మంత్రపురి

(కవితా సమీక్షా లేఖా సంపుటి)

గజానన్ తామన్

ప్రచురణ :

శ్రీ లక్ష్మీ సదన్

మంథని, తెలంగాణ

అంకితం

శ్రీ గట్టు నారాయణ 'గురూజీ'

సంస్థాపకులు

శ్రీ సీతారామ సేవాసదన్, మంథని.

మంత్రపురి

(కవితా సమీక్షా లేఖా సంపుటి)

గజానన్ తామన్

ప్రచురణ :

శ్రీ లక్ష్మీ సదన్

మంథని, తెలంగాణ

మంత్రపురి

(కవితాసమీక్షాలేఖా సంపుటి)

ప్రథమ ముద్రణ : 2022

గజానన్ తామన్

ప్రతులు : 1000

అమూల్యం

ప్రకాశకులు :

శ్రీ లక్ష్మీ సదన్

మంథని-505 184,

పెద్దపల్లి జిల్లా, తెలంగాణ.

ముద్రణ :

ప్రొ॥ జక్కని ప్రభాకర్

సత్యనారాయణ ప్రింటర్స్

4-6-143, తిలక్‌రోడ్, కరీంనగర్.

సెల్ : **98663 95537**

Telangana
Formation Day
ADILABAD
OMARAM BHEEM
NIRMAL
NIZAMABAD
EDDAPALLE
JAYASHANKAR
KAMAREDDY
MEDAK
WARANGAL
MAHABUBABAD
KOTHAGUDEM
SANGAREDDY
RANGAREDDY
KHAMMAM
SURYAPET
MAHABUBNAGAR
WANAPARTHY
TELANGANA
MARTYRS'
MEMORIAL
GUNPARK
HYDERABAD
1969

సాహిత్య వరివస్యలో
మంథని

కరీంనగర్ జిల్లాలోని పవిత్ర గోదావరీతటాన గల మంథని సమస్తాంధ్ర దేశానికి సుపరిచితమైన మహాగ్రామం. ఈ గ్రామానికి మహోజ్వల పౌరాణిక, ఐతిహాసిక, నేపథ్యం ఉంది. స్కంధపురాణాంతర్గత కాశీఖండంలో ఈ గ్రామం 'మంత్రకూటమ్'గా అభివర్ణితమైంది. జనవ్యవహారంలో 'మంత్రపురి' అనే పేరు దీనికి ఉంది. కాకతీయుల ఏలుబడిలో మంథని, నిస్సందేహంగా, మహర్దశను అనుభవించింది. ఇచటి ప్రజల ఐహిక జీవనాన్ని సమృద్ధం చేయడానికి శీల సముద్రమనే బృహత్తటాకం నిర్మితమైనది. అధ్యాత్మికతా వికాసానికి శీలేశ్వర, సిద్దేశ్వర ఆలయాలు నిర్మితమైనవి. తరువాత కాలంలో మానవ సంస్కృతీసభ్యతలకు నికషాయమాన మనదగిన సాహిత్యం, తత్త్వశాస్త్రం, తర్కం, వ్యాకరణం ఉచ్చస్థితికి ఎదగడానికి యోగ్యవాతావరణం ఏర్పడినది.

అతీతం లోనికి తొంగిచూస్తే, ఈ గ్రామం చతుర్వేదాలకు కాణాచి. ఇచటి వేద వేదాంగవేత్తలు, సారస్వతులు మహామంత్రకూట యశోగాథను ఆసేతు హిమాచలం పరివ్యాప్తం చేశారు.

తెలంగాణలో తెలుగు కవులు పూజ్యమన్న ముడుంబై వేంకటరాఘవచార్యుల వ్యాఖ్యకు దీటైన సమాధానంగా కీ.శే. శ్రీ సురవరం ప్రతాపరెడ్డి గారు క్రీ.శ. 1934లో గోలుగొండ కవుల సంచికను వెలువరించారు. ఇందులో 354 తెలంగాణా కవుల కవితలున్నవి. తెలంగాణా సాహితీ వైభవాన్ని గురించిన అవగాహనారాహిత్యం కేవలం ఆచార్యుల వారికే సీమితం కాదు. నాడూ నేడూ ఈ సుగుణం వారి ప్రాంతం వారిలో సైతం ప్రస్ఫుటంగా గోచరిస్తుంది.

'తెలంగాణ వాణి' అనదగిన 'గోలకొండ కవుల సంచిక'లో మంథనికి చెందిన ముప్వురు కవుల రచనలున్నవి. కీ॥శే॥ శ్రీమాన్ తిరువరంగం పాపయ్య శాస్త్రి గారి 'మంథెనద్విజులు' కీ॥శే॥ గంగా లక్ష్మన్న గారి 'మాతృభాష' కీ॥శే॥ వేంకటరాజన్న అవధాని గారి 'నేటి ద్విజులు'. మంథని ప్రాచీన కవులలో ఆద్యులు, ప్రథమగణ్యులు అయిన ముద్దు బాలంభట్టు (బాయన్న) రచించిన రెండు యక్షగానాలు తప్పుగా ముద్దయ్య పేరున చూపబడినవి.

అయితే, డా॥ మలయశ్రీ గారి 'కరీంనగర్ జిల్లా తెలుగు సాహిత్య చరిత్రలో ముద్దు బాలంభట్టు రచనల పరిచయమే కాదు, వైదుష్యపూర్ణమైన అనుశీలనం ఉంది. అలాగే మిగతా ముగ్గురు కవులను గురించి కూడా, డాక్టరు గారి ఉపకృతిని మంథని ప్రజలు విస్మరించరు.

ముద్దు బాలంభట్టు జీవితవిశేషాలు పోతన మహాకవి జీవితవిశేషాలవలె మనకంతగా తెలియరావు. రామాయణయక్షగానంలోని బాలకాండ ఆరంభంలోని రెండవ శ్లోకం, షట్కాండాంత పుష్పికలు దక్క వీరి ధన్యజీవన పార్శ్వాలను ఆకలనం చేసుకొనుటకు అనువైన సాక్ష్యాధారాలు మరేవి లేవు. అణిమాది అష్టసిద్ధులను పొందిన మహనీయునిగా ఓ జనశ్రుతి ప్రచారంలో ఉంది. ఆబాలవృద్ధప్రీతిపాత్రమైన యక్షగాన ద్వితయాన్ని అందించి యశఃకాయుడైన ఈ కవి రెండు శతబ్దాల పూర్వం వాడని కవిశేఖర గంగా రాజేశ్వరరావు నిర్ధారిస్తే, మూడు శతాబ్దాల క్రితంవాడని శ్రీ రేగళ్ళ మురళీధరశర్మ గారు అభిప్రాయపడినారు. కవిశేఖరుల అభిమతాన్నే ప్రామాణికమైనదిగా ఎంచి డా॥ మలయశ్రీ గారు మన బాయన కవి 1780 ప్రాంతంలో జీవించి ఉంటాడని నిష్కర్షించారు.

మంత్రపురాఖ్యనగరవాసి, ముద్దు రాజేశ్వరసూనుడు, శ్రీ సీతారామ సరస్వతిభ్రాతుడు, అయిన ముద్దు బాలంభట్టు నిత్యనైమిత్తికకర్మలకు బద్ధుడైన నిష్ఠాపరుడు. ప్రత్యహం ఉదయాత్పూర్వమే గోదావరీజలస్నాతుడై తీరస్థ గౌతమేశ్వరునకు పూజలు సల్పి గృహోన్ముఖుడయ్యేవాడు.

ఒకానొక యతి ఆజ్ఞను తలదాల్చి ఊరిలోని శ్రీ ఓంకారేశ్వర మందిర ప్రాంగణంలో తాత్కాలిక నివాసమేర్పర్చుకొని 'మంథెన్న రామాయణం' 'శివపురాణం' అనే అపూర్వ యక్షగానద్వితీయనిర్మితిలో కృతకృత్యులైనారని ఓ జనశ్రుతి ప్రచారంలో ఉంది.

లబ్ధప్రతిష్ఠులైన డా॥ దివాకర్ల వేంకటావధాని గారి భూరి ప్రశంసనందుకొన్న ఈ యక్షగానకావ్యాలు ఉచ్ఛ్రభ్రూ పఠితృపరిసీమితం కావు. ఇవి నిర్వివాదంగా సామాన్యజనసమ్మానితాలు. వీటి భాష గ్రాంధికమే యైనా, మంథని బ్రాహ్మణ్యమాండలిక ప్రభావానికి లోనైన సందర్భాలు కొల్లలు.

బాలంభట్టు వరకవి. పండితకవుల వలె వరకవులు ఛందో వ్యాకరణాలు

అంతగా పట్టించుకొనరు. హ్రస్వాక్షరాలను దీర్ఘాక్షరాలుగా రాగతాళాల కోసం మార్చడం జానపద కవుల రచనల్లో సర్వసామాన్యం. వరకవులు స్వేచ్ఛా విహంగాలని డా॥ మలయశ్రీ చెప్పిన మాటలో అణుమాత్రం అత్యుక్తి లేదు.

ముద్దు బాలంభట్టును హిందీ కవి తులసీదాసుతో పోల్చవచ్చు. ఆయనవలెనే మన బాయన అధ్యాత్మ రామాయణమును అనుసరించాడు. జనవ్యవహారంలోని భాషనే అభివ్యక్తి మాధ్యమంగా ఎంచుకొన్నాడు. "రామచరిత మానస్"ను తులసీదాసు 'స్వాంతః సుఖాయ' నిమిత్తం రచిస్తే, బాలంభట్టు 'మానసవీధి పవిత్రమొందేందుకు' రచించాడు.

బాలంభట్టు యక్షగానాలు శ్రవ్యకావ్యాలు. దృశ్యకావ్యమైన రూపకానిక ఉండాల్సిన లక్షణాలు వీటిలో కన్పట్టవు. పాత్రల ప్రవేశనిష్క్రమణలు లేవు. సంవాదాలు లేవు. అందుకే బాయన తన కృతులను 'యక్షగానాలు'గా చెప్పుకొన్నాడు.

ఈ యక్షగానాలలో హృదయస్పర్శియైన కీర్తనలు ఎన్నో ఉన్నవ. "దేవా ! శ్రీరాముల కనుగొనినావా ? "రారా రామయ్య తండ్రి !" "శ్రీరాములంపే నమ్మా మీ జాడలో" ఇప్పటికి ఊరివారు పాడుకొంటారు. జగన్నాథపండితరాయల వారి మాట "పాషాణదపి పీయూషం స్యదతే యస్య లీలయా' ఈ కవికి అన్వయించవచ్చు. ఈ ప్రాచీన కవి ముద్దు బాలంభట్టు తరువాత పేర్కొనదగిన 'సరస్వతీ పుత్రుడు కీ॥శే॥ గంగాలక్ష్మణ కవి (1900–1919) అణువంత జీవనంలో బ్రహ్మాండాన్ని సృజించాడు. గోలకొండ కవుల సంచికలో వీరి రచనలు దర్శనమిస్తవి. కీ॥శే॥ కవిశేఖర గంగా రాజేశ్వరరావు గారు ఈయన సుపుత్రుడే. లక్ష్మణ కవి వృత్తిరీత్యా అభియంత, ప్రవృత్తిరీత్యా కవి. ఇరువదేండ్ల జీవనంలోనే సంస్కృతాంధ్రాల్లో ఎనలేని వైదుష్యం సముపార్జించాడు. వీరి రచనలు 1. రత్నకాంత నాటకము (ముద్రితం), 2. కుచేల చరిత్రము హరికథ (ముద్రితం), 3. దండకారణ్య చరిత్రము : కావ్యము (అలభ్యం) కృష్ణదేవరాయచరిత్ర, నాటకము (అలభ్యం). చివరి రెండు కృతులను ముద్రణ నిమిత్తం కీ.శే. మాడపాటి హనుమంతరావు గారి స్వాధీనం చేస్తే, ముద్రణ మాట ఎలా ఉన్నా లభ్యం కాకుండా పోయినవి.

శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం (స్థాపన 1901) వార్షికోత్సవ

సభలో ధర్మంవరం కృష్ణమాచార్యుల సన్మాన సందర్భంలో చదివిన రెండు పద్యాలు, గోలుకొండ కవుల సంచికలో ప్రచురితమైన నాల్గు పద్యాలు వారి శేముషీవైభవానికి నిదర్శనాలు. ఈ పద్యాలు రచించు నాటికి వారి వయస్సు కేవలం పదకొండు వసంతాలు.

'అచట బుట్టిన చిగురు గొమ్మైన చేవ' అనే మాట పెద్దన 'అరుణాస్పద పురానికి ఏమో కాని మంథిని యెడ సార్థకమౌతుంది.

ఆర్యుడు సత్కవిత్వమహిమాంచిత డిద్ధ
యశోవిశాలుడా
చార్యసమేతు డాఢ్యు డల ధర్మవరాన్వయ
రామకృష్ణమా
చార్యుడనంగ గర్ణముల జల్లగవింటిమి, చూడ
మెప్డు ధీ
వర్య ! మిముం గనం గలుగు భాగ్యమునున్
లభియించె నిత్తరిన్

మాతృభాషను కాదని ఆంగ్లాన్ని ఆరాధించే తెలుగు జాతికి కనువిప్పు అయ్యే విధంగా ఈ కవి తేల్చి చెప్పిన 'తేటగితి'ని సైతం మీరు సంచికలో చూస్తారు.

ఆంధ్రులే తప్ప నితరు లేరైన గాని
మాతృభాషను గాదని మారు భాష
నభ్యసించిరె భూలోక మందునెందు
మానధనులార ! భాషాభిమానులార !

గంగా లక్ష్మణకవికి 17 వత్సరాల క్రితం వాడైన సుధీవర్యుడు కీ.శే. తిరువరంగం పాపయ్య శాస్త్రి గారు (1883) సదాచారసంపన్నమైన శ్రీ వైష్ణవ కుటుంబంలో జన్మించారు. అష్టావధాని. పురాణ ప్రవక్త. అనల్పప్రతిభావంతుడైన ఈయన సృజించిన సాహిత్యం బహ్వల్పమే.

గోలకొండ కవుల సంచికలో వీరి 'మంథెన్న ద్విజులు' :
నేపాలదేశావనీపాల సభలలో
నగ్రతాంబూలంబు లందినారు

ఆదరం బొంది బరోడాధిపుని చేత
వర్షాశనభృతుల బడసినారు
పూనానగరరాజధాని రారాజుచే
నవగ్రహారాదుల నందినారు
గద్వాలసంస్థాన విద్వత్పరీక్షలో
మనవార లదియె పెట్టినది భిక్ష
స్థిరతరంబైన కీర్తి నార్జించినట్టి
వారలొక రిప్డు లేకున్కి వలన కనుల
నీరు రాదొకో ! మంథెన్న వాసులార !

ఈ పద్యాన్ని పూర్వవైభవాన్ని కోలుపోయిన మంథని పైని విషాదగీతికగా అన్వయించుకొనవచ్చు. మహాకవి శ్రీశ్రీ గేయం 'ఏవి తల్లీ!' గుర్తుకురాక మానదు. శ్రీమాన్ తిరువరంగం వారి తరువాత, ముచ్చటించు కొనదగిన కవి కీ.శే. వేంకటరాజన్న అవధాని గారు (1909-1995) ఏకసంతగ్రాహి; బహుభాషాకోవిదుడు. అవధానవిద్యలో సెబాసనిపించు కొన్న ఘనుడు. సహస్రావధాని సాహిత్య సుబ్రహ్మణ్యశాస్త్రి గారి అంతేవాసి. వృత్తిరీత్యా న్యాయవాది ప్రవృత్తిరీత్యా సాహిత్య స్రష్ట.

వీరు పలు రచనలు చేసినా, ముద్రణకు నోచినవి కొంచెమే ! 'గోలుకొండ' అంధ్రభూమి పత్రికలకు సహాయ సంపాదకునిగా పనిచేశారు. కాళోజీతో కలిసి 1950లో హైదరాబాద్‌లో 'వైతాళిక సమితి'ని స్థాపించారు.

వీరి రచనలు 1. 'అగ్నిశబ్దమాహాత్మ్యం (సంస్కృతం) 2. కుంభకర్ణ నిద్ర, 3. లక్ష్మీశతకం.... ఇత్యాదులు. తేటగీతి ఈయనకు ప్రీతికరమే అయినా శతకాన్ని 74 కందపద్యాల్లో వ్రాశారు. ఈ కావ్యానికి ముగ్ధులై విశ్వనాథ వ్యాఖ్య వ్రాస్తానన్నారట ! స్వాతంత్రయోద్ధ వినాయక సావర్కర్ వ్రాసిన మరాఠీగ్రంథం 'మొప్లాంచే బండ్' (మొప్లా ముస్లిం తిరుగుబాటు)ను ఆంధ్రీకరించారు. కీ.శే. సురవరం వారి 'హిందువుల పండుగలు' గ్రంథంపై విమర్శనాత్మక సమీక్ష వ్రాశారు 'భారతి'లో. గోలకొండ సంచికలోని వీరి పద్యం :

నేటి ద్విజులు
స్వాధ్యాయనిరతులై వరల గాంచిన వార
　　లక్షర శత్రువు లైరి భువిని
త్రైలోక్యగురువులై రాణ మించెడి వారు
　　గురుమంత్రమును తామె మరుపు గొనిరి
అఖిలవేదార్థవిద్యావిభూషితు లిప్డు
　　వేదనామమున కవేద్యులైరి
నిత్యాగ్నిహోత్రసన్నిధి నుండు వారలు
　　ధూమపానాగ్ని సంతుష్టులైరి

పరహితార్థసంపాదనపరులు నేడు
స్వార్థసిద్ధైక కార్యతత్పరులునైరి
ఆత్మవత్సర్వభూతాని యనెడివారు
జనుల బీడింప సమకట్టి రనుదినంబు

తిరువరంగం వారి పద్యం 'మంథెన్న ద్విజులు'లో ధ్వనితమయ్యేది కాల్పనికవేదన. అవధాని గారి పద్యం 'నేటి ద్విజుల'లో అధిక్షేపం.

అవధాని గారికి సాహిత్యసృజనుడైన కవి కీ.శే. శ్రీ గంగా రాజేశ్వర రావు గారు (1920–2005). ఈయన సాహిత్యసృజనకే యావజ్జీవితాన్ని అంకితం చేసికొన్నారు. అసమాన పద్యశిల్పి. 'మార్గ' 'దేశి' ఛందస్సులపై ప్రభుత సాధించారు. మలయశ్రీ గారు నుడివినట్లు చిత్రబంధకవిత ఆయనకు నల్లేటిపై బండినడక. ఇదిరవలో ముచ్చటించుకొన్న కీ.శే. గంగా లక్ష్మణకవి వీరి జనకులు. స్వగ్రామంలో గంగాతరంగిణి అనే సాహితీ సంస్థను స్థాపించారు. అనేక సన్మాలను సత్కారాలను పొందారు. శిలేశ్వరాలయంలో గండపెండియరముతో సన్మానింపబడినారు. సహస్ర చంద్రదర్శనం చేసికొనిన ధన్యజీవి. అభ్యుదయ భావజాలం గల్గిన ప్రతీతుడు.

ఈయన రచనలు :

1. రుక్మిణీ కళ్యాణము
2. పార్వతీ విజయము
3. పరీక్షిచ్చరిత్రము

4. హనుమద్విజయము
5. గంగారూకాలు

ప్రాచీనకవిపుంగవులను సంస్మరించుకొన్నాక గీర్వాణభాషా ప్రతీతులను విస్మరించడం క్షంతవ్యం కాదు. మాఘే మేఘే గతం వయః అన్న మల్లినాథ సూరి స్ఫూర్తితో పంచకావ్యాధ్యేతలు కీ.శే. చయనం శాస్త్రి గారు, గుల్కోట రామశాస్త్రి గారు, గోస్వామి లింగన్న శాస్త్రి గారు, మోతేరాం రాజేశ్వర శాస్త్రి గారు, నల్లగొండ చంటయ్య గారు.

ఓంకారేశ్వర మందిర పరిసరాల్లో గీర్వాణపుస్తకాలయాన్ని సంస్థాపించిన సూర్యనారాయణ వడూత్కర్ చెప్పుకొనదగినవారు.

మంథని చరిత్ర పుటల్లో దర్శనమిచ్చే మేరునగప్రఖ్యుడు కీ॥శే॥ బహద్దర్ దహగాం లక్ష్మీనారాయణ (1876–1930) గ్రంథ పఠనాశక్తి కలవారు. ఆ కాలంలో లక్షలు విలువ చేసే పుస్తకాలను కొన్నారు. మాంగనీజు వ్యాపారంలో లక్షలార్జించిన ఘనులు. కీ.శ. 1920లో సి.పి. శాసనమండలికి సభ్యునిగా ఎన్నికైనారు. ఆ తరువాత కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్‌కు సభ్యునిగా నియమితులైనారు. ఆ దరిమిలా ఆయన ఉపన్యాసాల సంపుటి ప్రచురితమైనది. తనకు ఉత్తరాధికారి లేనందున యావదాస్తిని ‘ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఈయదలిచారు. నాటి ఉపకులపతి కీ.శే. కట్టమంచి రామలింగారెడ్డి గారు తగు రీతిని స్పందించనందున, నాగపూర్ విశ్వ విద్యాలయానికి ముప్పది లక్షల రూపాయలు దానంగా ఇచ్చారు. బ్రిటిష్ ప్రభుత్వం ఈ దానకర్ణుని ‘రావు బహద్దూర్’ బిరుదంతో సత్కరించింది. అతీతంలో ఇలా ఎందరో మహానుభావులు. వారిని గురించి చెప్పుకుంటే బృహద్గ్రంథమౌతుంది. అయినా ముగ్గురు ధీశాలుర గురించి సంక్షిప్తంగా వివరిస్తాను.

కీ.శే. మహావాది లక్ష్మణ శాస్త్రి గారు (1896–1962) గీర్వాణ విద్యకు నిలయమైన వారణాసిలో తర్కవ్యాకణాలను అభ్యసించారు. దేశంలోని ప్రముఖ స్థలాలను సందర్శించారు. సన్యాసాశ్రమ స్వీకారం చేసి బ్రహ్మానంద సరస్వతి స్వామి వారిగా శివైక్యాన్ని పొందారు.

కీ.శే. వజ్జల రాజారాంశర్మ ఘనాపాఠి (1860-1930) సంస్కృతాంధ్ర భాషలలో పేరొందిన పండితులు. క్రాంతదర్శి. ప్రగతిశీలి. నాటి ఛాందసులను ఎదిరించే దృఢసంకల్పం కలిగిన వ్యక్తి. 1920లో 'పునర్వివాహ శాస్త్రం' రచించి ప్రచురించారు. ఈయన గురించిగాని, ఈయన గ్రంథాన్ని గురించిగాని మంథని వాసులకు తెలియదు.

కీ.శే. ఘనకోట రాజేశ్వర శాస్త్రి గారు (1909) గీర్వాణభాషా పరశేష భోగి. కృష్ణాజిల్లా ఆకిరి వేదపాఠశాలలో న్యాయ, వేదాంత, తర్క శాస్త్రాలను అధ్యయనం చేశారు. అప్పటి లబ్ధప్రతిష్ఠులైన వేమూరి రామబ్రహ్మశాస్త్రి వీరి గురువులు. ఆ తరువాత వారాణాసిలో చదివారు. బ్రహ్మసూత్ర శంకర భాష్యంపై వీరికి గల ప్రభుతకు ముగ్ధులై కాంచీపరమాచార్య శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతి స్వాములవారు వీరిని సన్మానించారు. 1976లో శృంగేరి జగద్గురువులు శ్రీశ్రీశ్రీ అభినవ విద్యాతీర్థస్వామి వారి నుండి ఆజ్ఞను పొంది శేషజీవితం కాశిలో గడిపారు.

మంథని గతచరిత్రకు చెందిన స్వర్ణాధ్యాయానికి ఇంతటితో ముగింపు పలుకుదాము.

మంత్రపురివాగ్దేవి వర్తమానంలో పరాఙ్ముఖ కాలేదు. ఆయమ ప్రేరితమైన నవ్యగళాలు నిన్న నినదించినవి. నేడూ నినదిస్తూనే ఉన్నవి.

ఆధునికుల్లో కీ.శే. కొల్లారం సీతారామశర్మ (1934-2002) గారు అగ్రగణ్యులు. ఉభయభాషాప్రవీణులు. గీర్వాణసాహితీమధురిమను ఎందరో ఛాత్రులచే ఆస్వాదింపచేశారు. మంథనిలో వేదపాఠశాలను స్థాపించి దీపనిర్వాణగంధస్థితికి చేరుకొన్న వేదవిద్యను పునః ప్రజ్వలితం చేశారు. ఓషధులను పెంచుటలో మక్కువ కనబరచేవారు. అంతేవాసుల యందు ఎంతో అనురాగం చూపేవారు. ఆయన వద్ద పంచకావ్యాల అధ్యయనం చేసిన వారు నేడు విద్యాక్షేత్రంలో గొప్పగా రాణిస్తున్నారు. సంస్కృతంలో కొన్ని స్తోత్రాలు వ్రాశారు. అవి అముద్రితం.

ఇచటి జనమానసాలపై శాశ్వత ముద్రవదలిన సాహిత్యకారులు కీ.శే. గీట్ల జనార్ధనరెడ్డి గారు (1938-2008) స్వభావతః ఉత్సాహపరుడు. కేవలం లేఖినీవీరుడే కాదు, కర్మయోగి. విద్యార్థిదశలో 'విజిగీషువు' అనే కలం పేరుతో

ఆయన వ్రాసిన వ్యాసాలు నాటి వార్తాపత్రికల్లో ప్రచురితమై సంచలనాన్ని సృష్టించినవి. ఈయన అసమానపద్యశిల్పి. పదికాలాల పాటు మనగలిగిన ఈయన సాహితీకృతులు 1. దుగ్ధగీత 2. జ్వాలాతోరణం 3. రక్తాశ్రుధారలు. ఎమ్ఎల్సి స్థాయికి ఎదిగినా, రాజకీయ క్షేత్రంలో గాంధేయుల స్థానంలో శిలీంధ్రాలవలె పుట్టుక వచ్చిన 'బ్రాందీయు'ల మధ్య ఇమడలేక రాజకీయాలకు దూరంగా ఉంటూ, నిజజీవనసాంధ్యలో పర్యావరణ పరిరక్షణ ధ్యేయప్రేరితుడై గోదావరిఖనిలో ఓ సంస్థను స్థాపించారు. సాహితీ గౌతమికి 1990 నుండి హితవరిగా సేవలందించారు.

'నిజాయితీ గల సాహితీవేత్త.' ఇది డా॥ గంద్ర లక్ష్మణరావు ఒసగిన కితాబు. 'ఆద్మీకా వకీల్' అనే శీర్షిఖతో గజానన్ తామన్ గారు వీరిని గురించి వ్రాసిన వ్యాసం, స్వర్ణసంచికలో చూడవచ్చును.

సాహితీ కృతులను :
బిగియించిన పిడికిళ్ళకు
తెగించగల కొడవళ్ళకు
జనం కొరకు, జగం కొరకు
జనగళముల జయం కొరకు

సమర్పించారు. 'ఆంధ్రపద్యకవితాసదస్సు' నిర్వహించిన పద్యరచన పోటీలో రెండు మార్లు ప్రథమపురస్కారాన్ని అందుకొన్న ఈయన తన జన్మభూమిని గురించి ఏమన్నారో గమనించండి.

నాయది మంత్రకూటము జనార్దనరెడ్డి
యటంద్రు నన్ను గం
గాయమునాస్రవంతులు చకాచక
ఝణఝణీరవమ్ములన్
జేయుచు తూగి సాగ పదిశింజిణు లొక్కట
ప్రోగపద్యముల్
గేయము లెన్ని యేని విలిఖించుచు పాడెద
నీ ధరాస్థలిన్

కీ.శే. రావికంటి రామయ్య గుప్త (1936–2009) గారు సహజకవి. పామరులకు సైతం అర్థమయ్యే భాషలో ఆశువుగా కవిత్వం చెప్పడం ఈయన ప్రత్యేకత. నలుబది ఏండ్ల పాటు ఉపాధ్యాయునిగా సేవలు అందించిన ఈయన వృత్తిలోనూ ప్రవృత్తిలోనూ కవిత్వం కలగలసిపోయినది. తన మనస్సులో కల్గిన భావాలకు అప్పటికప్పుడు అక్షరరూపమొసగి శ్రోతలను రంజింపచేయడంలో ఈయనకు ఈడైన వారు అరుదు. నిజాయితీ ఈయన రచనల్లో సాక్షాత్కరించే గొప్ప సుగుణం. మాటలాడినంత తేలికగా 'ఆటవెలదు'లను అల్లడంలో ఈయన చూపిన ప్రతిభకు ముగ్ధులై ఊరివారు 'మంత్రకూటవేమన' అని ముద్దుగా పిలుచుకొనేవారు. నగ్నసత్యాలు అనే ఈయన కావ్యంలో చేదు నిజాలు అంతటా పరచుకొని ఉన్నవి. ఈయన మరో రచన వరద గోదావరి (ఉయ్యాల పాట) ఈయన మరో ముఖ్యమైన రచన 'గీతామృతం' (గేయకావ్యం) సంస్కృత భగవద్గీత సందేశాన్ని సామాన్యుల వరకు తీసుకవెళ్ళటంలో కృతకృత్యులైనారని 'ముందుమాట'లో ప్రముఖ కవి గజానన్ తామన్ గారు పేర్కొన్నారు. గుప్త గారు అనేక సామాజిక సమస్యలపై గేయాలు వ్రాసారు. ఈయన 'నల్లాల భాగోతం' 'రామగుండం – రాత్రి గండం' జనప్రియమైన రచనలుగా చెప్పుకొనవచ్చును. ఈయన శతకంలోని పద్యం.

ముడుపులేక వచ్చు మొక్కు బళ్ళేవియు
శ్రీనివాసు డసలె చేతగొనడు
దైవమైన నేడు డబ్బుకు దాసుడే
కల్లగాదు రావికంటిమాట

ఇంత చక్కగా పద్యాలు అల్లిన కవిని తెలుగు పాఠకలోకం విస్మరించగలుగుతుందా ?

గట్టు నారాయణ గురూజీ (1940) బహ్వంగీన వ్యక్తిత్వాన్ని సమగ్రంగా శబ్దాంకన మొనరించడం ఈ చిన్నపత్రంలో అసాధ్యం. ఇలెక్ట్రానిక్స్, ఇంట్రికల్ ఇంజనీరింగ్ డిగ్రీ, మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో స్నాతకోత్తర పదవీధరులు. గ్రంథపఠనాసక్తిలో 'రావు బహద్దూర్' దహగాం లక్ష్మీనారాయణ గారితో

పోల్చదగినవారు. ఆయనవలెనే వితరణశీల. ప్రస్థానత్రయాన్ని క్షుణ్ణంగా చదివారు. నూటికి పైగా ఆంగ్లంలో, తెలుగులో గ్రంథాలు వ్రాశారు. వీటిలో కొన్ని భారతీయ భాషలలోనికి అనూదితమైనవి.

శ్రీ గురూజీ శతాధిక గ్రంథకర్త అని ఇదివరకే చెప్పుకొన్నాము. ఈ గ్రంథాల గురించి సమగ్ర పరిచయం ఇచట సాధ్యం కాదు. అయినా, వారు రచించిన Noble Leader మరియు Offersings ను చెప్పుకొనక తప్పదు. బౌద్ధుల పవిత్ర ధర్మగ్రంథమైన 'ధమ్మపదం'లోని ఇరువదియారు అధ్యాయముల నుండి తదాధ్యాయ సారమనదగిన ఒక గాథను గొని, దానికి తన వైదుష్యపూర్ణమనదగిన భాష్యాన్ని చేర్చి శ్రీ గురూజీ Noble Leader అనే గ్రంథాన్ని రూపొందించారు. దీనికి శ్రీ రాజేశ్ వైద్య చక్కటి ఆముఖం వ్రాశారు. దీనిని గుజరాతీలోనికి హస్ముఖ్ ఉపాధ్యాయ, హిందీలోనికి అజీత్ బచ్చావత్, మరాఠీలోనికి జయశ్రీ పట్వర్ధన్, తెలుగులోనికి గజానన్ తామన్ అనువదించారు. పూదేనియనుగ్రోలే తుమ్మెద పువ్వుకు క్షతి కల్గించదు, దానికి ఫలదీకరణకు దోహదమౌతుంది. అలాగే ఉదాత్తనేత మానవ సందోహాల మధ్య కదలుతూ విలువైన అనుభవాలను గడిస్తాడు. వాటికి హితమైన మార్గాన్ని చూపి అవి వికసించేట్టు చూస్తాడు.

వ్యవస్థాపకీయ క్షేత్రంలో గురూజీ ఎందరినో దిద్దితీర్చారు. వ్రాతలతో ప్రవచనాలతో, ఇతర సంవాద మాధ్యమాలతో అంటే కథా కథనాలతో సంచనం సృష్టించారు. వారు చెప్పిన కథలు ఒక వంద. ఇవి Offersings అనే పేరుతో నాల్గు సంపుటాలుగా వెలువడినవి. శ్రీ సీతారామ సేవాసదన్ వారు మొదటి మూడు సంపుటాలను శ్రీ గజానన్ తామన్ గారిచే, చివరి దానిని 'సాహిత్య బ్రహ్మ' డా।। వి.వి.ఎల్. నరసింహారావు గారిచే అనువదింపజేసి ప్రచురించారు. ఈ అనువాద గ్రంథాలకు ఆచార్య వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి గారు, డా।। రావూరి భరద్వాజ గారు సంప్రవేశనాలను సమకూర్చినారు. ఈ కథలు ఇతర భారతీయ భాషల్లోకి అనూదితమై శ్రీ గురూజీనికి ఎనలేని జనప్రియతను ఆర్జించి పెట్టినవి.

శ్రీ గురూజీ బహుముఖీన వ్యక్తిత్వాన్ని ఆకలనం చేసికొనటానికి శ్రీ సీతారామ సేవాసదన్ వారు ప్రచురించిన ఆంగ్ల గ్రంథం Guru Dharshan ఎంతగానో ఉపయోగపడుతుంది.

గురూజీ వంటి మహనీయుల వల్లనే మానవ సమూహాలు పురోగతిని సాధిస్తాయి. 'సుఖో బుద్ధానాం ఉత్పాదః' – ఇది ధమ్మపదంలోని మాట.

'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపిగరీయసీ' అను సూక్తికి అనుగుణంగా వాచా, మనసా, కర్మణా మాతృభూమిని ఆరాధించారు. స్వగ్రామమైన మంథనిలో శ్రీ సీతారామ సేవాసదన్ (2003) స్థాపించారు. శ్రీ సువర్ణ లక్ష్మణరావు నేతృత్వంలో ఈ సంస్థ సమాజానికి గణనీయమైన సేవలను అందిస్తున్నది.

సాహితీవరివస్యకు అంకితులైన ఇచటి ఆధునికుల్లో శ్రీ నల్లగొండ పురుషోత్తమశర్మ గారిని గురించి చెప్పుకొనక తప్పదు. అపారవైదుష్యవైభవం కలిగినవాడైనా తనను గురించి చెప్పుకొనటానికి బిడియపడే వ్యక్తి. 'ధర్మః క్షరతి కీర్తనాత్' అన్నారు కదా పెద్దలు. బాల్యంలో తండ్రి గారి వద్ద వేదాధ్యయనం చేశారు. కీ.శే. కొల్లారపు సీతారామశర్మ అంతేవాసిగా పంచ కావ్యాలు పఠించారు. వేదాంతవర్ధినీ సంస్కృతకళాశాల విద్యార్థిగా గౌతమ న్యాయశాస్త్రంలో పదవీధరులైనారు. లబ్ధప్రతిష్ఠులైన శ్రీమాన్ కోకం శఠకోపరామానుజాచార్యులవారు, శ్రీ ఖండవెల్లి నరసింహశాస్త్రి వైయాకరణ కేసరి, కృష్ణాచార్యవర్ణేద్కర్ గారు, శ్రీమాన్ మరింగంటి రంగాచార్య గారు వీరి గురువులు.

వీరి రచనలు :

1. న్యాయశాస్త్రంలో భౌతికతత్త్వము
2. న్యాయశాస్త్రంలో వేదవిరుద్ధమా ! (వ్యాసం), సంప్రతి : భక్తి సాహిత్య సృజనలో నిమగ్నులు.

అథో జ్ఞాపికలు

1. కుండస్య పశ్చిమే భాగే
   యోజన త్రితయాంతరే
   మంత్రకూటేఽ తిఖ్యాతో....

2. ఘనాపాఠులు : 1. కీ॥శే॥ గట్టు లింగన్న గారు
   2. కీ॥శే॥ గట్టు ఎర్రలింగన్న గారు
   3. కీ॥శే॥ నల్లగొండ చంటయ్య శాస్త్రి గారు

4. కీ॥శే॥ గుల్కోట రామశాస్త్రి గారు
5. కీ॥శే॥ మంథెన రాయం గారు
6. కీ॥శే॥ అవధానుల పెద్ద కిష్టన్న గారు
7. కీ॥శే॥ విశ్వనాథ సోమయాజి గారు
8. కీ॥శే॥ అవధానుల నరసింహులు గారు
9. కీ॥శే॥ అవధానుల పుల్లన్న సోమయాజి గారు
10. కీ॥శే॥ గట్టు బాపు శాస్త్రి గారు
11. కీ॥శే॥ ముద్దు రాజన్న గారు
12. కీ॥శే॥ మారుపాక ఎర్ర నాగన్న గారు

వేదపండితులు : 1. కీ॥శే॥ గుల్కోట నారాయణ గారు
2. కీ॥శే॥ నల్లగొండ వెంకయ్య గారు
3. కీ॥శే॥ కామావజ్జల లింగయ్య గారు
4. కీ॥శే॥ అవధానుల పెద్ద పాపయ్య గారు
5. కీ॥శే॥ అవధానుల చిన్న పాపయ్య గారు

పంచకావ్యాధీతులు: 1. కీ॥శే॥ చయనం శాస్త్రి గారు
2. కీ॥శే॥ గోస్వామి లింగన్న గారు
3. కీ॥శే॥ మోతేరాం రాజేశ్వరశాస్త్రి గారు

3. తెలంగాణం : తెలుగు మాగాణం
డా॥ గుమ్మనగారి బాలశ్రీనివాసమూర్తి

4. మంథెన్న రామాయణం
ముద్దు బాలంభట్టు శ్రీ సీతారామ సేవాసదన్ 2009 మంథని

5. కరీంనగర్ జిల్లా సాహిత్య చరిత్ర
డా॥ మలయశ్రీ

6. శ్రీరామ్‌చరిత్ మానస్
తులసీదాస్ : గీతాప్రెస్
నానాపురాణ నగమసమ్మితం యద్
రామాయణే నిగదితం క్వచిదన్యతోఽపి

స్వాంతః సుభాయ తులసీ రఘునాథగాథా
భాషానిబంధ మతిమంజుల మాతనోతి

7. శ్రీ మంథెన్న రామాయణం
ముద్దు బాలంభట్టు
సం॥ డా॥ కిడాంబి నరసింహాచార్య
ప్ర. మధుసూదన్ వడూత్కర్

సదయుడ ! మీ చరిత్ర నిల సందడి లోకులు మెచ్చగాదు, నా
యుదరము నిండగాదు. భువి నుండగ లేదని కాదు, మీమహా
మదిమురిపించగాదు, తన మానసవీధి పునీతమొందగా
పదముల కివ్వజేతు నను బాగుగ రక్షణ సేయు రాఘవా !

విరియాల లక్ష్మీపతి
VIRIYALA LAKSHMIPATI
అభ్యుదయ సాహితీ కరదీపిక
సంపాదకులు

అభ్యుదయ రచయితల సంఘం
(అరసం)
విశాఖ శాఖ.

కవితా దృశయంలో మానససరోవరం

జంబూద్వీపే భరతవర్షే, భరతఖండే, జననీజన్మభూమి, ఇది వేదం పుట్టిన దేశం, వేదాంతం పుట్టిన దేశం లాంటి రసాత్మక వాక్యాలు భారతదేశాన్ని దేశ ప్రతిష్ట హిమవత పర్వత పంక్తుల మీద ప్రతిష్టించడానికి రచించి గానం చేయబడినాయి. భారతదేశాన్ని తలుచుకోగానే ముందుగా గుర్తొచ్చేవి వేదాలు, ఉపనిషత్తులు. ఆర్య సంస్కృతి భారతదేశంలో విడదీయరానంతగా ముడిపడి వుండడానికి ముఖ్యకారణం చతుర్వేదాలే... భారతదేశము వేద విజ్ఞానమూ అవిభాజ్యులు.

అయితే వేదమూ వేద విజ్ఞానమూ సామాజికులకు చేరకుండా మడిగట్టించి ఆలయాల్లోకి మళ్లించారు. మధ్యయుగాల నాటి పాలకులూ, అగ్రకులలవారు, వారు వారి పబ్బం గడుపుకునేందుకు, సంఘ జీవన స్థితిగతుల పై పెత్తనం చెలాయించేందుకు సకల భోగభాగ్యాలు అనుభవించేందుకు వేదాన్ని అడ్డం పెట్టుకుని, ఆధిపత్యం చెలాయించారు. ఈ కారణంగా వేదకాలం నాటి సహజీవన సంస్కృతి మధ్యయుగాలలో ప్రజాజీవనానికి అక్కరకు రాకుండా నిరోధించబడింది. కుల వ్యవస్థ బలంగా వేళ్లూని వేదమూ వేదార్థమూ తప్పుదారుల్లో నడచిపోయి సామాన్యులకు అందని సస్యాలయ్యాయి. విగ్రహారాధన పెచ్చు పెరిగింది. దేశానికి కావలసినంత మతమౌఢ్యం సంక్రమించింది. మతము వైరాగ్యము ప్రజలకు తలనొప్పి తెచ్చిపెట్టాయి. మతయుద్ధాలు ప్రబలి నరబలి తాండవించింది. మానవ రక్తానికి తప్ప ఏకాయ కల్పచికిత్సకి లొంగని దీర్ఘరోగం దేశానికి సంప్రాప్తించడం జాతి చేసుకొన్న దురదృష్టం.

సహనావవతు, తమసోమాజ్యోతిర్మయి, అగ్నిమీళేపురోహితం సర్వేజనా సుఖినోభవంతు లాంటి విజ్ఞాన సూక్తులు కొన్ని మాత్రమే ప్రజాబాహుళ్యంలో ప్రాచుర్యం పొందాయి. మానవజాతికి విజ్ఞాన జ్యోతులుగా భాసించాయి. అసత్యం నుండి సత్యానికి, అజ్ఞానం నుండి విజ్ఞానానికి, చీకటి నుండి వెలుతురు లోకాలకి నడిపించడానికి సుఖశాంతులతో వుండాలని ఆకాంక్షించాయి.

అయితే మానవజాతి సంపూర్ణ మానవులుగా మనుగడ సాగించడానికి తెలుగు సాహజత్యంలో వేద సూక్తుల్ని ఉపనిషదార్థాన్ని యధాతథంగా అనువాదం చేసిగాని, అనుసృజన చేసిగాని తెలుగుతో కవిత్వీకరించడం అరుదుగానే కనిపిస్తుంది. అలా వేదస్ఫూర్తిని కవిత్వీకరించిన వారిలో శ్రీ గజానన్ థామన్ ఒకరు. వీరు తేలికమాటల్లో కొన్ని వేదసూక్తుల్ని కవితలుగా సృష్టించి మానససరోవరంగా సంపుటీకరించి తెలుగు పాఠకులకు అందించారు. ఈ ప్రయత్నాన్ని తెలుగు పాఠకులందరూ మెచ్చుకోవలసినదే. విమర్శకులు తప్పక పరిశీలించవలసినదే.

శ్రీ గజానన్ థామన్ వెలువరించిన ఈ సంపుటంలో ఇరవైరెండు అందమైన కవితలు సమాహారం చేయబడ్డాయి. ఇందులో ముత్యాలై రసాలుచిందే లయ ప్రధానంగా సాగి కవితలతోపాలిట కొన్ని వచన కవితలు కూడా సంకలనం చేసి పాఠకులకు అందించారు కవి.

ఈ మానససరోవరం గ్రంథంలో గల కవితల్ని పైపైన పరిశీలించే సమయంలోనే గ్రంథకర్త సంస్కృతాంధ్ర భాషల్లోనేకాక ఇంగ్లీషు, హిందీ, మరాఠీ భాషలలో పరిచయస్తుండన్న సత్యం పాఠకలోకానికి బోధపడుతుంది. అలాగే గ్రంథంలోతులు పరిశీలించి ఆమూలాగ్రం కావ్యం పఠించిన తర్వాత గ్రంధకర్త మహారాష్ట్రా దేశం తెలుగు దేశానికి బహూకరించిన బహుభాషా పండితుడన్న సత్యం తేటతెల్లమౌతుంది. ఈట్స్ నుండి సో॥సు వరకూ విశ్వనాథ నుండి ఎలియట్ వరకూ మహాకవులం దరినీ ఆపోసన పట్టిన సందర్భాలు అనేకం వీరి కవితలు స్పష్టం చేస్తాయి.

మాక్సు ముల్లర్‌ని ఇంకా ఇతర ఫ్రెంచి జర్మన్ పండితుల్ని ప్రభావితం చేసిన కఠోపనిషత్తుని గజానన్ థామన్ కవిత్వంలోకి తర్జుమా చేసి తెలుగు కవి పండితుల మన్ననలందుకున్నారు. ఇది వీరిలోని కవితాశక్తికి మచ్చుతునక అయితే శుష్కవేదాంతంలో నిమగ్నమై అగోచరమైన ఆత్మజ్ఞానంతో జారిపోకుండా గ్రంథకర్త మానుష సమాజ విజ్ఞానంలోకి తన్ను తాను మళ్లించుకుని మానవుడ్ని తన కార్యానికి నాయకుడిగా, మానవతని తన కార్యానికి అంగరసంగా ప్రతిష్టించుకున్నారు. ఈ సత్యం వీరి కవితలన్నిటిలోనూ ప్రస్ఫుటమౌతుంది. వేదనాదాన్ని జీవనవేదంగా ప్రదర్శించే కిటుకు తెలుసుకుని ఆలోచనాత్మకమైన కవితలు రచించి తెలుగు పాఠకులకు అందించారు థామన్.

"నీ కనులు కరుణనే వర్షించునవి గాన
హరిణవాలు ఇంతగా నా ఊహమెదిలినవి
నీ హృదయమే వీణవోలె మొరయునగాన
ఈ వసుధ అందుల కోవెలగ తోచినది" అంటూ తన కవితలకు జ్ఞానకాంతులందించిన సరస్వతికి అంజలి ఘటించి కవితకు **"అంజలి"** అని నామకరణం చేశారు కవి. కావ్యారంభంలో కావ్యానికి మంగళాశాసనం చేసే సమయంలో ఇష్టదేవతా ప్రార్థన చేయడంలోని భాగంగా భాసరలోని చదువుల తల్లికి నమస్కరించే సత్ సాంప్రదాయాన్ని పాటించారు గజానన్.

వీరి కార్యహంస
"భూ దినాల మధ్య అహర్నిశం
లీలగా కదిలే వినోద వేషాన్ని" అంటూ మరో నగరాల్లోంచి ఎగిరి,
"నేను మానవుడను అయోనిగళ నియంత్రుడను ఉభయ సంధ్యలుపేక్షించు అనామకుడను" అంటూ మానవ మనోంతరాళంలో విహరించి, దేవదారుల నీడ తీర్చి నిత్యము కొలువు గంధర్వ గీతికల గళమెత్తి పాడుదము" అని మానస సరోవరంలో పల్లటీలు కొడుతుంది. కవితను చదివే పాఠకుడ్ని తనతో పాటే ఎగరేసుకుపోతుంది. మానవ

మేథల్ని విహంగాలుగా చేసి మానసరోవరంలో త్రుళ్లింతలాడిస్తుంది. ఊహలకందని తీరాలకి పరుగులు తీస్తుంది. ఎన్నో రసగుళికలు నోటకరుచుకుని పాఠక హృదయకుడ్యాలలోకి ప్రవేశిస్తుంది. "ద్వాసుపర్ణా సయుజాసఖాయ" అని కొమ్మమీద వాలిన వేదవిహంగాల్ని పాఠక లోకంలో గల ప్రియసఖులకు పరిచయం చేస్తుంది. తనదైన శైలిలో ఎన్నో సత్యాల్ని వాక్యాలుగా తర్జుమా చేసి అందించారు గజానన్.

ఇటు తెలుగునేలకీ అటు మహారాష్ట్రకి మధ్య స్నేహవారధిగా నిలుపుతూ ఆదిలాబాద్, సాకేత మృగశిర కవితలు వెలయిస్తూ "నా తెలంగాణా ముక్కోటి దేవతల ప్రాంగణం" అంటూ విజ్ఞప్తి చేస్తారు కవి.

అందాల మా ఊరి కోవెలలో
నిత్య నవోన్వేషణం అనుగ్రహించే

స్వామి కృతికి అనురూప స్పందనగా అంటూ కవి on to be in England Now that utprills there. అన్న రాజిర్టేబ్రౌనింగ్ వాక్యాలలో కవితను ప్రారంభించి, ఆ కవితను స్వామి కృతికి అనురూప స్పందనగా... అన్న వాక్యంలో ముగిస్తారు. నైఋతి ఋతుపవనాలు వచ్చి తెలంగాణాలోని, తన పంటపొలాల్ని తడిపి సస్యశ్యామలం చేసివుంటాయనే ఆశాభావాన్ని ఒక సైనికుడి కంఠవాహినిలో విన్పిస్తారు కవి. తెలంగాణా అందాల్ని ఇంగ్లాండ్‌లోని చైత్ర మాస శోభలతో ఉపక్రమిస్తారు. సత్యాన్వేషణ, సౌందర్యారాధన, మానవతాజిగీష ఈ మూడు వీరి ఈ మూడు గుణములు వీరి కవితల్లో ఉపాంగరసాలుగా గోచరిస్తాయి. ఎవరో అజ్ఞాత సుందరిని ప్రేయసిగా ఊహా సుందరిగా హృదయంలో ప్రతిష్టించుకుని కాల్పనిక ధోరణిలో తన హృదయాంతర్గత బాధని విన్నవించుకుంటారు. వీటిని చదివి ఆస్వాదించిన తర్వాత పాఠకులు ఎవరికి వారు తమ తమ ఊహాసుందరీమణులను జ్ఞప్తికి తెచ్చుకుని తీయనైన బాధని అనుభవించకమానరు. ఇదే వీరి కవితల్లో, అంతస్సూత్రంగా పొందుపర్చిన కావ్య రహస్యం.

మానవతనీ, సౌందర్యాన్వేషణ సిద్ధప్ప సిద్ధాంతాన్ని ప్రబోధించిన ఈ కవితా సంపుటిలో గజానన్ థామన్ కొన్ని సామాజిక స్పృహ గల కృతలకి ప్రాణప్రతిష్ఠ చేశారు. నామాలు వేరైనా, పంచశీల, ఈనాదేశం, ఇల్లు కంటె లాంటి కవితలు ఆధునిక కవిత్వానికి అద్దంపడతాయి. శ్రీ గజానన్ తామన్ కంచెల గురించి "స్నేహమయీ

సాధ్యం కాదు చెప్పడం సంక్షిప్త రూపంలో
కథనం చేయాల్సి వుంటుంది. అంచెలంచెలుగా
కరుణరసస్ఫోరక మహాకావ్యంగా మంచి" అంటూ సాగిన కంచె కవిత పాఠకున్నే కాదు, అభ్యుదయ కవుల్ని ప్రత్యేకంగా ఆకర్షించకమానదు.

"మనం మనం భాయీ భాయీ"
మన మధ్య కంచె అనేది ఎక్కడుంది.
ఇదంతా పూర్వీకుల నిర్వాకం" అంటారు. కంచె వేయడం అన్నది భాష ఏదైనా ప్రాంతం ఏదైనా హద్దులు నిర్ణయించడానికి ఉద్దేశించబడింది. భూమి తగాదా వచ్చి రెండుగా విడిపోయి మళ్లీ ఎప్పుడూ హద్దు దాటకుండా వుండడానికి తగువు పొడిగించకుండా వుండడానికి మానవులు ఏర్పరుచుకున్న సాధనం కంచె పరిష్కార మార్గం కంచె.

భారతదేశానికి భరతభూమికి కురుపాండవుల నాటి నుండి భూ సమస్య శాపంగా పరిణమించింది. రక్తం కాల్వలై పారింది. అసంఖ్యాక-నాటి నుండి ఆ శాప ఫలితంగా పగలు రేగుతునే వున్నాయి. స్వాతంత్ర్యం సిద్ధించిన తరుణంలో భరతఖండంలో చీలిక ఏర్పడింది. భాయీభాయిలుగా మసలుకోవలసినవారు జుత్తులు పట్టుకున్నారు కత్తులతో పోరాడుకున్నారు. కంచె ఏర్పరుచుకున్నారు. అయితే కవి కవిత్వంలో చెప్పినట్టు కంచె ఏర్పరుచుకున్న తర్వాత కథ కంచికి చేరలేదు. కథ దుఃఖానికి రక్తపాతానికి దారి తీసింది. దేశాల మధ్య చిచ్చు రగిల్చిందని చెప్పడంతోనే కంచె కవిత ఉత్తమ కవితగా రూపుదాల్చింది.

"నేనే నీవు నేనే నీవయినా
కంచె అనేది అవసరం నీనామధ్య
పున్నమి కోమారైనా నీవు అయి వేపు నుంచి
నన్ను పలుకరించి ఊరించాం కదా !

ఋగ్వేదంలోని ఊర్వశిలా" అంతా కంచె కవితను ముగిస్తారు థామన్. కవిత చదవడం ముగిసిన తక్షణం పాఠకుని మదిలో ఒక స్నేహభావం చిగురిస్తుంది. కంచెకి ఇరువైపుల అంతా వుండి ఇరువర్గాల వారు శతృత్వం కాస్తంత సేపు ఆపి ప్రేమగా పలకరించుకోవాలనిపించడానికి కవిత దోహదపడుతుంది. ఆ ప్రేమ భావం ఉద్భూతం కావడానికి కవి ఋగ్వేదంతో గల ఊర్వశి పురూరవుల గాథని గుర్తుకు తెచ్చుకుంటారు. కవితకు చక్కని ముగింపు సమకూర్చి పెట్టారు థామన్.

ఈ కవితల్లో గల కొన్ని రసాత్మక వాక్యాలు పరిశీలిస్తే కవి భావ కవి యుగంలో జన్మించిన ఆధునికుడుగా దర్శనమిస్తాడు. ఎంత ఆధునికుడో అంత ప్రాచీనుడుగానూ సాక్షాత్కరిస్తాడు.

1. ఎల్లవేళలు తిరిగి సజన విజన పథాలు
   నీవు అర్పించుటకు నేను తరియించుటకు

2. అవి విదాతకు ఇవి సాటి మానవునికి
   అనాకలనీయమైన ప్రశ్నన చిహ్నాన్ని

3. ఇన్ని నాళ్ల నెయ్యాన్ని సమభావ ప్రేరిత సహజీవనాన్ని

4. "దాని నింపను దీని నిత్తును
   గగన కుసుమములు చిటవి యిత్తును"
   ఎన్నికలలో గెల్పుకోసము
   ఇవి ఉత్తి మాటల గారడీలు

5. గ్రామాభ్యుదయం ధ్యేయమైన యువకిశోరాలు
   కావిస్తారు నాకొలువున వాదోపవాదాలు

7. ఎడారియె దవ్వెంత నడచిన ఎక్కడోచిరుశాద్వలం" లాంటి వాక్యాల్లో గ్రాంధిక వాసనలు దాగున్నా మానవతను వీడని కారణంగా కవితలు రసజ్ఞుల్ని ఆకర్షించక మానవు. అభ్యుదయ స్ఫోరక వాక్యాలు ఆహ్వానాలందుకొనక మానవు.

అయితే నేటి ఆధునిక కవిత్వంలో ఎలా మాట్లాడితే అలాగే వచన కవితలు రచించే సంవిధానం నెలకొని వుంది. గేయం గట్టిగా చదివి గంభీరంగా ఆలోచించడం అలవాటయిన నేటి తరం కవితా పాఠకులకు ఈ సంపుటిలోని కొన్ని కవితలు విసుగు కలిగిస్తాయనడంకు విమర్శ కాదు.

"ఈ వేళ ఓపికగా నాగదిలో కూర్చొని
అడ్డం నిలువు ఎటు పడితే అటు అయి
నా ఈ కుంచెను పరుగులు తీయించి
భిన్నత్వంలో ఏకత్వం చూపించే
ఓ మహాకృతిని తెస్తాను అస్తిత్వంలోకి
మళ్లీ వీలుండునో ఉండదో" అంటారు మళ్ళీ వీలుండునో... అనేక కవితలో. పైన ఐదు పాదాలు వాడుక భాషలోను ఆరవపాదం గ్రాంధికంలోనూ వుండడం పఠితకు కొంత ఇబ్బంది కలిగిస్తుంది. వచన కవితల్ని వాడుకభాషలో చదవడం అలవాటయిన పాఠకులకు ఇలాంటి వాక్యశకలాలు సూదుల్లా గుచ్చుకుంటాయనడం అతిశయోక్తి కాదు.

కవికి సంస్కృత భాష మీద ఎనలేని అభిమానం అన్న సత్యం వీరి ప్రతి కవితలోనూ ప్రస్ఫుటంగా దర్శనమిస్తుంది. అక్కడక్కడ కవితల్లో గల పదాడంబరం క్లిష్ట సమాస విన్యాసమూ పాఠకుల్ని మొగ్గలు వేయిస్తుంది. తెలుగు నాట కృష్ణశాస్త్రి విశ్వనాథ శ్రీశ్రీ వంటి మహాకవుల కంఠాలు వీరంగం చేసిన తర్వాత ఓ అంటే ఓహో అంటూ అనేక యువ కంఠాలు అనుకరించి ప్రతిధ్వనించడం ప్రారంభించాయి. శ్రీ గజానన్ థామన్ కూడా అలా ప్రతిధ్వనించి తన స్వంత గొంతుని వినిపించిన వారిలో ఒకరైన దాఖలాలు వీరి కవితల్లో కన్పిస్తాయి. ధ్వనిని, లయని తన కవితలో నిక్షిప్తం చేసి స్మృతుల్ని శ్రుతుల్ని ఋక్కుల్ని కవితకు నేపథ్యంగా స్వీకరించారు.

వృత్తిపరంగా గజానన్ థామన్ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయులు. పండితులకు పండితులు. ఈ పాండిత్య ప్రకర్ష వీరి కవితలలో అక్కడక్కడ తొంగి చూస్తూ పాఠకులకు గ్రాంధిక బరువులు తలకు మించిన భారాన్ని కలిగిస్తాయి.

కొన్ని కవితల్లో శిశిర శైత్య దష్టతరులు, శీర్ణకోటి పర్ణావళి, వర్తమాన మంథన నిర్గళితగరళం, విరార్జనాళిక, నభంగమనిర్ఘోషం, నికృత్తన్యగ్రోధం, సహచర పరివ్యక్తుడు, నిరీహవు లాంటి పదాలు తెలుగు కవితల్లో వాడకంలో లేని పదాలు, వచన కవితలకి కొత్త కాంతులూ, నూతన అందాలూ, సమకూర్చలేకపోయాయి. అందగించని ఆభరణాల బరువులుగానే దర్శనమిచ్చాయి. ఆ పేజీ తిప్పి పఠితను అమోమయంలో పడవేస్తా యనడంలో నిజం లేకపోలేదు.

అలాగే వస్తువు ఆధునిక మూసం విధానం ప్రాచీనమై సమాస పదాడంబరంతో కొన్ని వచన కవితలు నారికేళపాకంలో పడిన సందర్భాలు అక్కడక్కడ కన్పిస్తాయి. అయితే మహారాష్ట్ర కవి సంస్కృత తెలుగు భాషల మీద మంచి వైదగ్ధ్య వైవిద్యాలు ప్రదర్శించాడన్న సంతృప్తి పాఠకుల్లో కొంత ఊరట కలిగిస్తుంది.

భారతీయ ఆత్మ యొక్క లాక్షణికతను స్వీకరించడం ప్రముఖ మరాఠీ సాహిత్యకారుడు పురుషోత్తమ రేగే సావిత్రి నవలను తెలుగు చేయడం, సాయనాచార్యుల వారి భాష్యం సహాయంతో ఋగ్వేదం పారాయణ చేయడం, జీవనవాదాన్ని మార్క్స్ దృక్పథాన్ని అనుసరిస్త ఆధునిక కవితా లోకానికి వచన కవితలందివ్వడం నేడు గజానన్ థామన్ రూపు రేఖలు తెలుగు వారందరూ సాదరంగా ఆహ్వానించదగిన ఉత్తమ కవి గజానన్ థామన్ ఉత్తమ కవితా సంపుటాల జాబితాలో చేర్చదగిన సంపుటం వీరి మానససరోవరం.

తల్లి తెలంగాణ

పరమ పావని తెలంగాణ !
పసిడి వెలుగుల కురియు సోనా!
జననీ !! వందనం

నీవయే కద మాదు శ్వాసము
నీవయే కద మాదు హాసము
నీవే మా ప్రాణం

నీ దిశల వీచే గాలులు
నీ వనుల పూచే పూవులు
నిలుపు మా ధ్యానం

అందమైనది నీ ప్రభాతము
అందమైనది నీ దివాంతము
నీవు బంగారం

ఆర్ద్రవైతివి అహో సుదినము !
హరిత వైతివి సుతుల భాగ్యము
నిత్య కళ్యాణం

కలలు కనెదము ప్రతి నిశీథము
కవన నిర్మితి ప్రతి నిమేషము
అపర చైత్ర రథం

ఎన్ని ఇడుమలు సైచినావో,
ఎంత సమరము సలిపినావో
ఇది పునర్జన్మం

ఎంత శౌర్యము నేల అరసెను
ఎంత సృజనము నేల విరిసెను
ఏమి ఇతిహాసం !

గజానన్ థామన్
మంథని

یتیلنگانہ   ٹیلنگانہ.
تو ہے خشیوں کا خزانہ.

کیا کہیں   اف تیری ادا
سارا جہاں تجھ پر فرا
ہو نگے گر تچھ سے جدا
کہاں پائین اشیا نہ.

خواب میں تو, خیال مین تو
جدھر دیکھیں تو ہی تو
ار ژو انجام بھی ہے تو
تیرے دم سے ہے ژمانہ.

کتنی حسین ہے صبح تیری
اور عجب سنہری شام
مستی میں گائیں ہم سبھی
خوبصورت تیرا ترانہ.

شاداب ہے اب تیری ژمیں
ماں گوداوری ہے مہرباں
کیا کمی دامن میں تیری
دیش سارا جانے فسانہ.

اژاد تم اور اژاد ہم بھی
دور ہم سے رنج و غم
اٹھ کے ہم چل دیں کہیں
ہر سفر ہوگا سہانہ.

دیکھے یہاں کا بھائی چارا
ہوتا ہے سں تھوڑے مین گژارا
ہر دل کو بھاے گا نظارہ
ژندگی گن گناتی تندانہ.

جگ جیت نے کی نہیں چککر
دل ہار نے میں ہمین غم نہیں
دستور تیرا صریوں پرانا
نبھائیں اسے ہم بن بہانہ.

گجانن تامن
منتھنی.

పరివేదన

ఏమి తోచకున్నది ఈ
శూన్య గృహములో
ఎవరి కేది వశమైనది
అచిర జగతిలో ?

అడిగికొన్న జీవనమితి
నాల్గు దినములే !
గడిచె రెండు కామనలో
రెండీక్షణలో !

ఏటికినుక పికస్వామికి
తోటమాలిపై,
నియతి వ్రాత నేడుఖైది
నిండాయనిలో !

ఏ కోరికకేని సెలవు
అవలనిలువనీ !
ఏమి చోటు నొసగగలను
పగిలిన ఎదలో !

ఓయి మాలి ! విరుల ముళ్ళ
వేరుచేతువా ?
ఒకే గాలి కూగి పెరిగె
ఉపవనమ్ములో

మూడు నాళ్ళ ముచ్చటైన
బతుకు ముగియు చో,
మునుక వేయ జాగేటికి
తీపి నిదురలో ?

ఈ సుమాలనుంతు రెవరు
నామ జారుపై
ఇసుమంత నేల నోచనైతి
చెలుని కోనలో !

మూలం: **బహద్దూర్ షా జఫర్**

నింగీ నేలా మనమూ !

నింగీ నేలా మనమూ
ఇతి వృత్తం అగును కదా !

నది నడకవు నీవైతే
నది కాపరి నేనె కదా !
నా తోడుగ నీవుంటే
నీ నీడను నేనె కదా !

ఈ అలజడి వేళల్లో,
ఈ ఎగసే జ్వాలల్లో,
మనుగడ కాదరువు
గుండెల దిటవె కదా !

గెలుచుట ఓడుటకే
ఓడుట గెలుచుటకే
యుగమది ఏదైనా,
ఇతిహాసం ఇదియే కదా !

కన్నీరే పన్నీరు
పన్నీరే కన్నీరు
నడిమి తెరను తొలగిస్తే,
అద్వైతము తెలియు కదా !

అనుభూతులు వేర్వేరు
అభిరుచులూ వేర్వేరు
నీ బ్రతుకుకు నిర్వచనం
నీవాసగే దౌను కదా !

ఈ శంఖారావాలు
ఈ ఉత్తర బేరాలు
ముగిసి సద్దుమణిగాక,
చివరి నగవు మనదే కదా !

ముగింపు

సరే ఒకసారి మరలా,
ఒకరికొకరము పరుల మౌదామా!

ఇక మీద కోరను తీయగా
నువు పలుకరించుటలు
నీవు సైతము నీవానిగా
నన్నూ హించుకొనవలదు

రానీను ఇంచుక గుండెసవ్వడి
నాదు మాటలలో
రానీకు నీవును ఎట్టి అలజడి
నీదు చూపులలో

ఏమి తలపో నిన్ను అడుగును
ముందుకే నీదు
నీ సొబగులన్నీ నావెఇవుడను
మాట వినరాజీ

నిరుటి నీనా అలుకలేవీ
స్మృతిని విడలేదు
నీ తోడగడపిన రేలనీడలు
వెలసి పోలేదు

ఈ గాధముగియనిదైన యగుచో
మార్గమేమని అడుగకు !
ఓ అందమైన ముగింపునొసగి
సాగిపోవుటె ముందుకు !

మూలం
ఉర్దూ సాహిర్ లూధ్యాన్వీ

శిలను కాను !

శిలను కాను జీవమున్న
మానవుండను
చీకు చింతలేని ప్రాణి
నెటుల యవుదును

నిరుడు తోడు నీడగ ప్రియ
జనులు ఎందరో !
నేడు తోవచూపు వారు
కరువె యందును !

ఈ దర్పణ మిక వ్యర్థము
పగుల గొడుదునా ?
ఏ అందము ఇందులోన
నేను చూడను.

ఏకతమున నున్ననైన
తీరు స్వాంతన
నే మధువున జీవన వ్యథ
విస్మరింతును

కారు చీకటి కమ్ము వేళల

కారు చీకటి కమ్ము వేళల
కలలు కందును మరి ఇలా !
నేను చేరుదు ఇలను సారెకు
నిండు పున్నమి వెలుగులా !

తలను దాచగ నేను కోరే
తావదొక్కటి యున్నదా ?
ప్రణయ గీతులు పాడుకొనుటకు
పాడులోకమా ! హద్దులా ?

ఇచటనైనా అచటనైనా,
ఎచటనైనా సరే !
చిరునగవుతో నిను పలుకరింతును
దరిని చేరే పడవలా

నింగి కెగసే ఓ విహంగము
నే క్షణమ్మొ చూచిన,
నేను సైతము అలా చేయుట
సాధ్యపడునా, మాటలా !

కలయిక

నీవు మనసా కోరినందుకు
దైవమిచ్చుట పారవైచెను

నీవు నన్నిక చూడజాలవు
నేను నిన్నిక చూడజాలను
బయటి వెలుగుల వెన్ని యున్నా,
లోని చీకటి నేమి చేతును ?

ఆయనైనా శిశిరమైనా
వలతు దేనిని, వగతు దేనికి ?
నాటి పెంచిన పుష్పవాటిక
నా ప్రవేశము నిషేధించెను

ఒకే తపమిది భంగమాయెను
ఒకే జీవనమిటుల ముగిసెను
ఒకరినొకరికి చేర్చు ఈ కథ
ఊహగానే మిగిలిపోయెను

ఈ జగాన

నీ జగాన ఓయి ప్రియుడ !
ఎందుదాగినాడవో ?
ఏకాకినిగా మిగిలితి
ఈ నా దశ చూడవో ?

అస్తమించు వేళరాదు
ఆశ నన్ను వీడిపోదు
హృదయమిటుల మారెనేమి ?
ఏదియైన మురిసిపడదు
దోచి నన్ను నిలువున
దోబూచులాటలెందుకో ?

ప్రాణమొకటి వ్యధలు వేయి
శ్వాస లెటుల నిలుపునోయి ?
చూపు మసకబారు వేళ
చూడవలతు చివరి సారి
దోచి నన్ను నిలువున
దోబూచులాటలెందుకో ?

మూలం : **ఉర్దూ సాహిర్ లూధ్యాన్వి**

పాంచజన్యం

పేదరికం ఒక శాపం !
పెద్దలకు తెలియనిది కాదు.
దినసరి పని కోలుపోయి
దినగండం బతుకులయ్యి,
పిల్లలతో, పాపలతో,
పెను ఇడుమలు పడుకుంటూ,
ఆకలితో,. దప్పులతో,
అలసిన మేనులతో,
ఇంటి దారి బిరబిర,
ఈ నడకలు, ఈ పరుగులు.
రైళ్ళ మోత ఏమోకాని
కోళ్ళ కూత వినిపించవు
రావుల శకటాలకేమి,
రైతుబండ్లు రవళించవు
ఒడి తలపుల తెగువ ఎంత ?
గుడి తలుపులె తెరచుకొనవు!
కర్మస్థలి రణగొణ ధ్వని
కర్ణపేయ మెవ్వరికని ?
ఇసుక వేస్తే రాలని ప్రజల
ఎందుదాగియున్నదొకటి ?
విపణి వీధులెన్ని వున్న
వినిపించరు నాటి గోస !
బార్ల తలుపు బార్లగాగ
బార్లుతీరు మధు పిపాస!
అంగడిలో ఎన్నియున్న
అల్లుని నోటిలో సున్న
ఖరీదైన పెండ్లి లేఖ
కరువే మరి జనాల రాక !
మసక బారిపోయెను కదా !
మర్యాదలు మన్ననాలు
ఉపవని విహారాలు లేవు
ఉపగృహాల మేత లేదు
కంచి పట్టు చేలమ్ముల
కామన ఒక కమ్మని కల
నిండు వినోదాలకింక
వెసలుబాటు లేనెలేదు
పుట్టిన రోజుయిన నేమి ?
పుత్తడి పిసరే మేరువు !
భారతీయ గృహిణి వ్యధలు
బ్రహ్మకేని తలకెక్కవు !

ఎల్లడేట్ల వోతెఏమి
ఇల్లు నీది పదిలము సుమ !
రోగమెంత చిన్నదైన
రూకలు రాలుట కష్టమా ?
తిమ్మిని బమ్మిగ చేయుట
తిమ్మా ! పత్రికల తెన్ను
పఠిన పాఠనాల కేమి ?
భారీగా వేతనాలు !
ఈ బరువులు మోసుకుంటు,
ఈ దేశం ప్రస్థానం !

ఆర్తి

నింగినంతయు గాలించి నిన్ను గొలువ
దిక్కులను వేడు యతనమ్ము బిక్కబోయె
నేలనంతయు తిరుగాడి నిన్ను గూర్చి
మొక్క మొక్కను కదిలించి మోడునైతి

మొదలి హిమగిరి నీ ధ్యాన భూమి కాదు
నాటి స్వర్గాన నీ చిరునామ కనను
శ్రీలుగలవారి ఇళ్ళకు చేరినావు
పేద గుడిసెల పేరెత్త విసుగు నీకు

భూ దివమ్ముల సృజనమ్ము నీదెయైన
నిన్ను పేర్కొనునంతకు మిన్నకాదు
చిన్న అణువున చావును చేర్చినావు
నీదు మహిమను గణుతింప నేటి తరము

చిమ్మ చీకటి క్రమ్మెరా జీవజగతి
చావు బ్రతుకుల ద్వైతమ్ము సమము వేళ
వెలుగువై రావె, నేజేయు విన్నపమ్ము
నీవు కలవను మాటను నిలుపుకొనుము

మూలం : **'పద్య ప్రభంజనం'**లో ప్రచురితం

ఇదం జగత్

సుఖమైనా, శోకమైనా,
ఏది యైనను
మనసా నా స్వీకృతి
రెంటికైనను

మసక బారె ఎదిరిచూపు
మోము మోమునా !
ఈ పాటికి సఖుడు వచ్చి,
పోయి యుండును

వీడుకోలు పలికినాను
వీడున తిథికి
ఇల్లుదోచె, దోచెనాదు
సర్వస్వమును

దవ్వులోని చందమామ
ముడివడదు కొంగునా,
ఈ వెలుగులు ముంగిలిలో
ఇముడవందును

బాటసారి యానము వలె
ఈ ప్రపంచము,
మెల్లగానొ వడిగానో
సాగిపోవును

మూలం : **నిదాషాజలి**

జీవనం ఓ ప్రణయ గీతం

జీవనం ఓ ప్రణయ గీతం
పాడుకోవాలి ఏ ప్రాయమైనా !
జీవనం వ్యథా సాగరం
జాము ఏదైన దాట గలుగాలి

ఎవరిదే కొలది యుత్సంగమో
వారి కాకొలది సంప్రాప్తము
పూలు నీ నుదుట లేకున్నచో
ముళ్ళకే ముచ్చట పడాలి

ఎచ్చోట గమ్యముంటేమి
ఎత్తు పల్లముల తోవైన నేమి
ఇరులు తారకలు లేనిదే యైనా
ఎదను వెలిగించి ముందుకే గాలి

చిరకాల వనవాసియైన
చేరువలు దవ్వులై చనిన
ఎడబాటు వరముగా నెంచి
ఇక మీద మసలుకోవాలి

జీవనం మృదుమధురహాసం
హృదయ వేదన మౌన భాష్యం
జీవనం ఒక రేయి నేస్తం
పొద్దుటే పయనమవ్వాలిపొడుపు
కథలేని మనిషి మనుగడలు

పొద్దుమాపులు దాని నెచ్చెలులు
జీవనం చూడ నీనొసగు వచనం
నీవు నీ మాట నిలుపుకోవాలి

మూలం : ఉర్దూ కవిత
సావిన్ కుమార్ టాక్

యాది

పూవులకు మేల్కొల్పు పాడే
భ్రమరము తుమ్మెదను విన్నా
గుమ్మళ్ళు పూచిన గుడిసె మీన
కోడిరాయుని గొంతు విన్నా,

తూనీగ వోలె పరుగు దీసె
త్యాగమెడ గంటలను విన్నా,
మావి చిగురులు మెక్కి మత్తిలు
కోయిలల తీయని కూత విన్నా,

ఆలమందనీ తోలు కెళ్ళే
గొల్లపిల్లని క్రోవి విన్నా,
తెలవారు వేళల హాయిగొలిపే
తెమ్మెరల గుసగుసలు విన్నా,

ఇవేకాక లెక్కకందని పల్లెముచ్చట్లు
గుండెలో పైలంగ దాచుకొ ఊరజిల్లేటే!
ఏనాటికైనా మళ్ళీ వినేందుకు ఎదిరిచూసేవే
ఎదనీ గెలికీ మాటిమాటికి ఏడిపించేవే

ఈ పట్నపోళ్ళ నడుమ ఉంటూ
నా నీడకే నే బుగులు పడుతూ
ఆగమయ్యిన బతుకులనీ చూస్తూ
చూడగూడనివెన్నో చేస్తూ,
పడుతు లేస్తూ, లేస్తు పడుతూ,
బతుకు బలిమిన లాగుకొంటున్నా

ఆడ నా ఊళ్ళె పిలగా !
బావ నౌకనికి మావ నౌకతెకు
మోరలేని దుడిసి నిక్కడ !
ఎవరికీ నీవేమి గాను
రోగమైన నొప్పియైనా
ధైర్నమిచ్చేటోడు లేడు
ఆపతైన సంపతైన
అడిగె చుట్టం ఉంటె ఒట్టు.

ఎన్ని మాట్లో పల్లెపిలుపుకు
ఉలుకనైతిని పలుకనైతిని
మాయలూ మంత్రాల పట్నం
బెల్లం గొట్టిన రాయినైతిని
ఎల్లమ్మ తల్లీ ! ఏమి పనియిది ?
ఎడజేసి నీవె నన్ను ఊరికి !

నేను విడిచిన పల్లె వైపుకు
దూసుకెళ్లే రైలు కూతను
ఇదే యాళ్ళకు దినాం వింటూ
ఎంతో కొంతో సంబ్రపడుతున్నా

గుర్తుకొస్తాయి

ఇట నుండి నే లేచి వెళ్ళాక
ఇవన్నీ నీకు గుర్తుకొస్తాయి

మేరలెరుగని నాదు ప్రణయము
సారెసారెకు నీదు స్మరణము
కలయికల వేళల కురియు పన్నీరు
వీడ్కోల్పు వేళల జారు కన్నీరు
అమవసే పున్నముల రాత్రులు
ఆరు ఋతువులు రాకపోకలు
ఇవన్నీ నీ గుర్తుకొస్తాయి !

నీ మేని యందలి వంపు సొంపులు
కవితలోనికి అనువదస్తూ
నాకు మిగిలిన మనోవేదన
గ్రంథ నీ రధి ముంచి తేస్తూ,
ప్రతి క్షణము దుర్భర యుగముగా
గడిపేటి నాదగు మహాద్భాగ్యము
ఇవన్నీ నీ గుర్తుకొస్తాయి !

నగవు మాటున నిస్సహాయత దాచుకుంటూ
కలువరేకులు కనులునీయవి తలుచుకుంటూ
నావంక చూడని నీ చిలిపి వైఖరి,
పూవంటి నా యెద ముల్లైయైనా,
స్వప్న వీధీ పథములందున
నీవు సలిపిన నిత్య విహరణ
జానె జా ! జానే తమన్నా !
ఇవన్నీ నీ గుర్తుకొస్తాయి !

ప్రాప్తి

పొందినది చేజారిపోయిన
నేమి అవుతుంది ?
ఊహలోనికి మధుర గీతిగ
అడుగు పెడుతుంది.

జీవనం ఏ పొద్దునైనా
వ్యథలో మునిగేదే !
ఎదిరిచూడని స్నేహ హస్తము
తోడుపడుతుంది.

మండు వేసవి నీరు అనునది
ఇగిరిపోవు కదా ?
దేహార్తి యౌ తేలి మబ్బులో
దాగిపోతుంది

కన్ను పెదవుల సొగసు చిరు
నాను ఎచ్చోట ?
ఒకరి నుండీ ఒకే ఒక్కటి
తొంగి చూస్తుంది

చిరునగవులో ఎడతెరపిగా
అశ్రు వుంటుంది.
'హాయిలోనూ ఉందు పొమ్మని'
బిగుసుకుంటుంది.

తెలంగాణ చంద్రోదయం

అష్టకష్టాలు పడితిమి అరువదేండ్లు
పరుల పాలన కోల్పోయి వనరులెల్ల
దమ్మిడీయము పొమ్మనె దానవపతి
వాయి మెదుపక మోరలు వాల్చినాము

భంగపాటులె దినసరి బత్తెమాయె
విరిగె లాఠీలు మనుజుల వీపుపైన
క్రుగ్గి రెందరు ఇరుకైన రాతిగదుల ?
కలిసి తమ్ముల అసువులు గాలిలోన !

కరెగె నెట్టుల తెలగాణ కాళరాత్రి ?
డాసె పున్నమి మాదైన ధాత్రినిపుడు
ముగిసి శిశరమ్ము ఆమని ముద్దుగొల్పు
చంద్రశేఖరునది ఇంద్రజాలమెల్ల

ఊర చెరువుల జలకళ యుట్టిపడును
దారి పొడుగున తరువులు దౌడుతీయు
పిలువ 'ఓ' యను ఇంటింట పేయ జలము
తడుపు బీళ్ళను ముందు గోదమ్మ నీరు

గూటి కోసర మెవ్వడు గోసపడదు
బిడ్డ పెండ్లికి ఒక్కింత వెతలు దప్పు
ఒంటిగా నున్న స్త్రీకి చేయూత యబ్బు
బడుగు తలుపును తట్టు సౌభాగ్యలక్ష్మి

-గజానన్ థామన్

మృగశిర

Oh ! to be in England
Now that April's there

_Robert Browning

మాటిమాటికి గుర్తుకొస్తున్నాయి నాకు
మైళ్ళ దూరంలో ఉన్న నా ఇల్లూ-ఇల్లాలు.

ఎల్ల వేళలూ, ఎల్లలపై నిఘా ఉంచుతూ,
రాళ్ళురప్పలు పలుకరించే ఈ చలి ఎడారిలో,
సమరం శాంతి గాని సందిగ్ధస్థితిలో
కొట్టు మిట్టాడే సైనికుల్లో నే నొకణ్ణి

చేరుకొని ఉంటాయి ఈ పాటికి
ఎప్పటిలాగే నైఋతి ఋతుపవనాలు
కురిసి ఉంటాయి కుండపోతగా ప్రావృణ్ణీరదాలు
తృణాంకురనైగనిగ్యం అందుకొని ఉంటుంది
నా తెలంగాణం - ముక్కోటి దేవతల ప్రాంగణం.

ఎఱ్ఱని పూలు మేనెల్ల కొల్లలుగా
విరబూస్తుంటుంది పెరటిలోని దాడిమ,
క్రొంజిగురాకు సొగసైన తొడవులతో
వయసొచ్చిన లేమలా ముస్తాబై ఉంటుంది జామ.
మార్పేమి ఉంటుంది మల్లియలో ?
మల్లియ మా ఆవిడకు ఆరవప్రాణం !
పంతగించి పొట్లలూ, బీరలూ
పందిరిని వ్యాపించి ఉంటాయి.

బడులు ఇటీవలే తెరిచారు కాబోలు !
పదేళ్ళు నిండీ నిండని మా పార్వతి
ఐదవ తరగతిలో చేరి ఉంటుంది.
పలకపై ఏవేవో గీట్లు గీస్తు పసివాడు
ముప్పొద్దులూ పెద్దల్ని మురిపిస్తు ఉంటాడు

గంటలు అవిరామంగా మోగుతాయి
దీపాలు చీకట్ల చీలుస్తూ వెలుగుతాయి
సందడి నానాటికి పెరుగుతుంది
అందాల మా ఊరి కోవెలలో,
నిత్యనవోన్మేషణం అనుగ్రహించే
స్వామికృతికి అనురూపస్పందనగా.

'జిగర్'
సం॥ **-అనిసెట్టి రజిత** జనవరి 2013

అమరవీరులు

గుడిసె మీన విరబూసిన
గుమ్మాడి పువ్వులతో...
గోడమీని పూతలోని
గుర్రాల దౌడులతో...
మా తల్లుల, మా చెల్లెల
మమతలొలుకు నవ్వులతో...
ఆరుగాలము చెమటోడ్చు
అన్నలతో తమ్ములతో...
దేవరలకు నెలవులైన
తెలంగాణ పల్లెలలో...
పుట్టి పెరిగినాము మేము
పున్నెము ఏ జన్మలదో !

నిన్న గదా ! మేము మీరు
నిండుగాను నవ్వుకుంట
చెరువులల్ల ఈతలు సరె !
చెలికలల్ల తిరుగుకుంట...
ఎదురైతే వరుస బెట్టి
ఏమి సక్కగ పిలుచుకుంట...
సారలక్క సమ్మక్కల
జాతరల్ల కలుసుకుంట...

యాట యాట పీరీలల్ల
అస్సోయ్ దూల ఆడుకుంట...
కొమురంభీం, అయిలమ్మల
గూర్చి కతలు చెప్పుకుంట

నేలపైన ఉనికెక్కడ ?
నీడలమై పోయినాము
ఊరి చివరి మర్రికింద
ఒదిగి నిదుర మునిగినాము
మల్ల మల్ల మతికి వచ్చు
మనుషులుగా మిగిలినాము
మే మెత్తిన బావుటాను
మీ చేతుల పెట్టినాము
మేము కన్న తీపి కలను
మీకు వదిలి వెళ్ళినాము
తెలంగాణ సాకారము
సెలవా మరి ! మీ భారము

-గజానన్ థామన్
మంథని

ఆదిలాబాద్

ఏ కల్పాద్యంతంలో, ఏ యుగంలో,
ఏ మహర్షి పంచాగ్ని మధ్యంలో నిలిచి,
ఎన్ని వసంతాలు ఆచరించిన తపఃఫలానివో !
నీవొక అపూర్వ సుముహూర్తాన
ఆవిర్భవించావు పావన గోదావరీ జలాల నుండీ
మానవ హస్తాలు చెరుపలేవు నీ అస్తిత్వం
ఇటు తెలుగునేతలకు, అటు మహారాష్ట్రకు మధ్య
శాశ్వత స్నేహవారధివి
వ్యాస మహర్షి తపోవనానివి
నీ పిల్లలమైన మాకు భూతల స్వర్గానివిగా
'రాముడేలిన దండకారణ్యఖండానివి'గా
ఎంత గొప్పగా చెప్పాడు పద్యంలో నీ సేనాపతి !
మరి నీ బంగారు నాయన, కొమురం భీమన
నీ చరిత్రకు సాంధ్యవర్ణాల పుటను చేర్చాడు.

ప్రకృతి పెదాలపైని మృదు హాసరేఖలా
మైళ్ళుగా వ్యాపించిన నీ మహారణ్యం
ఏపుగా పెరగడంలో పంతగిస్తున్న తేకు, మద్ది వృక్షాలు
అడుగడుగునా ఎదురయ్యే వెదురుపొదలు
దొరల నిమిత్తం పెంచబడుతున్న నీలగిరులు
చెట్టునో, పుట్టనో, కోరాడు పనిలేని అడవిదున్నలు
ఒయ్యారంగా ఆడే మగ నెమళ్ళు
ముస్తైలకై మునిమాపులు నేలను తవ్వుతున్న వరాహగణం
పుట్టెడు పూలు రాల్చు ఇప్పల కింద
పొట్ట చేత బట్టుకొని గుమిగూడే ఎలుగులు

గాలిలో తేలిపోతూ ఈనాటి సీతను మురిపించే లేడికూనలు
రాచరికం అడవుల్లో నిలబెడుతూ, ఠీవిగా కదులుతున్న పులులు
ఎక్కడో దూరాన కుంతల జలపాతం గలగల,
బాసర చదువుల తల్లి గుడిలో సందడి
ఏ నందనవనం, ఏ చైత్ర రథం
దీనికి ప్రతిరూపం !

అకారాది పట్టిక ఎవరిదైనా
అరంభం నీతోనే
'అ–ఆ'లతో మొదలవుతుంది తెలుగు వర్ణమాల
అందుకే, ఏలికలకు వేరే పర్యాయం లేదు.
నీ గోండ్లు, ప్రధానులు, మన్నెలు, మహోర్లు
అన్నెం–పున్నెం ఎరుగని నీ లక్షలాది సంతానం
ఏ మాత్రం వెలుగు చూశారు,
ఈ ఏబది వసంతాలలో ?
ఎన్ని మారులు ప్రశ్నించినా, పెదవి విప్పరు
పాలకవర్గ బృహస్పతులు
మా సహనానికి మేరలు ఎక్కడ గీచావు ?
మా కోసం ఏ స్వప్నం ఎక్కడ దాచావు ?

నమస్తే తెలంగాణ **-గజానన్ థామన్**

ఊరు పిచుకలు

ఊరుపిచుకల జోలి ఎవరైనా ఎత్తిరా,
ఉస్సురంటవి మా 'దేవేందర్' పంచప్రాణాలు.

తెలుగు బాసకు ఇయ్యాల అంటిన తెగులు
తీరా వాటికి సుత సోకిందో ?

తెలంగాణ పల్లెల్ల నీటి చుక్క కరువై,
దినదినగండంగా బతుకులు బరువై,

మన మడుసులు దుబాయి బాట వట్టినట్టు
మరి యాడికి ఎగిరిపోయినవో అవి ?

ఇసుంటి ప్రశ్నలే అతణ్ణి పాపం,
ఏనాడో చేసినయి నిద్రకు దూరం !

ఏ జన్మల నేను జేసుకున్న గోరంత పున్నెం !
ఏనాడూ ఊహించని మాపటేళ్ళ

ఎగురుకుంట, దుంకుకుంట మా పెరట్ల
ఏవో కొన్ని ఆగుపించినయి

ఇన్నాళ్ళు వేచిన కంటికి
ఈ నేలమీద నూకలు చెల్లినవనుకొన్న వాటి 'సంపతి'

ఏ మాశ్చర్యం ! ఇంకా ఊపిరితో ఉన్నది
వాటిని దక్కించుకునేందుకే

నేడు ఛప్పన్నదేశాల పూనికలు
పాటల పంచుకుంట నా చాతనైన కాడికి

ఇప్పుడు ఎండకాలం దేవుడా ! నిప్పులు చెరుగుతున్నది.
ఎంత గోసనే అన్న ! ఈ కంకెడు జీవాలకు ?
పెరట్ల చెట్లున్నయి గద ఒకటి రెండు
వేరే ఆలోచన దేనికి ? ఆలస్యం దేనికి ?
గోలెంల ఉన్న సల్లటి నీళ్ళతో
కొమ్మలూ రెమ్మలూ తడుపుత పొద్దుమాపులు
ఇగ్గ జూసుకో ! వాటి మురిపాల పిచపిచలు
ఏమాత్రం మాటలకందని ఎడతెగనిలొల్లి
కవిత్వాలు రాసుకుంట, కైతికాలు జేసుకుంట
కాలం గడుపుడా మడిసి నైపుట్టి ?

తెలుగు జాతి పత్రిక

-గజానన్ థామన్

మంథని, కరీంనగర్.

పొద్దు పొడుపు

అడుగు ముందుకు వేయుట నడ్డు నెవడు ?
ఎదురుచూడదు సమయమ్ము ఎవరి కొరకు !
ఎగుర గలిగెడి ఇసుమంత తెగువ యున్న,
ఎగసి విహంగము చేరును గగన పథము

వేడి నిట్టూర్పు కన్నీళ్ళు వెఱ్రితనము
'జాను' 'కాద'ను ఊగిసలాట యంతె
వైరి సందోహ మటునిటు పారు దనుక
అనిని సల్పెడు దోర్దండ మలయవలదు

ఇప్పటి సమరమా ఇది ? ఏండ్లు గడిచె
పాసిరసువులు నునులేత ప్రాయమందె
కడుపు కోతలు, పుస్తెల తాడు తెంపు
లెన్ని ముంగిళ్ళు కన్పట్టు వన్నె దరిగి

ఏటి లూటీలు నిన్నటి మాట యగును
నేటి లారీలు ఇక మీద నిదురవోవు
నీవు ఓర్పుతో ఒక్కింత నిలుతు వేని
నేటి దొరతన మిట్టె మున్నీట మునుగు

తమ్ముడా ! ఇంక 'దేహళి' దాపులోనె
శకుని సంతతి పాచిక ల్సాగిలబడు
వేల్పు దీవెన లందువా వేన వేలు !
నీవు కనెదవు నీ వీట పొద్దు పొడుపు

-గజానన్ థామన్

మా ఊరి పరిసరాలు

ఇచటి పరిసరాలు కంచె వెల్పలికి రావు
ఎన్ని పెడబొబ్బలెట్టినా లెక్కగొనవు
చెవులు కదుపవు చిల్లులు పడినగాని
చెక్క శిల్పాలుగా శిలల నిల్చువోలె

ఆరు గాలాలు మేతకా లోటులేదు
అడవి జీవాల ఇసుమంత త్రాసులేదు
కడుపు పగిలేంత సుష్ఠుగా మేతమేసి
కమ్మ నిద్దురదేలెడు వీలుగలదు

ఆలు పాలిచ్చు మాటను వేల్పులెరుగు
ఆము బోతులా ! రంకెల పొద్దు పుచ్చు
బర్లు బర్లే ! బడాయిలు చెప్పు కొరకె
బలిసి దున్నలు రైతుల పరువుదీయు

గాత్రగరిమన దిక్కుల నదరజేయు
కాలితో నేల నటు నిటు నొరగజేయు
ఉత్తరాన చిరుమెరుపు మెరిసెనేని
ఒక్క పెట్టున మోరలు వాల్చుకొనును.

నమస్తే తెలంగాణ **గజానన్ థామన్**

నందన

ఏండ్లుగా ఎద వేగిరించిన
నీ మనీషను దీర్చి వేగము,
నందనా ! నీవందుకోవలె
నాల్గుకోటుల వందనాలను

ఇందుకోసమె అవ్వ ! ఎందరు
ఎక్కినారలు మంచుపల్లకి ?
అయిన కరుగరు ఎంతమాత్రము!
అసలు శిలలే ఏలువారలు !

మావె సరితలు ! మావె జలములు
మాదు నేలల దూపదీర్పవు
మాదు కొలువల మాటయందువ ?
మాకుచిక్కవు; మాకుదక్కవు

ఎంత తీయనిదమ్మ మా నుడి !
ఇక్షుఖండము ! జుంటితేనియ !
ఏది ఆలన ? ఏది పాలన ?
ఎంత సైచెను ఒరుల హేళన ?

మావి చివురులు మేయు కోకిల
మధుర రుతమును వినుట భాగ్యము !
ఏ యుగాదిన ఇట్టి సంబర
మింట గాదియకెత్తు టెరుగము

తెలంగాణము మాదు ప్రాణము !
తెలంగాణము మాదు శ్వాసము !
ఈ యుపాయన మీవు నందన !
ఇచ్చి పున్నెము మూటగట్టుము

ఎన్ని యుగములు చనిన సైతము
నిన్నె దలుతుము, నిన్నె కొలుతుము
పాటయందున, పద్యమందున
పదిలపరుతుము నీదు చరితము

తెలుగు

నాదు భాగ్యమేమి చెప్ప పలుకు నాది తెలుగు
నాదు జన్మధన్యమవగ వీనులందు తెలుగు
జాతి ధర్మమేదియైన కూర్చుజనుల తెలుగు
చక్కదిద్ది బ్రతుకు మధువులాన జేయు తెలుగు

నా తనువున అణువణువున నెలవైనది తెలుగే !
నాదు హృదయపీటి పైన కొలువైనది తెలుగే !
నాదు శ్వాసహాసాలను శాసించును తెలుగే !
నా తలపుల కదలి నన్ను కదలించును తెలుగే !

ఇచటి నభము వర్షించును అనునిత్యము తెలుగు
ఇచటి కృష్ణగోదమ్మల అలలలోన తెలుగు
ఇచటి పైరులందు దూరి నాట్యమాడు తెలుగు
ఇచటి వేంకటాద్రిపైన వెలుగులీను తెలుగు

హాల గాథలోన తొంగిచూడగలిగె తెలుగు
త్యాగరాజ కృతుల తమిళగళము జొన్పె తెలుగు
విశ్వనాథ మ్రోల వేయిపడగలయ్యె తెలుగు
'వేల్పు భాష' సోయగాల ఇముడు కొనియె తెలుగు

మా ఇంటను చిరుపాపగ జన్మమెత్తు తెలుగు
మా గేహపు ముంగిలిలో నడక నేర్చు తెలుగు
మా చిన్నారులను గూడి ఆడిపాడు తెలుగు
మాతోనే మనుచు మమ్ము మనజేయును తెలుగు

తెలుగు జాతిపత్రిక **గజానన్ థామన్**

పంజరమ్మున గోర్వంక పాడునేల ?

ముక్తశారిక గాడుపు మూపుపైన
నెక్కి హాయిగా విహరించు నెంతో వడిని
రెక్కలను సాచి తుదకు నారింజ వన్నె
నింగినంతకు స్వామిగా నెంచు తనను

పంజరమె వాసమైన గోర్వంక సేయు
నేమి? పక్షముల కుమతులెవరొ త్రెంచి
కడియములు రెండు కాళ్ళకు కట్టు కతన
పాటయైనది ఊనిక బతుకులోన

తీయదన మెంతొ గొంతులో తిక్తమంతె
మురిపెమే లేదు గొంతులో బుగులు దక్క
వెర్రి కోరిక ఎదలోన వేగిరించ
పాడుచున్నది దయలేని ప్రజలు వినగ

నులు సెరుంగని మనుగడ నోచుకొనిన
విహగ సౌభాగ్య మెంచగా వీలుపడున?
వేచియున్నది మరియొక వీచి కొరకు
నింగి నెలవైన జీవికినేమి లోటు ?

బందిగానున్న పక్షికి బతుకుటనిన
రేల ఉలికిపడుటయె, మరేమి కాదు
పసిడి కలలను నేలలో పాతిపెట్టి
గళము సవరించి పాడుటే కడకు మిగులు

నమస్తే తెలంగాణ **గజానన్ థామన్**

మనదేశం

ఈ దేశ మనమునకు
ఎనలేని దగుమోజు
ఇది దేశమైనటుల
ఎట్టి గుర్తులు లేవు

ఇచ్చోట ప్రణయమ్ము
ఏదో అంగడి సరుకు
స్నేహాలు ఏనాడో
చింది చెదరిన కలలు

జనసేవ అనెదవా
జపమునకు పరిమితము;
నిధుల సంపాదనకు
నేతలై రంకితము

ప్రాణాలు పోయినా
పదవి వైపే మొగ్గు.
ధర్మానికనుదినము
తలపెట్టెదరు ఎగ్గు.

అన్న మొసగే రైతు
దాగమైనది బ్రతుకు
యువతకై మిగిలినది
ఊహకందని భవిత

ఆడుదై పుట్టుటే
అపరాధ మీనేల
వేదాల నెలవంచు
వెర్రిచిందులు ఏల ?

బడుగులను బడుగులుగ
పదిల పరచెదరిచట !
పాత ఒరవడులకే
పూత వెట్టుదిరిచట !

ఏమి సందేశమ్ము
ఈ వేళ ఈగలను ?
ఇది దేశమైనటుల
ఎట్టి జాడలు కనను

నమస్తే తెలంగాణ **గజానన్ థామన్**

సర్వజిత్తు

మత్తుగా లేమావిచివుళ్ళారగించిన
కోకిలల కుహుకుహుల కేమిగాని
నానా తరూలతా గుల్మాలకు
నానా ధరణీ ధరాలకు
నదీ నద ప్రపాతాలకు
తటాకాలకు, సరోవరాలకు
ఆమని దొర ఉదారంగా ప్రసాదించిన
అందచందాల ముచ్చట్లకేమి గాని
అనురాగాల హసన్నయనాల నయగారాల
అర్థాంగినులందించే పచ్చడి వ్యవహారాలకేమి గాని
ముద్దుల మూటగట్టేలా నిలువెల్లా ముస్తాబయి
ఊరిని ఊపిరి బిగపట్టేలా చేస్తున్న
చిలిపి చిన్నారుల వైనాలకేమిగాని
సర్వజిత్తు శుభాగమన సందర్భాన్ని పురస్కరించుకొని
సహోదరీ సహోదరులారా !
ప్రత్యేకంగా గుండెవిప్పి, గొంతువిప్పి
బాహాటంగా చెప్పుకోవాల్సిందీ,
ప్రతి ఒక్కరికి చేరవేయాల్సిందీ
ప్రతి ఒక్కరి గుండెలో లోతుగా నాటాల్సిందీ
ఒకే ఒక ఒకే ఒక మాటవుంది
మీ ఒంటికి, ఎదకు చల్లదనమిచ్చే ఊసువుంది
వారు ఊరించే వరాలకు ఉబ్బిపోకండి
వారి నఖరాలు ఏనాడో బేనఖాబు అయినాయి
పూటకో స్వరం ! ఎన్నాళ్ళని వింటారు ?
బహురూపుల భాగోతం ఎన్నాళ్ళని చూస్తారు ?

జలయజ్ఞాలు ఉత్తి అంకెల గారడీలు
అన్నాయిల సన్నాయి నొక్కులకు తమ్మీ !
అసలే మోసపోవద్దు
మన నేల మనకు కావాలె !
మన బతుకుల్ని మనమే దిద్దుకోవాలె !
ఈ మాటనే బతుకమ్మ జాజిరి పాటలుగా కూర్చాలె !
ఈ మాటనే ఊపిరిగ, నడిచే తొవ్వగ మార్చాలె !
ఈ తొవ్వనే నువ్వు నేను ఒకటై పయనించాలె !
ఎల్లెడలా గుమగుమల గులాబీలు పూయించాలె !
వాడలలో రచ్చబండ గుసగుసగా కాదు
కొమ్మలలో రెమ్మలలో రుసరుసగా కాదు
గువ్వల కువకువ వలె, పిచుకల పిచపిచవలె
సెలయేరుల గలగలవలె, చిన్నారుల కిలకిల వలె
దవ్వులలో వెదురు పొదల సవ్వడి వలె కాదు
అనంతాహి భీకర పూత్కారం భాతి
అమరేంద్రుని ఐరావత ఘీంకాంరంరీతి
ధర్మక్షేత్ర కాహళి హళాహళి పోలిక
ఆభీలానకదుందుభి ఘననాదాను కృతి
సకల సృష్టివిలయవేళ
జలద ఫెళఫెళార్భటి యటు
దిక్కులన్ని ఒక్కుమ్మడి
పిక్కటిల్లు కైవడి
త్రినేత్రఫాల స్థిత
భయదార్చులు ఒలుకుసరణి
జిత్తులమారుల గుండెలు చెదరేలా
దోపిడి కెగబడిన దొరలు తోకలు ముడిచేలా
నినదించాలిక !

స్పందించాలిక !
జై తెలంగాణ ! జైజై తెలంగాణ
ఝూ... ఝూ... ఝుటక్ ఫటక్
సర్వజిత్ ! సంకట భిత్ !
సత్వర వరదాయినీ !
స్వప్నం మూడున్నర కోట్లది
సాకారం గానీ !
చరిత్రలో నీదు కీర్తి
శాశ్వతమై నిలువనీ !!

గజానన్ థామన్
సేవానివృత్తి ప్రాచార్యుడు

ఆర్ద్రగీతి

వేసవి నేలను కొలిమిన వ్రేల్చెను
కరువులు బడుగుల మనుగడ కూల్చెను
'దప్పి' దప్పియని తపించే జీవులు
బావులు, చెరువుల, వాగులు, వంకలు
పరిపరి నింగిని బ్రతిమిలాడినవి.

పొలాలు చేనులు పోరుకు దిగినవి
అడవులు చూడగ ఆగమయ్యినవి
అన్ని కడల మరి ఎన్నో అలజడులు!
మబ్బులు వినినవి మనుజుల మొరలను
నిలువున నీరై నిలిచి చూచినవి.

గాలులు వీచెను, కదలిక లబ్బెను
ఉరుముల మెరుపుల హోరుల హెచ్చెను
కుండపోతగా కురిసెను వానలు
జగతి స్నాతయై, జగన్మాతయై
ఎందుజూడ కనువిందు చేసినది

చిటపట చినుకులు చిటికెలు వేయగ
మగనెమిళ్ళు మైమరిచి ఆడినవి.
కరుణా ధీనము కవుల మానసము
పదములు మధుర ప్లావితమైనవి
తడిసి ముద్దయై తళుకనె గీతము

సలిల పూర్ణములు కొలనులు, కుల్యలు
సజలములైనవి జలాశయమ్ములు
వసుధ తాల్చగా పచ్చని పావడ
గగనమెత్తెమృద్గంధ పాత్రమును
జనుల నినాదము 'జయ' తెలంగాణము.

గజానన్ థామన్

I WILL TELL YOU
కాస్త నా మాట విను

తెలుగు అనువాదం : **గజానన్ థామన్**
ఆంగ్లానువాదం : **విలియన్ ఓ దలే**
నెరూడా రచనా కాలం : **1971–73**

నేను చెప్పేదేమిటో
నింపాదిగా విను నేస్తం !

ఎన్నేళ్ళ క్రితమో !
నేనో మహానగరంలో
నివసించే వాడ్ని.
మహానగరమంటే
దానికి చెందిన ఏదో ఒక వీధిలో
వీధి పేరంటావా ?
క్యాపిటన్ క్యా.... పి.... టన్.
ఏ ఋతువైనా సరే
ఈ వీధి కిక్కిరిసి పోయేది
వచ్చిపోయే పర్యాటకులతో
పదే పదే పానశాలలో
లేదా ఉపాహార గృహాలు
సూదీ దారాలు మొదలుకొని
పగడాలు అమ్మే పణ్యశాలలు
పాదాచారులకై ప్రత్యేకింపబడిన
ఉప పథాల్లో పాదత్రాణాల రాశులు
ప్రవేశ నిష్క్రమణులకు
పద్మవ్యూహం లాంటిది ఈ వీధి,
నిక్షప్తం
ఉదరం భరత్వంలోనో
ఊచుతూనో
ఊపిరి పీలుస్తూనో,
ఒకరినొకరు త్రోస్తూనో,
క్రయ విక్రయాల్లో
తలమునకలైన జన సందోహం.
మేలిమి అయ్యే మాట
ఎలా ఉన్నా !
మెరుపులీనే
ఉపస్కృతులు.
అంధత్వాన్నో,
బధిరత్వాన్నో,
ఉదారంగా అనుగ్రహించే
శంపాలతలు – స్తనయిత్నువులు

ఆ మహానగర వీధిని వదలి
ఓ పుష్కరం గడిచి వుంటుంది.
సంప్రతి ఇక్కడికి మకాం మార్చాను
మకాంతో పాటు మార్చాను
జీవన విధానాన్ని
రాళ్ళ మధ్య, రప్పల మధ్య
గలగలపారే సెలయేటి గట్టున
సజావుగా, నిరామయంగా
సాగిస్తున్నాను నా మనుగడ.
మరి ఆ వీధి ? ఈ పాటికి
మరణించి ఉంటుంది.

TO SEARCH
అన్వేషణ

తెలుగు అనువాదం : **గజానన్ థామస్** ఆంగ్లానువాదం : **విలియన్ ఓ దలే**
నెరూడా రచనా కాలం : **1971–1973**

ఉత్సాహ వృత్తం నుండి
మహోదధి మూలాల వరకు
విస్తరించి ఉంది
ఊహకందని ఓ సరికొత్త శూన్యత
ఎగసెగసి పడే మిలమిలల ఓ అల
ఏమీ కోరనంటుంది
అలవోకగా జనాలు
వాగడం మానేస్తే
అదే పది వేలని లోలోన
తలపోస్తుంది
ఈ మహానగర సిమెంటు శ్మశ్రువులు
రోజుకింత పెరగడాన్ని
ఎంతగానో చీదరించుకుంటుంది

మేమొంటరి జీవులం !
మేము అనికేతులం !
మాకు చిట్టచివరగా
వీలైనంత బిగ్గరగా
దిక్కులు దిగాలు పడేలా
ఓ అరుపు అరవాలని ఉంది.
మైళ్ళుగా వ్యాపించిన
నీ అర్ణవానికి అభిముఖంగా
నిల్చొని, క్షార జలాలతో
హాయిగా అల్పాచమానం
ఆచరించాలని వుంది.
ఒకే వర్ణం గల ఏడుపిట్టల్ని
నింగిలో ఎగురుతూ వుంటే
అనిమేషులమై చూడాలని ఉంది
అలాగే త్రిసహస్ర హరిత పక్షుల్ని

శకలితమై, ఇసుకలో
చిందరవందరగా పడియున్న
ప్రణయాన్ని, స్నేహాన్ని
అపచయించాలని వుంది
కాళ్ళకు తొడిగిన పాదరక్షలు అరిగే వరకు
నెత్తిమీద దర్జాగా అమరిన హ్యాట్,
మత్తుగా, మౌనంగా పడివున్న మానసం,
మైలపడే క్షణం వరకు
మిమ్మల్ని వెదకాలని ఉంది.

తస్మాత్ !
మాకేమీ వద్దు
గాఢ పరిష్వంగాలు
కపోల చుంబనాలు
కాల హరణాల కరచాలనాలు
పాటలు, పద్యాలు
ఇవేమీ వద్దు.
ఏదీ లేని దైన,
ఏదో ఉన్నదయిన
వద్దే వద్దు.

సాగిపోతూనే వుంటుంది.
క్షణ విరామ మెరుగని
మా సత్యాన్వేషణ.

శ్రీకృష్ణ !

(స్తోత్ర ముక్తకాలు)

సోమకాసురుదునుమ
జొచ్చినవు నీళ్లల్ల
నలువ కిస్తివి నాడు
నాల్గు వేదాలు

మా నీరు కాజేసి
మా నేల మరుభూమి
గా మార్చు నేర్పరుల
కరుణించకు హరి !

మా నల్ల బంగారు
మాకు దక్కే కొరకు
అవతారమెత్తు మా
యజ్ఞవరాహమ !

కొలువులెన్నో దొరలు
కొల్లగొట్టిరి, ఇంగ
వలువలే ఊడ్చెదరు
'పాహి', శ్రీకృష్ణ !

గుడిసె కప్పుల మీన
గుమ్మడిపూవులు సాన
గోడపూతలు సూడు !
గుఱ్ఱాల దౌడు.

కుంట్లల్ల, చెరువుల్ల,
కొండ వాగుల్లల్ల
తేలేటి బతుకమ్మ
తీరు బలె ముద్దు !

సమ్మక్క జాతరలు
సవ్వార్లు పీరీలు,
పోతరాజుల జోరు
బోనాలసౌరు

గోండు రాజుల గొండ్లి,
గొల్లబోయల సుద్ది
చిందు బాగోతాలు
చిరునామ మాది

మా ఉనికిలోగలవు
మధుమాస హాసాలు
వలదోయి వేరేమి !
తెలగాణ చాలు.

గజానన్ ఠామన్
9440211285

ఆరక్షణ ప్రహసనం

నా దేశం కాదు సుమీ ! కేవలమొక భూశకలం
నా ప్రియబాంధవులు కాదు మృణయరూపాలు
వేదఋషులు వెల్గునిచట యుగాలపూర్వ మరసినారు
విశ్వమ్మును మేలుకొల్పు ప్రాభాతిని పాడినారు

నగాలు, నదీనదాలు, శాద్వలాలు, మరుస్థలాలు
నవవిధ సస్యప్రద శ్రీకరకేదారాలు
గహనగూఢ వనసీమలు జనదాలు పత్తనాలు
గారడియని భ్రాంతి గొల్పు అద్భుతాలు వేనవేలు

ఎన్నో భాషలు, యాసలు, బహువిధ పరిధానాలు
ఏకత్వం భిన్నతలో నిర్వచించు దర్శనాలు
ఇచ్చోటనె పరిఢవిల్లె ఎన్నెన్నో ధర్మాలు
ఎవ్వరు తలదాచుకొన్న అకుతోభయవచనాలు

క్షణము నిల్చుదాని కొరకు రవంతయేని లేదు తపన
చరమ సత్యమరయుటకే చిరతపస్సు, అన్వేషణ
మా గూటికి చెందు మనిషి మేని రంగు ఏదైనా
మా తోడనె మనుగడ మరి ఇరులు వెలుగు లేవైనా

నిన్ననె కదా ! నా దేశం రెండుగ చీలింది !
నిన్ననె కదా ! నరుని రుధిర మేరులుగా పారింది !
పుట్టి పెరిగినట్టి నేల తనది కాని దయ్యింది
పొరుగు పంచ బ్రతుకు మరల శ్రీకారం చుట్టింది
పాతేసిన పంచబ్రతుకు ఆహ్వానం దేనికి ?
మతం పేర ఆరక్ష ! మతిపోయినదా ఏమిటి ?

అధిపతులయ్యేటందుకు అడ్డమైన గడ్డి తినుట !
అరిపేదల చీల్చివైచి బరిలోనికి దించుట !
పూట గడవనట్టి దొరలు కోటికి పడగెత్తుట !
దీటుగ పార్టీపెట్టుట, జండా లెగరేయుట !

కోరదగున తొలివలపృను చెలి ! ఈవేళ ?

నా దానివైన ఈ జన్మకు వెలుగే వెలుగు
నీ వేదన చాలు నాకు, ఏ వేదన వలదు
నీ మోమే జగతికొసగు నిండా మరులు
నీ కన్నుల సోయగాన కే సరిలేదు
నీవే నేనైన నియతి మోకరిల్లదా ?
ఊహించితి నిటుల తుదకు ఊహె మిగిలెను !

యుగయుగాల కీచర జనాల క్రీడలు
లేమేనులు విక్రయాలు నిత్య రుధిర సేచనలు
గతము వైపె చూపు మరలు నేమిచేతును ?
మనసు దోచు నీ యందము నేమి చేతును ?
విరహ వ్యధను మించు వ్యధలు వేలుచూడగా,
మేళనలో విరతిమించు నిరతలు కలవు

మరణభేరి

నిర్జన జనపద పథాన ఆమని అడుగెట్టు నటుల
నీ వేలో నేడు నాదు మనోవీధి మెదలినావు
తెలతెలవారిన వీచే లేలెమ్మెర తరగవేమొ !
మరు భూమిని సుమవనిగా మార్చేననదేవివో !

వ్యధాగారమైనదేమి చూడచూడ ఈలోకము
ఏముగింపులేనిదయ్యె ఆ బాలవృద్ధ జనశోకము
ఈ అసుర సంధ్య వినిపించునుమరణభేరి నిర్ఘోషము
దాగియున్న నీకిది చెవి సోకునో సోకదో నేస్తం !

గజానన్ థామన్

9440211285

తేజోమయి !

నా స్వప్న గవాక్షాలను కైసేసె తేజోమయి !
నీ స్వప్నం నా వాసం అగునేమో తెలుపవే !

ఏ వాటిక పారిజాత తరువువు నీవైన గాని
చిరుతెమ్మెర మోసి తెచ్చు నెత్తావులు నావేలే !

నీకు వలెనె నాకున్నది దివారాత్ర సంక్రమణము
నా నుదుటను శుభోదయమ్ము ఉందొ లేదొ పలుకవే !

పసితనాన ఏ మలుపున మనము కలిసికొనినామో !
ఆ మలుపిపుడున్న తీరు వివరముగా దెలుపవే !

వేరుదారులెన్నయినా, వేరు తావులెంచు కొనిన,
తలపులోన ఎడబాటది కూడదంటు తెలియవే

బతుకంతా వేచినాను ఈ గీతిని కూర్చినాను
నీ పెదవిని చేరుకొనే తెరవునొకటి చూపవే !

గజానన్ థామన్
9440211285

అయోమయం

మబ్బు నీడ మేను మరచి
మగనెమిళ్ళు ఆడవేమి ?
చలిచలిగా నున్న రేల
జ్వాల ప్రజ్వరిల్లదేమి ?
మావి కొమ్మ పైని పికము
మౌనమూనియున్నదేమి ?
వేసవి వేళయెయైన
విరిజాజులు విరియవేమి ?
పల్లె పట్టణాలు నేడు
పసవాడిన వైనవేమి ?
కవిగాయక శ్రేణి నేడు
కలత నిదుర మునిగె నేమి ?

అనురాగానుబంధాలు
అంత్యనిధికి అర్పితాలు
ప్రజాసేవ ముసుగుమాటు
పదవులకై పల్లటీలు
విత్తార్జన సాధనలో
విద్యావైద్య రంగాలు
ధాత్రి యందు నెటుజూచిన
ధర్మధ్వజ విహారాలు

కాని వరునిగూడె ననుచు
కన్న బిడ్డ నలిపివేత
దారినడచు అడబడుచు
తాళిబొట్టు ఊడదీత

కనుదెరువని పసి తనువును
కాటేసే పాశవికత
న్యాయదేవి నిస్సహాయ
నరాధముల అణచివేత

అరుగాలము చెమటోడ్చీ
అన్నదాత నిరాధరణ
బడిపంతులు గారి ఇంట
పస్తులుండు వ్రతాచరణ
అటవి జన జీవనాన
అంతులేని అయోమయత
పదే పదే పాన శాల
పరికల్పన మగ్న ప్రభుత !

గజానన్ థామన్
9440211285

"ఆనంద భిక్షువు" ఆవిష్కార సమారోహం సి.పి. బ్రౌన్ గ్రంథాలయం కడప (20-06-2004)

మహాజనులారా !

ఇక్కడికి రావడం మాకు సంతోషంగా వుంది. కడపలో కాలూనే అవకాశం మాకు కలిపించినందులకు వయో, జ్ఞాన తపో వృద్ధులైన డా॥ జానమద్ది వారికి నేను, మన్మిత్రులైన గట్టు నారాయణ గారితో పాటు ఎంతో ఋణపడివున్నాను. జాన్మంతం ఈ ఋణంలో ఉండదలచాను కనుక వారికి నా కృతజ్ఞతలు తెలుపుకోవడం లేదు.

దక్షిణ భారత "దేహళి"యైన ఈ కడపలో ఎందరో మహానుభావులు జన్మించారు. కారణజన్ములైన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి అట్టి వారిలో ప్రథమ స్మరణీయులు. ఆంధ్ర కవితాపితామహుడూ, పద కవిత పితామహుడూ జన్మతః రాయలసీమను పునీతం చేశారని చెబితే చాలు. సాంస్కృతిక వైభవోపేతమైన ఈ పుణ్యభూమి పై ఏ విస్తృత భాష్యం అవసరం లేదు.

సి.పి. బ్రౌనీ గారికి ఇది కావ్యక్షేత్రం. తాళపత్రాల్లో నిక్షిప్తమైన తెలుగు సాహిత్యాన్ని ఎన్నో వ్యయప్రయాలకోర్చి శాశ్వత రూపాన్ని కల్పించిన ఆ మహామనీషికి తెలుగువారమైన మనం ఎంతో ఋణపడివున్నాం. ఆయన తరువాత ఆయనకు సములైన తపోధనులు డా॥ జానమద్ది వారికి ఏమిచ్చి ఋణ విముక్తులం కావాలో తెలుగువారు ఆలోచించుకోవాలి.

డా॥ సి. నారాయణ రెడ్డి గారు మార్గం చూపించారు. అదే మార్గంలో నడచిన గట్టు నారాయణ గారు ఈ వేళ మీముందు వున్నారు. బ్రౌనీ శాస్త్రి గారు ఆచరిస్తున్న మహాక్రతువునకు ఓ సమిధను ధారవోయటం లక్ష్మీకటాక్షానికి పాత్రులైన వారి ప్రథమ కర్తవ్యం. సామాన్యులైనవారు సైతం ఉడత భక్తిగా ఎంతో కొంత సమర్పించుకోవాలి. ఈ గ్రంథాలయం ఇతోధికంగా వికసించవలెనంటే మరో మార్గం లేదు.

నలుభయ్యేళ్ళు మహారాష్ట్రలో ఉన్న నాకు తీరాంధ్రను, రాయలసీమను సందర్శించుకునే సౌభాగ్యం సంప్రాప్తించలేదు. నా జన్మభూమియైన తెలంగాణలోని మూడు జిల్లాలు మాత్రమే నాకు తెలుసు. బాల్యంలో రాయలసీమను గావించిన శ్రీనాథ మహాకవి చాటువును చదివాను పూర్తిగా స్మరణకు రావటం లేదు. "ఆమ్నాయానామ యోగేన విద్యాం ప్రశిధిలామివ" అన్న వాల్మీకి చెప్పిన స్థితిలో ఉన్నాను. రాయలసీమలో "రంభయైన ఏకులెవడకున్" ఈ చాటువును నేను అధిక్షేపాత్మకమైనదిగా భావించటం లేదు. భోగోప జీవనియైన ఆ అచ్చరతీగ శ్రమైకజీవనశైలికి ఈ రతనాల సీమను ఎన్నుకొన్నదని నా అన్వయం. నిసర్గానుకూలత లేకున్నా, అహోరాత్రాలు చెమటోడిచి ధాన్యలక్ష్మిని గాదెలకెత్తే రాయలసీమ శ్రమజీవులకు శిరసా ప్రణమిల్లుతున్నాను.

నా "మానససరోవర" కావ్యానికి హంసధ్వనిని అందించిన డా॥ వి.వి.యల్. నరసింహారావు గారి మూడవ ముద్రణకు నోచుకున్న ఆనందభిక్షువు గ్రంథ విమోచన సమారోహంలో వక్తగా అంతకుమించి శ్రోతగా పాల్గొనే మహదవకాశం కల్పించిన డా॥ శాస్త్రి గారికి, మిత్రులు గట్టు నారాయణ గారికి నా నమోవాకాలు.

నేను తెలుగు సాహిత్యం పెద్దగా అధ్యయనం చేసినవాణ్ణి కాదు. తెలుగుదేశానికి సంస్కృతికి నలుభై ఏండ్లు దూరంగా ఉన్న నేను డా॥ రావు గారి "ఆనంద భిక్షువు"ని గురించి ఏమి మాట్లాడాలి ? అపహాస్యతం గమిష్యామి అనే భయం నన్ను పూర్తిగా గ్రసించివేసింది. విశ్వనాథగారు, శ్రీశ్రీ, రాళ్ళపల్లివారు ప్రశంసించిన కావ్యానికి నావంటి వాని మల్లీనాథీయం నిజానికి అనవసరం. జాపచారికత (formality) సుగ్రీవ శాసనం వలె కఠోరం, అనుల్లంఘనీయం. ఈ బుడిబుడి నుడిని ఉదారులైన మీరు సహించాలని నా విన్నపం.

"కరుణశ్రీ"తో పోల్చినప్పుడు నరసింహారావు గారు అభివ్యక్తితో అత్యంత ప్రాచీనులు. ఆశయానికి (Content) ఒకరు మరొకరికి తీసిపోరు.

"ఇల్లిగ్గులు" "వ్యాచిక్రంస" వంటి పదాలు ఈ కావ్యంలో కొల్లలు. అవి నన్ను తికమకపెట్టి శబ్దకోశాల్ని ఆశ్రయింపచేశాయి. "ఔరా !" అనిపించే వీరి శబ్ద వైభవాన్ని లిఖించనాడనైన నేను ఎలా వర్ణించాలి !

ఈ కావ్యంలో ముచ్చటగా నాలుగే నాలుగు పాత్రలు. ప్రకృతి, ఆమెతల్లి, ఆనందుడు గోవత్సం, అలంకార ప్రాయమైన (Ornamental) లేక మనోవినోదార్థం సృజింపబడిన పాత్ర (Peripheral Character) కాదు. ప్రకృతి ప్రకృతిని అర్థం చేసుకోవటానికి అవసరమైన పాత్ర. కథా నాయకయైన ప్రకృతి డా॥ జి.వి. కృష్ణారావు గారు నుడివినట్లు సాంఖ్యుల "ప్రకృతి" కాదు. అద్వైతులు "మాయ" అంతకంటే కాదు. పతన పూర్వస్థితి (Prelapsarian State) లోని ఈవ్ (Eve) వంటిది. ఆమె అనాగస. సర్వసంగ పరిత్యాగియైన ఆనందుని పై మనసుపడడం జైవిక స్పందన మాత్రమే. పాత్ర మూల్యంకనానికి నైతిక సూత్రమేదైనా ఇక్కడ సందర్భ బాహ్యం. తను మనిషిగా గుర్తించిన ఆనందుని యెడ ప్రణయభావన. ఆమె మనసులో పొటమరించడం అసహజం కాదు. అలా అని "ఉదాత్తం" కూడా కాదు. స్వకేంద్రితం (Self Centered) కనుక. అది వైశ్విక స్థాయికి ఎదిగినప్పుడు సమాజానికి అభ్యుదయ ప్రదం అవుతుంది. ఆనందుని ప్రణయం అలాంటిది.

సర్వభూతాని ఆత్మవత్ – ఇలా ఉపనిషత్తులు ఉద్ఘోషిస్తున్నవి. శ్వపాకుని యెడ పండితుని యెడ సమదృష్టి కలిగియుండాలని గీత చెబుతున్నది. "అంటరానితనం" ఎవరు చెప్పినా మన మనస్సును అంటిపెట్టుకునే ఉంది. దళితులను శాపాన్నుంచి, మనలను అంటే తథాకథిత అగ్రవర్ణీయుల్ని పాపాన్నుంచి విముక్తులను కావించిన అంబేద్కర్ కర్మభూమియైన "భారత్"లో అస్పృశ్యతకు ఏమాత్రం తావు లేదు. దాని నిర్మూలనం తత్క్షణ కర్తవ్యం అని ఉద్ఘోషించే "ఆనందభిక్షువు" కావ్యం ఎంతైనా ప్రాసంగికం అదే కావ్య ప్రయోజనం కూడా.

కావ్యంతో పాటు విమర్శకుల అభిప్రాయాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. ఇవన్నీ చదివి కావ్యాన్ని చదవకండి. నూర్గురి అభిప్రాయాలను

విన్న తరువాత వ్యక్తం చేయటానికి మన వద్ద ఏ అభిప్రాయం మిగులదు. ఈ మాట స్వానుభవం మీద చెబుతున్నాను. వేదాలు శాసిస్తాయి. కావ్యం కాంతసమ్మితోపదేశం చేస్తుంది. ఈ అభిప్రాయం ఎవరు వెలిబుచ్చారో కాని అన్ని ఋతువుల్లో అందరి అభిప్రాయమై కూర్చుంది. వేదాలు శాసిస్తాయా ? ఋగ్వేదంలో కావ్యం లేదా ? "పురూరవః పునరస్తం పరేహి" – ఊర్వశి పూరూరువునకు చెబుతున్నది కాంత సమ్మితోపదేశం కాదా ? ఉద్యమ కవితకు, కవితోద్యమాలకు దూరంగా ఉండి "ఆనంద భిక్షువు"ను తెలుగు లోకానికి ఉపాయనంగా ఇచ్చిన డా॥ వి.వి.యల్. నరసింహారావు ధన్యచరితులు. పురవర్ణనం, నరనారీవర్ణనం, నిసర్గవర్ణనం ఇక్ష్వాకులనాటి తాటాకుల పొత్తాల నుండి అరువు తెచ్చుకున్నవి కాదు. కవితమాధ్యమం జాపమికమాధ్యమం. జాపమిక సర్జనలో రావుగారు ప్రదర్శించిన ప్రతిభ అనితర సాధ్యం. మనసనే బలహీనతకలవాళ్ళు ఈయన పద్యాల్ని అభినందించకుండా ఉండలేరు.

మువ్వల మ్రోత తోడ జగమున్
మురిపించుచు చౌకళించుచున్
రివ్వన దాసిదాసి బెదిరించపోవక
నిల్చి, యంతలో
దవ్వన కేగియేగి కనుదమ్ముల
నల్లన నప్పళించుచున్
జివ్వన వచ్చి బావికడ నిల్చె చివాలున
వాలమార్చుచున్ –

స్పృహణీయ ధ్యేయాంకితులై జగాన్ని మురిపించే జానమద్ది "అన్నా" అని ఒకరినొకరు పిలుచుకునే వారి ఆశీస్సులను, కడప వారి చల్లని చూపు నాయెడ కడసారిగా కారాదని కాంక్షిస్తూ సెలవు తీసుకుంటాను.

తమ్మిచెఱువుకట్ట వీధి,
మంథని, జి॥ కరీంనగర్.
తెలంగాణ–505 184.

గజానన్ థామన్
(సేవ నివృత్త ప్రాచార్యుడు)

భక్త్యుద్యమం : మరాఠీ భక్తి సాహిత్యం

క్రమ పరిణామ వాదులు మానవుడనబడే ప్రాణి నిటారుగా నిలిచే (Homoevectus) స్థితి నుండి ముప్పది ఐదువేల సంవత్సరాల పూర్వం నేటి మానవునిగా ఎదిగాడని చెబుతారు. ఆ కాలఖండంలో శైత్యాతపాన్ని తట్టుకునేందుకు గుహలను ఆశ్రయించేవాడు. నగ్నత్వ విధానానికి అవసరమైన వస్త్రధారణ ఎరుగడు. క్షున్నివారణార్థం వేటాడేవాడు. అరువులూ కనుసైగలే తప్ప భాష అనేది ఇంకా అలవర్చుకోలేదు. ఆ స్థితి నుండి సభ్యజీవిగా ఎదగడానికి వేల ఏళ్లు పట్టినవి. సంవాదమాధ్యమైన భాషను ఏర్పర్చుకొన్నాక, మానవుని బౌద్ధిక వికాసం భౌతిక వికాసంలాగానే ఓ సుదీర్ఘ క్రమపరిణామంలో నిష్పన్నమైంది. డా॥ అవినాశ్‌చంద్రదాస్ వేదాల రచన ఇరువది ఐదువేల సంవత్సరాల క్రితం జరిగినదని వెలిబుచ్చిన అభిప్రాయం తర్క సంగతం కాదనడానికే ఈ ప్రాక్కథనం. మానవుని సాంస్కృతేతిహాసం మహా అయితే నేటికి ఐదువేల సంవత్సరాలలోపుదే.

మానవుని బౌద్ధికవికాసములోని మూడు మజిలీలు : పురాకథ (Mythos) వీరగాథ (EPOS) తర్కం (Logos) ఋగ్వేదంలో ఈ పురాకథలు వీరగాథలు మనకు అడుగడుగున సాక్షాత్కరిస్తాయి. ఇంద్రవృత్త సంహారం ఒక పురాకథ.

ఆర్యులు క్రీస్తుపూర్వం పదిహేనువందల సంవత్సరాల క్రితం భారత దేశంలోని "సప్తసింధూ" ప్రవేశానికి చేరుకొన్నారన్న మ్యాక్స్‌ములర్ వాదాన్ని అంగీకరించిన పక్షంలో, ఋగ్వేద రచనాకాలం క్రీస్తుపూర్వం 1200 నుండి 900ల మధ్య లోనిదనడంలో ఏలాంటి విప్రతిపత్తి లేదు.

ఆర్య సంస్కృతి శైశవస్థితిలో ఋగ్వేదం ప్రాదుర్భవించింది. క్రాంత దర్శులైన ఆనాటి కవుల రచనలు కలదియే ఋగ్వేదం. రెండు మూడు వందల సంవత్సరాల అవధిలోని రచనలు సంహితగా రూపొందుటకు ఎన్నో ఏళ్ళు పట్టినవి.

ఋగ్వేద కాలంనాటి ఆర్యుల సమాజ జీవనం ఆదర్శప్రాయమైనదీ,

నీతిధర్మనిబద్ధమైనది కాదనడానికి ఋగ్వేదమే తిరుగులేని సాక్ష్యం, దస్యులతో, తోటి తెగలవారితో ఎడతెరిపి లేకుండా యుద్ధాలు చేయడంలోనే వారి యావచ్ఛక్తి వ్యయింపబడింది. శత్రువుల నుండి గోగణాన్ని పూర్వంలా అపహరించలేక పోతున్నానని తన సైనికులు సింహనాదం చేయడం ఏనాడో మరిచారని పురూరవుడు ఊర్వశితో తన వెతను వెళ్ళబోసుకోవడం ఋగ్వేద దశమ మండలంలో ఉంది. ఆనాటి వీరత్వ లక్షణం అంటే ఇదే. పరద్రవ్యాపహరణం ధర్మసంగతం కాదు. అదే శ్రేష్ఠమైన పురుషార్థం. వీరులకు పురందరుడైన అంటే కోటలు విధ్వంసం చేసే ఇంద్రుడే ప్రేరణా స్రోతస్సు, జూదం, సోమపాన, స్వైరాచరణ ఇలాంటివి ఆనాటి సమాజ జీవనంలో నిత్యాచరితాలే అనడానికి ఋగ్వేదం ఒక దస్తావేజు.

నీతి బాహ్యమైన సమాజాన్ని ఋజుమార్గాన నడిపించేందుకే ఆనాటి ఋషులు కావ్యరచనకు పూనుకొన్నారు. ఋషి అనే పదానికి కవి అనే అర్థం. ప్రాచీన సభ్యతల్లో కవికే సమాజంలో అగ్రస్థానం. బౌద్ధిక నేతృత్వం ఆచార్యత్వం కవిదే. ఆంగ్లకవి షెలే అన్నట్లుగా కవులే మానవజీవన విధాన నిర్ణేతలు. లాటిన్ సంస్కృతిలో కవి (Vates) అంటే వేత్తగా సంభావింపబడ్డాడు. ప్రాచీణ గ్రీకుల దృష్టిలో కవి అనేవాడు ఒక స్రష్ట. (Poet) ఋగ్వేద సంస్కృతిలో కర్తవ్యాకర్తవ్యాలను సర్వజనాభ్యుదయానికి మార్గమెరిగినవాడు ఋషి.

అరిస్టాటిల్ దృష్టిలో కవి కర్మ కేవలం అనుకరణం (Mimesis) కాదు. యాథాతథ్య దర్పణం సాహిత్యం కాదు. పూర్ణత్వసిద్ధి ప్రకృతి ముందు గల ఏకైక లక్ష్యం. పూర్ణత్వాన్ని అందుకొనడానికే ప్రకృతి నిరంతర ప్రయాసరత. ఆ ప్రయాసలో ప్రకృతికి తోడుగా నిల్వడమే కవియైనవాడు చేయవలసినది. ఒకే మాటలో చెప్పాలంటే కవిత మానవజీవనాన్ని యథాతథంగా చిత్రించదు. పైగా దాన్ని ఉదాత్తీకరించడమే పరమలక్ష్యంగా కలది.

ఋగ్వేదంలోని యమయమీ సూక్తాన్ని తీసుకోండి. గోత్రాంతర వివాహ పద్ధతికి (Endogamy) స్వస్తి చెప్పి నాటి సమాజం గోత్రబాహ్యా వివాహ (Exogamy) పద్ధతిని స్వీకరించింది. యమీయములకథ ఈ కొత్త ఒరవడిని

సూచిస్తుంది. గుంపులు గుంపులుగా జీవిస్తూ ఒకరితో ఒకరు కలహించేకన్నా జనపద వ్యవస్థను రూపొందించుకొని శాంతి సామరస్యాలతో జీవించడం లక్ష్యంగా పెట్టుకుంది. తెగల మధ్య ఆదాన ప్రదానాలు సాధ్యమైనప్పుడే జనపద వ్యవస్థ అస్తిత్వంలోకి వస్తుంది.

యముడు ఈ నవజాత సమాజవ్యవస్థకు నిర్మాతయేకాక శాస్తకూడా. అందుకే యమి సంగమనకామనను తిరస్కరిస్తూ అంటాడు. "న తే సఖా సఖ్యం వష్ట్యే తత్స లక్ష్మా యద్విషరూపాభవతి" ఆర్ణవ మధ్యద్వీపంలో, విజన ప్రదేశంలో ఏది చేయబడినా అది దేవతల చారులచే చూడబడుతుంది. మానవుడు ఆచరించే శుభాశుభకర్తలను ఓకంట కనిపెట్టే దేవతల చారలు ఉన్నారని వారు "న తిష్టంతి న నిమిషంతి" అంటూ యముడుయమిని హెచ్చరిస్తాడు.

"లోకాయత్ర జ్యోతిష్మంతః తత్ర మామృతంకృధి" ఇలాంటి ఉదాత్తమైన ఋషుల ఆలోచనలకు అద్దం పడుతుంది. ఋగ్వేదం. మానవుని పాపభీరువును సన్మార్గగామిని చేయడమే ఋగ్వేద ఋషు ప్రయాస.

బ్రాహ్మణాల కాలం నాటికి ఇంతటి మహోన్నత విచార వైభవం గల ఋగ్వేదం అర్థహీనమైన యజ్ఞక్రియను పరిపుష్టం చేసే సాధనంగా వినియోగింపబడినది. ఆధిక్యతకోసం ఓవర్గం నిర్హేతుకమైన పశుబలిని ఆకృతిబద్ధం కావించి సమాజం మీద ఏకాధిపత్యం సాధించడంలో సఫలమైంది. ఋక్కులు మంత్రాలయినవి. ఋక్కునకు బ్రాహ్మణాలు సూచించిన వినియోగానికి గల సంబంధం బాదరాయణ సంబంధమే "మధువాతా ఋతాయతే" అన్న ఋక్కులో ఋక్కునకు "యజ్ఞ"మన్న అర్థాన్ని బ్రాహ్మణాలు కల్పించినవి. యజ్ఞంలో భాగమైన గ్రామ్య వన్య పశువుల బలిలో తాబేలును వరుణదేవునకు బలియిచ్చేటప్పుడు దీని వినియోగం ! ఉదాత్త భావనలు గల ఋచ ఈ నికృష్ట కర్మాచరణతో సంధానింపబడినది. అలాగే "కస్మై దేవాయ హవిషా విధేమ" అనే ఋక్కులోకః అంటే ప్రజాపతి అనే పొసగని అర్థాన్ని కల్పించింది ఐతరేయ బ్రాహ్మణం. కః అంటే అకారాంత పుంలింగమై సర్వనామం కానప్పుడు కాయదేవాయ అనాల్సి ఉంటుంది కదా.

అలాగే ఈక్రింది ఋక్కు ఇచ్చే అర్థాన్ని పరిశీలించండి. శ్రాద్ధవిధిలో పవిత్రధారణకు దీనికి గల సంబంధమేమిటి ?

పవిత్రం తే వితతం బ్రహ్మణ స్పతే ప్రభుర్గాత్రాని పర్యేషి విశ్వతః
అతప్త తనూర్నత దామో అశ్నుతే శృతాస ఇద్వహన్త స్తత్ సమాశత
ఋగ్వేదం (9-83-1)

ఓ సోమా ! వ్రతాది కఠోర కర్మలచే శుష్కింపజేయని తనువుగలవాడు నీ కృపా పాత్రుడు కావడానికి అర్హుడు కాడు అని దీని అర్థం.

ఇంద్ర పదవిని చేజిక్కించుకోవాలన్న కామనతో హైన్యమైన నరబలికి రాజులు ప్రేరితులు కావింపబడ్డారనడానికి ఐతరేయ బ్రాహ్మణంలోని శునః శేపుని అఖ్యాయిక యే ఒక తిరుగులేని దృష్టాంతం. ఇది ఆనాటి సమాజ పరిస్థితి. ఇలాంటి వేళ, దీనిని నిరసించడానికి లోకాయతులు ఉదయించారంటే ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. వేదప్రామాణ్యాన్ని అంగీకరించకున్నా, పారలౌకిక జీవనాన్ని నిరాకరించినా, దేహాత్మవాదులైనా, ఈ దేశానికి వారు మహోపకారం చేశారని పండితులైనవారు అంగీకరించారు. ఐతే చార్వాక దర్శనం అప్రతిష్ఠ పాలైంది ఇందుకు కాదు. స్వచ్ఛందతావాదాన్ని లేక భోగవాదాన్ని (Hedonism) పర్యాయంగా ప్రతిపాదించుటలో లోకాయతులు కృతకృత్యులైనారనడానికి ఐతరేయ బ్రాహ్మణమే సాక్ష్యం. కాలాంతరాన పశువుకు బదులు యజ్ఞకర్మలో వ్రీహి మేధ్యపదార్థమైనది.

భారతీయ సమాజానికి దిశ మరియు గమ్యాన్ని ఏర్పరిచంది భాగవత ధర్మం. మానవతావాదం పునాదిగా సమాజరచనకు ప్రేరణాస్రోతస్సుగా నిలిచింది. హేయమైన యజ్ఞ సంస్కృతి మళ్లీ తలెత్తడానికి వీలు లేకుండా చేసింది. సృష్టిని ఏలేది ఇంద్రాది ప్రాకృతిక శక్తులు కావని, వాటిని ప్రసన్నులు గావించేందుకు పశువధ వంటి హైన్యానికి దిగవలిసిన పనిలేదని, సచ్చిదానంద స్వరూపమే పరమాత్మ స్వరూపమని ఘోషించింది. భాగవత ధర్మం నిద్రాణమైన ఉపేక్షిత వర్గాన్ని తట్టిలేపి వారి వ్యక్తిత్వ వికాసానికి బంగారు బాట వేసింది. ఈ ధర్మం ప్రవచనాలకే పరిమితం కాలేదు.

ఉద్యమరూపం దాల్చి, ఆసేతు హిమాలయవ్యాప్తమైన ఈ దేశాన్ని ఆమూలాగ్ర పరివర్తనకు లోబడజేసింది. యజ్ఞానుష్ఠానాన్ని నిరసించడం లోకాయతులు చేసింది సరైనపనే. అయితే వారు వేదప్రామాణ్యాన్ని నిరాకరించడం ఎగతాలి చేయడం సమర్థనీయం కాదు. వేదమే భారతీయ అస్తిత్వానికి సంస్కృతికి మూలాధారము. ధర్మానికి నీతికి మూలం వేదమే "మీలాగా మేము వేదాల బరువును మోయడం లేదు. దాన్ని ఆంతర్యాన్ని గ్రహించిన వాళ్లం అన్నాడు. మహారాష్ట్ర భూషణమైన తుకారాం. నిరుక్తములో చెప్పిన మాటలే ఆయన చెప్పినాడు.

స్థాణురయం భారహారః కిలా భూ దధీత్య వేదం నవిజనాతి యోஉర్థమ్

వేదం సాయనాచార్యులవారి అనుగ్రహం వల్ల అవబోధమయ్యే పరిధిలోనిది. వేదాలు ఏ ఒకరిసొత్తు కాజాలవు. ప్రతి భారతీయుని స్వాధ్యాయంలో ఒక భాగం అయినప్పుడే ఈదేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనం సాధ్యమౌతుంది.

సామాజిక రాజకీయ విప్లవాలు, తిరుగుబాట్లు ఏ దేశంలోనైనా ఊరికేరావు విషమత, శోషణ సమాజ వ్యవస్థలో చోటుచేసుకున్నప్పుడు బహుజనసమాజం ఉపేక్షింపబడి నిరాశానిస్పృహలకు గురికావింప బడినప్పుడు సామాన్యుని మనుగడయే ప్రశ్నార్థకమైనప్పుడు ఇవి అనివార్యాలు, విప్లవంలో తిరుగుబాట్లో మౌలికబేదముంది. సమయభంగం తిరుగుబాటుకు దారితీస్తుంది. యథాస్థితి పునరుద్ధరింపబడుటతో ముగుస్తుంది. విప్లవం ఇతోధిక ప్రశస్తమైన సమాజ రచన లక్ష్యం కలదై ఉంటుంది. విప్లవం హింసాత్మకం కానక్కరలేదు. శాంతినే ఆయుధంగా గ్రహించిన పక్షంలో ప్రతి హింసకు ఆస్కారముండదు. నిరాయుధ విప్లవమే అభిలషణీయం.

భాగవతధర్మప్రేరితమైన భక్త్యుద్యమం శాంతినే సాధనంగా గ్రహించిన ఒక ఉదాత్త విప్లవం. ఇది హింసను దూరంగా ఉంచి శాంతిమార్గాన్ని ఆశ్రయించి అన్ని వర్గాలను తనలో ఇముడ్చుకోగల్గింది. ఈ ఉద్యమానికి పుట్టినిల్లు దక్షిణ భారతమే. ముఖ్యంగా తమిళదేశం. క్రీ.శే. 7వ శతాబ్దానికి

చెందిన ఆళ్వారులు ఈ ఉద్యమ ప్రవర్తకులు. ఈ ఉద్యమం కాలాంతరాన దేశమంతటా వ్యాపించింది. మహారాష్ట్రలో చక్రధర జ్ఞానదేవులు, గుజరాత్‌లో నారసీమెహెతా, రాజస్థాన్‌లో మీరా, హిందీ ప్రాంతంలో తులసీ, వంగదేశంలో చైతన్యులు భక్తిమార్గ ప్రవర్తకులు. ఈ ఉద్యమానికి ప్రేరణ భాగవత కృష్ణుడే ! సంస్కృత భాగవతంలోని దశమస్కంధములో కృష్ణుడు తండ్రిని అడుగుతాడు. "కేనవా సాధ్యతే మఖః" కృష్ణుని దృష్టిలో యజ్ఞం అర్థం లేని కర్మయే. "జ్ఞాతాజ్ఞాత్వాచ కర్మాణి జనోయ మనుతిష్టతిజ. యజ్ఞవిధిని సమర్థిస్తూ వసుదేవుడంటాడు "పరజన్యో భగవాన్ ఇంద్రః"

ఇది అంగీకరించని కృష్ణుడు ఇలా అంటాడు.
"రజసా చోదితా మేఘా వర్షన్త్యతంబుని సర్వతః
ప్రజాస్తైరేవా సిద్ధ్యన్తి మహేంద్రః కింకరిష్యతి"

వేదం ఇంద్రుని పర్జన్య కారకుడని ఘోషిస్తున్నది. "విశ్వస్మాత్ ఇంద్ర ఉత్తరః అంటూ ఇంద్రుడు వేదంలో తన ఆధిక్యతను ప్రకటించుకున్నాడు. ఇంద్రయాగ నివారణకు కృష్ణుడు ఎందుకు పూనుకొనినట్లు ?" "కిమింద్రేణ భూతానాం అని ఎందుకన్నట్లు ? కర్మణా జాయతే జంతుః కర్మణైవ విలీయతే, సుఖం దుఃఖం భయం క్షేమం కర్మణైవాభిపద్యతే అంటూ కృష్ణుడు యజ్ఞానుష్ఠానం నిష్ప్రయోజనమని తండ్రికి చెపుతున్నాడు. భగవద్గీతలో "వేదవాదరతుడవు కావలదని అర్జునునకు హితవు పలికాడు. పుణ్యమనేది యజ్ఞానుష్ఠానం వలన ఆర్జింపబడేది కాదని, సదాచరణతో నిగడితం అయి ఉన్నదని కృష్ణుని అభిమతం. మానవుని సన్మార్గగామిని చేయునదేది జపమా, తపమా, స్వాధ్యాయమా ? ఇవి కఠినమైన మార్గములు. సామాన్యులకు సులభమైనది భక్తి. ఇది నవవిధములని చెప్పబడినది.

"భక్తిః" అనేది భజ్ అనే దాతువునకు "క్తిన్" అనే ప్రత్యయము చేర్చగా ఏర్పడు పదం. ఇది బహ్వర్థ ప్రతిపాదకం. వియోజనం, పృథక్కరణం, లేక ఉపాసన ఈ పదానికి గల కొన్ని అర్థాలు. కేవలం పృథక్కరణం అనే అర్థాన్ని తీసుకుందాం. దేని నుండి దేనిని వేరుపరుచుట? పోతన చెప్పినట్లు "విశ్వమందు కన్న విన్న అర్థములందు విషయదృష్టిజేసి వాంఛ

యిడకపోవడమే. ఇంద్రియగ్రామాన్ని మనోబుద్ధుణ్ణి విషయాల నుండి మరల్చి పరమాత్మునియందు నిలపడం.”

చార్వాకులు ప్రతిపాదించడం భోగవాదానికి ఇది పూర్తిగా విరుద్ధంగా ఉంది. మానవజాతిని అధః పతనానికి పురికొలిపే లోకాయత వాదాన్ని నిరసించేందుకే కదా భక్త్యుద్యమం ప్రాదుర్భవించింది. “తేనత్యక్తేన భుంజీథా” అని ఉపనిషద్ చెప్పేదే భాగవతధర్మం చెప్తున్నది. శ్రుతిమించిన అర్థవాదం అన్ని అనర్థాలకు మూలం. వస్తుసంచయనం జీవనపరమావధి కారాదు. ఇది అన్ని రకాల స్పర్ధకు దారితీస్తుంది. స్పర్ధ నుండి హింస ఆక్రామకత పుట్టుకొస్తాయి. చిన్నచేప పెద్ద చేపను కబళింపజూస్తుంది. సామ్రాజ్యవాదం అనేక రూపాల్లో మళ్ళీ మళ్ళీ తలెత్తుతుంది. మానవ జీవితం అస్తవ్యస్తం అవుతుంది. ప్రేయోమార్గాన్ని వదిలి శ్రేయోమార్గాన్ని మానవత స్వీకరించాలన్నదే భాగవతధర్మ సారాంశం.

ఆమార్గాన పయనించడానికి ఏకమేవ ప్రేరణాస్రోతస్సు ఈశ్వరుడే ! అందుకే విషయాల నుండి మనస్సుకు వేరుపరచి ఈశ్వరునియందు నిలుపడం, సుఖదుఃఖాలను సమదృష్టితో చూడడం, సర్వభూతహిత రతుడవడం రాగద్వేషాలకు అతీతుడు కావడం ఇవన్నీ ఈశ్వరునితో సఖ్యం నెరపిననాడే సాధ్యం. ఇది విష్ణు పురాణంలో భక్తుని లక్షణంగా చెప్పబడింది.

ఆళ్వారులను గురించి ఆరంభంలో సూచించటం జరిగింది. అయితే నాకది పూర్తిగా అపరిచిత క్షేత్రం. మహారాష్ట్రను 13వ శతాబ్దంలో ప్రభావితం చేసిన భక్త్యుద్యమాన్ని గురించి సంక్షిప్తంగా చెప్పటానికి నన్ను నేను పరిమితం చేసుకుంటాను. చక్రధర జ్ఞానేశ్వరులు ఉదయించక పూర్వం, ఆధ్యాత్మిక దృష్టితో చూసినప్పుడు మహారాష్ట్ర ఒక ఊసరక్షేత్రం. టి.ఎస్.ఎలియట్ తన (Wasteland) కావ్యంలో వర్ణించిన మరుభూమిని పోలినది. ఆ అంధయుగంలో కర్మకాండకే పెద్దపీట. ఆచరణకు ఏమాత్రం ప్రాధాన్యం లేదు. కరుడు కట్టిన ఛాందసుల వల్ల ధర్మధ్వజుల వల్ల సమాజ జీవనం అతలాకుతలమై కూర్చుంది. జ్ఞానేశ్వరుని తండ్రి, గురువు ఆదేశం మేరకు తిరిగి గృహస్థాశ్రమం స్వీకరించిన నేరానికి వెలివేయబడ్డాడు. ఒకసారి

సన్యాసం స్వీకరించిన వ్యక్తి అలా చేయడం శాస్త్ర విరోధమని కర్మరులు ఈ శిక్ష విధించారు.

మతమౌఢ్యం అనే కటికచీకటి మహారాష్ట్రను ఆవరించిన వేళ జ్ఞానేశ్వర చక్రధరులు వెలుగురేఖలుగా ఉదయించారు. మహానుభావ పంథాకు ప్రవర్తకుడు చక్రధరుడైతే, వారకరీసంప్రదాయ సంస్థాపకుడు జ్ఞానేశ్వరుడు. సమాజ పునరుజ్జీవనానికి దోహదపడే భక్తివాఙ్మయ నిర్మితి వీరితోనే ఆరంభమైంది. మహానుభావ పంథీయులకు పంచకృష్ణులలోని ద్వారకా కృష్ణుడే ఆరాధ్య దైవతం. వారకరీ సంప్రదాయానికి చెందినవాళ్లకు శ్రీ క్షేత్రమైన పంఢరీలో వెలసిన కానడీ విఠలుడు ఆరాధ్యదైవం. విఠలుడు ఇటుకపై నిలిచి పుండలీకునికి దర్శనమిచ్చాడు. శంఖచక్ర గధాపద్మధారి కాకపోవటం గమనించదగిన విషయం. అందుకే భూమిని నమ్మి జీవించే అనాగస ప్రజలకు ఆరాధ్యదైవమైనాడు. విష్ణుగుణకథన శ్రవణము మోక్షదాయమైనందున చక్రధరుడు "రుక్మిణీ స్వయంపర్" రచించాడు. జ్ఞానేశ్వరుడు కావ్య రచన చేయకున్నా అతని జ్ఞానేశ్వరి అనుయాయులకు నిత్యపఠనీయమైన గ్రంథమైంది. మహాభారత కృష్ణునికన్న భాగవత కృష్ణుడే మహారాష్ట్ర జనహృదయాధినేతయైనాడు. చక్రధరుని శిష్యురాలు మహదంబ. ఆమె రచించిన కావ్యము "ధవళే కృష్ణుని రుక్మిణీవరునిగా కీర్తించే గేయాలే ధవళే అంటే ధవళాలుగా చెప్పబడినవి. ధవళ కావ్యం గణపతి లేక శారదా స్తవంతో ఆరంభంకాక గురుస్తుతితో ఆరంభమవుతుంది.

"శ్రీ చక్రధరాచే సిరీధరూనియా చరణ ।
మగ్ ధవళీ గాయన్ గోవిందురాణా ।
భేణే రుక్మిణీ హరియలీ తేణే పవాడే కేలే అతి బహుత్ ।
పావజే పరమగతి భక్తీ ఐకతా కృష్ణ చరిత్ర్ ।"

కృష్ణుని వధువు రుక్మిణి ఆమె వర్ణించిన తీరు ఎంతో మనోహరంగా ఉంది.

"భీమకా కుళీ రుక్మిణీ కేలీ అవతారు ।
రూపే లావణ్యే తియా జితలా సంసారు ॥"

మరియు ఆమెకు అనురూప వరుడైన శ్రీకృష్ణుడు ఎలాంటివాడు ?

"కాళియా కంసు నిర్దళూని గోవర్ధన వామకరీ ధరియలా ।
పరమాత్మ లీళావశే యదుకుళీ అవతరలా ॥"

కృష్ణుని ద్వేషించే రుక్మిణికి సోదరిని కృష్ణునికిచ్చే ప్రతిపాదన నచ్చలేదు. నాన్నతో అన్నాడు.

"గౌళియాఘరీ కైసీ రుక్మిణీ దీజే ।
సకళ కళా కుశళా కుమరీ రూపే చాతుర్యే తీయ నహీ సీమా ॥"

శ్రీకృష్ణుని లీలను వర్ణించే ఆఖ్యానకాలు చక్రధర సాంప్రదాయానికి చెందినవాళ్లకు పరమాన్నం వంటివి. ఆ తరువాత దామోదర పండితులు, భాస్కరభట్టు "రుక్మిణీకళ్యాణాలను" రచించారు. ఈ కావ్యాలు పండితులను మెప్పించే శైలిలో ఉన్నవి. నరేంద్ర భట్టు సైతం రుక్మిణీ కళ్యాణాన్ని రచించాడు. భాస్కర నరేంద్రులు సమానప్రతిభావ్యుత్పత్తి కలవారు.

వారకరీ సంప్రదాయానికి చెందిన భక్త నామదేవుడు అభంగాలను రచించాడు.

భక్తి సాహిత్యం మహారాష్ట్ర జనజీవనాన్ని ఎంతో ప్రభావితం చేసింది. చైతన్యం ఒకే వర్గానికి పరిమితం కాక అన్ని స్తరాలకు ప్రసరించింది. జ్ఞానదేవ తుకారాంలు సామాజిక సమతకు అమర ప్రతీకలు. శ్రావణమాసంలో పంఢరీ విఠలుని దర్శించుటకు లక్షలకు పైగా గ్రామీణులు గుంపులు గుంపులుగా ఏర్పడి తన్మయతతో నామ సంకీర్తనం కావిస్తూ 'దారిలోని ఏదో ఊరిలో ఏర్పాటైన విడుదుల్లో భోజన విశ్రాంతులు తీసుకుంటూ నెలపాటు ప్రస్థానం చేస్తూ పోతుంటే చూసే వారికి నేత్ర సార్థక్యం చేకూరుతుంది.

భక్తివాదం పలాయనవాదం (escapism) కాదు. కర్మసన్యాసాన్ని, సంసార విముఖత్వాన్ని ప్రభోదించదు. వ్యక్తిగా సమిష్టియెడగల బాధ్యతను వ్యక్తి విస్మరించరాదనే భాగవతధర్మం చెబుతుంది. క్రైస్తవ ప్యూరిటనిజమ్ (Puritanism) వంటి ఉద్యమమే భక్త్యుద్యమం.

ఏను నా జన్మలో ఇటు బాలాజీని గాని, అటు కానడి విఠలుని గాని

దర్శించుకొనలేదు. మీలో దర్శించుకొన్న మహానుభావులు ఎందరో ఉన్నారు. మిమ్మల్ని దర్శించుకొని వారిని దర్శించుకొన్న అనుభూతిని పొందుతాను.

'దురితాచే తిమిర జావో ।
విశ్వ స్వధర్మ సూర్యేపాహో ।
జో జే వాంఛీల్ తో తే లాహో ।
ప్రాణిజాత్ ॥
జ్ఞానేశ్వరుని ఈ ప్రసాదదానంతో (పసాయదాన్) ముగిస్తాను.
మధువాతా ఋతాయతే మధుక్షరన్తి సింధవః
మాద్వీర్నః సన్త్వోషధీః
మధునక్త ముతోషసో మధుమత్ పార్థివం రజః....

ఆధార గ్రంథాలు : 1. సంస్కృత భాగవతం, 2. విష్ణుపురాణం, 3. ఋగ్వేద భాష్య భూమిక : సాయనాచార్యులు, 4. చార్వాక్ దర్శన్ కీ శాస్త్రీయ సమీక్ష : సర్వానంద్ పాఠక్), 5. మహాదంబేచే ధవళే (మరాఠీ) : మహాదంబ, 6. ఐతరేయ బ్రాహ్మణం, 7. The Wonder that was India : AL Basham. 8. The Religion of the Rigveda : Griswold.

స్వస్తిశ్రీ స్వభాను నామ సం॥ర పుష్య శు॥ దశమి తేది 02-01-2004 శుక్రవారము వేదిక : వరంగల్ (సేవానివృత్తి) ప్రాచార్యుడు, స్నాతకోత్తర ఆంగ్ల విభాగ ప్రముఖుడు. తమ్మిచెఋవుకట్ట వీధి, మంథని-505 184. జిల్లా కరీంనగర్. ఫోన్ : 08729-259600

-గజానన్ తామన్

మహదంబే చే ధవళే

మరాఠీ భక్తి సాహిత్యం

-గజానన్ తామన్
(సేవా నివృత్త ప్రాచార్యుడు)

భక్త కవయిత్రి మహదంబ లేక మహదాయిసా రచించిన 'ధవళే' ఆఖ్యాన కావ్యాన్ని గురించ ముచ్చటించుకొనే ముందు పదమూడవ శతాబ్దానికి చెందిన మహారాష్ట్రలో ఆవిర్భూతమైన యాదవకాలీన భక్త్యుద్యమద్వితయాన్ని గురించి పరిపూర్ణమైన అవగాహన కలిగి ఉండటం ఎంతైనా అవసరం. ఈ ద్వితయంలో ప్రప్రథమంగా పేర్కొనదగ్గది 'వారకరీ పంథా'. ఇది ఒక ధార్మిక సంప్రదాయం. ఇది మహామహిమాన్వితుడైన జ్ఞానదేవుని మూలంగాఊర్జోపేతమై, బహువిశ్రుతమై పదమూడవ శతాబ్దంలో పెద్ద ఎత్తున అనుయాయులను సమీకరించుకొన్నది. దీని తర్వాత ప్రాదుర్భవించిన మరో ధార్మిక సంప్రదాయం 'మహానుభావపంథా. మహారాష్ట్ర సాంస్కృతిక పునరుజ్జీవనానికి ప్రేరకాలైన ఈ రెండు సంప్రదాయాలు 'భాగవతకృష్ణ' భక్తిమార్గాన్నే ఎంచుకొన్నవి. అయినను తత్త్వజ్ఞానంలో ఆచరణలో వీటిని భిన్న ధ్రువాలుగా చెప్పుకొనవచ్చును. వారకరీసంప్రదాయం సర్వజనానుమోదాన్ని పొందినదైతే, మహానుభావ సంప్రదాయం పరిమిత జనసందోహానికే అవశిష్టమైంది. వికృతవైరాగ్యాన్ని ప్రతిఫలించే వీరి జీవనవిధానమే ఇందుకు కారణము. వీరి ధార్మిక గ్రంథాలు గూఢలిపిబద్ధాలు. వీరి సంప్రదాయం ద్వైతమతాధిష్ఠితం. వీరి దృష్టిలో జీవుడు వేరు, పరమాత్మ వేరు. జీవపరమాత్మమేళనం సులభసాధ్యమైనది కాదు. మహానుభావీయపంథీయుడు సర్వసంగపరిత్యాగియై, అనికేతునడై సన్యాసిగా దేశాటనం చేస్తూ ప్రాణాలు నిలుపుకొనేందుకు మాత్రమే నీరసమైన పాచిపోయిన ఆహారాన్ని తింటూ ప్రయాణమధ్యంలో ఎక్కడైనా ఆగాల్సి వస్తే పుష్పఫలోపేతమైన వృక్షచ్ఛాయలో గాక కంటకాన్వితమైన తరువులనే ఎంచుకుంటూ శిధిలాలయాల్లో నిద్రిస్తూ జీవితం గడపాలి. ఏ మహానగరంలో అడుగెట్టకూడదు. ప్రేతభూముల్లో అపచయించిన వస్త్రాలను

ధరించాలి. సూక్ష్మంగా చెప్పాలంటే జీవన్మృతధర్మాన్ని పాటించాలి. ఇలాంటి జుగుప్సాకరమైన జీవన విధానం వల్ల వీరిని మొగలు సామ్రాట్టు హిందువులుగా పరిగణించక 'జిజియాపన్ను' విధించలేదు. వీరు జీవన వాదులు కారు. జీవితాన్ని ప్రేమించలేరు. వీరి దృష్టిలో మానవజీవితం ఒక పాపం. తృణతుచ్ఛం.

వికృతమనోవృత్తి గల మహానుభావులతత్త్వంలో స్త్రీ సమస్తదోషాలకు ఆకరం. నరకానికి రాజమార్గం. మదిర సేవిస్తేనే మత్తెక్కిస్తుంది మగువం మదిర సేవించకుండానే. మహానుభావీయసంప్రదాయకవి భాస్కరభట్టు బోరీకర్ 'స్త్రీ భణిజే మత్త ద్రవ్యాచా రావో గా' అంటాడు తన గ్రంథంలో. మరో అడుగు ముందుకు వెళ్ళి చిత్రంలో సైతం స్త్రీని చూడరాదని శ్రీచక్రధర స్వామి శిష్యులను ఆదేశించారు.

మహానుభావీయులు పంచకృష్ణులను దక్క మరే దేవుని ఆరాధించరాదు. చక్రధరుని దృష్టిలో సమస్త దేవతలు హీనమైనవారు తీర్థక్షేత్రాలు సందర్శించరాదు. మహానుభావ ప్రతిపాదిత భాగవత ధర్మాన్ని పాటించే గృహస్థునికి స్వర్గప్రాప్తి కలుగుతుంది తప్ప ముక్తి సిద్ధించదు. ఈశ్వర సాయుజ్యం కఠోరవ్రతాచరణుడైన సన్యాసికే సాధ్యం అని భాస్కరభట్టు బోరీకర్ దశమస్కంధానికి తాను వ్రాసిన టీకలో చెప్పాడు. మహానుభావుల దృష్టిలో, వారకరుల దృష్టిలో ఈశ్వరుడు ప్రేమస్వరూపుడే; కారుణ్య స్వరూపుడే. ఈశ్వర ప్రాప్తికి సూచించిన సాధనామార్గంలో మహదంతం ఉంది. తాత్త్వికదృష్టిలో కూడా.

వారకరీ సంప్రదాయ ప్రవర్తకులు శ్రీ జ్ఞానదేవనామదేవులు. వారకరీ సంప్రదాయం అద్వైతాధిష్ఠితం. జగత్తు ఈశ్వరుని దివ్యాభివ్యక్తి 'ప్రహ్లాదుడు చెప్పినట్లు సర్వమున్నతని దివ్యకళామయము.'

మహానుభావ సంప్రదాయం జీవనవిముఖమైతే, వారకరీ సంప్రదాయం జీవనాభిముఖం. అందుకే మహారాష్ట్రలోని ఆబాలగోపాలానికి వారికరీ సంప్రదాయం ప్రీతిపాత్రమైనది. పరమకారుణ్యధాముడైన ఈశ్వరుడు

ఒసంగిన దేహాన్ని నానాయాతనలకు గురిచేయరాదు. యుక్త ఆహార విహారాలను కల్పించాలి. రోగరహిత దేహం వినాహరిస్మరణం సాధ్యం కాదు. హరిస్మరణం వినా హరిప్రాప్తి అనూహ్యమే కదా !

మహానుభావుల దృష్టిలో :

శరీర్ దుఃఖాచేకోఠార్

శరీర్ రోగాచే భాండార్

శరీర్ దుర్గంధీసి ధార్

నాహి అపవిత్ర్ శరీరా ఐసే

వారకరుల దృష్టి ఇందుకు పూర్తిగా విభిన్నం. వారకరి సంప్రదాయానికి చెందిన పరమ భాగవతోత్తముడు తుకారాం ఏమంటాడో తెలిసికొందాము.

శరీర్ ఉత్తమ్ చాంగలే

శరీర్ సుఖాచే ఘోసులే

శరీర్ సాధలే పరబ్రహ్మ

స్వాస్థ్యవంతమైన శరీరం సర్వసౌఖ్యాలనొసంగే గూడువంటిది. శరీరం ద్వారానే పరబ్రహ్మ సాధ్యం. మరొక చోట అంటాడు.

శరీర్ సుఖ నేదాకా భోగ్

న ద్యావే దుఃఖ్ నా కరీ త్యాగ్

నవ్హే వో ఖరే నా చాంగ్

తుకా మ్హణే వేగ కరీ హరిభజనీ

శరీరానికి పీడ కల్గించరాదు. శరీరాన్ని త్యజించరాదు. ధర్మబద్ధులమై సమస్త శరీరసుఖాలను అనుభవించాలి. శ్రీ జ్ఞానదేవులు భాగవతధర్మాన్ని త్రికాలస్మరణీయంగా, హృదయంగమంగా వచించారు.

కా సాండసీ గృహాశ్రమ్/కా సాండసీ క్రియాకర్మ్

కాయసా సాండసీ కులీచే ధర్మ్.

గృహాశ్రమాన్ని త్యజించడమెందుకు ? ఏల క్రియాకర్మలను త్యజిస్తావు?

కులధర్మాలను విడనాడడమెందుకు ?

వారకరీసంప్రదాయానికి చెందినవారు మానవజీవనం దుఃఖమయం అని అంగీకరించనా, సుఖమయం కావించుకొనే మార్గాలు ఉన్నాయంటారు. అవఘాచి సంసార్ సుఖాచా కరీన్ అంటాడు 'జ్ఞానదేవుడు'.

భగవద్గీత, భాగవతం ఉభయ సంప్రదాయాలకు మాన్యగ్రంథాలే. గీతలో అర్జునునకు భాగవతంలో ఉద్ధవునకు కృష్ణుడు ఉపదేశించినది మహానుభావ్యులకు సమ్మతమే. గీతలో కృష్ణుడు చెప్పిన త్యాగాన్ని మహానుభావులు తప్పుగా అన్వయించుకొన్నారు. గృహత్యాగాన్ని కృష్ణుడు ప్రవచించలేదు. కర్మఫలాసక్తి త్యాగాన్ని గురించే చెప్పాడు.

భాగవతంలోని ఏకాదశస్కంధంపై మహానుభావీయ సంప్రదాయానికి చెందిన భాస్కరభట్టు, వారకరీ సంప్రదాయానికి చెందిన ఏకనాథుడు భాష్యాలు వ్రాశారు. ఏకాదశ స్కంధంలోని మొదటి ఐదు అధ్యాయాల్లో భాగవతధర్మాన్ని గురించ ఏకనాథుడు చక్కగా చెప్పాడు. అంటే ఆ పంచాధ్యాయాలపై చక్కని భాష్యం వ్రాశాడు.

హే పంచాధ్యాయీనవ్హే జాణ్ !
ఏకాదశాచే పంచప్రాణ్
ఉపదేశావయా శుద్ధజ్ఞాన్ !
పంచమ్ ఆలాపే శుకకోకిళ్
ఏకాదశ వసంతమూళ్ !
భక్త్ ఆలాపవీ స్వయే

ఈ పంచాధ్యాయాలు ఏకాదశస్కంధానికి పంచప్రాణాలు. శుద్ధ జ్ఞానాన్ని బోధించే నిమిత్తం భక్తుల మ్రోలనిలిచియున్నవి. ఈ పంచా ధ్యాయాలు పంచమస్వరాన్ని ఆలపించే శుకపికావళి. ఏకాదశం మధుమాస మూలం భక్తులు స్వయంగా ఆలపిస్తారు.

మహానుభావ పంథీయుడు భాస్కరభట్టు ఈ ఐదు అధ్యాయాలను

భాష్యం వ్రాయకుండా వదిలివేశాడు. భాగవత స్ఫూర్తికి విరుద్ధమైన తత్త్వజ్ఞానాన్ని కృష్ణునిచే ప్రవచింపజేశాడు. కృష్ణోద్ధవ సంవాదాన్ని ద్వైతాన్ని నిరూపించడానికి అద్వైతాన్ని ఖండించడానికి భాస్కరభట్టు ఉపయోగించు కున్నాడు.

ఉభయ సంప్రదాయాలు ఏకేశ్వరార్చననే ప్రతిపాదించినవి. 'భారత కృష్ణుని' ఉపాస్యదైవంగా ఉద్ఘోషించినవి. మహానుభావ పంథీయులకు సమస్త దేవతలు చివరకు త్రిమూర్తులు సైతం నిత్యబద్ధులైనందున పూజార్హులు కారు. పరమేశ్వరుని పంచావతారాలైన దత్తుడు, ద్వారకాకృష్ణుడు, చాంగ్‌దేవ్ రావుల్, గోవింద ప్రభు వారికి ఆరాధ్య దైవాలు దత్తుడు వ్యాఘ్ర రూపంలో చాంగ్‌దేవ్‌కు దర్శనమిచ్చాడు. విదర్భలోని రిధ్‌పూర్ నివాసియైన గోవింద ప్రభువును చాంగ్‌దేవ్ అనుగ్రహించాడు. చక్రధరస్వామి గోవింద ప్రభుని అనుగ్రహం పొందాడు. చక్రధరునికి గోవింద ప్రభుని యందు ఎనలేని భక్తిభావం విరక్తుడై మౌనస్థితి వహించి దేశాటనం కావించాడు. ఆంధ్ర దేశములోని వరంగల్లును సందర్శించి తిరిగి మహారాష్ట్రలోని రామ్‌టెక్‌ను చేరుకున్నాడు. అక్కడ నుండి పైఠన్‌కు వచ్చాడు. సన్యాస దీక్షను స్వీకరించాడు. మహాపండితుడైన నాగాచార్యుడు ఈయనకు శిష్యుడై మహిమ భట్టుచే చక్రధరుని లీలలను 'లీలాచరిత్ర'గా గ్రంథస్థం చేయించాడు. అతని బోధలకు ముగ్ధుడై సర్వసంగపరిత్యాగియైనాడు. చక్రధరస్వామ 1196లో హిమాలయాల్లో నివాసమేర్పర్చుకొన్నాడు. అక్కడ నుండి ఆయన ఈనాటికి రాజ్యం చేస్తున్నాడని పంథీయుల నమ్మకం.

మహానుభావపంథీయుల 'భాగవత కృష్ణుడే ఉపాస్యదైవం. వారకరీ పంథీయులకు విఠలుడు. తన్ను తాను శ్రీకృష్ణుని అవతారంగా చెప్పుకొన్న మహానుభావమార్గప్రణేతయైన చక్రధరస్వామి ఏ గ్రంధరచనకు పూనుకొన లేదు. ఆయన ఉపదేశాలను శిష్యులు సూత్రబద్ధం చేశారు. వాటిపై పండితులు భాష్యాలు వ్రాశారు. వేదప్రామాణ్యాన్ని అంగీకరించని మహానుభావ పంథీయులకు అవే శ్రుతులు; అవే స్మృతులు. స్త్రీలకు సైతం

సన్యాసదీక్ష ఇచ్చి మాతాలలో ప్రవేశం కల్పించిన ఫలితంగా దంభాచారానికి మతాలు ఆకరాలై మహానుభావీయ సంప్రదాయం ప్రజల మన్నను కోల్పోయింది.

ఏది ఏమైనా, ఈ రెండు సంప్రదాయాలు మరాఠీ సాహిత్య నిర్మితికి ప్రేరకాలైనవి మహానుభావీయ సంప్రదాయానికి చెందిన మహదంబ మరాఠీలో ఆఖ్యాన కావ్యాన్ని రచించిన మొదటి కవయిత్రి. ఆమె జీవిత విశేషాలు మహానుభావీయ గ్రంధాల్లో దొరుకుతవి. మహదంబ అసలు పేరు రూపాబాయి. ఈమె జీవించిన కాలం 1158-1224, చిన్నతనంలోనే వైధవ్యం ప్రాప్తించిన కారణంగా విరక్తగా 'రావణగావ్' గుహలలో కొంతకాలం జీవితం గడిపింది. శ్రీ చక్రధరస్వామికి శిష్యురాలై యావజ్జీవితాన్ని తీర్థయాత్రలు చేయుటలో సత్పురుషుల సేవలో గడిపింది.

మహదంబ రచించిన 'ధవళే' మరాఠీలోని మొట్టమొదటి ఆఖ్యాన కావ్యం నాలుగు చరణాలు గల 'ధవళా' ఒక ఛందో విశేషం. ఆమె విదుషీమణి కాకపోవడం వల్ల అక్కడక్కడ వ్యాకరణ దోషాలు దొరలినవి. పాత్ర నిర్మితిలో అనౌచిత్యం ఒకటి రెండు చోట్ల చోటు చేసుకుంది. ఇదివరకే చెప్పిట్లు 'ధవళా'కు నాలుగు చరణాలు ఉంటాయి. మొదటి మూడు చరణాలు అంత్యప్రాసబద్ధాలు. ఈ ఛందోనియమాన్ని మహదంబ పెక్కు చోట్ల పాటించలేదు.

భాగవతంలోని 'రుక్మిణీహరణం' పరమాత్ముడైన కృష్ణుడు ఆచరించిన అద్భుత లీలల్లో ఒకటి. ఆయన భక్త పరాధీనుడు రుక్మిణి విపత్తులో చిక్కుకుంది. పుత్రుడైన రుక్మిమాట కాదనలేక కుండినపురాధీశుడైన భీష్మకుడు రుక్మిణిని శిశుపాలునికి ఈయదలిచాడు. రుక్మిణికి శిశుపాలుని పేరెత్తితే గిట్టదు. తన మనోగతాన్ని విప్రుని ద్వారా కృష్ణునకు తెలిపింది. ఆర్తత్రాణ పరాయణుడైన కృష్ణుడు స్పందించి సేనాసమేతుడై కుండినపురాన్ని చేరుకొన్నాడు. రుక్మిణితో వివాహబద్ధుడై కుండినపురంలోని ఆబాల గోపాలానికి అమందానందాన్ని అనుగ్రహించాడు. రుక్మిణీహరణోదంతాన్ని గోవింద ప్రభుని కోరికపై తన కావ్యానికి మలచారు. 'ధవళా' అనేది

గేయవృత్త ప్రకారం పెండ్లికుమారుని అందచందాలను గుణగణాలు వర్ణిస్తూ పాడేపాట. 'ధవళే' కావ్యం పూర్వార్ధం, ఉత్తరార్థంగా విభక్తం. పూర్వార్థంలో ఎనుబది మూడు, ఉత్తరార్ధంలో అరువది ఐదు 'ధవళాలు' ఉన్నాయి.

మహానుభావీయ సంప్రదాయానుసారం కావ్యారంభంలో గణేశుని లేక శారదనుగాక మహదంబ శ్రీ చక్రధరస్వామికే వందనమాచరించింది. కావ్యరచనకు గోవింద ప్రభుని కోరికపై పూనుకొన్నది. ఆయన అనుగ్రహం వల్ల భయసందేహాలు పటాపంచలై, రచనకువలసిన స్ఫూర్తి మహదంబకు లభించింది.

శ్రీ చక్రధరాచే సిరీ ధరునియాచరణ్
మగ్ ధవళే గాయిన్ గోవిందు రాణా !

మహదంబ విదుషీమణికాదు. కృష్ణభక్తి ప్రేరితమై ధవళేను రచించింది. ఈమె కావ్యంలో శబ్ద వైభవం ఇంచుకైనా కన్పట్టదు. అడుగడుగునా అలంకారాలు సాక్షాత్కరించవు. కుంతకుడు చెప్పిన వక్రోక్తి కాక సహజోక్తియే పఠితలను రంజింపచేస్తుంది. కథాకథనంలో స్త్రీ సులభమైన మార్దవం, భావోద్వేగం ఉన్నాయి. గిరినిర్ఝరవేగముంది.

మహదంబ ధవళే కావ్యాన్ని యశసేర్థకృతే రచించలేదు. శివేతరక్షతం కోసం కృష్ణుని పాడుకొంది. ఈమె రచన ప్రవృత్తి వైపు గాక నివృత్తి వైపు పయనింపచేసే రచన. ధవళే శృంగారరసప్రధాన కావ్యం కాదు. ఇందులో రుక్మిణీ శ్రీకృష్ణులు ఉదాత్తభావనాబద్ధులు. జగత్కాళ్యాణార్థం ఏతెంచిన దైవతాలు. రుక్మిణీకృష్ణుల చరితాన్ని శ్రవణం చేసే భక్తునకు పరమగతి ప్రాప్తిస్తుంది. కృష్ణుడెలాటివాడు ? ఈ ప్రశ్నకు కవయిత్రి ఇచ్చే సమాధానం.

జేషే రుక్మిణీ హరియలే
తేణే పవాడే కేలే బహుత్
పావిజే పరమగతీ భక్తీ
ఐకతా కృష్ణ చరిత్ర్

మరి రుక్మిణి :

భీమకాకులీ రుక్మిణీ కేలా అవతారూ
రూపేలావణ్యేతియాజితలా సంసారూ

ఇలాంటి రూపగుణసంపన్నయైన తనయకు యోగ్యుడెవరన్న ఆలోచనలో భీష్మకుడు పడ్డాడు. ఎవరికి ఈయాలి ఈమెను ?

తవరావే చింతాకరీ కవణాదేయావీ

ఒకనాడు ద్వారవతి నుండి కుండినపురానికి వచ్చిన వందీజనం కృష్ణుని రూపగుణసంపదను బహువిధాలుగా పొగిడింది. పరాక్రమాన్ని అభివర్ణించింది.

కాళియా కంసు నిర్దాళుని
గోవర్ధను వామకరీ ధరియలా
పరమాత్మా లీలా వశే యదుకులీ అవతరలా

ఇది విన్న భీష్మకుడు తన కన్యకు కృష్ణుని అనురూప వరునిగా నిర్ణయించారు. ముక్తహస్తాలతో వందీజనులను సత్కరించాడు. మంత్రులను విచారించాడు. రాజు నిర్ణయాన్ని వారు సమర్థించారు. 'శుభస్య శీఘ్రమ్' అన్నారు.

రుక్మియా మ్హణే తాతా ఏసే కేవీకీజే
గౌళియా రుక్మిణీ దీజే.

రాజసౌధంలో ఏమి జరిగిందో రుక్మిణికెలా తెలుస్తుంది ?

రుక్మిణీ పుసే సఖియాంసి వృత్తాంతు
కాయి బోలే మాతాపితా
కాయిబోలేవో రుక్మియా భాయీ

శిశుపాలునే వరునిగా నిర్ణయించారని చెలికత్తెలు చెప్పగా రుక్మిణి చింతాగ్రస్తయైనది.

శ్రమూ పాతలీ నీర్వా ఝూలీ వ్యాకుళ్
స్మరిలే కృష్ణరావో

దేవా ! సంకష్టీపడలియథోరీ.
తూ ఎకు వాచౌనియా అను నాహీ అవధారీ.
శిశుపాళ బందీ శాళ్చుకవా.
దాఖవా ఆపులే శ్రీచరణ్.

రాచపట్టి కదా ! చూస్తూ ఊరుకుంటుందా ! చేతులు ముడుచుకు కూర్చుంటుందా ? వెంటనే తన చెలికత్తెను పంపి తనకు విశ్వసనీయుడైన సుదేవుడనే విప్రుని రావించింది. ఆ విప్రుడు అన్నాడు.

తూ కా వో దైన్యవదన్
శోకే వ్యాకుళ్ భీమకా బాళే !

సంక్షిప్తంగా హుందాగా పరిస్థితిని తెలిపింది తాతా ! ఉపేక్షేళియే కృష్ణాగోపాళే బ్రాహ్మణుని ఇలా కోరింది.

జాయీ వేగే విస్తా ! కృష్ణరాయా జవళా
నూఝీ వినతీ సాంగావీ గోపాళా
మీత యా శరణాగత్ ఏథ్ యే ఉనీ న్యావే గోవిందే
నా తరి సాండీ తూయే బ్రీదే.

శరణువేడిన నన్ను వెంటనే కొనిపో ! లేని పక్షంలో భక్తవత్సలుడన్న బిరుదువదులుకో ! రుక్మిణి చివర వాక్యంలోని పరుషత్వం గోపాలుని యెడ ఆమెకు గల ప్రణయ భావాన్ని వ్యక్తం చేస్తున్నది.

ధన్యచరిత నీకు దాస్యంబు సేయని
జన్మమేల వేయి జన్మములకు.

అని పోతనగారి రుక్మిణి అన్నట్లుగానే మహదంబ మానసపుత్రి అంటుంది.

నా పావో కృష్ణ రావోతరి
హే జన్మ జీవిత్ హోఈల్ భూమీ భారూ

మహీసురుడువాయుమనోజవం తో పయనించి ఐదవనాడు ద్వారవతి చేరుకుంటాడు. రాజసౌధతోరణము ముందు నిల్చిన విప్రుని దౌవారికులు సింహాసనాశీనుడైన శ్రీకృష్ణ సన్నిధికి తీసికొని వెళ్ళుతారు. బ్రహ్మణ్యుడైన

వారి గద్దియ డిగ్గున దిగి విప్రునకు అతిథి మర్యాదలు చేస్తాడు. ఓలగాన్ని విసర్జించి భూదేవుని కృష్ణుడు స్వీయసదనానికి గొనిపోతాడు.

వోలగ్ విసర్జిలీ తయా తత్క్షణీ
నిప్రాచా కర్ ధరూనియా చాలే
నిజభువనా దేవకీయకుమరు

విమ్మిల్ని కృష్ణుని సన్నిధికి చేర్చటంలో దౌవారిక పాత్ర నిర్వహించాను. పోతన చెప్పినా, మహదంబ చెప్పిన, రుక్మిణీ కృష్ణుల ప్రణయకథ సుఖాంతమే అవుతుంది. అది లోకానికి మంగళ ప్రదమవుతుంది.

Paper to be read at
The International Conference on Srimad Bhagavatam At
SRI VENKATESHWARA UNIVERSITY
Tirupati.
20th - 22nd June, 2009

GAJANAN TAMAN, M.A.
(Rtd.) Principal
T.C. Kattestreet, P.O. MANTHANI-505 164.
Dist. KARIMNAGAR. (T.S.) Cell : 9440211285

సందర్భ గ్రంథాలు :

1. మహదంబే చే ధవళే – సం॥ డా॥ దాదాగోరే
2. భారతీయ సంస్కృతికోశ్
3. వారకరీ సంప్రదాయ్ – ఉదయ్ వ వికాస్
4. శ్రీమదాంధ్ర మహాభాగవతము – బమ్మెర పోతన

'ధవళే'లో సాక్షత్కరించిన తెలుగు పదాలు :

అందు	=	అందె
ఓళగ్	=	ఓలగము సేవ
కడగియా	=	కడియాలు
పరియళ్	=	పళ్ళేరము
బోనే	=	బోనాలు

మాతు	=	మాట
వోగర్	=	ఓగిరము
సరి	=	తుల్యము
మీసే	=	మీసాలు

-గజానన్ తామన్

తెలంగాణ ముద్దుబిడ్డ

(ప్రభాకర్ చీఫ్ ఇంజనీర్‌గా నియమితులై జూరాల ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టినారు. విశాఖపట్నం ఉక్కు కర్మాగారానికి నీరు అందించే ఏలేరు ప్రాజెక్టు ఆయన హయాంలో రూపొందించబడింది.)

నాటి హైదరాబాద్ సంస్థానంలో అంటే నేటి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కరీంనగర్ జిల్లాలోని మంథని మండలంలో సువర్ణ ప్రభాకర్ జూలై 12, 1930న జన్మించారు. మెట్రిక్యులేషన్ పరీక్ష 1947లో ఉత్తీర్ణులయ్యారు. గణితశాస్త్రంలో అత్యధిక మార్కులు సాధించిన ఆయనను బోర్డువారు బంగారు పతకంతో సన్మానించారు. పువ్వు పుట్టగానే పరిమళించును కదా! ఇంటర్మీడియట్ చదవడానికి ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలోని మహావిద్యాలయంలో చేరారు.

స్వేచ్ఛాభావాలు గల యువకుడు చేతులు ముడుచుకొని కూర్చుండగలడా ? 'పరుల కష్టాలతో పనియేమి మనకనెడు వారివిధంగా' అని కాళోజీ చెప్పినట్లు హాయిగా మనగలుగుతాడా ? నిజాం నియంత పాలనకు వ్యతిరేకంగా ఏర్పడిన విద్యార్థి సంఘంలో చేరాడు. చరిత్రకెక్కిన సత్యాగ్రహోద్యమంలో మొక్కవోని ధైర్యంతో పాల్గొన్నాడు. నిజాం కాలేజీ ఆవరణలో పోలీసులు జరిపిన లాఠీచార్జ్‌లో తీవ్రంగా గాయపడినారు.

స్వామి రామానందతీర్థ పిలుపు మేరకు మహా విద్యాలయాన్ని వదిలి, స్వాతంత్ర్య సంగ్రామ సైనికుడైనాడు. స్వగ్రామమైన మంథనిలో కొందరు సహాధ్యాయులతో దళసభ్యుడైనాడు. ఊరేగింపులలలో పాల్గొని సత్యాగ్రహిగా తన వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వహించాడు. ఈ యువకుల కార్యకలాపాలు సహించని నిజాం దొరతనం వారు వీరిని నిర్బంధంలో ఉంచాల్సిందిగా హుకూం జారీ చేశారు. గృహాలను సోదా చేశారు. పన్నెండు మంది సహచరులతో ప్రభాకర్ అజ్ఞాతవాసంలోకి వెళ్లారు. ఈ పన్నెండు మంది యువకుల్లో పేర్కొనదగినవారు గులుకోట శ్రీరాములు, పన్కంటి కిషన్‌రావు, రాంపల్లి కిష్టయ్యలు. వీరంతా చంద్రపూర్ (మహారాష్ట్ర) శివారులోని క్యాంపులో 1947 అక్టోబర్‌లో చేరారు. నిజాం సర్కారుకు వ్యతిరేకంగా సాగుతున్న సాయుధ సంగ్రామంలో పాల్గొనే నిమిత్తం భారత

ప్రభుత్వం వారు నాగపూర్‌లో ఏర్పర్చిన ఇండియన్ ఆర్మీ సెంటర్‌లో శిక్షణను పొందినారు.

చాందా క్యాంప్ ఆధ్వర్యంలో జరిగిన ముక్తి సంగ్రామంలో (అక్టోబర్ 1947–సెప్టెంబర్ 1948) వీరందరు వీరోచిత పోరాటం సల్పినారు. గోదావరి, ప్రాణహిత సంగమ ప్రదేశంలోని సిరివంచలో కార్యకలాపాలు సాగించారు. చాందా క్యాంప్ కరీంనగర్ ప్రాంతాన్ని కార్యక్షేత్రంగా ఎన్నుకొని పోలీసు బలగాలతో, రజాకారు మూకలతో అనేక పోరాటాలు సల్పింది. కాళేశ్వరం, మహాదేవ్‌పూర్, చింతకాణి మొదలగు గ్రామాలలో తన అస్తిత్వాన్ని ఈ క్యాంపు ఘనంగా చరిత్రకెక్కే విధంగా చాటుకున్నది. పోలీసు చేరువైంది. కరీంనగర్‌లో సెప్టెంబర్ 17న సుసంపన్నమైన విరాడ్ జైత్ర సమ్మేళనంలో ప్రజాజయధ్వానాలను అందుకొన్న భాగ్యశీలురులలో ప్రభాకర్ ఒకరు.

హైదరాబాద్ భారత్‌లో విలీనం కావడంతో ముక్తి సంగ్రామం ముగిసంది. ప్రభాకర్ ఉస్మానియాలో చేరి 1952లో బి.ఈ. (సివిల్) డిగ్రీని పుచ్చుకున్నారు. తత్పరీక్షలో సర్వోత్తమశ్రేణిని సాధించారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా ప్రథమశ్రేణి ఇంజనీర్‌గా 1955లో నియమితులై, 1964లో కార్యనిర్వాహక ఇంజనీర్ స్థాయికి ఎదిగారు. గోదావరి లోయకు సంబంధించిన ప్రధాన ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించారు. ప్రతిష్టాత్మక నిర్మాణాలు, ముఖ్యంగా ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన ఆర్.సి.సి. టన్నెలు వీరిచే నిర్మితమై ఆంధ్రప్రదేశ్‌తో పాటు ప్రపంచబ్యాంకు ప్రశంసలను అందుకున్నారు. పర్యవేక్షక అభియంతగా 1976లో పదోన్నతి పొంది 'దిగువ మానేరు డ్యాం' కాకతీయ కెనాలు వ్యవస్థ నిర్మితికి వీరే మూలాధారమైనారు. నాటి భారత ప్రధాని ఇందిరాగాంధీ లోక్‌సభ నియోజకవర్గంలోని సింగూర్ ప్రాజెక్టును అస్తిత్వంలోనికి తెచ్చిన ఘనత ఈయనదే. లక్ష్యసాధనలో వీరు ప్రదర్శించిన నైపుణ్యాన్ని ఆమె అనేక సందర్భాల్లో మెచ్చుకున్నారు.

మనం ముఖ్యంగా గమనించవలసిన విషయమేమిటంటే ప్రభాకర్ చీఫ్ ఇంజనీర్‌గా (భారీ నీటిపారుదల శాఖ) నియమితులై జూరాల ప్రాజెక్టు

నిర్మాణానికి శ్రీకారం చుట్టినారు. విశాఖపట్నం ఉక్కు కర్మాగారానికి నీరు అందించే ఏలేరు ప్రాజెక్టు ఆయన హయాంలో రూపొందించబడింది. తుంగభద్ర ఉన్నతీకరణ, కాలువ విస్తరణ, పెన్నా అహోబిల జలాశయం వీరి పర్యవేక్షణలోనే నిర్మాణం జరిగింది. సుంకేశుల ఆనకట్ట నిర్మాణానికి ప్రతిపాదనలను వీరే రూపొందించారు. ఇంజనీర్-ఇన్-చీఫ్‌గా నియమితుడైన ఈయన సేవలను ఆగష్టు 1986లో వరదల వల్ల తలెత్తిన సంక్షోభ నివారణ నిమిత్తం ప్రభుత్వంవారు వినియోగించుకున్నారు. భీషణ పరిస్థితిని సూక్ష్మ దృష్టితో పరిశీలించ వేలాది గండ్లను సల్పకాలంలో పూడ్చి పది లక్షల ఎకరాలలోని పంటలకు నష్టం వాటిల్లకుండా చర్యలను చేపట్టి తన నేతృత్వ పటిమను నిరూపించుకున్నారు. నాటి భారత ప్రధాని రాజీవ్ గాంధీ 3 అక్టోబర్ 1986న ఆంధ్రప్రదేశ్ సందర్శించినప్పుడు ఆయనకు వివరణ ఇచ్చే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఈయనను నియమించిందంటే వీరి నేతృత్వ పటిమను అర్థం చేసుకోవచ్చు.

ప్రభాకర్ ఇరిగేషన్ ప్రాజెక్టు పథకాల కమిషనరుగా, నీటి పారుదల, సి.ఎ.డి. విభాగ సంబంధిత కార్యనిర్వాహక అధికారిగా మే 1987లో నియమితులయ్యారు. కేంద్రస్థాయి సమావేశాలలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా వ్యవహరించారు. ఏడవ పంచ వార్షిక ప్రణాళికా రూపకల్పనకు సంబంధించిన కమిటీలో సభ్యునిగా ఉన్నారు. జాతీయ, అంతర్జాతీయ సమావేశాలలో పాల్గొని పత్రాలను సమర్పించారు. అమెరికా, కెనడా దేశాలను సందర్శించారు. నీటిపారుదల క్షేత్రంలో ఆయన కృషిని ప్రపంచ బ్యాంక్ అభినందించింది. ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధికి కృషి సల్పిన వారిలో ప్రభాకర్ ఒకరని పేర్కొనటంలో అతిశయోక్తి లేదు.

నీవు అభియంతగా ఎంతో ఎత్తుకెదిగి
వసుధ దాహార్తి దీర్చిన వాడ వీవు
నీవపర భగీరథుడవై ! నిన్ను కనిన
మా తెలంగాణ ధన్యయె ! మారు గాదు.

-గజానన్ తామన్

అనిల్ అవచట్ 'మనుష్యులు : ఒక అనుశీలన

అనిల్ అవచట్ మరాఠీపుస్తకం 'మాణసే' తెలుగు పాఠకులను పరిచయం చేయాలన్న తలంపుతో నేను ఉన్న సమయంలో అన్నవరం దేవేందర్ తన కవితా సంగ్రహం 'మంకమ్మతోట లేబరు అడ్డా' నాకు ఉపాయనంగా ఇచ్చాడు. ఆశ్చర్యం కలిగించే విషయమేమిటంటే; అనిల్ మహారాష్ట్రీయుడు దేవేందర్ తెలుగువాడు. 'మాణసే' (మనుష్యులు) సమాజ శాస్త్రీయ అధ్యయన రూపం (Case Studies) లో ఉంది. 'మంకమ్మతోట లేబరు అడ్డా' కవితా రూపంలో ఈ ఇద్దరు రచయితలు దేశంలోని విభిన్న ప్రాంతాలకు, భాషలకు చెందినవారైనా అనికేతులయెడ, (తల దాచుకొనడానికి కొంపలేనివారు) నిష్కాసితుల యెడ (వెడలగొట్టబడినవారు) శ్రీశ్రీ మాటల్లో చెప్పాలంటే 'దగాపడిన తమ్ముల'యెడ పరిపూర్ణమైన నిబద్ధత కలవారు. అచ్చులో తమ పేరు చూద్దామనో అవార్డులు పొందాలన్న తపనతో రచనలు చేసే కోవకు చెందిన మహానుభావులు కాదు. 'కూడులేని', గూడు లేని 'పక్షులూ' 'భిక్షులూ' అయిన వారి జీవతాల్ని శబ్ద చిత్రాలుగా మలచి లోకం ముందువుంచాలనే, శిలీభవించిన హృదయాలలో ఆర్ద్రత పుట్టించాలనే దీక్షతో లేఖినులకు పనిని కల్పించిన అధునాతన మహర్షులు. కవి శబ్దవాచ్యతకు అన్నివిధాలా అర్హులు. 'ప్రతిభగల చోట నా హస్తాలు ముకిళిత మౌతాయి' అన్నాడొక మరాఠీ కవి. వీరు ప్రతిభకలవారు. మన హస్తా ముకుళితం కాకుండా ఎలా ఉంటాయి ?

ఎవరైనా పుట్టిన ఊరి నుండి నిష్కాసితులు కావడానికి కారణాలు రెండుంటాయి. ఒకటి మానవీయ కారణం. రెండవది ప్రాకృతిక కారణం 'అప్పులోల్లు యములైంద్రు; రైతు బలికే దినం కాదు'. ఇది అన్నవరం 'రైతు' ఆవేదన. అనిల్ అవచట్ 'రైతు' ఆవేదన. అనిల్ అవచట్ 'రైతు'ను కరువు కాటేసింది. 'మీరేమి అమ్ముకొని ఇక్కడికి వచ్చారు' అని అనిల్ ఓ రైతును అడిగితే "మిగిలిందేమిటో అడగండి" అని రైతు జవాబు చెబుతాడు. 'మాణసే'లో మంకమ్మతోట లేబరు అడ్డా'కు ఉపసంహారం (epiclogue) వ్రాసిన జింబోగారు అన్న మాటలు అక్షరాలా నిజం ! ఒక కరీంనగర్‌లోనే

కాదు; బహుశః ప్రతిపట్టణంలో అలాంటి లేబర్ అడ్డా ఉండవచ్చు. పూణె నగరంలో అలాంటిది. ఒకటి ఉందని అనిల్ అవచట్ 'మాణసే'లో చెబుతాడు. చెప్పడమే కాదు బొమ్మకట్టిస్తాడు.

"పల్లె పొలిమేరలు దాటి
అడ్డమీద సరుకుగా మారన సందర్భం
అంగడిలో గొడ్డూగోదా అమ్ముడు పోయినట్లు
నిలువెత్తు మనిషి
తనకు తానే అమ్ముకుంటున్న దృశ్యం"

అపర భవభూతియైన అన్నవరం దేవేందర్‌కు కావ్య వస్తువైంది. పఠితలను ఆర్ద్రీభూత చేతస్కులను చేయగల శబ్ద చిత్రాన్ని ఎంతో నైపుణ్యంతో చేయగల శబ్ద చిత్రాన్ని ఆవిష్కరించాడు.

"సున్నం వేసే కుంచెలు
తట్ట, పార, గడ్డపారలతో
పల్లె తరుముతే
పక్షులన్నీ అడ్డామీద వాలేయి.
చేయి సంచిల సద్దిగిన్నె
జబ్బమీద తువ్వాల
ఇంకో చేతిల అతారెలు
ఎవరు పిలుస్తరా అని ఎదిరిచూపులు"

'వీళ్ళు' ఉస్నాద, ఎములాడ, సిరిసిల్ల, చినుకులు కురువని పల్లెలు ఎల్లగొడితే' అడ్డామీద కూలీలైనారు. మరి పూణె నగరంలో అడ్డాల మీద కూలీలు రైతులెందుకైనట్లు ? చినుకులు కురువకనే. వరుణదేవుడు కరుణించకనే.

తెలంగాణాలో అనావృష్టి ప్రాంతాలున్నట్టుగానే మరాఠ్వాడాలో సైతం అనేక ప్రాంతాలున్నాయి. అలాంటి ప్రాంతాలలో ఒక ప్రాంతం ఉస్మానాబాద్ వరుణదేవుని కటాక్ష వీక్షణానికి నోచుకోనని వసుంధర ఉస్మానాబాద్ వరుసగా మూడు నాలుగేండ్లు వానలే కురియవు. పిల్లలకు పట్టెడన్నం

పెట్టలేక ఇంటి పైకప్పుగా నిలిపిన ఇనుపరేకుల్ని, ఇత్తడి సామానుల్ని, చివరకు పూజా పేటికలోని దేవతామూర్తుల్ని అమ్ముకొని పూణె నగర పథగాములౌతారు సకుటుంబంగా పల్లీయులు.

1 పనిముట్లు

టికెట్టు కొనకుండానే రైలులో ప్రయాణం చేస్తూ టి.టి.ఐ. ద్వారా మధ్యమధ్యన దింపబడుతూ అవమానింపబడుతూ ఎట్టకేలకు పూణె నగరం చేరుకుంటారు.

– "వెధవా ! టికెట్టు కొనకుండా ప్రయాణిస్తున్నావ్. రైల్వే బోగి మీ అబ్బ జాగీరా ? ఆ మూటలో ఏముంది ?"

పల్లిగింజలు సాహెబ్

– "ఇలా ఇయ్యి"

– "ఆకలయితే తినడానికి పోరని కోసం ఉంచిన మారాజా ! తీసుకో కుండ్రి"

– టికెట్టు కొనవు, ముష్టి పల్లిగింజలు వదులుకోవడానికి ఇష్టపడవు బే !

వామనుని ముందు బలి మరొకసారి తలవంచాడు. సన్నకారు రైతుగా జీవించి, కరువు కారణంగా సర్వస్వాన్ని కోలుపోయి ఈ స్థితికి దిగజారిన మనిషి బ్రతుకును 'మాణసే'లో హృదయవిదారకంగా చిత్రించడు అనిల్ అవచట్.

భారతదేశంలో స్వచ్ఛతకు పేరొందిన పూణే రైల్వేస్టేషన్. పలు ప్రాంతాల నుండి వచ్చిన రైతు కుటుంబాలతో కిక్కిరిసిపోయింది. ఒకటే లొల్లి.

కంపుకొట్టే గుడ్డలతో కదులుతున్న మానవాకృతులు. ఆకలితో అంగలారుస్తున్న చీముడి ముక్కుల పోరగాండ్లు. వంట సామానుల మూటలు. మలమూత్రాల వైతరుణులైన పరిసరాలు వ్యాధులను మోసే ఈగలు. నిర్ణయంలో ఉంటున్నా ఏమీపట్టనట్లు ఒకరితో ఒకరు కేరడాలాడుతున్న పసివాళ్ళు 'కోకాకోలుగా' అని ఒకడంటే ఒరే ! మసాలా

వడ' అని రెండవవాడు. ధర్మదేవతను నాల్గు పాదాలపై నిలుపవలసిన రక్షకభటులకు దరిద్ర దామోదరులు సృష్టించిన ఈ మనోహర దృశ్యం సహ్యమౌతుందా? వీరి పీడవదలించుకోకుంటే 'పూణే స్టేషన్ ప్రతిష్ఠ' మట్టిలో కలుస్తుంది. లాఠీలు భుజంగాలలా బుసలు కొడుతాయి. నిమిషాల్లో అభం శుభం తెలువని జనులు స్టేషన్ ఖాళీచేసి అరుబయట కుయ్యో మొర్రో అంటూ గుంపులు గుంపులుగా అఘోరిస్తాయి. ఇంతలో వాన చినుకులు – ఎడతెరిపిలేకుండా ఓ అరగంట పాటువాన కురిసి వెలుస్తుంది.

"ఈ వాన మన ప్రాంతంలో కురిస్తే ఇట్లా వాకిలి వదలి ఇక్కడికి వచ్చేవాళ్ళమా ? ఓ రైతు స్త్రీ మరో స్త్రీతో వాపోతూ "ఎంత పుణ్యం చేసుకుంటే పూణె దర్శనమౌతుంది" స్పందిస్తుంది మరో కృషీవలగేహిని స్వీయ వ్యంగ్య వైభవాన్ని ప్రదర్శిస్తూ

కరువు కాటకాలకోరల్లో చిక్కుకున్న ఉస్మానాబాద్ జిల్లాలోని లాతూరుకు వెళ్ళాడు రచయిత అనిల్. అలాగే ఉద్గీర్‌కు. ఇంటి పైకప్పురేకుల్ని అమ్ముకుంటున్న రైతుల్ని అడిగాడు.

"మీరు ఊరువిడిచిపోతున్నారా ఏం ?"

"ఏం చేస్తాం – ఈ సంవత్సరం అన్నీ ఎలుక వానలు. పిల్లి వానలు అసలే పడలేదు."

"ఎలుక వానలా ? పిల్లివానలా ? ఆశ్చర్యంగా ఉంది !" సాహెబ్ !

"ఇందులో ఆశ్చర్యం ఏముంది ? ఎలుకవానలంటే చిదురుముదురు వానలు. వేసిన విత్తులు మొలుస్తాయి. పిల్లివానలంటే కుండపోతవాన. అది కురిస్తే కలుగులకు మూతపడి బయటికి రాలేక ఎలుకలు చస్తాయి. పడకుంటే వాటికి మాజారే మజా ! మొలుకలు యేసి బలిసి, పిల్లలు పెడుతూ విచ్చలవిడిగా అటూ ఇటూ పరుగెత్తుతాయి. మనుషుల్ని ఏమాత్రం ఖాతరు చేయవు. పైగా గేలిచేస్తాయి. మమ్మల్ని ఊరి నుండి వెళ్ళగొడుతాయి."

మూషిక వ్రాత దౌష్ట్యానికి అనికేతులై అకించనులై కన్నతల్లిలాంటి

పల్లె విడిచి పట్నపు బాటపట్టిన సన్నకారు రైతులు నగరంలో పలుచోట్ల అడ్డాల నేర్పరుస్తారు. భూమిహీనుల సంగతి మరో ఘోరం. వాళ్ళ దగ్గర ఎలాంటి పనిముట్లు ఉండవు. చెత్తకాగితాల్ని, ప్లాస్టిక్ బ్యాగుల్ని, సీసాల్ని పోగుచేస్తూ ఎవడైనా నగరంలో కనిపించాడా వాడు సెంటు భూమిలేని కూలీయే.

పెరిగిన గడ్డం, చిరిగిన ధోవతితో ఒకనాడు ఓ మనిషి అనిల్‌కు తటస్థపడ్డాడు. అనిల్‌ను చూస్తూనే ఒళ్ళంతా కళ్లు చేసుకొని అన్నాడు. "సాహెబ్ ! ఏమైనా పనిదొరుకుద్దా ?" ఈలోగా అక్కడ పది మంది పోగయ్యారు. "నేను ఎంత తక్కువిచ్చినా వస్తాను." మరొకడు. "మా ఇంట్లో నేను, నా పెళ్ళాం, మా ఇద్దరు పిల్లలు పస్తులుంటున్నాము. ఏ పనైనా ఇప్పించండి. పొలంలో పనా ? ఏదైనా సుతారికింద పనిచేయాలా ?" – మూడో మనిషి.

''ఈయన పని ఇప్పించడానికి రాలేదు. మీ స్థితిగతులు తెలుసుకొనడానికి వచ్చాడు." అనిల్ వెంటవున్న, స్నేహితుడు అనడంతో మీరు బాధగా నిట్టూర్చారు.

ఇది చదువుతుంటే అన్నవరం దేవేందర్ కవిత 'మంకమ్మతోట లేబరు అడ్డా' గుర్తుకు రావటం లేదు.

"పనికి తీసి కోంబ్రి సారూ...
కూలి తక్కువిచ్చినా వస్తం.
ఎదన్న పని.. కావాలె.. అయ్యా పని.
గోస గోస మాటలు
గోవుల్లాంటి మాటలు
ఎవలు పిలుస్తరా ! అని ఎదురుచూపులు
కంకరకొడుతురు కందకాలు తీస్తరు
భవంతులు కడుతరు బండలేస్తరు
గోడలు కడుతరు రాళ్ళు మోస్తరు
అరొక్క పని అవలీలగ చేస్తరు."

అరొక్క పనిచేస్తే వీరి బ్రతుకు భాద్రపదంలోని అమావాస్య రేయి స్వేచ్ఛా సూర్యుడు వీరికై నేటికీ ఉదయించలేదు. నేటి నేరగాళ్ళ బేరగాళ్ళ ప్రజాస్వామ్య స్వరూపం మారనంత వరకు వీరు మనుషుల్లా బ్రతికే అవకాశం మృగ్యం.

హరేక్ – హిందీ = ప్రతిపని

సత్తాంతరం ఈనాడు ఎంతైనా అవసరం. 'సత్తా' అనేది కలవారి చేతుల్లో నుండి శ్రామికవర్గాల చేతుల్లోకి మారాలి. స్వర్ణాంధ్ర ప్రదేశులు

'హరితాంధ్ర ప్రదేశులు' అంఘ్రి సానులను మురిపించే మృషా నినాదాలు. జూకంటి జగన్నాథం నుడివినట్లు 'దేశంలో ముఖ్యంగా తెలుగులో రానున్న కాలమంతా బహుజన సాహితీకారులదే. ఈ బహుజన సాహితీకారులే సత్తాంతకారులదే. ఈ బహుజన సాహితీకారులే సత్తాంతరానికి వలసిన జనచైతన్యాన్ని సాంద్రతరం చేస్తారు. బహుజనులను దేశానికి ఏలకలను చేస్తారు. అప్పుడే శ్రీశ్రీ మాటల్లో చెప్పాలంటే –

స్వాతంత్ర్యం సమభావం
సౌభ్రాత్రం సౌహార్ధం
పునాదులై ఇళ్ళులేచి
జనావళికి శుభం పూచి
శాంతి శాంతి శాంతి శాంతి
జగమంతా జయిస్తుంది.

-గజానన్ తామన్

తెలుగు సాహిత్య ఎర్రమందారం : 'ఆమ్రపర్ణి'

ఆమ్రపర్ణి మహాకావ్యం అవధులెరుగని నభఃసదృశమైనది. దీని సమ్యగవలోకనం ఓ చిన్న వ్యాసంలో సాధ్యమయ్యేదికాదు. వారసత్వంగా వచ్చిన 'మకుటాన్ని' పరిత్యజించి, ఎల్లవేళలా ఉపేక్షితప్రజాపక్షం వహించి, గడిచిన అరువదేండ్లలో పలు కాలాలపాటు మనగల కావ్యం తరువాత కావ్యాన్ని తెలుగులోకానికి ఉపాయనంగా అనుగ్రహించిన సాహితీ చక్రవర్తి డా॥ ఆవంత్స సోమసుందర్ గారు. ఆయన లేఖిని నుండి జాలువారిన అపురూప కళాకృతి ఆమ్రపర్ణి.

కావ్యనిర్మాణం పురుషకారం వల్ల సిద్ధించేదికాదు. అనాకలనీయ రహస్సు నుండి అందే ప్రేరణకు ఫలితం. కావ్యనిర్మాణాధీనమానసాన్ని (Mind engaged in the act of creation) శాస్త్రీయంగా ఇంతవరకు వివేచించినవారులేరు. అందుకే ప్రాచీన గ్రీకులు A poet or a prophet says things when he is beside himself కవిని, ప్రేషితుణ్ణి ప్రేరణా మాధ్యమాలుగా చూశారు. కావ్యం పుట్టదు. ఏదో ఒక బ్రాహ్మీమయ ముహూర్తంలో అవతరిస్తుందన్న యథాతథ్యాన్ని హేతువాదియైన డా॥ సోమసుందర్ సైతం నిరాకరించలేదు. నిరంతర కవికాగల సౌభాగ్యం ఏ కొద్దిమందినో వరిస్తుంది. మధ్యాంతర కవులైనవారే ఏ దేశంలోనైనా లెక్కకు మించినవారు. మహాకావ్య లేక దీర్ఘకావ్య సృజన ఏక దివసీయవ్యవహారం కాదు.

డా॥ సోమసుందర్ గారి తొలి కావ్యం వజ్రాయుధం. అది 1948లో ప్రచురితమైంది. ఆ తరువాత అనేక కావ్యాల్ని తెలుగులోకానికి అందించారు. ఈ కావ్యాలలో విశేషంగా పేర్కొనదగింది అమ్రపర్ణి. మహాకవి శ్రీశ్రీ మహాప్రస్థానంలాగే ఈ కావ్యం అజరామరంగా నిలుస్తుంది. అందుకు కారణం, ఆయన ఎన్నుకొన్న ఇతివృత్తం. ఎలియట్ చెప్పినట్లు సీతాకోకచిలుక మీద అందమైన కావ్యం వ్రాయవచ్చు. మహాకావ్యరచన సాధ్యపడనిది. మానవాస్తిత్వానికి ఆధారధాతువులైన వాటిని స్పర్శించే

ప్రయత్నం ఈ కావ్యంలో జరిగినదనుట చేతోమోదమైన వివాదానికి ఆహ్వానం కాదనుకుంటాను.

ఈ కావ్యానికి ఆమ్రపర్ణి అని నామకరణం చేయటం ఎందుకు జరిగింది? “ఆమ్రపర్ణిః అభిప్రాయ వేదికలో” ఈ పదబంధంపై ఎన్నో స్పష్టీకరణాలూ, భాష్యాలూ కదిలాయి. అందులో ఏ ఒకటి సంతృప్తిని కలిగించేదిగాలేదు. ఆమ్రపర్ణి అనే పదబంధం సంభావనా పూర్వపద కర్మధారయసమాసం. పర్ణి అంటే పర్ణములు కలది. పర్ణములు కలది వృక్షం, ఫణివంటి పదమే పర్ణి, బౌద్ధానికి దీనికి గల సంబంధాన్ని కాదనలేము. అయితే బౌద్ధంతోనే దీని సంబంధాన్ని పరిమితం చేయలేము. భారతీయ సంస్కృతిలో న్యగ్రోధం, అశ్వత్థంలాగే అతిపవిత్రంగా చూడబడే వృక్షం ఆమ్రపర్ణి. మామిడికి మధుదూతం అనే పర్యాయపదం సంస్కృతంలో వుంది. వసంతాగమనాన్ని మామిడి వృక్షం కిసలయపుష్పధారణతో సూచిస్తుంది. మానవజీవనం శిశిరగ్రస్తమై, శీర్ణమైన వేళ, ఆశావాదియైన కవి తలపుల్లో మెదలేది మధుఋతువు. దాని ఆగమనానికై తహతహలాడే ఆశావాది మనస్సుకు దర్పణం ఆమ్రపర్ణికావ్యం.

ఏ కావ్యాన్నైనా అనుశీలించే ముందు అది ఏ సాహిత్యవిధకు Genre చెందింది. అనేదాన్ని పరిగణనలోనికి తీసుకోవాల్సి వుంటుంది. డా॥ నారాయణరెడ్డిగారి ‘విశ్వంభర’, డా॥ సోమసుందర్‌గారి ‘ఆమ్రపర్ణి’ రెండూ మహాకావ్యాలే. రెడ్డిగారిది The Epic అనే పాశ్చాత్య సాహిత్య ప్రక్రియకు దగ్గరది. దానిలో లీలగానైనా కథాసూత్రం వుంది. మానవీయ పరిమితుల్ని అధిగమించి మహామానవుడయ్యే దిశలో కథనాయకుడైన మానవుని ప్రస్థానం ఇందులో అభివర్ణితం. ఆమ్రపర్ణిలో కథాసూత్రం ఛాయామాత్రంగానైనా లేదు. నాయక ప్రతినాయకులు లేరు The Epic లో అనివార్యమైన సమర ప్రసంగంలేదు. అవ్యవస్థ నుండి సువ్యవస్థవైపు మానవజాతి ప్రస్థానం చేయాల్సిన అవసరాన్ని నిర్ద్వంద్వంగా సూచించడం జరిగింది. ఈ ప్రస్థానానికి ప్రేరణ తథాగతుడే ఈయ గల్గుతాడన్నది కవి విశ్వాసం. ఇదివరకు మనవిచేసినట్లు ఈ కావ్యం ఒక మనోజ్ఞమనోయాత్ర.

ప్రస్తుత వ్యాసం సమగ్రానుశీలనం కాదు. ఆ దిశలో ఒక అల్ప ప్రయత్నం మాత్రమే. స్థలాభావం యిక్కడ పెద్ద అవరోధంకాదు. కావ్యానికి గల అన్ని పార్శ్వములను స్పర్శించే సామర్థ్యాభావమే అసలైన అవరోధం. ఆమ్రపర్ణిపై కదలిన అభిప్రాయాల్లో దీన్ని సైతం ఓ అభిప్రాయంగా పరిగణించడానికి చివరికీ ఏ అభ్యంతరం వుండకూడదు. సభ్యసమాజంలో అభిప్రాయాభివ్యక్తి ఒక ఔపచారికత (Formality). విషయదూరమైన స్వీయవైదుష్యాన్ని చాటుకొనడానికి ఆర్జిత వతిష్ఠులైన విమర్శకులకు, నావంటి హరితశృంగులకు (Green horns) రచయితలు కల్పించే స్వర్ణావకాశం.

ఆమ్రపర్ణి ఆంతర్యాన్ని పట్టుకొనడానికి సహపాఠంగా Co-text టి.ఎస్.ఎలియట్ 'వేస్ట్‌లాండ్' ఉపయుక్తంగా వుంటుందని నా అభిమతం. ఎలియట్‌లాగానే సోమసుందర్ కవితకు సహజమైన ఔపమిక Metaphoric మాధ్యమాన్ని పరిత్యజించి ప్రతీకాత్మక Symbolic మాధ్యమాన్ని ఎన్నుకున్నాడు. నానాటికి జటిలమూ సంక్లిష్టము అవుతున్న అధునాతన మానవజీవనశైలిని అభివర్ణించడానికి ఉపమానం ఆదిగా గల అర్థాలంకారాలు చాలవు. ఉపమేయాన్ని ఉపమానానికి మధ్య ఏకాన్యైక సంబంధం One for one realtionship మాత్రమే వుంటుంది. అందుకే బహ్వర్థ ప్రతిపాదకాలైన ప్రతీకలు నేటి సంకీర్ణజీవనశైలిని వర్ణించడానికి అవసరమవుతవి.

రెండు మహాయుద్ధాల మూలంగా యూరప్ పెద్ద ఎత్తున విధ్వంసాన్ని చవిచూసింది. రుధిర ప్లావితమైంది. తరతరాలుగా జాతికి ఆధారభూతాలైన జీవన మూల్యాలను చేజార్చుకుని జాంతవస్థితికి దిగజారింది. అఆర్టే–వై–గాసెట్ నుడివినట్లు, ఆత్మావలోకనక్షమతను Introspection కోల్పోయింది. అనిశ్చితి, అభద్రతాభావన నానాటికి సాంద్రం కాగా వానర స్థితికి తిరోగమించింది. జీవనపరిధి నుండి దైవాన్ని నిష్కాసితం చేసింది. యూరప్ తిరిగి జన్మించి పూర్వవైభవాన్ని సంపాదించాలంటే సంప్రదాయంలో త్రికాలాబాధితంగా మిగిలిన మూల్యాలను ఆత్మగతం చేసుకొనాలి.

ఎలియట్ మహాకావ్యం Exploration వేస్ట్‌లాండ్‌లో 'మరుభూమి 'జలం' కేంద్ర స్థానీయంగా వున్న రెండు ప్రతీకలు, జలస్రోతస్సు లింకిపోయిన మరుభూమి యూరప్. జలం ఎక్కడ వెదికినా కానరాదు. నిరంతరం జలాభాసవుంది. దీన్ని Drip-drop sound of a cicada గా ఎలియట్ అభివర్ణిస్తాడు. Wate Land ప్రథమ భాగంలోనే మనకు దర్శనమిచ్చే పంక్తులు.

"Come ! Let us Stand under the shadow of this redrock I'll show you death in a handful of dust"

దాదాపు ఈ భావం గల పంక్తులే ఆమ్రపర్ణిలో మన దృష్టిని ఆకట్టుకొంటాయి.

ఈ తీరంలో గుప్పెడు ఇసుకతీసుక పరిశీలించు
ఎన్ని హత్యలు ? దారుణాలు ?
మానభంగాలు దర్శనమిస్తాయో,
ఎన్ని నరమేధాలు విషాద గాథలు వినిపిస్తాయో

వేస్ట్‌లాండ్‌లో 'జలం' 'మరుభూమి'లాగే ఆమ్రపర్ణి కావ్యంలో మామిడిచెట్టు ఒక ప్రతీక. పూర్వ ప్రాభవాన్ని కోల్పోయి దారిద్ర్యంతో, మతమౌఢ్యంతో, అంతఃకలహాలతో దిశాహీన నేతృత్వంతో అస్తవ్యస్తమైన జాతికి ఆశావహసంకేతంగా మలచబడిన కావ్యం ఆమ్రపర్ణి. ఒక వర్గానికి కాక సమస్త జీవజగతికి శుభోదర్కప్రతీకగా కావ్యంలో సాక్షాత్కరించే మహావృక్షం ఆమ్రపర్ణి.

చైతన్యం, విప్లవం, సమైక్యం జీవనధర్మాలైన కవి విచలితుడూ, పథచ్యుతుడూ కాజాలడు. కాజీ నజురుల్ ఇస్లాం చెప్పినట్లు కవి నిరంతరం 'బిప్లబేర్ పథగామి'.

ఆగామి (సోమసుందర్‌కు ప్రియంకరమైన పదం) కవి దృష్టిలో మహోజ్వలమవుతుంది. నేడు చరిత్రహీనులైనవారు రేపటి చరిత్రను సృష్టించే వారవుతారు. వడలి మందేశ్వరావు ఆమ్రపర్ణిని ఆశలు చిగురించే కావ్యంగా సంభావించినాడు. ఆయనతో మనం ఏకీభవించకుండా వుండలేము.

సమసమాజ నిర్మితికి మార్క్స్ ప్రతిపాదించిన సిద్ధాంతం అపరిహార్యమని నమ్మేకోవకు చెందిన సోమసుందర్‌కు కావ్యాంతాన తథాగతుని స్మరణ ఎందుకు కలిగింది ? ఇప్పటి పరిస్థితిలో తథాగతుని పునరాగమనం ఏ వెలితిని పూరిస్తుంది ?

స్థూల దృష్టితో చూస్తే మనల్ని సంభ్రమంలో పడవేసే వైరుధ్యం కావ్యంలో కానవస్తుంది. సూక్ష్మేక్షికతో పరిశీలిస్తే సోమసుందరుని దర్శనంలో ఏ వైరుధ్యం చోటుచేసుకొనలేదు. అన్వేషణ వేస్ట్‌లాండుకు ఇతివృత్తమైతే, నిరీక్షణ సోమసుందర్ గారి ఆమ్రపర్ణికి ఇతివృత్తం. ఈ రెండు మహాకావ్యాలు కథాకథనం చేసే కావ్యాలు కావు. మజిలీల వారిగా సాగే సుదీర్ఘ మనోయాత్రలు. ఆమ్రపర్ణిలో మనోయాత్రకు ఏబదియారు మజిలీలు వున్నాయి. కావ్యారంభంలో కవి ఇలా ప్రశ్నిస్తాడు లేదా తన్ను తానే ప్రశ్నించుకుంటాడు. 'ఇంత కటికచీకటిలో తెల్లవార్లు నిలిచి దేనికోసం నిరీక్షిస్తున్నావూ ?'

ఈ కటిక చీకటి భయావహమైంది. ముఖ్యంగా రెండు భయంకర యుద్ధాల నడుమ, మహక్షామాల నడుమ, జీవించిన నిరుటి తరానికి, ఆ తరానికి చెందిన కవికి హీరోలు నిష్క్రమించగా రంగస్థలం శూన్యమై వెలవెలబోతున్నది. నిరుటి ఆశయాలు, త్యాగాలు, రాగోజ్వలభవితను వర్తమానతరానికి అందించలేకపోయాయి. కలల అవశేషాలకోసం అన్వేషణ అందరితోపాటు కవియైన తానూ సాగిస్తున్నాడు.

ఏ ఒక్క విప్లవం మానవసమాజ రూపురేఖల్ని తీర్చిదిద్దలేదు. ఈ వాస్తవం ఎరిగిన కవి నైరాస్యపు గుడారాలను ఆశ్రయించడు.

భారతీయ దృష్టిని వ్యష్టి నుండి సమష్టి వైపు మరల్చిన ప్రథమ పుణ్యశ్లోకుడు సిద్ధార్థ గౌతముడు. మార్క్స్ ప్రయత్నం అదే. అయితే మార్క్స్ తన దర్శనాన్ని సమ్యగ్దర్శనంగా చెప్పుకొనలేదు. 'జాంతవవేదన నుండి మానవుణ్ణి విముక్తుణ్ణి చేయగల ఉపాయాన్ని కనిపెట్టెను. అతణ్ణి ఆత్మికవేదన Spiritual Suffering నుండి తప్పించే ఉపాయం నావద్ద లేదు'. ఓ సందర్భంలో మార్క్స్ అన్నమాటలివి.

భారతీయులది ఆత్మరతప్రవృత్తి. దేశం విషమ పరిస్థితుల్లో చిక్కుకొన్నా, విదేశీయుల దాడులతో జనజీవనం అతలాకుతలమవుతున్నా, ఈతి బాధాగ్రస్తమైనా, మనుగడ ప్రశ్నార్థకమైనా సామూహికంగా స్పందించటం ఎరుగదు. తన్నివారణార్థం ఉద్యమించిన ఘటనలు బహు అరుదు. తథాగతుని నుంచి ప్రేరణ పొందిననాడే భారతీయుల దృష్టి సమాజాభిముఖం అవుతుంది.

కటికచీకటి క్రమ్మిన వేళ, మానవసమాజం గత వైభవాన్ని స్మరించు కొంటుంది. పథ నిర్దేశం చేసిన మహనీయులను స్మరించుకొంటుంది. యుగ ప్రతినిధులైన కవులు Ubi suntmotif గల 'ఏవి తల్లీ ! నిరుడు కురిసిన హిమ సమూహములు వంటి' గీతాలను ఆలపిస్తారు. నవ్యపంథాలో పయనించేందుకు మరో తరహా గీతం గాని కావ్యం గాని అవసరం. ఆమ్రపర్ణి కొంతవరకు ఈ అవసరాన్ని తీరుస్తుంది.

'ఆనంద హిమానీ గీతాలు పాడుకుందుకే మా ఆరాటాలు, మా అక్రోశాలు మా నిరీక్షలు.

సోమసుందర్‌గారి ఆమ్రపర్ణి జాతికి నారాశంసి గాక మరేమిటి?

-గజానన్ తామన్

నవ్యాతి నవ్యం... గోపికా వల్లభా కావ్యం

తెలుగు సాహిత్య క్షేత్రాన్ని అనిదం పూర్వమైన స్తబ్దత ఆవహించినవేళ, ఇటీవల వెలువడిన కావ్యాల్లో (వచన కావ్యాలు కావు) ఆచార్య లక్ష్మణమూర్తిగారి 'గోపికావల్లభా!' అనే శతకం ప్రత్యేకంగా ఉల్లేఖింప దగినది. ఉత్తమ సాహిత్యాన్ని అభిమానించే లేక ఆస్వాదించే పఠితలకు ఈ కావ్యం రసగంగావగాహానికి సుదీర్ఘ ప్రతీక్షానంతరం అందివచ్చిన సదవకాశం.

'ఆత్మాశ్రయ' కవిత్వం అందునా భక్తి కవిత్వం కాలబాహ్యామైనదని భావించే విజ్ఞులకు దీని ఆగమనం అసామయికంగా ప్రతిభాసించే ప్రమాదమైంది. 'ఆత్మాశ్రయత్వం' 'వస్త్వాశ్రయత్వం' అనే ఈ రెండు పదబంధాలు తెలుగు సాహిత్య విమర్శలో తరచుగా తారసిల్లే మృషా పారిభాషికాలు. గుంటూరు శేషేంద్రశర్మగారు ఈ పారిభాషికాల్ని నిరుపయుక్తమైనవిగా తోసిపుచ్చారు. ఆయన నుడివినట్లు 'మఠాధిపతులూ మూఢభక్తులూ మంచి కవిత్వం మీద ఎత్తే మరో ఆయుధం – అదే ! అది 'ఆత్మాశ్రయ కవిత్వం'.

వీటిలో ఏ ఒకటి కృతిశ్రేష్ఠతను నిర్ధారించేందుకు సర్వమాన్యమైన నికషం కాజాలదు. శ్రేష్ఠత అనేది కవి ప్రతిభా వ్యుత్పత్తులకు సంబంధించినది. వస్తువునకు సంబంధించినది కాదని చెప్పే అవసరం ఏమాత్రం లేదు. తెలుగు జనజీవనాన్ని ప్రభావితం చేసి ఏ తత్సంస్కృతీ విశేషంగా నిలిచిన 'శతకం' ఒక సాహిత్య ప్రక్రియగా అత్యంత ప్రాచీనమైన చరిత్ర కలది. ఈ ప్రక్రియకు ఆరంభ బిందు వెక్కడినుంచో తెలియదు. శతకకారులలో ప్రథమ స్మరణీయుడు వేమన. వేమన శతకంతోపాటు సుమతి శతకంలోని పద్యాలను కొన్నింటినైనా కంఠస్థం కావించని తెలుగువాడు దుర్లభాతి దుర్లభుడనే చెప్పుకోవాలి.

కన్ఫ్యూషన్ వ్రాతలు చైనీయుల నైతికతను (ethos) ఎలా ప్రభావితం చేశాయో శతక వాఙ్మయం తెలుగువారి నైతికతను అలా ప్రభావితం చేసింది. అయినవాడు సమాజంలో సాటివారితో ఎలా వ్యవహరించాలో

ప్రవచించాయి. విధినిషేధాల్ని అప్రత్యక్ష సంహితగా అందించి, జీవనశైలిని మెరుగుపరచుకునేందుకు దోహదపడ్డాయి. అధిక్షేపాత్మక స్ఫూర్తిని కలిగినవైనా శతక కావ్యాలు వ్యక్తిమనోరాగానికి (sentiment) క్షతి కలిగించనివిధంగా సమాజ స్వాస్థ్యానాకి అవసరమైన రీతుల్ని, సంకేతాల్ని నిర్వచించాయి. ఐహిక జీవన సార్థక్యానికి పరిమితమైన ఈ శతకాలు 'నీతి శతకాలు'గా సంజ్ఞితమైనవి. ఇవి వ్యక్తిని షట్ప్రజ్ఞుని చేసే ఉదాత్తమైన ఆశయం కలవి. నీతి శతకాలతో పాటు భక్తి శతకాలు అశేష జనహృదయ నికటస్థమైనవి. లెక్కకుమించిన శతకాలు అతీతంలో వెలువడినవి. వర్తమానంలో సైతం వీటి పరంపర ఖండితమైనట్లు తోచదు. పైగా పూర్వంకన్న, ఈ కోవకు చెందిన శతకాలు చారుతర శబ్దభావ వైభవంతో చిక్కణమై పఠితల హృదయాలకు పర్వప్రాయమగుచున్నవి.

ఆచార్య లక్ష్మణమూర్తి 'గోపికావల్లభా' ఇతఃపూర్వం వెలువడిన శతకాలకు ప్రతిధ్వని కాని నిష్ప్రాణానుకరణ కానికాదు. భావంలో సంయోజనలో నవ్యాతి నవ్యతను ప్రదర్శించే మహాకృతి. గహన తాత్త్విక వైలక్షణ్యం కలది. ధూళిపాక మహాదేవిగారి మాటల్లో చెప్పాలంటే ఈ కావ్యం 'మేధా జనితం' అందుకే 'సద్యోరస నిర్భరం' కాదు. ఆంగ్లగీర్వాణ భాషల్లో కవి అమేయ వైదుష్యాన్ని ఆర్జించుకొన్న సుకృతి. అందుకే తెలుగు శతక రూపంలో 'కవితామృద్వీక నైవేద్యాన్ని' గోపికా వల్లభునకు అర్పించుకొని ధన్యజీవనుడైనాడు. 'సమాప్తి కామో మంగలమాచరేత్' అనే శిష్టాచారాన్ని పాటిస్తూ కావ్యారంభంలో 'ఆముక్తమాలా కైంకర్య చిత్తుడైన' గోపాల దేవునితోపాటు సంస్కృత వచశ్రీ ప్రక్రియను నేర్పిన పుణ్యశ్లోకుడైన స్వీయజనకుని అనూన భక్తిభావంతో సంస్మరించుకొనినాడు. ఈ కావ్యంలోని క్లిష్టత శబ్ద సంబంధమైనది. నిఘంటు సహాయంతో రసాస్వాదనకు అల్పావరోధమైన దీన్ని అధిగమించవచ్చు. ఇటీవలి కొన్ని కవితల్లో కానవచ్చే, 'ఉచ్చభ్రూ'లకు తప్ప సామాన్యులకు అవబోధం కాని అయోమయత్వం ఈ కావ్యంలో మచ్చుకైనా లేదు.

సామాజిక స్పృహను ప్రతిబింబించని ఈ కావ్యం వల్ల ప్రయోజనం

ఏమిటని ప్రశ్నించేవారికి నా సమాధానం ఇది – భారతీయుల దృష్టిలో ఐహిక జీవనం జీవుని మహాప్రస్థానంలో ఒక మజిలీ మాత్రమే. మృత్యూపరాంత స్థితి అనేది వున్నదని వారి ప్రగాఢ విశ్వాసం. కర్మవాగుర బద్ధుడు (ఇష్టాపూర్తములకు చెందిన కర్మయైనా) స్వర్గగతుడైనా పుణ్యాంతాన తిర్యగ్యోని సంభవనిగానో, స్థాణువుగానో తిరిగి జన్మిస్తాడని భాగవతం చెపుతున్నది. కర్మరాహిత్యం వల్ల జీవుడు బ్రహ్మైక్యాన్ని పొందుతాడని కూడా ఉద్ఘోషిస్తున్నది. తపాది కఠోర చర్యల వల్ల భవబంధ విమోచనం సాధ్యమే అయినా, అవి క్లేశ కారకాలు. సులభమైన మార్గమే భక్తిమార్గమని కవి ఆర్ష ప్రతిపాదితాన్ని అంగీకరిస్తూనే పూజావృత క్రతూపాసనలు అంతగా ఫలప్రదాలు కావన్న మనోభావాన్ని వెలిబుచ్చుతాడు.

"వ్రతముల్ పూజలు పాసనల్ క్రతువిధుల్ పారాయణంబుల్
దృత తంత్ర క్రియలెల్ల నీ పదయుగీన వీక్షార్థ యత్నంబులే
కృత పుణ్యంబున నప్రయత్నముగ తండ్రీ ! గోపికా వల్లభా"

భగవంతుని చేరుకొనటానికి 'ఈ సమాదృత తంత్రక్రియలు' కాక భక్తిమార్గమే మార్గమని ఆళ్వారులు – ఆ తరువాత దేశంలోని ఇతర ప్రాంతాలకు చెందిన జ్ఞానేశ్వరుడు, తుకారాం చైతన్యుడు తులసీదాసు ప్రబోధించారు. భక్త్యుద్యమం భారతీయ ఇతిహాసంలో శాంతి పథాన నడిచిన గొప్ప సామాజిక విప్లవం. ఈ విప్లవం ఉత్తమ సాహిత్య సర్జనకు ఉత్ప్రేరకంగా నిలిచింది.

లక్ష్మణమూర్తిగారి 'గోపికా వల్లభా !' శతకం స్తోత్రపరమైన కావ్యం. స్తోత్రమంటే దేవతా స్వరూపాన్ని, గుణాల్ని, చరితాన్ని స్తుతించడం. గోపాలకృష్ణుడు కవికి ఆరాధ్య దైవం. ఆయన జితమన్మథుడు. అతనిని కవి 'శిఖిపింఛాబీరసలీల చికుర శ్రీ కల్పితాషాడు'నిగా, 'వ్రజ వధూ మయూరస ప్రేమ సంభ్రమ వీక్షాదృత ప్రావృషేణ్య జలదస్వామి'గా 'అతసీపల్లవ కోపలాపఘనుని'గా అభివర్ణించాడు. మరి గుణాలమాటేమిటి ? 'సర్వజగతీ ప్రాణ ప్రతిష్ఠా క్రియావన దీక్షా పరతంత్రు'డాయన. 'నమతాంశరణ్యుడు'. అన్నిటిని మించి 'భక్తసందోహ బాంధవుడు'. ఇది

కథాకావ్యం కాదు కనుక కావ్య నాయకుని చరితాన్ని 'కాళియాహి దమనా!' 'సంత్రాసిత నిర్జరా !' 'వినమితంద్రా!' 'చక్ర విక్ర మితనక్రా!' 'పృధాకువ్రాత్య గర్వాపహరణా !' వంటి సంబుద్ధులతో రేఖామాత్రంగానే ఐనా మనోమోహకమైన రీతిలో వ్యంజింపచేసినాడు. సంస్కృత గద్య కావ్య నిర్మాతలైన అంటే దండీ బాణ సుబంధు త్రయాన్ని తలపించే వాగ్వైభవం ఈ కావ్యంలో పదేపదే సాక్షాత్కరిస్తుంది. పఠితలకు సులభగ్రాహ్యం కాని శబ్దాటోపం ఎందుకని ఎవరైనా చైతన్యాన్ని' ముగ్ధ బోధపద బంధాలతో రూపు కట్టించడం సాధ్యమా ? వస్తువునకు అనురూపమైన శిల్పం అవసరమేకదా ! కవితా సందర్భంలో శిల్పం అంటే అర్థ గౌరవంతోపాటు నాదమాధుర్యం గల శబ్ద సంయోజనమే.

నేడు భారతీయ జనజీవనం వస్తు సముపార్జనమే ధ్యేయమైన అర్థవాదం వల్ల కకావికలైనది. వైషమ్యం పెరిగి హింసా ప్రవృత్తికి దారితీసింది. సైమితం మృగ్యమైంది. ఆతతాయిత్వానికి ప్రేరకమైన ఉన్మాదం దావానంలా ప్రబలి మనిషి అస్తిత్వాన్నే ప్రశ్నార్థకం చేసింది. ఉపనిషత్తులు ఉద్ఘోషించే 'తేన త్యక్తేన భుంజీథాః వంటి త్రికాలాబాధిత మూల్యాలు విస్మృతమైనవి. దేశ చరిత్రలో ఉద్వేజితాధ్యాయ మనదగిన దీనికి కవి స్పందనను గమనించండి.

"ప్రతివాడీ ధర సర్వమున్ దనిదిగా భావించు, తద్భావనా
గతి భోగార్థమే జీవితమ్మనుకొనున్, కాలాహి దంష్ట్రాంతర
స్థిత భేకోమంచు నేరుడు కదా !"

'భయమే జీవిత బద్ధశత్రువది' అనే పద్యం యావచ్ఛతకానికి మకుటాయమానం.

స్వేచ్ఛ అనేది అధరసేవ (Lin Service) కే పరిమితమైన శబ్దాల్లో ఒకటి. వాస్తవానికి స్వేచ్ఛా స్థితిని ఏ వ్యక్తి కోరుకొనడు. ఏతత్ స్థితి ఎదగడానికి ఈషత్ప్రయత్నమైనా చేయడు. ఎందుకని ? స్వేచ్ఛాస్థితిలో ఎవరి ఆలంబన లేకుండా ఏ కృత్రిమ ఆధారాల్ని ఆశ్రయించకుండా స్వీయ సామర్థ్యం మీద వ్యక్తి జీవించాల్సి ఉంటుంది. అందుకే స్వేచ్ఛ వ్యక్తికి అభద్రతా భావాన్ని కల్గిస్తుంది. ఈ భయం వస్తు సంచయమే శ్రేయప్రదమన్న

భ్రాంతిని కల్గించి వ్యక్తిని స్వసృష్టదాస్య స్థితిలోకి దించుతుంది. మానవ చరిత్రలో స్వేచ్ఛ ఈప్సితార్థయే కాని ఆర్జితార్థం కాదు. హేతువాదం చరమ సత్యాన్ని దర్శించే మార్గాన్ని సూచించదు. పరిమితమైంది మానవ ప్రకృతి. ప్రకృతి జన్యమైన హేతువాదం పరిమితమైనదే ! ఎన్ని యత్నాలు చేసినా సర్వజ్ఞతా స్థితిని మానవుడు అందుకోజాలడు. కవి ఇలా ప్రశ్నిస్తాడు.

"కలడే నీ కనిపింపడేమని మహా గర్వాన...
సర్వజ్ఞతా
బిలమున్ దూరు మనుష్య మూషకమనో
విజ్ఞానమేపాటి ?

'కనిపించే' దానిలోనే కలడన్న సత్యాన్ని గర్వాంధులు గమనించలేరు. నాట్యం నుంచి నటుని వేరొనరించి చూడగలమా ?

ఈ శతక మంజూషలో ఏకాధిక శతరత్నాలున్నవి. పన్నెండు పద్యాలు శార్దూల విక్రీడితాలు. మిగతావి మత్తేభాలు. శార్దూలాల గమనంలో నయనమనోనందకరమైన ఠీవి వుంది. మావటికి (సమర్థుడు కనుక) ఏలాటి క్లేశాన్ని కలిగించని రీతిలో లయాత్మకంగా మత్తేభాలు నడక సాగించినవి. మా కావ్యంలోని 'బహువ్రీహి' అలుక్స మీసాల హోరును ఎదురొడ్డి నిలదొక్కుకో గలిగితే రసయాత్ర గమ్యాన్ని అవలీలగా చేరుకొని పఠితకు అవిస్మరణీయానందానుభూతిని మిగుల్చుతుంది.

'నిను వర్ణించెడు వేళ మానసము చాంద్రీశీత
సంస్పర్శమ
బ్బినయట్లై, సుమకోమలంబయి సుధావీచి
విగాహంబుపొం
దినయట్లై, తలమీద మోయు బరువున్
దింపన్ ప్రయాసంబుతో
రినయట్లై బ్రదుకెల్ల దెప్పితిలె
తండ్రీ ! గోపికావల్లభా !"

-గజానన్ తామన్

త్వమేవాఽ హం

అన్యభాషలమాటేమిటో గాని తెలుగులో 'ఆచంద్ర దివాకరౌ' గా శాశ్వతత్వాన్ని ఆర్జించి ఏ యుగానికైనా చెందిన పఠితలను అలరించగల శతక సాహిత్యముంది. దాన్ని మరింత సమృద్ధం చేస్తూ ఇటీవల వెలువడిన కృతి 'నీవు' అనునది మద్విద్వన్మిత్రులు డా॥ గంధ్ర లక్ష్మణరావు గారిది. ఇలా అని నేను అత్యుక్తి దోషానికి పాలుపడటం లేదు. వీరు తెలుగు సాహిత్యాన్ని ఆసాంతంగా ఉపాసితం కావించిన ధన్యజీవి. నీరక్షీర వివేకం గల సద్విమర్శకులు. జగమెరిగిన బ్రాహ్మణులు. తెలుగు సాహిత్యం 'నానీమయ'మైన ఇటీవలి మసక మసక చీకటిలో వేయి వెలుగులు పంచే ఇలాంటి కమనీయ కావ్యం వెలువడుట తెలుగు వారి భాగ్యవిశేషమని తలుస్తాను.

శతకమంటే నూరు పద్యాలు గల కావ్యమని మల్లినాథీయం చేసే అవసరం ఏమాత్రం లేదు. ఏతత్ ప్రక్రియ శృంగార, వైరాగ్య, భక్తి ప్రవర్తకమని చెప్పడం కూడా చర్విత చర్వణమే అవుతుంది. శతకంలోని ప్రతిపద్యం ఒక ముక్తకం. చతుర్థ చరణాంతంలో గాని, సంపూర్ణ చరణం గాని ఒక మకుటముంటుంది. అయితే, గంధ్ర వారు కావ్యారంభంలోనే మకుటమేర్పరచినారు. సంప్రదాయ విరుద్ధమైనా, స్వాగతార్హమైన ప్రయోగంగా దీనిని చూడవలెనని విన్నపము.

సంధ్యాసమయం అపురూపమైనది. దేవతలు కరుణించి మానవునకొసంగిన గొప్ప వరం. నానావిధ రూపమయమైన ఈ జగత్తున ఏకాకృతిగా సంజవేళ సాక్షాత్కరిస్తుంది. ఏకాగ్రతను ప్రసాదిస్తుంది. మానవ జీవన సంధ్య అలాంటిదే !

ఇన్నిన్నాళ్ళ సంకెలలన్నీ పటాపంచలమౌతవి. ఇంద్రియాలు నిద్రపోయి ఆత్మ మేలుకొంటుంది. నేలను వీడి చూపు క్షితిజం వైపు మరులుతుంది. మానవ మానసం 'నేను' నుంచి 'నీవు' వైపు పయనం సాగిస్తుంది.

గంధ్రవారి కావ్యం అలాంటి అపురూప పయనమే ! కేవలం పయనమే కాదు. ఒక అద్భుత గవేషణ. 'కలండనెడు వాడు కలడో లేడో' అనే

సందేహగ్రస్తులు లక్ష్మణరావు గారు కాదు. గవేషణ హేతువైన 'నీవు' ఆయన దృష్టిలో జగము నిండను చేరిన చేతనత్వమే ! ఈ కావ్యం చదువుతున్నవేళ నాకు W.B.Yeasts గారి "Leda and the Swan" గుర్తుకు వచ్చింది. హంసగా Zeus నవ యవ్వనయైన Leda ను బలాత్కరిస్తాడు. జడాన్ని చైతన్యం ఆవహిస్తుందని ప్రతీకాత్మక మాధ్యమంలో కవి సూచించినాడు. జీవసృష్టి యాదృచ్ఛిక రసాయనిక సమ్మేళనం నుంచి నిర్గతమైనది కాదు. దానికి కారకమైనదేదో ఒకటి ఉంటుంది. వాల్మీకి రామాయణంలో చెప్పినట్లు మానవుడు 'అద్దానిని' మానవాకృతిగా భావన చేస్తాడు. అంతేకాదు దర్శనాభిలాషియై

"జీవరసాత్మ రూప ! కడు చిత్రము కన్పడ వేమి వింతయో" అని వాపోతాడు కూడా !

గంద్రవారి శతక కావ్యం పరమాత్మను గూర్చిన ఒక సుదీర్ఘ పరిదేవనం. దేవతలు స్తుతి ప్రియులు. ఈతి బాధాగ్రస్తుడైన వేళ మానవుడు 'పాహి !' అని దేవతలను పొగడ్తలతో ముంచెత్తుతాడు. 'అగ్ని మీళే పురోహితమ్' అంటూ వేదర్షులు అగ్ని దేవుని గుణగానం చేశారు. అవతార కల్పన ఏర్పడిన తరువాత పురాణకర్తలు అదే మార్గాన్ని అనుసరించారు. లక్ష్మణ వర్యులు పట్టిన బాట అదే.

జగదాధారుడైన ప్రభుని నీరదరూపునిగా ఎంచి

"నీవు వియత్తలంబునను నీరద రూపముదాల్చి నేలపై
జీవుల కెల్ల ఛత్రమయి జీవనధారలు గుమ్మరించి, సం
జీవినివోలె మట్టి సరిచేయుచు పూలు ఫలాలు పంటలన్
ప్రోవులు ప్రోవులై కురియ ప్రోతువు సర్వధరాతలమ్మునన్"

మన లక్ష్మణరాయ కవి ఈశ్వరుని వైభవాన్ని ఔదార్యాన్ని కీర్తిస్తూ నూటపది ఉత్పలమాలలతో కూర్చిన మాల ఈ 'నీవు' అనే శతకకృతి అద్వితీయ భావసాంద్రతకు ఈడైన అభివ్యక్తి సాంద్రత గల దీనిని పఠించడం ఒక దివ్యానుభూతిని పొందడమే అవుతుంది.

-గజానన్ తామన్

సంప్రవేశనం

పాశ్చాత్య వైచారిక జగత్తులో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సృష్టించుకొన్న స్టీఫన్ కోవే 'సెవన్ హాబిట్స్ ఆఫ్ హైలీ ఇఫెక్టివ్ పీపుల్' అనే గ్రంథాన్ని వెలువరించి బుద్ధిజీవివర్గంలో గొప్ప సంచలనాన్ని కలిగించాడు. ఈ గ్రంథం బహుచర్చితమైంది. విభిన్న క్షేత్రాల్లో కార్యాంకితులైన ప్రతిభావంతుల ఏడు రకాల అలవాట్లను గురించి కోవే తన అద్వితీయ కృతిలో విపులంగా వివరించాడు. బాహ్య యశస్సు నుండి ఆంతర్యయశస్సును చేరేందుకు ఏ ఏ మజిలీ ద్వారా సాధకులు జీవన యానాన్ని సాగించాలో ఆ పుస్తకంలో తర్కసంగతంగా, హృదయస్పర్శిగా నివేదించాడు. పాశ్చాత్యజీవనమూల్యాలను, ఆశయాలను ప్రతిఫలించే ఈ గ్రంథం శ్రీ నారాయణ గురూజీని ఆకట్టుకొన్నా, ఆ గ్రంథం ద్వారా అభివ్యక్తమైన భావజాలం అసమగ్రమనే భావన కలిగించింది. కోవే సంరచనను (Structure) సంకల్పనను (Concept) యథాతథంగా ఉంచి పౌర్వాత్య దృక్కోణంతో వాటిని – అంటే సంకల్పాలను – పరిశీలించాడు. స్పందనగా "Dependence to Freedom" అనే గ్రంథం వ్రాసి పాండు లిపి స్థితిలోనే కోవేకు పంపారు. గ్రంథానికి ముగ్ధుడైన కోవే తన లేఖలో (జూన్ 25, 1991) గురూజీ సృజనాత్మకతను, వైచారిక పరిణతిని కంఠోక్తిగా శ్లాఘించారు.

శ్రీ గురూజీ గ్రంథం "Dependence to Freedom" 'అవలంబన నుండ ముక్తి వైపు) షడధ్యాయ లేక షణ్మార్గ సమాహారం. ఇది వచనంలో కాక ఛందోబద్ధ చతుష్పది (క్వాట్రేయిన్) రూపంలో ఉంది. భావపుష్టికి సరితూగగల శబ్దపుష్టి సాధించుటలో శ్రీ గురూజీ కృతకృత్యులైనారని చెప్పడానికి మీ ముందున్న గ్రంథమే సాక్ష్యం.

In learning process receiving first
with open mind receiving best
be like a little bird just out of nest
opening the wings

గూటికే పర్యాప్తమైన ఇపుడిపుడే కనుదెరచిన పక్షి నింగిలో తేలేందుకు చేసిన ప్రథమప్రయత్నంగా రెక్కలు విప్పుకొంది. నీవు నీ సీమితక్షేత్రం నుంచి వెలుపలికి వచ్చి సువిశాల జగత్తులో అడుగుపెట్టే ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. చేతులకు మస్తిష్కానికి పనికల్పించాల్సి ఉంటుంది. నీకునీవై నిర్వచించుకొన్న గమ్యాన్ని చేరాల్సి ఉంటుంది. జన్మతః ప్రాణులది అవలంబనమే. కర్మణ్యులై ముక్తి అంటే స్వావలంబన సాధించాల్సిందే. మీరు గమనించవలసింది. ఆచార్యుడు సాధనోన్ముఖుడైన అంతేవాసిని ఉత్తేజితం చేస్తున్నాడు.

అర్జునునకు కర్తవ్యోపదేశం చేసే భగవానుని వాక్కు గద్యమాధ్యమాన్ని కాక పద్య (శ్లోక) మాధ్యమాన్ని ఎంచుకొన్నది. గురుపరంపరకు చెందిన ఏ విభూతి వాక్కు అయినా, ఏ యుగంలోనైనా శ్లోకరూపమే ధరిస్తుంది. షడధ్యాయ సమాహారమైన గ్రంథంలో గురూజీ ఏ విషయాన్ని స్పర్శించారో పఠితలైన మీరు అడుగకుండానే వివరస్తాను.

1. ప్రథమాధ్యాయం	:	Dependence అవలంబన
2. ద్వితీయాధ్యాయం	:	Independence స్వావలంబన
3. తృతీయాధ్యాయం	:	Interdependence పరస్పరావలంబన
4. చతుర్థాధ్యాయం	:	Supporting సంప్రతిపత్తి – చేదోడు
5. పంచమాధ్యాయం	:	Sharpening the Saw క్రకచతీక్షణీకరణం. (అంపానిక పదునుపెట్టడం).
6. షష్ఠాధ్యాయం	:	Reaching Self : Siphoning the Sea ఆత్మ సందర్శనం సాగరజలచూషణం

ఈ గ్రంథంలోని ప్రతి యొక్క క్వాట్రేయిన్ శ్రీ ప్రభాకర్ తోసర్ విరచిత మరాఠీ చతుష్పదిని తోడుగాగొని ఉభయదిన్ (22-02-1991) నాడు పఠితృలోకం ముందు నిలిచింది. శ్రీ సమర్థరామదాసు వంశజుడైన శ్రీ ప్రభాకర్ తోసర్ గురూజీ గ్రంథానికి అనువాదంగా 'అవలంబనా కడూన్ ముక్తీ కడే' ఓవి ఛందస్సులో రచించి ఎ.సి. శ్రాఫ్ వంటి మహనీయుని మన్ననకు పాత్రుడైనాడు.

ఇది గ్రంథేతిహాసం యొక్క పూర్వభాగం. ఇక ఉత్తరభాగానికి రావడం సద్యః కర్తవ్యంగా ఎంచుతున్నాను.

అష్టాదశ వసంతాల తరువాత గురూజీ గ్రంథ: 'Dependence to Freedom' 'సాహిత్యబ్రహ్మ' డా॥ వి.వి.ఎల్. నరసింహారావు గారి భాషాంతరీకరణం 'స్వేచ్ఛావలంబనం'తో చెట్టాపట్టాలేసుకొని తెలుగుపాఠకుల మానసాలు చూరగొనే నిమిత్తం ముంగిట నిలిచి ఉంది.

గురూజీ గ్రంథంలోని ఆంగ్లచతుష్పదులను కడు సమర్థతతో డా॥ వి.వి.ఎల్. నరసింహారావు గారు వచన పద్యాలుగా అనువదించారు.

పరాధీనుడవై నేర్చుకొనేటప్పుడే స్వయంశక్తి కూర్చుకో;
నేర్చుకొనే ప్రతిదీ నూతన యుగానికి
ద్వారంగా సమకూర్చుకో;
ఈ విధంగా పురోగమించి స్వతంత్రస్థితి అమర్చుకో;
అదే పురోగతి.

పద్యపాదాలు గణబద్ధం గాని, మాత్రాబద్ధం గాని కాకపోయినప్పటికీ లయాత్మకంగా రూపొందాయి. డాక్టరుగారు పద్యశిల్పి కావడమే అందుకు కారణం.

ఈ గ్రంథానికి పరిచయకర్తగా కాక దౌవారికునిగానే వ్యవహరించాలని మొదటే నిర్ణయించుకున్నాను. ఒక్కొక్క అధ్యాయాన్ని విశ్లేషిస్తూ పోతే, మరో గ్రంథమే అవుతుంది. ఎదుటివాడు పల్లెత్తు మాట అనుకున్నా, విస్తరభీతి నా గాత్రాన్ని స్వేదమయం చేస్తున్నది.

కాలక్షేపానికి చదువుకొనే గ్రంథం కాదు. గ్రంథంలో గంభీరభావజాలం ఉంది. ఇది మనల ఆలోచింపచేస్తుంది. అంతర్ముఖుల్ని చేస్తుంది. మనలోని మనీషను చిగిరింపచేస్తుంది. ఉన్నతిని ఏ క్షేత్రంలోనైనా సరే, సాధించేందుకు పురికొలుపుతుంది. ఇలాంటి గ్రంథాన్ని 'ఆనందభిక్షువు' రచయితగా తెలుగు నేలలో నాలుగు చెరగులా వాసికెక్కిన డా॥ వి.వి.ఎల్. నరసింహారావు గారు కాక మూలానికి సంపూర్ణ న్యాయం చేసే విధంగా ఎవరు ఆంధ్రీకరించ గలుగుతారు ?

విజయ సాధనలో సంకల్పం మొదటి దశ
నీ సొంత ఎన్నికతో కదలిపోవడం శ్రేష్ఠం.
చిన్న కూనలా ఉండు; జీవితపరీక్ష ఎదుర్కో
చేతులనే ఆయుధాలుగా చాచు.

ఇంత చక్కగా సాగిన అనువాదాన్ని ఆద్యంతం చదువకుండా ఏ పఠిత పక్కకు పెడతాడు ? గురూజీ గ్రంథాన్ని 'సాహిత్యబ్రహ్మ' ఆంధ్రీకరణాన్ని ఒక పర్యాయం కాదు. అనేక పర్యాయాలు చదివాను. ఒకచోట క్రింది చతుష్పది నన్ను మంత్రముగ్ధుణ్ణి చేసింది.

'You become that which you think
Think you are he, his way you think'

నీవు భావించినట్లే నీవుండు
అతడే నువ్వనుకొని అతని మార్గాన్ని నీవాలోచించు
ఉభయుల భావాలకు ఒక అనుబంధం సంధించు
అదే భావవినిమయం !

ఈ పంక్తులు నా అనాగతంలో నిదురోతున్న స్మృతిని సందీప్తం చేసి మేలుకొల్పినవి. నేను పాతిక సంవత్సరాల క్రింత చదివిన పురుషోత్తమ్ శివరామ్ రేగే నవలలోని నాయిక సావిత్రి కట్టెదుట సాక్షాత్కరించింది. నవల పేరు సైతం 'సావిత్రి'యే. ఈ నవలని ఒక తాత్త్విక పిరామిడ్‌గా చెప్పుకోవచ్చు.

ఈ నవల పరస్పరపూరకాలైన 'అస్తిత్వం' (Being) మరియు 'భవం' (Becoming) అనే సంకల్పనలను లోతుగా పరిశీలిస్తుంది.

సంఘటనా సమాహారమైన ఈ నవలలో ఒక సంఘటన.

ఇందులోని పాత్రలు లచ్చి, ముసలవ్వ, మగనెమలి. ఈ సంఘటనను కథనం చేసేది పనిమనిషి రాజవ్వ. శ్రోత్రి సావిత్రి. స్థలం : నైసర్గిక రమణీయతకు పేరుగాంచిన కర్ణాటకలోని 'కూర్గ్' సావిత్రి తండ్రి పేరుగాంచిన పిలాసఫీ ప్రొఫెసర్. వేసవి సెలవులు కూతురుతోపాటు

'కూర్గ్'లో గడుపుతారు. నిరంతరం అధ్యయనంలోనే మగ్నులై ఉంటారు. ఒంటరితనాన్ని జయించి మాతృవిహీనయైన చిన్నారి సావిత్రి ఒక అందమైన భావవిశ్వాన్ని తనకై నిర్మించుకొంది. సుఖదుఃఖాలనే ద్వైతాన్ని అధిగమించే మానసిక పరిణతిని సాధించింది. ఆమె ఆత్మరతవృత్తికి ముగ్ధుడైన తండ్రి 'నీవు ఆనందభావినివమ్మా !' అని అపుడపుడు అనేవారు.

కథలు చెప్పడంలో రాజవ్వది అందెవేసిన చేయి. సావిత్రికి చెప్పిన పలు కథలలో ఓ నెమలి కథ ఉంది. కథలు చెప్పే రాజవ్వ సావిత్రికి తాత్పర్యం చెప్పేది కాదు.

ఊరికి దూరంగా, అడవికి చేరువలో ఓ పూరి గుడిసె. అందులో ఓ ముసలవ్వ, ఆమె మనుమరాలు లచ్చి ఉండేవారు. ఒకనాటి వేకువ వేళ ఓ మగ నెమలి గుడిసె ముందు నిలిచింది. లచ్చికి ఎంతగానో నచ్చింది. "కట్టివేసి మనం దాన్ని ముద్దుగా పెంచుకుందామే అవ్వా !" అంది లచ్చి. "నీకే తిండి పెట్టలేను; దాన్ని నేనెలా మేపేది?" అసహనాన్ని కనబరుస్తూ అంది ముసలవ్వ. అవ్వా మనుమరాళ్ల సంవాదం తారాస్థాయికి చేరుకుంది. ఇదంతా గమనిస్తున్న నెమలి ఇరువురిని శాంతిపచేయడానికి అంది :

"పోట్లాడుకోకండి. అడవి దగ్గరే. నా తిండి గురించి ఎవరూ తిప్పలు పడాల్సిన అవసరం లేదు. ప్రతిరోజు పొద్దటివేళ ఇక్కడికి వచ్చి కొంతసేపు గడుపుతాను మీతో. అయితే ఒక షరతు. నేను వచ్చి ఆడినప్పుడల్లా లచ్చి నాతో ఆడాలి." 'ఇదేమంత కష్టమైన పని !" లచ్చి తల ఊపింది. మొదట్లో నెమలి దినం తప్పకుండా వచ్చి కుటీర ప్రాంగణంలో లచ్చితో పాటు నృత్యం చేసేది. కొంతకాలం గడిచాక, ఈ క్రమంలో మొదట అల్పవిరామాలు తరువాత దీర్ఘ విరామాలు చోటుచేసుకున్నాయి. కాలాంతరాన నెమలి రావడమే మానేసింది.

లచ్చి నెమలి గుడిసెకు రాని రోజూ ఆడేది. రావడం పూర్తిగా మానేశాకా ఆడటం మానలేదు. నృత్యం ఆమె దినచర్యలో భాగమై కూర్చుంది.

నేడు సావిత్రి త్రింశతి వసంతాలు చూసిన మహిళామణి. ఏదో ఒకనాడు చిననాడు రాజవ్వ చెప్పిన కథ గుర్తుకు వచ్చింది. తాత్పర్యం అవబోధమైంది.

మీకూ అవబోధమైన పక్షంలో జాబు వ్రాయండి. "స్వేచ్ఛావలంబనం" గురించి మీ అభిప్రాయం తెలుపడం మరవకండి.

చిరునామా :
శ్రీ సువర్ణ లక్ష్మణరావు, అధ్యక్షులు
శ్రీ సీతారామ సేవాసదన్
పో॥ మంథని, జి॥ కరీంనగర్-505 184.
ఆంధ్రప్రదేశ్.

ఉత్తరకథనం :

ఎన్నియో భావనలు, స్మృతులు, అనుభూతులు ఈ "స్వేచ్ఛా వలంబనం" అధ్యయనం చేస్తుంటే నాకు కల్గినవి.

మీ జీవనవధానాన్ని మీరు అంతఃపరిశీలన చేసుకోవడానికి ఈ ఉత్తమ గ్రంథము ఎంతో ఉపయోగపడుతుంది. శ్రీ గురూజీ గారికి, శ్రీ సాహిత్య బ్రహ్మ గారికి ఎన్నియో అభినందనలు, ధన్యవాదములు.

-గజానన్ తామన్

నేనెరిగిన వరదులు

స్వర్గీయ శ్రీమాన్ వరదాచార్యులవారి ప్రథమ దర్శనభాగ్యం నాకు 1954లో వారి స్వగ్రామమైన చెన్నూర్‌లో సంప్రాప్తించింది. అప్పటికి నా వయస్సు 17 సంవత్సరాలు. మెట్రిక్ పరీక్షలో ఎలాగో అలాగ కడతేరి, వేసవి సెలవులు సరదాగా గడిపే నిమిత్తం అదే ఊరిలో అభియంతగా పనిచేస్తున్న కీ.శే. లోకే రాజేశ్వరరావు గారి వద్దకు వెళ్ళాను. వారు మా తల్లికి మేనమామగారు. నాయందు వారికి అపరిమితమైన వాత్సల్యం. వారు అభ్యుదయ భావాలు కలవారు. కాల బాహ్యమైన ఆచార విచారాలకు బద్ధవైరులు. నిరంతర గ్రంథ పఠన శీలురు.

ఆచార్యులవారి యెడ వారికి, వారి ఇల్లాలు రుక్మిణమ్మగారికి ఎనలేని ఆదరాభిమానములుండేవి. ఒకసారి ఆచార్యులవారు వారింటికి దయచేశారు. ఎప్పటిలాగే చిన్న సాహితీ గోష్ఠి. అది సాగుతుండగానే తాతగారు ఇంట్లో ఎక్కడో నక్కి కూర్చున్న నన్ను పిలిచి వారికి ఇలా పరిచయం చేశారు. "చదువుమాట ఎలా ఉన్నా, వీడు ఏవో 'లొల్లాయి' కవిత్వాలు వ్రాస్తుంటారు. దయచేసి మీరు విని, వానిని సరైన దారిలో పెట్టండి.

ఆచార్యులవారు స్ఫురద్రూపులు. దారి తప్పి ఇలకు దిగివచ్చిన గంధర్వులు. స్మితపూర్వ భాషులు. చిన్నవారి 'గోరంతలను' 'కొండంతలు' చేసి ఉత్సాహపరిచే పరమోదారులు. నా బిడియాన్ని ఆ మాట ఈమాటతో పోదోలుతూ 'ఏదీ ! వినిపించు నాయనా !' అని మృదువుగా అన్నారు.

అప్పటి కవీయాన్ని ఆద్యంతాలు అధ్యయనం చేసినవాడిని కాదు. చిన్నయసూరి దరిదాపులకూ వెళ్ళలేదు. అయినా వారి ప్రోత్సాహంతో మరీ మరీ చేసిన అనునయంతో అభయంతో అకుతోభయుడనై, కించిదాత్మ విశ్వాసోపేతుడనై 'గద్యమా? లేక పద్యమా' అను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసే 'ప్లాటిపస్'ను తలపించే ఒక రచనను వినిపించాను.

'సహస్ర కర భాస్కర సప్తాశ్వఖురపుటీ – ఘట్టనోద్ధూత ధూళీ కళంకిత పశ్చిమాశాకాశ"...

ఈ శబ్ద పటాటోపానికి ఆచార్యులవారు ఆశ్చర్యచకితులు కాకుండా ఉంటారా ! "ఏమో అనుకున్నాను రాజేశ్వరరావు గారు ! ఈ కుర్రవాడు మహాఘటికుడు". వారి సతీమణివైపు తిరిగి మళ్ళీ ఇలా అన్నారు. "రుక్మిణమ్మ గారు ! కొన్నాళ్ళపాటు వీడికి దొండకాయ శాకం తినిపించండి. అలా చేస్తే 'చాంతాడు'లాంటి సమాసాలు అల్లడం మాని అందరికీ అర్థమయ్యే సులువైన శైలి అలవరచుకుంటాడు" అన్నారు.

అందరి నవ్వుల మధ్య నేను ఆలోచనలో పడ్డాను. నాకు గల 'శబ్ద ప్రభుత', 'దీర్ఘ సమాస నిర్మాణ' నైపుణి 'మృషా వైదుష్య భ్రాంతిని కలిగించేవియే అయినా అసమాన సహనశీలం గల ఆచార్యులవారు అనుగ్రహించిన కితాబుకు మురిసిపోయారు మా పెద్దలు. ఓ క్షణంపాటు, మృషా వినయాన్ని పక్కకుపెట్టి, నా శబ్దాడంబరానికి గల నేపథ్యాన్ని వివరించడం అవసరమని భావిస్తాను. నిజానికి నేను ఉర్దుమాధ్యమంలో ఏడవతరగతి వరకు చదువుకొన్న విద్యార్థిని. మా గురువర్యులు స్వర్గీయ బి.వి.వి.యస్. మూర్తిగారు నాకు తెలుగు సాహిత్యంలో అభిరుచి కలిగించడానికి నానాపాట్లు పడ్డారు. ఆయన ప్రోత్సాహం వల్లే మా తాతగారు చెప్పిన 'లొల్లాయి కవిత్వాలు' వ్రాసే సాహసానికి పూనుకొన్నారు.

నేను 1958-65 మధ్య మహారాష్ట్రలో ఉన్నా, ఆచార్యుల వారిని కలిసికొనే అదృష్టం నన్ను ఎన్నోమార్లు వరించింది. ఆంగ్లంలో అవే లోకోక్తి ఓ మంచి అవకాశాన్ని కోల్పోవడమనే అర్థాన్ని ఇస్తుంది. నేను రెండుమార్లు బస్ మిసవడం సత్ఫలితాన్నే ఇచ్చింది. ఒకసారి నాందేడు వెడుతూ నేను, దోమకొండ వెడుతూ ఆచార్యులవారు బస్సులు మిస్సయినాము. ఓ హోటల్లో కాఫీ తాగుతూ తెలతెలవార్లు కూర్చొనియున్నాము. వారి 'పోతన' వినిపించారు. నేను తరించాను. వారు ఒకచోట తెలంగాణ గ్రామీణ సౌందర్యాన్ని అభివర్ణించే పద్యాలు చదువుతుంటే విని ఆంగ్లకవి జూన్‌మాన్సి ఫీల్డ్‌కు దూరపుటన్న మావరద్దన్న అని లోలోన అనుకున్నాను. బస్ మిస్సయిన రెండవసారి నిజమాబాద్ బస్‌స్టేషన్‌లో ఆచార్యులవారి

అంతేవాసి అందె వెంకటరాజం గారు తారసపడ్డారు. సాహిత్య గోష్టిలో ఆరాత్రి కరిగిపోయింది.

నేను వ్రాసిన కవితలు చెన్నూరులో మంథనిలో వారు విన్నారు. ప్రోత్సహించారు. 'ఆకాశవాణి' కేంద్ర అధికారికి నాకు అవకాశం ఇయ్యవలసినదిగా పత్రం వ్రాసి ఇచ్చారు.

నా మానస సరోవరం కవితా గేయసంపుటి 2004 శ్రీ గట్టు నారాయణ గురూజీ గారి చలువ వల్ల అచ్చయినవి. ఆచార్యులవారు జీవించి ఉంటే ఆ పుస్తకం చూసి నన్ను ఆకాశానికి ఎత్తేవారు. అట్లే నేను తెలుగులోకి అనువదించిన మరాఠీ 'గీత్‌రామాయణ్'ను కూడా వారికి వినిపించే భాగ్యం కలిగేది. వారు విని ఎంతగానో ఆనందించేవారేమో !

-గజానన్ తామన్

ఒకింతసేపు ఋగ్వేధుల్లో...

ప్రతి కవిత్వ అభ్యాసకుడు తప్పనిసరిగా ఋగ్వేదం చదవాలి. తైత్తిరీయోపనిషత్తు ముఖ్యంగా చదవాలి. దాంట్లోనుంచి అగ్నిని పిండుకొని గటాగటా తాగాలి అంటారు శేషేంద్రులు. ఈ వాక్యాల నుండి తమకు, తమ వర్గానికి అత్యంత అనుకూలమైన అర్థాన్ని కాక విజ్ఞులు ఆయనకు అభిప్రేతమైన అర్థమేమిటో అవబోధం చేసికొనే ప్రయత్నం చెయ్యాలి. ప్రయత్నం చేయడమంటే రాహుల్ సాంకృతాయన్ ఉపగమనాన్ని స్వీకరించడమౌతుంది. రాహుల్జీది హేతువాద దృష్టి. ఆయన నిష్కర్షలో వేదం దేవుని సృష్టి కాదు. అది మన సంస్కృతికి విజ్ఞానానికి చరిత్రకు కాణాచి.

వేదాధ్యయనం వినా భారతీయ సంస్కృతి జీవనశైలి, మనకు అనాకలితంగానే ఉండిపోతాయి. ప్రాచీనార్యుల అస్తిత్వాన్ని ప్రతిబింబించే దర్పణం ఋగ్వేదం. నిరలంకారికంగా చెప్పాలంటే ఋగ్వేదం ప్రామాణికమైన సామాజిక దస్తావేజు. ఋగ్వేద సంహిత మూడువందల సంవత్సరాల సుదీర్ఘ కాలఖండంలో ఆనాటి క్రాంతదర్శులైన కవులు రచించిన కావ్యాల సంకలనం. సప్తసింధూ ప్రాంతంలో ఆర్యులు క్రీ.శ. 1500 పూర్వమే ప్రవేశించి ఉంటారని సాంకృతాయన్ అభిప్రాయపడ్డారు. మాక్స్‌ముల్లర్ క్రీ.పూ. 1200 ప్రాంతంలో సప్తసింధూ ప్రదేశాన్ని ఆర్యులు తమ నివాసంగా చేసికొన్నారని, ఋగ్వేద రచనాకాలం 1200-1500 మధ్యది అని నిర్ధారించారు. ఆర్యుల ఆగమన విషయంలో, ఋగ్వేద రచనాకాల విషయంలో ఇతిహాసకారుల విభిన్న స్వరాలు అదెట్లా ఉన్నా, వేదాల ప్రాచీనత ప్రస్తుత వ్యాసంలోచర్చనీయాంశం కాదు. వాటి ప్రాసంగికత నేడు ఏమిటో సాకల్యంగా, సర్వంకషంగా చర్చించాల్సిన అవసరముంది. వేదాల పౌరుషేయత లేక అపౌరుషేయత గురించి వాద జల్పవితండాలకు దిగడం వ్యర్థమే అవుతుంది. మానవసమాజాన్ని (ఏ దేశానికి చెందినదైనా) అవ్యవస్థ నుండి సువ్యవస్థ దిశగా ప్రస్థావింప చేయడంలో సంస్కృతి అనబడేది ప్రధాన పాత్ర వహిస్తుంది. అయితే

సంస్కృతి ఒక సంశ్లిష్ట ప్రత్యయం. ధర్మం, విశ్వాసాలు, నీతి, రాజకీయం, అర్థవ్యవస్థ, కళలు – ఇలాటి వెన్నిటినో తనలో ఇముడ్చుకొంటుంది. సమాజ స్వాస్థ్యానికి, స్థిరతకు, ఆదిభౌతిక, ఆధ్యాత్మిక పురోగతికి కవులు సైతం సమిధలను ధారవోస్తారు. ఆదర్శ సహజీవనం వ్యక్తివికాసానికి ఎంత అవసరమో ఋగ్వేదం తనదైన శైలిలో ఉద్ఘోషిస్తుంది. సమాజవాద భావజలం క్రింది ఋక్కులో విస్పష్టంగా ధ్వనిస్తుంది.

సంగచ్ఛధ్వం సంవదధ్వం
సంవోమనాంసి జానతామ్
దేవభాగం యథాపూర్వే
సంజానానా ఉపాసతే

సాయణాచార్యులు దీనిపై ఇలా భాష్యం చెప్పారు.

యూయం సంగతా భవత. పరస్పరం విరోధం పరిత్యజ్య, ఏకవిధమేవ వాక్యం బ్రూత. యుష్మాకం మనాంసి ఏకరూప మేవార్థం అవగచ్ఛంతు. యథా పురాతనాః దేవాః ఐకమత్యం ప్రాప్తాః హవిర్భాగం స్వీకుర్వంతి తథా యూయమపి వైమత్యం పరిత్యజ్య, ధనం స్వీకురుత...

మీరంతా ఒక్కటై మనుగడ సాగించండి. ఒకే గొంతుతో మాట్లాడండి. మనసుల్ని విడదీయలేనంతగా మేళవించండి. సనాతనులైన దేవతలవలె మీరు మీకు రావలసిన వాటాను న్యాయబుద్ధితో పొందండి. సార్వజనిత సంపత్తిలో సింహభాగం పొందవలెనన్న అభిలాష నీచాతి నీచమైంది. శ్రమదోపిడి చౌర్యంకన్న హీనమైంది. సమాజంలో ఏర్పడిన విషమతలు తిరుగుబాట్లను విప్లవంను సృష్టిస్తాయి. ఇలాంటి మౌళిక సత్యసందర్శనం చేయించే వేదం ఏ యుగంలోనైనా కాలబాహ్యం కాదు.

ధర్మబద్ధమైన జీవనం సాగిస్తూ విషయలోలుపతకు, వ్యసనాలకు దూరంగా ఉండాలని వేదం హృద్యంగా ఉద్బోధిస్తున్నది.

నాటి ఆర్యులు సంచారజీవనులు. నిరంతర సంగ్రామ వ్యగ్రులు. మితిమీరిన సోమపానంతోపాటు ద్యూతం వీరిని గ్రసించిన వ్యసనం.

జీవనంలోని అనిశ్చితి ఇందుకు కారణం కావచ్చు. వేదాలు ప్రభుసమ్మితాలు, పురాణాలు మిత్ర సమ్మితాలు, కావ్యాలు కాంతా సమ్మితాలు అనేది ఏండ్లుగా వినబడుతున్న జనశ్రుతి. ఇది అర్ధసత్యం. వేదాలు కేవలం ప్రభువులాగా శాసిస్తాయా ? ఋగ్వేదంలో పలు సంవాద సూక్తాలున్నాయి. వాటి మాటేమిటి? ఇవి ఆఖ్యాన సాహిత్యంగా ప్రసిద్ధి చెందాయి. విశేషంగా ఇవి దశమ మండలంలో దర్శనమిస్తాయి. ఈ ఆఖ్యాన సూక్తాలలో అనిర్వచనీయమైన ఆనందానుభూతిని కలిగించే కావ్యత ఉంది. అందుకే కవిగా ఎదుగదలచినవాడు అంటే అభివ్యక్తి సాంద్రతను సాధించదలచిన వాడు ఋగ్వేదాన్ని అధ్యయనం చేయాలని శేషేంద్రులు చెప్పారు.

ఋగ్వేదంలోని దశమమండలంలోని ఊర్వశీపురూరవుల ఆఖ్యానం సర్వశ్రేష్ఠమైనది. అలాగే సూర్యావివాహం మనచే నవదంపతులపై అక్షతలు వేయిస్తుంది. యమయమీ సూక్తం వివాదాస్పదం. ఏడవ మండలంలోని మండూక సూక్తాన్ని దాటవేయగలమా ! ఇందులో వేదం చదివే వటువులు కప్పలుగా వర్ణింపబడ్డారు. వీటి గురించి మరో సందర్భంలో మాటాడుకొందాము. ఈవేళ కాస్త విపులంగా దశమ మండలంలోని కిత వాఖ్యానం (10.3.34) వైపు దృష్టి క్షేపంకావిద్దాం. ఈ జూదరి కథ నేటి పేకాట రాయళ్ళకు కనువిప్పు కలిగించేంత ఓజస్వంతంగా ఉంది. మనకు నికటమైన అతీతంలోని కవి విరచితమేమో అన్నంత భ్రాంతిని కల్గిస్తుంది.

యుగాలు మారినా, రాజ్యస్వరూపాలు మారినా మానవ ప్రవృత్తిలో పెద్ద మార్పు ఉండదు. సుగుణాలుంటాయి. ఏహ్యాభావం కలిగించే దైహిక, మానసిక బలహీనతలుంటాయి. రష్యాలో సమాజవాద వ్యవస్థ ఏర్పడి శ్రమ జీవులకు సాంస్కృతికంగా ఎదిగే వాతావరణం కల్పించినా, వోడ్కా సేవనం తగ్గలేదు. చౌర్యాలు పాత కథలు రాలేదు. అవినీతి జనజీవనం నుంచి అంతర్హితం కాలేదు. నూరేండ్ల పంటయైన పెండ్లిమున్నాళ్ళ ముచ్చటైన ఘటనలు ఎన్నో ! అందుకే మానవుణ్ణి ఋజుమార్గగతుడ్ని చేయటానికి అన్ని కాలాలలోను ధర్మం నీతి రెండూ అవసరమే.

ధర్మం, నీతితో పాటు మానవీయ మూల్యాలు సంరక్షణలో కళలు

ముఖ్యంగా సాహిత్యం తన వంతు పాత్ర నిర్వహించాల్సి ఉంటుంది.

ఇది ఇక్కడ వదిలి, కితవుని (జూదరి) ఉదంతానికి ఋ.వే. (10.3.34) తిరిగి వద్దాం.

ప్రావే పామా బృహతో మాదయంతి ప్రవాతే జా ఇరిణే వవృతానాః
సోమ స్యేవ మౌజవతస్య భక్షో విభీదకో జాగృనిర్మహ్యామచ్ఛన్

ప్రవణదేశంలో పుట్టిన విభీతక బీజాలు పాచికలై పటంపై కదలడాన్ని చూస్తే సోమపానం చేస్తే కలిగే మధురానుభూతి కలుగుతుంది. ఈ ఋక్కులలో ఆర్యుల ద్యూత ప్రియతపాటు సోమపానాసక్తి సూచితమైంది.

అహోరాత్రాలు ద్యూత క్రీడలో మునిగి తేలుతూ కుటుంబ బాధ్యతలను విస్మరించిన భర్తపై ఇల్లాలికి ఏ మాత్రం కోపం లేదు. ఆమె క్ష్మా వలె క్షమాశీల. అలాటి అనురాగవతిని తలచుకొని జూదరి నిర్వేదస్థితిని చెందుతాడు.

న మామిమేథన జిహేళ ఏషా శివాసఖిభ్య ఉతమహ్యా మాసీత్
అక్షస్యాహమేక పరస్య హేతో రనువ్రతా మప జాయా మరోధమ్

ఇంటికి వచ్చిన తోటి జూదరులను అన్నపానీయాలతో సంతుష్టులను చేసే గుణవతియైన గేహినిని పాచికలాటలో పడిపరిత్యజించినందుకు జూదరి వ్యథితుడైనాడు.

పాంచభౌతికమైన దేహాన్ని విడవడం అత్యంత సహజం. ప్రతిష్ఠను సమాజంలో కోలుపోయి జీవచ్ఛవం కావడం మరణం కంటే హీనస్థితిని పొందడమే అవుతుంది.

ద్యూత క్రీడాసక్తుడై, నానా అవమానాల పాలయ్యే జూదరి తన దుస్థితిని తలచుకొని లోలోన కుమిలిపోతాడు.

ద్వేష్టిశ్వశ్రూరపజాయారుణద్ధిననాథితో విన్దతే మర్డితారమ్
అశ్వస్యేవ జరతో వరుయస్య నాహం విందామి కితవస్య భోగమ్

జూదరియైన అల్లుడు ఇంటికి వస్తే అత్తనిందిస్తుంది. భార్య వదిలి

పెడుతుంది. కితవునకు డబ్బిచ్చి ఆనందపరచే దాతలుండరు. ముసలి గుర్రాన్ని ఎవరు కొంటారు ? జూదరిని ఎవరు మన్నిస్తారు ? విలువ ఇస్తారు.

అక్షాల మోహంలో మనిషి అధోగతి పాలవుతాడు. వాని బార్యపై తోటి జూదర్లు కన్నువేస్తారు. మరి పరివార సదస్యులు ? వీణ్ణి మేమెరగము. ఇష్టమైన చోటుకు వీణ్ణి తీసుకవెళ్ళండి అని ఋణదాతలతో అంటారు.

అన్యేజాయాం పరిమృశంతస్య యస్యాగృధం ద్వేనే వాజ్యక్షః
పితామాతా భ్రాతార ఏన మాహుర్నజానీమో నయుతా బద్ధమేతం

1. పాచికలు ఇక ముందెప్పుడు ఆడనని జూదరి చేసిన శపథం అట్టే నిలువదు. పటం మీదే ఇటు అటు కదలే పాచికలను చూడగానే మనస్సు మారుతుంది. సంకేత స్థానంలో ప్రియసమాగమార్థం చేరుకొనే జారిణి వలె కితవుడు ద్యూత స్థానానికి చేరుకుంటాడు.

జూదరి తన్నుతాను బాగా అలంకరించుకొని ఎక్కడున్నారు ధనికులు? వాళ్లను ఈరోజు జయిస్తాను అని బీరులు, పలుకుతూ అడ్డాకు చేరుకుంటాడు. కొన్నిమార్లు పాచికలు జూదరికి అనుకూలంగా పడుతాయి. అప్పుడు పుత్రప్రాప్తి వల్ల కల్గిన ఆనందం వాడికి కల్గుతుంది. కొన్నిమార్లు పాచికలు ఇతర జూదరుల అనుకూలంగా పడి రాజకీయ వేదనకు ఓడిన వాడిని గురిచేస్తాయి.

త్రి పంచాశః క్రీళతి వ్రాత ఏషాం దేవ ఇవ సవతా సత్యధర్మా
ఉగ్రస్య చిన్మన్యవే నా నమస్తే రాజా చిదేభ్యోన ఇత్కృణోతి

సత్య స్వరూపుడైన సూర్యదేవుని గగన విహారాన్ని తలపించే విధంగా ద్యూతపటంపై ఏబది మూడు పాచికలు విహరిస్తాయి. క్రుద్ధుడైన కితవుని పాచికలు ఏ మాత్రం లెక్కచేయవు. ఎవరి వశం కావు. రాజయినా ద్యూతక్రీడలో పాచికలకు నమస్కరిస్తాడు. దేవనం వల్ల జూదరి కుటుంబ జీవనం కకావికలమవుతుంది. జూదరి గేహాన ఏర్పడ్డ దయనీయ స్థితిని ఋగ్వేదర్షి శబ్ద చిత్రంగా మలచినాడు. ఈ శబ్ద చిత్రం ఎంతటి కఠిన హృదయుడినైనా ద్రవింపచేస్తుంది. ఈ సూక్తం కరుణరసప్లానితం కనుక

మళ్ళీ మళ్లీ పఠితను చదివింపజేస్తుంది.

జాయాతప్యతేకి తదస్యహీనా మాతా పుత్రస్య చరతః క్వస్విత్
ఋణావాచిభ్యధ్న మిచ్ఛమనోన్యేషామస్తు ముపనక్తమేతి
కితవస్య భార్యా పరిత్యక్తాసతి, వియోగ సంతాపేన
సంతప్తాభవతి, జనన్యపి క్వాపి చరతః

పుత్రశోకేన సంతప్తా భవతి. అక్షరపరాజాయాత్ ఋణవాన్ కితవః ధనం కామయమానా అన్యేషాం గృహం రాత్రౌ చౌర్యార్థః ఉపగచ్ఛతి.

భార్య భర్తచే ఉపేక్షిత అయినందున విరహంలో వ్రేగుతుంది. కొడుకెక్కడున్నాడో తెలియని తల్లి శోకసంతప్త అవుతుంది. ద్యూత క్రీడలో పరాజితుడైన కితవుడు రాత్రివేళ జబ్బుకోసం ఏ కలవారి ఇంటికో కన్నం వేస్తాడు.

స్త్రియం దృష్టాయ కితవం తతౌపాన్యే
జాయాం సుకృంతచ యోనిమ్
పూర్వాహ్ణే అశ్వాన్ యుయుజేహి
బభ్రూన్తో్స అగ్నేరంతె వృషల పపాద

కితవుడు (వీధుల్లో తిరుగుతూ) ఇతర పురుషుల భార్యలను స్వలంకృత గృహాల్లో చూచి తపించిపోతాడు. అశ్వారూఢుడై ప్రభాతవేళ ద్యూతస్థలికి వెళ్ళినవాడు ఒంటికి చాలీచాలని వస్త్రాలతో రాత్రివేళ చలిని భరించలేక నెగడి దగ్గరని దూరిపోతాడు. ఇంటికి వెళ్లి ఎవరికీ మొహం చూపించలేడు.

ఈ వ్యాసం ముగించే ముందు పదమూడవ 'ఋచ' చేసే హితబోధను అప్రమత్తులమై విందాము. మితిమీరిన ద్రవ్యార్జన బ్రతుకును అస్తవ్యస్తం చేస్తుంది. కనుక అర్థవాదం సకల అనర్థాలకు మూలం. మానవులు వ్యసనముక్త జీవితం గడపాలి. ప్రేయోమార్గగతులు కాకూడదు. శ్రేయోమార్గ గతులు కావాలి.

అక్షైర్మాదీవ్యః కృషిమిత్కృషస్వ విత్తేరమస్వబహుమన్యమానాః
తత్రగావః కితవ తత్ర జాయాతస్మేనిచష్టే సవితాయ మర్యః

ఓయి జూదరి ! జూదమాడకు ! హాలికుడవు కా ! వ్యవసాయం వల్ల ప్రాప్తించిన ధనంతో సుఖజీవనుడవు కా ! సేద్యం వల్ల నీకు ఆవులు దొరుకుతాయి. ఆలు దొరుకుతుంది. ఈ ధర్మ రహస్యాన్ని నాకు సవిత చెప్పాడు.

శ్రమైక జీవన సౌందర్యాన్ని దర్శించు ; వ్యసనముక్తుడవు కా అని చెప్పే వేదం కన్న ఉత్కృష్టమైనది ప్రపంచంలో ఏముంటుంది.

పరామర్శ గ్రంథాలు :

ఈ వ్యాసానికి మూలం – ఋగ్వేద సంహిత (సాయనాచార్య కృత భాష్య సంకలితా, చౌఖంబా విద్యాభవన్, వారణాసి)

1. ఋగ్వేద ఆర్యులు : రాహుల్ సాంకృత్యాయన్, అను – మిక్కిలినేని సుబ్బారావు.
2. వేదిక్ సాహిత్య్ కా ఇతిహాస్ – డా॥ పారస్‌నాథ్ ద్వివేది.
3. వైదిక్ సాహిత్య జార్ సంస్కృతి – వాచస్పతి గౌరోవా.

-గజానన్ తామన్

మంథని

'మణిమాల'

ఏ చీకూచింతా లేకుండా చెన్నూరులో నేను గడిపిన వేసవి సెలవుల్లో, ఆచార్యులవారి గేహానికి వెళ్ళడం నా దినచర్యలో భాగమైపోయింది. ఆయన ఇంటి ముందు గల పాకలో నాకూ మరొక అభిమానికి మణిమాల (1945)లోని పద్యాల్ని వారు వినిపిస్తుండేవారు. ఈ ఖండకావ్య సంపుటిలో దేవతలో, దైవాంశ సంభూతులో, రారాజులో వర్ణ్య వస్తువులు కాకపోవటం నన్ను అబ్బురపాటుకు గురిచేసేది. అయితే అప్పటికే శ్రీశ్రీ "మహాప్రస్థానం" చదివియున్నవాణ్ణి గనుక ఆధునిక తెలుగు సాహిత్యంలో 'సామాన్యు'లే కేంద్ర స్థానీయులైనారన్న విషయాన్ని నాలో నేను వితర్కించుకొన్నాను. ఈ పెనుమార్పు వెనుకగల ఐతిహాసిక కారణాలను అప్పట్లో హరిత శృంగిని (Green Horn) అయినందున ఊహించుకోలేకపోయాను.

ఒక దశాబ్దం తరువాత అంటే 1963లో మరాఠ్వాడ విద్యాపీఠంలో స్నాతకోత్తర విద్యార్థిగా చేరి ఆంగ్ల మహాకవి వర్డ్స్‌వర్త్ 'Lyrical Ballads' చదివే వరకు పైన చెప్పిన 'మార్పు' నా ఆకలన పరిధిలోనికి రాని విషయంగానే ఉండిపోయింది.

సమానత్వం, సౌభ్రాతృత్వం, స్వేచ్ఛ అనే ధ్యేయ త్రితయ ప్రేరిత ఫ్రెంచి విప్లవం (1789) సగటు మనిషిని అందలం ఎక్కించింది. శాసితుణ్ణి శాస్తను చేసింది. ప్రజాకంటకులైన రాజులూ, వారి ఆశ్రితులూ తరతరాల బూజులుగా తిరస్కృతులై ప్రాభవ వైభవాలను కోల్పోయారు. అలా సామాన్యుని శాస్తగా నిల్పిన ఈ మహోదయానికి వర్డ్స్ వర్త్ ఓ కవితలో స్వాగతం పలికాడు.

క్షంతవ్యంగాని విషయాంతరమైనా, ఒక విషయాన్ని సాహితీ స్రష్టలూ, అభిమానులు గుర్తుంచుకోవాలని విన్నవించుకుంటున్నాను. సాహిత్యం ఏ రాజకీయ, సాంఘిక విప్లవాలను సృష్టించదు. సాహిత్యంలో వచ్చే విప్లవాలు పైవాని ప్రతిఫలనాలు మాత్రమే. ఫ్రెంచి విప్లవం జాగతిక సాహిత్య రూపు

రేఖలనే మార్చివేసింది. 'ఆరిన కుంపటి విధాన' కన్పించే శ్రీశ్రీ ముసలవ్వ కవితకు గల ప్రేరణను తెలిసికొనుట ఈ నేపథ్యం ఎరిగిన వారికి సులభ సాధ్యమే.

Lyrical Ballads అనేది కతిపయ గేయ సమాహారం. నిసర్గ నికట జీవన యాత్ర సాగిస్తున్న వ్యక్తుల శబ్ద చిత్రాలు లేక దాశరథి మాటల్లో చెప్పాలంటే మాట బొమ్మలు. జీవన చరమాంకంలో సంతోషంగా బురదలో పడుతూ బ్రతుకు తెరువును వెదకికొన్న ఓ మూడు కాళ్ళ ముదుసలి, చేని కోతలో మగ్నుయైన ఓ పడుచు, పల్లీయుల హృదయాల్లో కారుణ్య భావాన్ని రేపే ఓ 'దేవానాం ప్రియుడు' ఈ కావ్యంలో మీకు దర్శనమిస్తాడు. ఉత్తమ ధ్యేయాలతో పురుడు పోసుకొన్న విప్లవం రక్తలాంఛితంగా ముగిసింది. మానవుడు సాటిమానవుని యెడ ప్రదర్శించిన క్రౌర్యానికి వర్డ్స్‌వర్త్ చలించిపోయాడు. వ్యధిత హృదయానికి స్వాంతన కూర్చే నిమిత్తం ప్రకృతివైపు, దానికి నికటమై జీవించే అమాయక పల్లీయులవైపు దృష్టి మరల్చి వాటినే తన కావ్య వస్తువులు కావించుకొన్నాడు. ఆంగ్ల సాహిత్యంలో ఆచార్యుల వారికి ప్రగాఢ పరిచయం ఉందా ? వర్డ్స్‌వర్త్ కావ్య జగత్తును ఆయన దర్శించారా ? చెన్నూరు వాస్తవ్యులూ, వారి సహోపాధ్యాయులైన వైద్యవినాయకరావు గారిని సంప్రదించాను. ఆంగ్లంలో అభ్యస్త పాండిత్యం కాకపోయినా శ్రుత పాండిత్యం కలవారేనని వారు సమాధానమిచ్చారు. మునుముందు ఈ విషయాన్ని గూర్చి విస్తృతంగా ముచ్చటించుకుందాము.

ఆచార్యులవారి "మణిమాల" ఏబది తొమ్మిది ఖండికలు గలది. డా॥ అద్దేపల్లి వారన్నట్లు ఇది ప్రచురింపబడిన 1948 నాటికి భావకవిత్వం ఉచ్ఛదశలో వుంది. ఈ "మణిమాల" భావకవితా యుగంలో వెలువడినా, భావకవితా లక్షణాలైన ఆత్మాశ్రయత్వం, సౌందర్యారాధన, స్వేచ్ఛా ప్రియత్వం వగైరాలు ఇందులో లేవు. ఊహా ప్రేయసిని కల్పించుకొని 'నవజీవన బృందావన దివ్యసీమలో విహరించేందుకు ఆచార్యులవారు ఆవిడకు ఆహ్వానం పలుకలేదు. 'నా తీరే వేరన్నట్లు ఆచార్యులవారు దేవులపల్లి, వేదుల, బసవరాజు వంటి భావకవుల మార్గంలో పయనించలేదు.

ప్రగతి శీలమైన అంశాలు గల ఉత్తమ సాహిత్య కృతిగా మణిమాలను

అద్దేపల్లివారు కొనియాడారు. అయితే, ఆచార్యులవారి ప్రగతిశీల భావాలు మార్క్సువాదం నుంచ వచ్చినవికావు. లౌకికవాద జన్యమైన అభ్యుదయవాదం నుండి వచ్చినవి కావు. మానవుడు సర్వభూత హితరతుడు కావాలని, విద్యావినయ సంపన్నుడైనవాడు సర్వజీవుల యందు, గీతలో చెప్పినట్లుగా, సమరసదృష్టి కలవాడు కావాలని శాసించిన సనాతన ధర్మప్రేరితం ఆయన ప్రగతిశీలవాదం... మానవుణ్ణి మానవ పరిసరాలనుమెరుగుపరచాలనే వాదమే అభ్యుదయవాదం. వర్తమానంలోని అన్యాయ సామాజిక స్థితిని సమూలంగా ధ్వంసం చేసి సమసమాజ నిర్మితికై పోరుబాట పట్టాలనేవాడు విప్లవవాది. ఆచార్యులవారు అభ్యుదయ లేక విప్లవవాది కాదు. ఆయన 'సంస్కరణవాదాన్ని' సైతం పరిమితార్థంలోనే తీసికోవాలి. 'పాకివాడి' 'వెట్టివాడి' స్థితిగతులను మెరుగుపరచాలని చెప్పని సంస్కరణవాదం ఆయనది కాదు. వారియెడ హీనదృష్టి కాక గౌరవ దృష్టి కలిగివుండాలన్న మాటే పద్యాల్లో చెప్పుతున్నారు. పాకీపని ఒక హేయమైన వృత్తి. ఆ వృత్తి నుండి, అందులో ఉన్నవానికి ముక్తి కల్పించ గౌరవ ప్రదమైన బతుకుతెరువు కల్పించాలని చెప్పడం లేదు. విప్లవ ఖంఖం పూరించడం అటుంచి, జాషువాలాగా అన్యాయ సామాజిక వ్యవస్థకు విరుద్ధంగా గొంతెత్తి 'నిరసన' ప్రకటించడం లేదు. 'సంస్కరణ' అనే దానిని వ్యక్తులకూ, వ్యవస్థలకు కాక చూపరులకే పరిమితం చేశారు.

మణిమాలలో గల పద్యాలన్నింటిని స్పృశించడం ఈ చిన్న సమీక్షలో సాధ్యం కాదు. ఇందులోని సామాజిక సందర్భాలు మారిన కారణంగా 'వితంతుబాలిక' లాంటి పద్యాలను గణనలోనికి తీసుకొనక పోవడం సమర్థనీయమే ఔతుంది. 'పెంట పేలిక', 'ఎండుగడ్డి వేరు' 'గ్రామసూకరము' 'తేనెటీగ' 'చుట్టగాల్పు' వంటి కవితలు 'మంచి కవిత'లే యైనా టి.యస్. ఇలియట్ చెప్పినట్లు గొప్ప కవితలు కాజాలవు. గొప్ప ఇతివృత్తం గల కవితలే గొప్పకవితలు. 'సమరకాళిక' 'వెట్టివాడు' 'హరిజనుడు' వంటి గొప్ప కవితలు ఇందులో లేకపోలేదు. 'డ్రోన్'లతో అమాయకుల ప్రాణాలకు, ఆస్తికి క్షతిని కలిగిస్తున్న 'మా నవవిధాన విజ్ఞాన మహిమ'ను అధిక్షేపించేదది మొదటిదైతే, దళితుల దైన్య జీవన స్థితిని హృదయ విదారకంగా వర్ణించే 'హరిజనుడు' అనే కవిత రెండోది. డి.ఏయిచ్, లారెన్స్ నుడివినట్లుగా

మన 'ధర్మం', 'సంస్కృతి' 'విద్యావిధానం' మానవ కేంద్రితాలు. ఇవి మానవుడే గొప్పవాడని గొంతుచించుకుంటాయి. మానవుని క్రౌర్యానికి, విధ్వంసానికి పరిమితులు లేవు. మానవతావాదంలో అమానుషీయమైన అంశాలు ఉన్నవి. మానవతావాదం నుండి జీవనవాదం వైపు పయనించాల్సిన అవసరం మనముందు ఎంతైనా ఉంది. ఆచార్యులవారి 'దుక్కిబక్క' మానవుడిని మించిన హింస ప్రాణి ఉండదన్న కఠోర సత్యాన్ని మనముందు నిల్పుతుంది.

ఆచార్యులు వారు వర్డ్స్ వర్త్ కావ్య జగత్తులో పరిచితులూ అనే ప్రశ్నను సమీక్షారంభంలో వేసికొన్నాను. ఈ ఇద్దరి కృతులలోనికి మరోమారు తొంగి చూచినప్పుడు నాకు కలిగిన ఆశ్చర్యానికి మేరలు లేవు. వస్తు సారూప్యం గల కవితలు ఇద్దరివి కొన్ని ఉన్నవి. 'పంటచేను పిల్ల' (The Solitary reapers), ముల్లు (The Thron) ఊరుపిచుక (The sparrows Nest) గా వర్డ్స్ వర్త్ రచనలైతే మన ఆచార్యుల వారివి 'పరిగపిల్ల', 'తృణము', 'ఊరుబిచ్చుక' వంటి రచనలు. తులనాత్మక దృష్టితో చూచినప్పుడు ఆచార్యులవారివే శ్రేష్ఠమైనవని అంగీకరించడం వినామార్గం లేదు.

ఏ 'ఇజం' నుంచి వారి కవిత పుట్టుకొని రాలేదు. క్రౌర్యాన్ని, దోపిడిని, హింసను, పాశవిక వృత్తిని చూచి నిలువెల్లా చలించిన, ద్రవించిన వారి కారుణ్య హృదయమే వారి అక్షర సృష్టికి స్రోతస్సు. 'మా నిషాద' అంటూ వాల్మీకి బోయను మందలించిన విధంగా కరకు రాచరిక వ్యవస్థలో ఉన్న వారిని మందలించలేదు. వెట్టివానిని చూచి వేదనను శబ్దాల్లో అభివ్యక్తం చేశాడు.

దుక్కి బక్కను చావపొడిచే కాపు బిడ్డను సూటి మాటలతో గర్హించకుండా నీ పొడిచెడి ముల్లు కట్టు కెటు పోయెను కన్గవ; యింత గ్రుడ్డిదే' అంటూ వాని హైన్యాన్ని వక్రోక్తి భణితిలో చెప్పాడు.

నిదురోతున్న మానవుణ్ణి ఆధ్యాత్మికంగా నిద్రాణం చేయాలన్న సంకల్పంతోనే లేఖినిని చేతబూనినాడు. విద్వన్మిత్రుడు డా॥ గంద్ర లక్ష్మణరావు గారు అన్నట్లు శోషితవర్గాలకు శత్రువులయెడ విప్లవించేందుకు పిలుపు నివ్వలేదు.

ఆచార్యులవారు పద్యం చదివే విధానం శ్రోతలను మంత్రముగ్ధులను చేసే విధంగా ఉండేది. 'అనేన పాషాణాదపి పీయూషం స్యందతే సదా!' అన్న జగన్నాథ పండితరాయల శ్లోక పంక్తి సాహితీ ప్రియులకు గుర్తుకు వచ్చే విధంగా ఆయన పద్యపఠనం ఉండేది.

-గజానన్ తామన్

సాంఘిక చరిత్రకు నవలా రూపం - 'కాలరేఖలు'

అంపశయ్య నవీన్ 1996లో పదవీవిరమణ చేసే నాటికి నవలాకారునిగా తెలుగు సాహిత్యంలో తన స్థానాన్ని సుప్రతిష్ఠితం చేసుకున్నాడు. 'కాలరేఖలు' నవల 'ప్రవేశిక'లో ఆయన చెప్పుకున్నట్టు 1996 నుండి 2001 వరకు రాత్రింబవళ్లు శ్రమించి 1994 నుండి 1994 వరకు – అంటే ఓ యాభై సంవత్సరాల కాలాన్ని తీసుకొని. ఆ కాలఖండంలో తెలంగాణా జన జీవనాన్ని చిత్రించే నవలాత్రయాన్ని సృజించారు. ఈ చారిత్రాత్మక నవలాత్రయాన్ని రచించడానికి ఆయన ఆనాటి తెలంగాణ రైతాంగ పోరాటానికి కేంద్రాలైన ఎన్నో గ్రామాలను సందర్శించారు. ఎంతో సమాచారాన్ని సేకరించారు.

ఈ నవలాత్రయంలోని మొదటి నవల 'కాలరేఖలు' – మిగిలిన రెండు నవలలు “చెదిరిన స్వప్నాలు”, “బాంధవ్యాలు”, “కాలరేఖలు” 2004వ సంవత్సరానికిగాను కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారాన్ని గెలుచుకున్న నవల. సాహిత్యంలో అత్యున్నత పురస్కారంగా భావించబడే ఈ పురస్కారాన్ని ఇది వరకు కేవలం రెండు తెలుగు నవలలు మాత్రమే గెల్చుకున్నాయి. (అవి గోపీచంద్ రచించిన “పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా” 1961, మాలతీ చందూర్ రచించిన “హృదయనేత్రి” 1985). ఈ గౌరవాన్ని దక్కించుకున్న నవలల్లో “కాలరేఖలు” మూడవది.

నవలను చదివి ఆనందించటానికి అపార వైదుష్యం అక్కరలేదు. సామాన్య పాఠకుల స్పందనలు ఉపేక్షనీయాలు కావు. డా. జాన్సన్ అంతటివాడు కృతి యొక్క ఉత్కృష్టతను నిర్ధారించడాన్ని సామాన్య పాఠకుని అంతిమ నిర్ణయానికే వదిలి వేయాలన్నాడు. ఈ నవలాత్రయాన్ని ఏకకాలంలో స్పృశించడం వల్ల ఏ ఒక్కదానికి సంపూర్ణ న్యాయం చేకూర్చడం సాధ్యం కాదు గనుక నన్ను నేను 'కాలరేఖలు' నవలకే పరిమితం చేసుకుంటున్నాను.

నవలాకారుడిగా నవీన్ ఆర్జించిన లోకప్రియతను గురించి మాట్లాడుకోవడం చర్వితచర్వణమే అవుతుంది. అవార్డులకంటే,

రివార్డులకంటె పాఠకుల ఆదరణ రచయితకు కొండంత మనోబలాన్ని ఇస్తుంది. యశోవిభూషితుణ్ణి చేస్తుంది. కళాత్మక సంకేతాల మాట ఎలా ఉన్నా నవీన్ లేఖిని నుండి జాలువారిన ప్రతి నవల ఏకబిగిన పాఠకుణ్ణి చదివింపజేస్తుంది. రచన కుండాల్సిన ప్రాథమిక లక్షణం ఇదే. నవీన్ నవలలు కేవలం మనోవినోదం కూర్చే రచనలు కావు. అతీతాన్ని సమగ్రంగా మనముందు నిలుపుతాయి. అతీతాన్ని విస్మరించే ఏ మానవ సమూహం ఉజ్వల భవిష్యత్తుకు నోచుకోలేదు. లోక ప్రియతనే కాక వస్తుగాంభీర్యాన్ని నికషంగా ఎంచిచూస్తే నవీన్‌వంటి నవలాకారులు ఏ దేశసాహిత్యంలోనైనా అరుదనే చెప్పాలి.

గత శతాబ్దంలోనూ, ఇప్పుడూ పుంఖానుపుంఖంగా వెలువడుతున్న నవలల్ని “రొమాన్స్” అనే సాహిత్య ప్రక్రియకు చెందిన రచనలనే చెప్పాలి. ఇవి పగటికలలకు ఇచ్చిన శబ్దరూపాలు మధ్యమ వర్గీయ యువ యువతీజన మనోరంజకాలు. ఇవి చదవడం వల్ల కాలహరణమే తప్ప ఏ ప్రయోజనమూ పఠితకు సిద్ధించదు.

నవీన్ ‘కాలరేఖలు’ నవల యాతనామయ తెలంగాణా జనజీవన యథాతథ్యానికి స్వచ్ఛమైన దర్పణం. మహాకవి దాశరథి చెప్పినట్టు “తెలంగాణా కోటి రత్నాల వీణ”. చివరి నిజాం నవాబు తీగలను తెంపి అగ్నిలో దించాడు. ఎన్నాళ్ళుగానో తెలంగాణా నేల బీటలు వారుతుండటం కాదనలేని కఠోరసత్యం.

నవీన్ నవలా శిల్పంలో ఒక వైశిష్ట్యం ఉంది. అది కాలరేఖలు నవల కథా కథనంలో ఆయన ప్రదర్శించిన తటస్థత. రచయిత చొరబాటు (Authorial Intrusion) ఆయన రచనల్లో మచ్చుకైనా కనిపించదు. రాజకీయ సైద్ధాంతిక సులోచనాలతో వర్తమానేతిహాసాన్ని విలోకించడం నవీన్ చెయ్యలేదు.

ఒక ఇతిహాసానికుండే విస్తృత పరిధి ‘కాలరేఖలు’కుంది. చరిత్రలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల్ని నేపథ్యంగా తీసుకుని ఒకానొక చారిత్రకయుగంలో జీవించిన అనేక వర్గాల ప్రజల సామాజిక జీవితాల్నీ,

వాళ్ళ సంప్రదాయాల్నీ ఆచార వ్యవహారాల్నీ, మానవ సంబంధాల్నీ కళ్ళకు కట్టినట్టు చిత్రించడమే ఇతిహాస రచన ప్రధాన లక్షణం. అలాంటి ఒక ఇతిహాస రచనగా 'కాలరేఖలు' నవల కలకాలం తెలుగు నవలా సాహిత్యంలో నిలిచిపోతుంది.

'కాలరేఖలు' నవలలో కథ చెప్పడంలో నవీన్ నాటకీయ శిల్పాన్ని అనుసరించాడు. కథనంలో ఎక్కడా నవీన్ రచయితగా తన అభిప్రాయాలను ఉటంకించలేదు. తన అభిప్రాయాలను సమర్థించుకునే విధంగా సంఘటనల్నీ పాత్రల్నీ మలచలేదు. పాత్రలు ఆయా సన్నివేశాలలోఆయా విషయాలను గురించి ఘర్షిస్తాయే తప్ప ఎక్కడా లాలూచీపడవు. చరిత్రలో యథార్థంగా జరిగిన సంఘటనల ఆధారంగా సామాన్య జన జీవితాన్ని అత్యంత వాస్తవికతతో పాఠకుని ముందుంచే క్రమంలో రచయిత చూపిన సంయమనం ఎంతో మెచ్చుకోదగింది. ఏ సిద్ధాంతరాద్ధాంతాలకు గానీ, నవలలోని ఏ పాత్రవైపుగానీ ప్రత్యేకించి మొగ్గు చూపకుండా రచయిత సమతూకంగా, నిష్పక్షపాతంగా రచనను సాగించడం వల్ల ఆయా సిద్ధాంతాల, పాత్ర జీవన దృక్పథాలు. మనస్తత్వాలు మంచి చెడ్డలను స్వయంగా పాఠకుడే బేరీజు వేసుకోవాల్సి ఉంటుంది. చారిత్రక వాస్తవికత నవలలో ఎక్కడా కాల్పనిక వాస్తవికతకు బలికాదు. కథ చెప్పడంలో రచయిత పాటించిన ఈ తటస్థత ఈ నవలనో గొప్ప నవలగా రూపొందించింది.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని నేపథ్యంగా తీసుకుని ఇదివరకు తెలుగులో చాలా నవలలే వెలువడ్డాయి. కాని ఆ నవలల్లో ఏదో ఒక సిద్ధాంతాన్ని లేక ఆ పోరాటానికి సంబంధించిన యేదో ఒక పార్శ్వాన్ని మాత్రమే ఉదాత్తీకరిస్తూ చిత్రించడం జరిగింది - కాని 'కాలరేఖలు' నవలలో ఆనాటి పోరాటానికి సంబందించిన అన్ని పార్శ్వాలను స్పృశించడం, కథ చెప్పడంలో మూడో వ్యక్తి దృష్టికోణాన్ని అనుసరించడం, అంటే రచయిత తటస్థుడిగా ఉండిపోవడం అనే శిల్పాన్ని ఈ నవలలో నవీన్ సమర్థవంతంగా పోషించాడు. ఓ రచయిత తను సృష్టిస్తున్న పాత్రటపట్ల, తను చిత్రిస్తున్న జీవితం పట్ల ఇంత నిష్పక్షపాతంగా వ్యవహరించగల్గటం ఋషి అయిన వాడికే సాధ్యమౌతుంది. అందుకే మన

పూర్వులు "నాన్నృషిః కురుతే కావ్యం" అన్నారు. అలాంటి ఋషిత్వం నాకీ నవలలో కనిపించింది. ప్రఖ్యాత ఫ్రెంచ్ రచయిత 'కామూ' రచయితకు తన రచన పట్ల నిబద్ధత ఉండాలని చెప్పింది ఈ ఉద్దేశ్యంతోనే.

కథాంశానికికొస్తే, కాలరేఖల్లో స్థూలంగా కథ ఇదీ

నవలలో ప్రధాన పాత్ర రాజు, అతని దృష్టికోణం నుంచే కథంతా నడుస్తుంది. రాజు తండ్రి నర్సయ్య. చిన్నాయన సత్తెయ్య ఒక సిద్ధాతానికి సంబంధించిన రెండు పార్శ్వాలకు ప్రతినిధులు. 1944లో జరిగిన పదకొండో ఆంధ్ర మహాసభలో ఇద్దరూ పాల్గొంటారు. ఈ పదకొండో ఆంధ్ర మహాసభకు కమ్యూనిస్టు నాయకుడు రావినారాయణరెడ్డి అధ్యక్షుడుగా ఎన్నికవుతాడు. అంతకుముందు మితవాదుల చేతుల్లో ఉన్న ఆంధ్ర మహాసభ 1944లో అతివాదులు అంటే కమ్యూనిస్టుల చేతుల్లో పడింది. దాంతో దొరల, దేశముఖుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నిమ్నవర్గాలవారు. చిన్న రైతులు, మధ్యతరగతి రైతులు ప్రారంభించిన పోరాటం ఉధృతరూపాన్ని ధరించింది. ఆంధ్రమహాసభను ఆనాటి గ్రామీణులు "సంగం" అంటుండేవాళ్ళు. బడా భూస్వాములు అంటే ఒకవైపు దొరలకు, దేశముఖులకు, – మరోవైపు తాడితులు, పీడితులకు ఈ రెండు వర్గాల మధ్య సాగిన పోరాటాన్నే ఈ నవల చిత్రిస్తుంది. ఆంధ్రమహాసభలో ఉత్సాహంగా పాల్గొన్న నర్సయ్య, సత్తెయ్యల కోసం పోలీసులు వెతుకుతారు. నర్సయ్య దొరను ఆశ్రయించి అరెస్టును తప్పించుకుంటాడు. కానీ సత్యం (సత్తెయ్య) సాయుధపోరాటానికి తనను తాను పూర్తిగా అర్పించుకుంటాడు. ఆగష్టు 15, 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం రావడంతోఈ పోరాటం మరో మలుపు తిరుగుతుంది. హైదరాబాద్ సంస్థానాన్ని పరిపాలిస్తున్న యేడో నిజాం రాజు – మీర్ ఉస్మాణ్ అలీఖాన్ తన సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసేది లేదని ప్రకటిస్తాడు. స్వతంత్రంగా ఉంటానంటాడు. ఈ కారణం వల్ల యావత్ భారతదేశానికి స్వతంత్రం వచ్చినా హైదరాబాద్ సంస్థానంలోని ప్రధాన భాగమైన తెలంగాణాకు స్వాతంత్ర్యం రాలేదు. ఖాసింరజ్వీ నాయకత్వంలో రజాకార్లు అనే ముస్లిం మతోన్మాదులు తెలంగాణా గ్రామాల మీద దాడిచేసి ప్రజల్ని ఊచకోత

కోశారు. స్త్రీలను చెరచారు. హిందూ మెజారిటీ రాష్ట్రంలో ఉన్న హైదరాబాద్‌ను ముస్లిం మెజారిటీ రాష్ట్రంగా మార్చాలన్నది రజాకర్ల లక్ష్యం. ఈ రజాకార్లనే రాక్షస మూకల బారి నుండి ప్రజల్ని కాపాడవలసిన బాధ్యతను కూడా ఆంధ్రమహాసభ నాయకత్వం తన నెత్తిమీద వేసుకున్నది. సత్యం కోసం రజాకార్లు కూడా గాలిస్తారు. అతని కుటుంబాన్ని హింసిస్తారు. ఆ కుటుంబంలోని స్త్రీలు వడిసెలతో, కారం సంచులతో, రోకలిబండలతో రజాకార్లను ఎదుర్కొంటారు. రజాకార్లు సాగిస్తున్న ఈ బీభత్సానికి తట్టుకోలేక సత్యం కుటుంబం కృష్ణా జిల్లాలోని బందరుకు వలసపోతుంది. తెలంగాణా ప్రాంతానికీ, ఆంధ్ర ప్రాంతానికీ మధ్య ఉన్న సాంస్కృతిక వ్యత్యాసాలను జీవన విధానాన్ని రచయిత ఇక్కడ చిత్రిస్తాడు. కొంతకాలం సత్యం కుటుంబం బందరులో గడిపాక తిరిగి వాళ్ళ స్వగ్రామం చేరుకుంటుంది. రజాకార్లు బైరాన్‌పల్లి అనే గ్రామం మీద పెద్దఎత్తున దాడిచేసి ఒకేరోజు వందమంది యువకులను కాల్చి చంపేస్తారు. సెప్టెంబర్ 1948లో భారత ప్రభుత్వం హైదరాబాద్ సంస్థానంలోకి సైన్యాన్ని పంపించింది. దీనినే చరిత్రలో 'పోలీసు యాక్షన్' అన్నారు. యేడో నిజాం రాజు సైన్యం భారత సైన్యానికి లొంగిపోయింది. సెప్టెంబర్ 17, 1948 నాడు హైదరాబాదు సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేస్తారు. దీంతో కమ్యూనిస్టు పార్టీ జరుపుతున్న సాయుధ పోరాటాన్ని విరమించాలని కొందరు ఆ పార్టీ నాయకులే సూచించారు. కానీ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం సాయుధ పోరాటాన్ని 1951దాకా కొనసాగించింది. ఆ తర్వాత సాయుధ పోరాటాన్ని విరమించి 1952లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పి.డి.ఎఫ్. పేరుతో (పీపుల్స్ డెమొక్రాటిక్ ఫ్రంట్) కమ్యూనిస్టు పార్టీ పాల్గొన్నది. తెలంగాణ ప్రజలు కమ్యూనిస్టు పార్టీ నిలబెట్టిన అభ్యర్థులనే గెలిపించారు. 1952లో ముల్కీరూల్స్‌ని అంటే తెలంగాణ స్థానికులకే ఉద్యోగలివ్వాలన్న నిజాం నవాబు గారి జీవోను అమలుపర్చడంలో జరుగుతున్న అవకతవకల్ని సరి చెయ్యాలన్న ఉద్యమం చెలరేగింది. ఆ తర్వాత 1956లో పెద్ద మనుషుల ఒప్పందాన్ని ఖరారు చేసుకొని భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడాలన్న కేంద్ర ప్రభుత్వ విధానంలో భాగంగా తెలంగాణా జిల్లాలను ఆంధ్రరాష్ట్రంలో విలీనం

చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు. ఇలా 1944లో ప్రారంభమైన 'కాలరేఖలు' నవల 1956లో తెలుగు మాట్లాడే ప్రజలంతా ఒక రాష్ట్రంగా ఏర్పడటంతో ముగుస్తుంది.

పన్నెండేళ్ళను కథా కాలంగా తీసుకున్న ఈ నవలలో రాజు (రాజయ్య) ప్రధాన పాత్ర. నవలంతా అతని దృక్కోణంలోంచే సాగుతుంది. నవల ప్రారంభంలో అతని వయస్సు నాలుగేళ్ళు. నవల పూర్తయ్యేటప్పటికి అతడు పదహారేళ్ళ నవయువకుడుగా మన ముందు నిలుస్తాడు. అలా రాజు అక్షరాభ్యాసంతో ప్రారంభమైన ఈ నవల అతడు మెట్రిక్యులేషన్ పరీక్ష రాయడంతో పూర్తవుతుంది. ఇలా ఈ నవల పైకి ఓ వ్యక్తి సాగించిన జీవితయాత్రలా కనిపించినా నిజానికిది నవలా రూపంలో సాగిన సామాజిక చరిత్ర. ఈ నవలలో కొన్ని వందల పాత్రలున్నాయి. ఐదారు కుటుంబా లున్నాయి. ఆనాటి పోరాటానికి కేంద్రాలైన ఎన్నో గ్రామాలున్నాయి.

ఈ నవలలో ప్రధాన పాత్రలైన రాజు బాల్యంలోంచి ఆరంభ యౌవ్వనంలోకి ప్రవేశించే క్రమంలో అతడు పొందిన మేధోవికాసాన్ని చిత్రించిన తీరు అత్యంత వాస్తవికంగా ఉంది. తన చుట్టూ జరుగుతున్న సంఘటనలకు సాక్షీభూతుడుగా ఉన్న రాజు ఆ సంఘటనల నుండి యేం నేర్చుకున్నాడో ఈ నవల చిత్రిస్తుంది. చదువుకోవడం ద్వారా క్రమంగా అతని చైతన్య పరిధి ఎలా విస్తరించిందో ఈ నవల మనకు చూపిస్తుంది. బాల్యంలోనే రాజులో మొగ్గగా ఉన్న రచయిత క్రమంగా ఎలా వికసించాడో ఈ నవలలో చిత్రించిన పద్ధతి అద్భుతంగా ఉంది. భవిష్యత్తులో రాజు ఒక కళాకారుడుగా రూపొందబోతున్నాడన్న సూచనల్ని రచయిత చిత్రించిన విధానం ఎంతో హృద్యంగా ఉంది. రాజు కళ్ళలోంచే ఈ నవలలోని అనేక దృశ్యాల్ని, సంఘటనల్ని రచయిత మనకు అలవోకగా చూపిస్తాడు. బాల్యం నుండి యౌవ్వనం వరకు ఓ కళాకారుడు సాగించిన ప్రస్థానంగా కూడా ఈ నవలను అభివర్ణించవచ్చు.

ఈ నవలలో నవీన్ వాడిన భాషను గూర్చి రెండు మాటలు చెప్పాలి.

ఈ నవలలోని సంభాషణలన్నీ తెలంగాణా మాండలికంలో సాగుతాయి. కథా రచన (Narration) మాత్రం శిష్ట వ్యావహారికంలో సాగుతుంది. సంభాషణల్లో వాడబడిన తెలంగాణ మాండలికం కూడా చాలా సరళంగా ఉంటుంది. పాత్రోచిత సంభాషణల వరకే మాండలికాన్ని పరిమితం చెయ్యడం వల్ల తెలుగువాళ్ళందరూ ఈ నవలను చదివి ఆనందించే అవకాశం కల్గింది.

ఈ నవలలోని మరో గొప్ప అంశం

ఆ నాటికీ, ఈనాటికీ మన సమాజాన్ని పట్టి పీడిస్తున్న ఎన్నో మూఢ నమ్మకాల్ని చిత్రిసస్తూ, ఈ నవలలోని కథానాయకుడు రాజు ఆ మూఢనమ్మకాల్ని అనుక్షణం ప్రశ్నిస్తూ, ఖండిస్తూ తనలో శాస్త్రీయ దృక్పథాన్ని ఎలా పెంచుకున్నాడో చూపించడం. ప్రతిదాన్ని పెద్దలు చెప్పారని గుడ్డిగా నమ్మడం కాకుండా వాటిలోని నిజానిజాల్ని స్వానుభవంతో తెలుసుకోవాలని ఈ నవలలోని రాజు పాత్ర ద్వారా రచయిత ఉద్బోధించాడు. రాజులో బాల్యం నుండే శాస్త్రీయ దృక్పథం ఏర్పడే క్రమాన్ని రచయిత ఎంతో మెలకువతో సూక్ష్మదృష్టితో చిత్రించడం చాలా గొప్పగా ఉంది. చిన్న పిల్లలు కూడా ఈ నవల చదివి తమలో శాస్త్రీయ దృక్పథాన్ని ఏర్పర్చుకునే అవకాశం ఉంది.

'కాలరేఖలు' నవలలో మనకు అడుగడుగునా కనిపించే మరో అంశం ప్రాంతీయత లేక ప్రాదేశికత (Provinciality) ఇది నిందార్థం కాదు. ఏ సాహిత్యానికైనా ఉండాల్సిన గొప్ప గుణం. ఎక్కడా ఎప్పుడూ కనిపించని పాత్రలను ప్రదేశపెట్టేవాడు. గొప్ప నవలాకారుడనిపించుకోడు. కృషిశ్రేష్ఠతను నిర్ధారించేది రచయిత నిజాయితి. ఈ నిజాయితి 'కాలరేఖలు'లో పుష్కలంగా ఉంది. తనకు తెలియని ప్రాంతాన్ని గానీ, వాతావరణాన్ని గానీ రచయిత చిత్రించే ప్రయత్నం చెయ్యలేదు. "ది ఓల్డ్‌మ్యాన్ అండ్ ద సీ" అనే హెమింగ్వే నవలలోని పాత్రలు వాస్తవికమైనవి కావని, ఘటనాక్రమం వాస్తవదూరమైనదని, భావాలు హృదయాంతరాళం నుండి ఉప్పొంగి వచ్చినవి కావని విమర్శకులు తప్పు పట్టిన దాఖలాలున్నాయి. నవీన్ నవలల్లోని పాత్రలు, సన్నివేశాలు అంతర్లీనంగా ప్రవహించే భావధార,

కృత్రిమమని (Fake) అనడానికి ఎవరూ సాహించరని నా ప్రగాఢ విశ్వాసం. ఈ నవలలోని రాజు, సుశీల, నర్సయ్య, రాధమ్మ, సజీవమైనవిగా, సహజమైనవిగా మనకు కనిపిస్తాయి. ఈ నవలలోని స్త్రీ పాత్రలు రాధమ్మ, సత్తెమ్మత్త, ప్రమీల, సుశీల, రుక్కమ్మ, పార్వతమ్మ మొదలైన వాళ్ళు మమూలు గృహిణులుగా ఉంటూనే ఆనాటి పోరాటంలో ఎలా వీరోచితంగా పాల్గొన్నారో, రజాకార్లలాంటి ముష్కరుల నుండి తమను తాము ఎలా రక్షించుకున్నారో చిత్రించిన తీరు ఈనాటి స్త్రీలకు ఎంతో కనువిప్పుగా ఉంటుంది.

ఇతర సాహితీ ప్రక్రియల కంటే నవల మానవ జీవితానికి అత్యంత చేరువగా వచ్చే ప్రక్రియ. ఈ ప్రకియలో కృత్రిమత్వానికి రవ్వంతైనా చోటు లేదు. అపారమైన శబ్ద వైభవంతో తిమ్మిని బమ్మిని చేయడానికి వెసులుబాటు కల్పించనిది. సత్యం యెడ, సమాజ శ్రేయస్సు యెడ అకుంఠిత నిబద్ధత కలది. మానవ పరిసరాలను సూక్ష్మంగా పరిశీలించే సామర్థ్యం కలది. నవల మూలాలు అనుభవవాదం (Empiricism) లో ఉన్నాయి.

రాగాలనంతాలైనట్టే నవలారూపాలు కూడా అనంతాలు. టి.ఎస్. ఎలియట్ చెప్పినట్లు ప్రతి జాతికి సృజనాత్మక, విమర్శనాత్మక మనోవిన్యాసం ఉంటుంది. నవలను సైతం సంస్కృతీ విశేషంగానే (Culture Specific) చెప్పుకోవాలి. ఫ్రెంచ్ నవల తాత్త్విక భూమికకు ప్రతీకాత్మకరూపం. 'కామూ' నవల "ప్లేగ్" ఇందుకు ఉదాహరణగా చెప్పొచ్చు. ఫ్రెంచ్ నవల వంటిదే రష్యన్ నవల. ఆంగ్ల నవల ఇందుకు పూర్తిగా విభిన్నమైంది. నేలను విడిచి సాము చేసే గుణం ఆంగ్ల నవలకు లేదు. నవీన్ నవల "కాలరేఖలు" ఆంగ్ల నవలల సంప్రదాయాన్నే పుణికి పుచ్చుకున్నదని చెప్పొచ్చు. తాత్త్విక భూమిక కంటె యదార్థాన్ని చిత్రించడమే ఈ నవల లక్ష్యం.

భారతీయ సాహిత్యంలో అసలు సిసలైన నవల ప్రాదుర్భవించలేదని సర్దార్ కుష్వంత్‌సింగ్ కొన్నేళ్ళ క్రితం సెలవిచ్చాడు. భారతీయ పాఠకుల మనస్సులపై చెరగని ముద్రవేసిన మున్షీ ప్రేమ్‌చంద్, శరత్‌బాబు, పురుషోత్తం రేగే, ముల్క్‌రాజ్ ఆనంద్ మొదలైన నవలాకారులు కుష్వంత్‌సింగ్

గుర్తింపుకు అర్హులు కాకపోవడం నవలా విమర్శా ప్రస్థానంలో ఒక విషాద ఘటన.

కుష్వంత్‌సింగ్ ఈ 'కాలరేఖలు' నవల చదివితే తన అభిప్రాయాన్ని మార్చుకుంటాడని నా నమ్మకం.

సాహిత్య ప్రక్రియగా నవల అంతరిస్తుందని గత శతాబ్దంలోనే కొందరు మేధావులు జోస్యం చెప్పారు. ఈ భూమిపై మానవుడి మనుగడ కొనసాగినంత కాలం నవల సజీవంగా ఉంటుంది. మన వ్యక్తిత్వ వికాసానికి నవల ప్రేరకమైనట్టుగా మరేదీ కాదు. మనల్ని అంతర్ముఖుల్ని చేసి సామరస్య భావనతో మనుగడ సాగించేలా 'కాలరేఖలు'లాంటి నవలలు చేస్తాయి. కాబట్టి మంచి నవలలకు మరణం లేదని మన మేధావులు గుర్తించాలి.

ఈ సందర్భంలో నవలను గురించి డి. హెచ్. లారెన్స్ చెప్పింది గుర్తు చేసుకోవడం ఎంతైనా అవసరం.

"తత్త్వవేత్త వస్తుతత్వాన్ని విశ్లేషిస్తాడు. మతాచార్యుడు స్వర్గధామాల్ని గూర్చి గోరంతలు కొండంతలు చేస్తాడు. వైజ్ఞానికుని దృష్టిలో మానవదేహం కతిపయ వ్యవస్థల సంఘాతం, వీళ్లందరిదీ పాక్షిక దృష్టి. కానీ నవలా కారుడిది సమగ్ర దృష్టి. నవల తేజోవంతమైన బతుకు పుస్తకం కాబట్టి వీళ్ళందరికంటే నవలాకారుడుగా నేను గొప్పవాణ్ణి" అన్నాడు లారెన్స్ "Why the Novel matters" అన్న వ్యాసంలో.

సమగ్ర జీవనదర్శనం నవలలోనే కల్గుతుంది అన్న లారెన్స్ మాటను అక్షరాలా నిజం చేసిన నవల "కాలరేఖలు".

పోయిన యాభై ఏండ్ల (1944–1994) తెలంగాణా జనజీవనంలో ఉత్పన్నమైన ఆర్థిక సామాజిక, రాజకీయ పరివర్తనను సూక్ష్మాతి సూక్ష్మంగా చిత్రీకరించిన నవలాకారుల్లో ప్రథమ స్మరణీయుడు నవీన్. ఆయన నవలలో కొత్తదనం ఉంది. యదార్థం ఉంది. రచయితకు ఇష్టమైనదాన్ని ఉదాత్తీకరించే ప్రయత్నం ఎక్కడా జరగలేదు. రంగులద్ది అలరించే ప్రయత్నమూ జరగలేదు.

నవీన్ ఇటీవలి నవలాత్రయాన్ని – "కాలరేఖలు", "చెదిరిన స్వప్నాలు",

"బాంధవ్యాలు" చదివిన పాఠకులకు వెంటనే గుర్తుకు వచ్చే పాశ్చాత్య నవలా కారుడెవరు ? 'కాముూ' గానీ "సార్త్రేత" గానీ కారు - వీరు తాత్త్వికతను నవలల్లో జోడించిన నవలాకారులు. జర్మన్ నవలాకారుడు "కాఫ్కా"నా? కాదు మరెవరు ? నా సమాధానం అమెరికాలోని చికాగో నగరాన్ని యావజ్జీవితం కార్యక్షేత్రంగా ఎంచుకున్న అమెరికన్ నవలాకారుడు "సాల్‌బెలో" (Saeul Bellow). (నోబెల్ పురస్కార గ్రహీత సాల్‌బెలో ఇటీవలనే మరణించాడు).

సాల్‌బెలో తనను తాను సామాజిక చరిత్రకారునిగా ప్రకటించు కున్నాడు. సమకాలీన సాహిత్య సృజన సిద్ధాంతాలకు, ఉద్యమాలకు అతీతుడుగా ఉంటూ తనదైన ఫక్కీలో రచనలు సాగించాడు. ఒక సందర్భంలో అతడన్న మాట నవీన్‌కు అక్షరాలా వర్తిస్తుంది.

"నాకు దృశ్యమానమవుతున్న దాన్ని అధిగమించను. చరిత్రకారునివలె నేను సైతం సందర్భ నిబద్ధుణ్ణి"

సాల్‌బెలో చికాగో ఎలాగో నవీన్‌కు అతని స్వగ్రామం, అప్పటి నల్లగొండ జిల్లాలోని వావిలాల, దాని పరిసరాలు అలాగ.

నాటి తెలంగాణాలో సమాజం నాలుగు వర్గాలుగా చీలింది. 1. భూస్వామ్య వర్గం - అంటే అగ్రవర్ణం లేక పాలకవర్గం, 2. సన్నకారు రైతులు, 3. వృత్తి పనివాళ్ళు మరియు భూమి హీనులు, 4. వెట్టిచాకిరీ చేస్తూ సర్కారు వారి మరియు దొరల దౌర్జన్యాలకు గురిఅయిన దళితులు. నాటి హైదరాబాద్ సంస్థానంలోని తెలంగాణా ఒక బృహద్విశ్వమైతే అప్పటి నల్గొండ జిల్లాలోని వావిలాల దాని పరిసర గ్రామాలైన పాలకుర్తి, కడివెండి, దేవరుప్పులి మొదలైనవి లఘు విశ్వాలన్నమాట. పై గ్రామాలతో పాటే ప్రత్యేకంగా పేర్కొనదగిన గ్రామం విసూ్నరు. విసూ్నరు దొరవారి కుమారుడు బాపుదొర సాగించిన దురాగతాలు "కాలరేఖలు" నవలలో విస్తృతంగా చిత్రించబడ్డాయి.

1944లో పదకొండవ ఆంధ్ర మహాసభ నల్లగొండ జిల్లాలలోని బోనగిరిలో జరగనుంది. జనసేకరణ నిమిత్తం రావినారాయణరెడ్డి, బద్దం

ఎల్లారెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి కథానాయకుడైన రాజు గ్రామానికి – అంటే వాయిల్పాడుకు రావడం, పదకొండు జతల ఎడ్లను కట్టిన బండిలో (పదకొండవ ఆంధ్రమహాసభకు సంకేతంగా) ఊరేగింపు తీయడం, ఎన్నో ఏళ్ళుగా నిద్రాణంగా ఉన్న తెలంగాణ పల్లె వాయిల్పాడులోని (వావిలాల గ్రామమే నవలలో వాయిల్పాడయ్యింది) మట్టికి ఈ నాయకుల రాకతో చైతన్య స్పర్శ కల్గటం – 'కాలరేఖలు' నవలకు ఇది ప్రారంభం. జనంలో ఉత్సాహం ఉరకలు వేస్తోంటే ఆడుతూ, పాడుతూ, జైకొడ్తూ ఊరేగింపు ముందుకు సాగిపోతున్నది. ఈ దృశ్యాన్ని చదువుతుంటే ఆనాటి ఆ ఊరేగింపులో మనమూ పాల్గొనట్టుగా అనుభూతి చెందుతాం. అన్యాయానికీ, శోషణకూ, స్వేచ్ఛారాహిత్యానికి విరుద్ధంగా పోరాడుతూ అసువులు బాసిన వీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్టుగా ఫీలౌతారు. వాళ్ళ త్యాగఫలితంగానే మన బతుకులు కాస్తో కూస్తో చక్కబడ్డాయన్న జ్ఞానోదయం మనకు కల్గుతుంది.

ఈ ఊరేగింపులో పాల్గొంటున్న పసిపిల్లలు రాజునూ, సుశీలనూ చూస్తోంటే ప్రఖ్యాత సినిమా "పథేర్ పాంచాలి"లోని అక్కాతమ్ముడు అపూ, దుర్గలు గుర్తొస్తారు. "పథేర్ పాంచాలి" నవలలోనూ ఆ నవల ఆధారంగా అదే పేరుతో సత్యజిత్‌రే నిర్మించిన "ఫథేర్ పాంచాలి" సినిమాలోనూ అపూ, దుర్గలు మొదటిసారి రైలుబండిని చూసినప్పుడు ఎలాంటి ఉత్తేజాన్ని పొందారో ఈ నవలలోని రాజు, సుశీలలు ఆ ఊరేగింపును చూసినప్పుడు అలాంటి ఉత్తేజాన్నే పొందారనిపిస్తుంది.

ఈ నవల ముగిసే నాటికి మధ్యలోనే సుశీల చనిపోతుంది. రాజు మెట్రిక్యులేషన్ పరీక్షలు రాస్తాడు. వాయిల్పాడు గ్రామం నుండి మెట్రిక్ పరీక్షలు రాసిన మొట్టమొదటి విద్యార్థి రాజు. 'కాలరేఖలు' నాయికా నాయకులు ప్రధానమైన నవల కాదు. సమసమాజ స్థాపనకోసం ఓ మానవ సమూహం సాగించిన మహాప్రస్థానమే ఈ నవల. ఇది ఇంకా చీకటిలో మ్రగ్గుతున్న మానవ సమూహాలకు స్ఫూర్తిదాయకమైన గ్రంథం.

దౌర్జన్యం, దౌష్ట్యం కలకాలం సాగుతాయా ? వాటిని ఎదిరించే శక్తులు

సహజంగానే పుట్టుకొస్తాయి. మానవ చరిత్ర యొక్క సంపూర్ణ అవగాహన ఉన్న వ్యక్తి ఏనాడూ నిరాశ, నిస్పృహలకు గురికాడు. 'కాలరేఖలు' నవల ఇచ్చే సందేశం ఇదే.

కాలమే సత్యం – కాలమే ఈశ్వరుడు. కాలమే సృష్టికి, స్థితికి, లయానికి మూలహేతువు. అన్ని రకాల ఒడిదుడుకులను కాలమే సరిచేస్తుంది. సర్వ యాతనలకు కాలమే భేషజం. 'కాలరేఖలు'లో గర్భితమైన ఈ అర్థాన్ని పసిగట్టగలవాడే "క్రాంతదర్శి".

రోజుకో ముగ్గురు అమాయకుల్ని నిష్కారణంగా రైఫిల్‌తో కాల్చి చంపే వరకు నిదురపోని విస్నూరు దొర కొడుకు బాపు దొర దుర్మరణం ఆకతాయి కృత్యాలకు పాల్పడే ధూర్తులకు ఒక హెచ్చరిక. ఖాసిం రజ్వీలాంటి మతోన్మాదులను కూడా చరిత్రలోని చెత్తబుట్టలో మీరు కలిసిపోక తప్పదని ఈ నవల హెచ్చరిస్తుంది.

"కాలరేఖలు"లో అడుగడుగునా అణచబడిన మానవ సమూహం. దృగ్గోచరమౌతుంది. "అవమానిత మానవ విజయం కోసం చరిత్ర ఎదురు చూస్తోంది" అన్న రవీంద్రుని మాటను ప్రతీకాత్మక రూపంలో... అంటే "కాలరేఖలు" అనే నవలా రూపంలో మనముందుంచాడు నవీన్. నవలాకారుడిగా ఆయన జన్మ ధన్యమైంది.

-గజానన్ తామస్

అనుమాండ్ల వారి నికషోపలం పై విశ్వనాథ వేయిపడగలు

ఏండ్లు గడచినా ఇసుమంత వసివాడని అనర్ఘ పారిజాత ప్రసూనం విశ్వనాథవారి వేయిపడగలు. 1934లో సరిగ్గా 29 రోజుల్లో కవిసమ్రాట్ ఈ నవలను రచించి పురస్కారానికి అడవి బాపిరాజు 'నారాయణరావు'తో పాటు అర్హత కలదిగా ఈ అపూర్వకృతి నిలిచినది. ధారావాహికా రూపంలో ఆంధ్రపత్రిక దీనిని 1937-38లలో ప్రచురించి తెలుగు పఠితలకు చదివి ఆనందించే అవకాశాన్ని ప్రసాదించింది. భూతపూర్వ భారత ప్రధాని కీ.శే. పి.వి. నరసింహారావు గారిచే 'సహస్రఫణ్' అనే పేరుతో 1968 ప్రాంతాలలో అనూదితమైంది. ఇరువది యొక్క మార్లు ముద్రణలకు నోచుకొని లక్ష ప్రతులకు చేరుకొన్నది. ఈ నవలపై కదలిన సమీక్షలు, అనుశీనలు, విమర్శలు కొల్లలు. వాటిని గురించి ప్రస్తావించడం మా బోంట్లకు సాధ్యమయ్యే పనికాదు. వేయిపడగల వంటి మహోన్నతమైన సాహిత్యకృతి మన్మిత్రులు డా॥ అనుమాండ్ల భూమయ్య గారిని విద్యార్థి దశలోనే ఆకట్టుకొని పఠింపచేసింది. వారు నిరంతరాధ్యయనశీలిగా, కావ్యాను శీలనంలో ఆరితేరిన నిష్ణాతులుగా, దిట్టగా, ఉత్తమ కవిగా తెలుగు సాహితీ జగత్తుకు సుపరిచితులు. వారి సుదీర్ఘ వైచారిక మంథన ఫలితమే ఈ విమర్శగ్రంథం 'వేయిపడగలు - ఆధునిక ఇతిహాసం' దీనిని గురించే ముచ్చటించే ముందు కొంత పూర్వరంగ నిర్మితికి పూనుకొంటాను.

వేయిపడగలు ఏ సాహిత్య ప్రక్రియకు చెందినదన్న విషయం పలు వివాదాలకు దారి తీసింది. కొందరు దీనిని నవలగా నిర్ధారిస్తే ప్రతీక ప్రఖ్యమైన 'పసరిక' వంటి పాత్ర గల ఈ రీతి నవల ఎలా అవుతుందని ప్రశ్నించిన వారు లేకపోలేదు. మరికొందరు దీనిని 'నవలేతిహాస'మన్నారు. ఈ 'నవలేతిహాసమనేది' పాశ్చాత్య సాహిత్యంలోని Epic Novel అనే దానికి సమానార్థక శబ్దమని తలుస్తాను. Epic Novel ఒక విశిష్ట వాఙ్మయ ప్రక్రియకాదు. ఇతిహాసానికి గల విస్తృత పార్శ్వాన్ని అరువు దెచ్చుకొన్న నవల మరో విధంగా చెప్పాలంటే ఒకానొక మానవ సమూహ జీవనరీతులను సమగ్రంగా ప్రతిఫలించే సాహిత్య కృతి. ఆంగ్లంలోని 'టామ్ జోన్స్' రష్యన్‌లోని 'వార్ అన్డ్ పీస్' ఈ కోవకు చెందినవిగా చెప్పుకొన వచ్చును. 'నవలేతిహాసం' అనే కంటే 'బృహన్నవల' అనడం యుక్తి

యుక్తమని నా అభిమతం.

ప్రాచీన పాశ్చాత్య సాహిత్య ప్రక్రియ 'ఎపిక్' దీనికి తత్తుల్యమైనది. 'ఇతిహాసం' డా॥ భూమయ్య వెలిబుచ్చిన ఈ అభిప్రాయానికి భిన్నాభిప్రాయం ఉంటుందని నేను అనుకొనను. భారతీయ సాహిత్యానికి చెందిన రామాయణ మహాభారతాలు ఇతిహాసాలుగా పేర్కొనడం పునఃప్రోక్తమే అవుతుంది. Epic అనబడేది అత్యంత ప్రాచీనమైన పాశ్చాత్య సాహిత్య ప్రక్రియ. దైవాంశ సంభూతుడు లేక మహామానవుడు ఇందులో కేంద్ర స్థానీయుడు. తనకు చెందిన మానవ సమూహాన్ని సంకటస్థితి నుండి సంక్షేమ స్థితికి చేర్చడానికి సుదీర్ఘ సమరం కావించి విజయుడౌతాడు. సమర ప్రసంగం 'ఎపిక్'కు జీవధాతువు. ఇది వినాకృతి రక్తి కట్టదు; పఠితలకు ఆద్యంతం మనోల్లాసాన్ని కలిగించజాలదు. భాష లోక వ్యవహారం లోనిది కాదు. ఛందోబద్ధమై, నానాలంకారయుతమై ఉదాత్తీకరించబడినట్టిది.

హోమర్ విరచిత 'ఇలియడ్'లోకి తొంగిచూద్దాం. ఇందులో మనకు సాక్షాత్కరించే అతిలోక సౌందర్యరాశి హెలెన్. స్పార్టా రాకుమారుడు ఈమెను అపహరించడం మూలాన నానాద్వీప సమాహారమైన గ్రీస్‌లో సంక్షోభం ఏర్పడుతుంది. పూర్వ మొనర్చుకొన్న సమయానుసారం గ్రీసుకు చెందిన రాజన్య సమూహం స్పార్టాపై యుద్ధం ప్రకటిస్తుంది. ద్వాదశవత్సరాలు సాగిన ఈ ఘోరసమరంలో దేవతలు సైతం ఏదో ఒక పక్షం వహిస్తారు. ధర్మం జయిస్తుంది. ధర్మ విరోధులైన స్పార్టా జనులు ప్రాణమాన సంపద్దానిని చవి చూస్తారు. 'హెలెన్'ను ఆమె భర్తయైన మెనిలస్‌కు అప్పగించడంతో కథ సుఖాంతమౌతుంది. హోమర్ తరువాత వచ్చిన వర్జిల్ 'ఈనిడ్', దాంతే 'డివైనా కమేడియా' విభిన్న ఇతివృత్తాలు కలవి.

డా॥ భూమయ్య నుడివినట్లు కాలంలో వచ్చే మార్పులాగానే సాహిత్య సృజనలో మార్పు సంభవిస్తుంది. రూప, వస్తు సంబంధమైన సంకల్పనలు (Concepts) మార్పుకు లోనవుతవి. సృజనను లక్షణము అనుసరిస్తుంది. లక్షణము సృజనకు పథనిర్దేశం చేయదు. సాహిత్య సిద్ధాంతం (Theory of literature) కావ్య స్వరూప వర్ణనకే పరిమితమౌతుంది. శాస్త్రగా ప్రవర్తించినవేళ అస్తిత్వ హేతువును (raison d'etre) కోలుపోతుంది.

సమస్త విశ్వ సాహిత్యేతిహాసాన్ని పరికించినట్లవుతే మనకు బోధపడే విషయం ఒకటి ఉంది. మానవజాతి సంస్కృతే శైశవంలో సాహిత్య సృజన దేవతానీకం చుట్టు పరిభ్రమించింది. కాలం గడిచేకొద్ది ఒక్కొక్క మెట్టుదిగి నింగికి దూరమై నేలకు చేరువయ్యింది. వర్తమానంలో సామాన్య మానవ జయాపజయాలకు, హర్ష విషాదాలకు, సమసమాజ నిర్మితికై కావింపబడుతున్న సంఘర్షణకు, దర్పణంగా సాహిత్యం రూపుదిద్దుకోవడాన్ని మనం గమనిస్తూనే ఉన్నాము. దళిత బహుజన వర్గాలు సాహిత్యాన్ని ఆయుధంగా మలచుకొనడం మనకు దృగ్గోచరం కాని విషయం కాదు. ఒకవైపు అసమంజసుల అకృత్యాలను బట్టబయలు చేస్తూనే, వారియెడ నిరసన ఘోషిస్తూనే మరొకవైపు అనికేతుల, అకించనుల పక్షం వహించి విరతి ఎరుగని న్యాయపోరాటానికి పూనుకొన్నది నేటి సాహిత్యం.

'ఇతిహాసం' అతీతానికి చెందింది. 'నవల' వర్తమానానికి, వస్తుపరంగా చూచినప్పుడు ఇవి భిన్న ధ్రువాలను ఆశ్రయించినవిగా స్పష్టమౌతుంది. ఒకదాని తిరోగమనానికి మరొకదాని పురోగమనానికి కారణభూతమైన సంఘటన ఫ్రెంచ్ విప్లవం. ఇది రాజన్యుల మట్టిగరిపించి సామాన్యుల ఉజ్వల భవితకై యుగద్వారాల్ని తెరదించి కల్పనావాదం మసకబారి, యధార్థవాదం తొలి వెలుగులు ప్రసరిస్తున్న వేళ నవలా ప్రక్రియ రేకులు విప్పుకొన్నది. అందమైన ఆడపిల్లలను చెరబట్టి కోటలో బంధించే ఆతతాయి మూకలు,వారితో పోరి చెరవిడిపించే అశ్వారూఢులు ఆయుధపాణ/లైన వీర పురుషులు తెరమరుగయినారు. దివాస్వప్నానికి ప్రతిఫలనమై కలవారి కలికిని అలరించే ఫ్యూడల్ వ్యవస్థకుచెందిన 'రొమాన్స్' అస్తంగతమై, మధ్యమ వర్గీయ మానవుని జీవితంలోని చీకటి వెలుగులను ప్రతిఫలించే 'నవల' ఉదయించింది.

డా॥ భూమయ్యగారి అనుశీలన గ్రంథం 'వేయిపడగలు – ఆధునిక ఇతిహాసం' ఏడు అధ్యాయాలు కలది. 1. ఇతిహాసం, 2. వస్తు సంవిధానం, 3. కథానాయకత్వం, 4. అనుకథలు, 5. కర్మఫలానుభవం, 6. ప్రతీకాత్మకత, 7. ఉపసంహారం.

ఇతిహాసం ఒక ప్రాచీన సాహిత్య ప్రక్రియ. కాలానుగుణంగా మార్పులకు లోనవుతూ నేటిదాకా సాగివస్తూనే ఉంది. డా॥ సుప్రసన్న

సహృదయ చక్రంలో చెప్పినమాటనే డా॥ భూమయ్యగారు అధ్యాయం ఆరంభంలో ఉద్ధరించారు. వీరిరువురి దృష్టిలో ఆధునిక ఇతిహాసం 'నవల'కు పర్యాయపదం. ఇలా ఎందుకంటున్నానంటే డా॥ భూమయ్య స్వీయ గ్రంథంలో 'వేయిపడగలు'ను 'ఆధునిక ఇతిహాసం'గా చెప్పుతూ డా॥ జి. లక్ష్మణరావు గారి వేయిపడగలు : ఒక దర్శనం అనే పుస్తకానికి కూర్చిన కైసేత 'అభినందన'లో వేయి పేజీల నవలగా, పాఠకులను విశేషించి ఆకర్షించినదిగా అభిప్రాయాన్ని వెలిబుచ్చినారు. 'ఇతిహాసానికి' 'నవల'కు గల జనకజన్య సంబంధాన్ని నేను కాదనను. మానవుని సంస్కృతీ శైశవంలో ఆవిర్భవించింది ఇతిహాసం కాదు. పురాగాథ (Myth). పురాగాథ నుంచి ఇతిహాసం, ఇతిహాసం నుంచి 'రొమాన్స్', రొమాన్స్ నుంచి 'నవల' పురుడు పోసుకొన్నది. ఏది ఏమైనా వీరు ప్రథమాధ్యాయంలో 'ఇతిహాసం' పుట్టు పూర్వోత్తరాలను సమగ్రంగా చర్చించినారు. పాశ్చాత్య సాహిత్యమునకు చెందిన 'ఎపిక్'కు గల ప్రయోజనాన్ని చెప్పకుండా, నా దృష్టిలో, వదిలివేసినారు. మరో విషయము. 'ఎపిక్' అనబడే ప్రక్రియ లిఖిత సాహిత్యానికి గాక మౌఖిక సాహిత్యానికి (Oral) చెందినది. పఠనానికి గాక పాడుటకు అనువైనది. సంచార గాయకులు (Bards) దేశదేశాలకు వెళ్ళి ధనికుల కొలువు కూటాల్లో పాడి జాతిలో చైతన్యం నింపేవారు. ఎపిక్‌కు గల ప్రయోజనం ఇది. మరి, భారతీయ సాహిత్యానికి చెందిన ఇతిహాసానికి గల ప్రయోజనం ఏమిటి ? ఈక్రింది శ్లోకము ద్రష్టవ్యము.

ధర్మార్థకామమోక్షాణాముపదేశ సమన్వితమ్
పూర్వవృత్తం, కథాయుక్త మితిహాసం ప్రచక్షతే.

'విశ్వనాథ : వేయపడగలులో కథ మరియు ఉపదేశం గవేషింప దగిన అంశములు. డా॥ అనుమాండ్ల భూమయ్యగారు వీనిని గవేషించుటలో సంపూర్ణంగా కృతకృత్యులైనారని చెప్పుటలో నాకెట్టి సందేహము లేదు.

వీరికి దీర్ఘాయువు ప్రసాదించాలని నా యిష్ట దైవత్వాన్ని వేడుతూ ఇంతటితో ముగిస్తాను.

-గజానన్ తామన్

పాల్కురికి కృతులు : ఒక స్పందన

మన తెలంగాణకు చెందిన పాల్కుర్కి సోమనాథుడు రచించిన 'వృషాధిప శతకము' అష్టోత్తర శతవృత్తాలు కలది. ఈయన జీవించిన దేశ కాలాల గురించి పలు వివాదాలు తలెత్తినా, సోమనాథుని 'పాల్కుర్కి' కర్ణాటకలోని తుముకూరు జిల్లాలోని 'హాలుకురికి' యో, గోదావరి జిల్లాలోని ఏదో ఒక గ్రామమెూ కాదని, ఓరుగల్లుకు సమీపంలో ఉన్న నేటి 'పాలకుర్తి'యని విమర్శకులు అంతిమంగా నిర్ణయించినారు. ఈయన జన్మతః బ్రాహ్మణుడు. శ్రియాదేవి, విష్ణురామిదేవులు ఈయన జననీ జనకులు. నాటి తెలుగునాట వ్యాప్తినొందిన వీరశైవ ధర్మావలంబియై తనను 'పాశవిముక్తిని'గా కేవలము భక్తి గోత్రునిగా చాటుకొనినాడు.

బహుదేవతారాధనకు అంకితమైన విప్రుల పథము నగర వధూపథము వంటిదైనందున తనకు బొత్తిగా సమ్మతం కాదని తాను శివదీక్షాపరుడనని, కులమతాలకు అతీతుడనని ఉపనయనోద్యోగం విరమించుకోవలసినదని బసవన తన జన్మదాతయైన తండ్రితో నిష్ఠురములాడినాడు.

బసవపురాణాన్ని ప్రస్తుతానికి వదలివేసి, వృషాధిప శతకాన్ని గురించి కొన్ని మాటలు చెప్పదలచినాను. ఈ శతకంలో రెండు వంతులు 'ఉత్పల మాల'లు ఒక వంతు చంపకమాలలున్నవి. ఇందులో 'బలుపొడతోలు చీరయును' అనే పద్యం తప్ప మిగతా పద్యాలు నారికేళపాకంలో ఉన్నవి. అంటే సామాన్యులకు అర్థంకాని సంస్కృత పదభూయిష్ఠమైనవిగా ఉన్నవి. అర్థాలంకారాల కన్న శబ్దాలంకారాలకే సింహభాగము. 'ఛేకానుప్రాసం' ఇతనికి అత్యంత ప్రియమైనదిగా తోచును. సోమనాథ విరచిత 'వృషాధిప శతకము' తెలుగు భాషలో వెలువడిన తొలిశతకమని లబ్ధ ప్రతిష్ఠులైన విమర్శకుల అభిప్రాయపడినారు.

సోమనాథుడు దేశంలోని అనేక ప్రాంతాలకు సందర్శించి విలువైన అనుభవాలను గడించిన ధన్యజీవి. బహుభాషావేత్త. సంస్కృతాంధ్రాలతో పాటు ద్రవిడ, కన్నడ, మరాఠీ భాషలలో శ్లాఘనీయ వైదుష్యాన్ని సముపార్జించిన కవిశేఖరుడు. ఏతచ్ఛతకంలో పై భాషలకు సంబంధించిన

ఒక్కొక్క పద్యమున్నది. 'జానుతెనుగు) అభిమానినని కవి అమితోత్సాహంతో ప్రకటించుకొన్నను ఇందులోని పద్యములు సామాన్య జనాకలన పరిధికి బాహిరమైనవిగానున్నవి. సంస్కృతపదగ్రధిత సమాసాలు, తారకల వెల్గుల వెల్లువలో తెలుగు పదాలు కంటికి కానరాని ఖద్యోతముల భాతి మినుకు మినుకుమనుచున్నవి.

అర్థావగాహనకు శబ్దకోశం వినాగత్యంతరం లేని దిగువ పద్యాన్ని గమనించండి.

శత్రులతాలవిత్ర గుణజైత్ర భవాబ్ధివహిత్ర జంగమ
క్షేత్ర విచిత్రసూత్ర బుధగీతచరిత్ర శిలాదపుత్ర స
త్ర్పాత్ర విశుద్ధగాత్ర శివభక్తికళత్ర శరణ్యమయ్య భా
స్వత్త్రిజగత్పవిత్ర బసవా ! బసవా ! బసవా ! వృషాధిపా !

శృంగారశతకమైనా, భక్తి వైరాగ్య శతకాలైనా వాటి పద్యంలోని చివర పాదంలో మకుటమనేది నియతంగా వస్తుంది. 'ఉత్పలము' లేక 'చంపకమాల'లో ఒదిగిపోగల మకుటార్థాన్ని కవి ఎన్నుకొనినాడని చెప్పడం చర్విత చర్వణమే అవుతుంది.

ఆరె మరాఠీలు సైనికులుగా, హాలికులుగా కాకతీయ యుగారంభంలో తెలుగు దేశానికి వలసవచ్చినారని తెలుస్తుంది. శతకంలోని ఒకే ఒక మరాఠీ పద్యాన్ని ఉటంకించినారు కూడా ! వారు ఉటంకించిన పద్యం ఇది.

"దేవవరా తుమ్హీచ, గురుదేవ మ్హణూనుతరీ తుమ్హీచ గో
సావతరా తుమ్హీచ, తుమ సాచ ప్రసాదఅమీ కృపాకరా
యీవగదా ! యటంచు నుతియించెద నిన్నును నారె బాస, దే
వా ! వినుతార్యలీల ! బసవా ! బసవా ! బసవా ! వృషాధిపా !

మహారాష్ట్రలో సుదీర్ఘవాస్తవ్యంలో మరాఠీ సాహిత్యాభిమానిగా ఎదిగిన నాలో ఈ శతకం చదవాలనే అభిలాష కాలం గడిచే కొద్ది తీవ్రతరం కాసాగింది.

శతకానికేమిగాని, మకుటమే శైవ వాఙ్మయంలో అణుమాత్రం

పరిచయం లేని నన్ను బహు ఇబ్బందులకు గురిచేసింది. దీనిలో బసవని బహుభంగుల స్తోత్రాలతో పాటు ముగ్ధ భక్తుల సందార్భలు. ఒకటా ! రెండా! లెక్కకు మించినవి. శివనాగయ్య, సంగయ్య దేవుడు, మడివాలు మాచన, గొల్లెత ! ఇత్యాదులు. చిప్పల జొన్నలు ముత్తియంబులౌట. మిండ జంగము కోరికపై బసవేశ్వరుడు ఆలి చీరను (ఆమె మానానికి క్షతి కాని విధంగా) వొలచి ఇచ్చుట, శివనాగయ్యగారి కరంబులు అమృత ధారలు కురియుట, అన్నింటికి మించి 'రుద్రుడు ఒక్కడే దైవము కాడని' ప్రేలు పురాణ భట్టులను కక్కయ వక్కలు చేయుట ఇత్యాది మహిమలు నన్ను తికమకపెట్టి 'బసవపురాణము' వైపు నడిపించినవి.

మకుటంలో ముమ్మారు ఆహూతుడైన 'బసవ'డెవరో అన్న సందేహాన్ని ఈ పుస్తకం చదివి నివృత్తి చేసుకొనినాను. శిలాదుడనే ఓ మహావిభూతి పంచాగ్ని మధ్యంలో నిలిచి అనేక వత్సరాలు పుత్రార్థియై తపమాచరించగా ఆశీతోషుడైన శివుడు ప్రసన్నుడై తనకు అత్యంత నికటవర్తియైన నందికేశ్వరుణ్ణి ఎతచ్ఛిలాద్రునకు పుత్రునిగా పుట్టవలెనని ఆదేశించినాడు. శిలాదునకు కలుగబోయే పుత్రుడు ఎటువలె నుండవలె ?

'యభిమతంబగు పుత్త్రునర్థి నిత్తేని
యభవ ! నీ భక్తి యం దణుమాత్రమైన
తక్కువ కలిగిన తలద్రుంచి వైతు !'

శివభక్తుల మాటలలో, నడతలోని తీవ్రత అబ్బురపరచే విషయం కాదు. శివనిందలకు మరణదండనయే వారు విధించవలసిన శిక్షగా భావింతురు. శిలాదునకు పుత్రరత్నంగా అవతరించిన నందికేశ్వరుడే 'బసవడు' – బసవడు బసవేశ్వరునిగా మాచాంబ మాదిరాజులకు పుత్రునిగా పుట్టినాడు. మాహేశ్వరమత వీరాభిమానియైన సోమనాథుడు తన శతకంలో శివుణ్ణిగాక, అతని ప్రియాతి ప్రియతముడైన నందీశ్వరుణ్ణి పలుభంగుల ఎందుకు కీర్తించాడని ఈ ప్రశ్నకు తలపట్టుకొనే అవసరంలేదు. సమాధానం కృతిలోనే దొరుకుతుంది. శైవధర్మంలో భగవంతునకు భక్తునకు మధ్య ఎలాంటి ద్వైతం లేదు. పరమేశ్వరుడే తన ఇల్లాలికి తెలిపినాడు. ఏమని?

"నందికేశ్వరునకు నాకు నొక్కింత
సందు లేకునికి నిస్సందేహమగుట
నీతని బుత్తెంతు నితనిచే పరమ
పూతమై లోకంబు బోధంబు వడయు"

శివుడు స్థిరలింగమైతే, బసవేశ్వరుడు చరలింగము. శివోపాసకుడైన బసవేశ్వరుడు బ్రాహ్మణులకు విధ్యుక్తమైన షోడశ కర్మలను నిరాకరించినాడు. బిజ్జలుని యొద్ద బండారిగా, దండనాయకునిగా కుదిరినాడు.

సోమనాథుని బసవపురాణము ప్రచార సాహిత్య కోవకు చెందినది. భక్తిరసమనేది ఒక రసమని అంగీకరించిన పక్షంలో ఈ ద్విపద కావ్యము భక్తిరసము ప్రధానముగా కలదని చెప్పుటకు విప్రతిపత్తి ఉండకూడదు. ఈ కావ్యము పోతన భాగవతమువలె తన్మయతను పఠితలలో కల్గించదు. ఇతరుల మాట ఎలా వున్నా, శైవ ధర్మీయుల ఆవేశం అంబరాన్ని అందుకునేట్టు చేస్తుంది.

'కళ' అంటే సౌందర్య నిర్మాణం నైపుణ్యం, సాహిత్యం ఒక కళ. దానిచే నిర్మితమైన దానిచే నిర్మితమైన సౌందర్యం. ఆనందానుభూతిని కలిగించడంతో పాటు పఠితను సంస్కరించి ఋజుమార్గగామిని చేస్తుంది. సోమనాథుని కృతులైన 'బసవ పురాణము'లో 'వృషాధిపశతకం'లో సౌందర్యాన్వేషణ నభోదోహనమే అవుతుంది. స్వమతాభినివేశం వ్యక్తులకుండుట సహజమైనది. ఎంత ఉన్నతస్తరానికి ఎదిగినా ఆక్షేపణీయం కాదు. పరధర్మాల యెడ మితిమీరిన అసహనం ఏమాత్రం క్షంతవ్యం కాదు. పైగా జుగుప్సాకరమైనది కూడ. మతవ్యాప్తి కోసం హింసామార్గాన్ని అవలంబించడం బహుళవాదయుగంలో జీవిస్తున్న మనకు ఆమోదయోగ్యం కానేరదు.

సోమనాథుని సాహిత్య కృతులకు కాలదోషం పట్టలేదు. మూల్యాంకనం సకారాత్మకమైనదైనా, నకారాత్మకమైనదైనా విమర్శకులకు అవి నిత్యాహ్వానం పలుకుతూనే ఉన్నాయి. 'కళ' కళకోసం కాదు; ప్రజాహితం కోసమేనని త్రికరణశుద్ధిగా భావించినవాడు సోమనాథుడు. సాహిత్యాన్ని సామాన్యుని

చేరువలో నిల్పటానికి మానవ సాధ్యమైన ప్రయత్నాలన్ని చేశాడు. ద్విపద ఛందస్సులో 'బసవ పురాణము'ను రచించి, దేశీయ ఛందోరీతుల ప్రతిష్ఠను పెంచినాడు. శబ్దవైభవం కన్న భావ వైభవమే మిన్నయని భావించాడు. అల్పాక్షరాలలో అనల్పార్థాన్ని అభివ్యక్తం చేసే మార్గాన్ని ఎన్నుకున్నాడు. అందుకే తెలుగు భాషను ప్రేమించే వారలకు ఆయన త్రికాల స్మరణీయుడు.

శైవ ధర్మీయులకు పఠన, పాఠన, గానయోగ్యంగా బసవ పురాణమును ద్విపద ఛందస్సులో మలచిన సోమనాథుడు స్వభావతః నిగర్వి. ఈక్రింది పద్య పంక్తులు ఆయన వినమ్రతకు తిరుగులేని సాక్ష్యాలు.

ఇదియఁ గోటికి పడగెత్తిన వానిఁ
బదివేల కాఁపనై బ్రతుకు మన్నట్టు
లా పరంజ్యోతి స్వరూపంబునకు
దీప కంభంబు లెత్తించిన యట్లు
భవ నిర్మితములైన పత్ర పుష్పములు
భవునకు తగు సమర్పణ చేయునట్లు
గాక, కీర్తింపగా నాకు తరంబె
ప్రాకటముగ భక్త బండారి చరిత.

ఈ నాల్గు మాటలు శివభక్తి తత్పరుడూ శేముషీ సింధువూ అయిన పాలకుర్కి సోమనాథకవి కృతులకు ఏ కొంచెమైనా న్యాయం చేయగల క్షమత కల్గినవి కావు. అట్టి కవి నిర్వేదమే నాయది యని గ్రహింప మనవి.

-గజానన్ తామన్

ప్రాతఃస్మరణీయుడు, స్నేహశీలి డా॥ అనుమాండ్ల భూమయ్య

డా॥ అనుమాండ్ల వారితో నాకు ఏర్పడిన స్నేహం ఈనాటిది కాదు. ఏనాటికి ముగియదు. ఒక దశాబ్దం కన్న ఎక్కువ కాలావధిగల ఇది యుగాలనాటి దన్న స్ఫృహను కల్గిస్తుంది.

1992లో అనుకుంటాను. డా॥ సుప్రసన్నగారి ఆహ్వానంపై ఓరుగల్లుకు వెళ్ళి అచ్చటి పోతన విజ్ఞానకేంద్రంలో మహారాష్ట్ర భక్త్యుద్యమం మీద పత్రం సమర్పించాను. ఆ కార్యక్రమానికి వచ్చిన శ్రోతలు అంగుళీ గణ్య సంఖ్యామాత్రులే ఐనా వారిలో అనుమాండ్ల వారొకరు. వారితో పరిచయం ఏర్పడడం. ఆ చిన్న పరిచయం కాలాంతరాన ప్రగాఢ స్నేహంగా పరిణమించడం నా పురాకృతసుకృతఫలంగా భావిస్తాను.

డా॥ భూమయ్య బహుగ్రంథకర్త. విమర్శకునిగా తెలుగు జగత్తులో ఎనలేని విశ్రుతి నార్జించిన ఆయన పద్యకవితారంగ ప్రవేశం బేతవోలు వారి 'బహుపరాక్' గంభీర ఘోషల మధ్య కావించినారు. కవిగా విఫలుడైన వాడు విమర్శకుడౌతాడని ఆంగ్లములో నానుడి ఉంది. ఇందుకు విపరీతంగా డా॥ అనుమాండ్ల వారు సాహితీ యాత్రను పరిశోధకులుగా ఆరంభించి సాంద్ర యశోభూషితుడైన కవిగా అనేక మజిలీలు పాదాక్రాంతం చేసికొనినాడు.

డా॥ భూమయ్య కవితా రచనకు పూనుకొనినాడన్న వైనం, ఆయన గురువర్యులైన డా॥ సంపత్కుమారాచార్యకు ఎంతో కాలం అంతుపట్టనిదిగా ఉండిపోయింది. 1993 ప్రాంతంలో వరంగల్లులో జరిగిన ఓ సాహిత్య సభలో అంతేవాసి చదివిన కొన్ని పద్యాలు ఆచార్యులను అబ్బుర పరచినవి. ఆ పద్యాలు 'అందమైన, ఆర్ద్రమైన భావనలో పరిప్లుతమైనవిగా వారిచే కొనియాడబడినవి. పరిచయమేర్పడిన రెండేళ్ళ తరువాత డా॥ అనుమాండ్ల పేరిట 'వేయినదుల వెలుగు' ఆదిగా గల తన ఐదు కావ్యాల్ని తెలుగు సాహిత్యంలో పెద్దగా పరిచయంలేని నాకు పంపించినారు. కొన్నాళ్లు గడచిన

వెనుక ఆయనచే ప్రేషితమైన మరో సద్గ్రంథం 'అంతర్వీక్షణ సార్వభౌమం' ప్రథితయశులైన సాహిత్యాచార్యుల సమీక్షాసమాహారం ఏతద్గ్రంథంలో చోటు చేసుకొన్నది.

ఈ గ్రంథంలోని సమీక్షలలో నన్ను ఎంతగానో ఆకట్టుకొని బహుకోణాల నుండి ఆలోచింపజేసిన సమీక్ష మన్మిత్రులు కీ.శే. జ్వాలాముఖి గారిది. నిశితమైన తార్కిక దృష్టితో అనుమాండ్ల వారి 'జ్వలిత కౌసల్య'ను పరిశీలించినారు. కౌసల్య విద్రోహ క్షమత గల నాయికకాదని, క్రూరమైన రాచరిక చట్రంలో అలసహాయస్థితిలో మగ్గుచున్న స్త్రీయని ప్రతిపాదిస్తూ 'జ్వలిత' బదులు 'తప్తకౌసల్య'గా కావ్యానికి పేరిడితే యుక్తియుక్తంగా ఉండి ఉండేదన్న వారి నిష్కర్ష నాకు సమంజసంగానే తోచింది. కావ్యం మాట ఏమోకాని, కావ్యకర్త వ్యక్తిత్వాన్ని జ్వాలాముఖి జన మనః ఫలకంపై చెరగని విధంగా శబ్దాంకనం చేసినారు. ఎదురు పడితే సమస్కరించదగిన వ్యక్తియని భూమయ్యను సంభావించారు.

డా॥ అనుమాండ్ల వారు నాకు అత్యంత ప్రీతిపాత్రులైన భావకవి. తెలుగులో దేవులపల్లి, మరాఠీలో నాకు గురుస్థానీయులైన గ్రేస్ కోవకు చెందిన కవియైనందున నేను వారి అభిమానిని కావటానికి ప్రధాన హేతువు. భావకవిత్వం నూటికి నూరుపాళ్ళు ఆత్మనిష్ఠం. అందువలన ఈ కవిత్వం సామాజిక స్పృహకొరవడినందున త్యాజ్యమని ఘోషించే ప్రగతివాద బార్హస్పతులు అనేకులు. ప్రణయ కవిత్వం కులపాలికా కేంద్రితం కావలెగాని ఊహాప్రేయసి పైన ఒలకబోయడం ఎందుకని ఆక్షేపించే వారు వీరిలో పలువురు లేకపోలేదు. సాహితీ క్షేత్రంలో 'భావకవిత్వం' ఒక భావ విప్లవానికి పురుడు పోసింది. స్త్రీని ఆరాధనా దృష్టితో చూచే సంస్కారానికి పునాదులు వేసింది. గురజాడవారు ఈ మార్పును ఎంతగానో శ్లాఘించారు. భావ కవిత్వం కేవలం ప్రణయాన్నే వస్తువుగా స్వీకరించలేదు. దాస్యశృంఖలాలను ఛేదించుకొని, స్వేచ్ఛ వైపు మానవ సమూహాలు పయనించవలసినదిగా ఉద్ఘోషించింది. 'జగము నిండ స్వేచ్ఛాగాన ఝురుల నింతు నన్న మహాకవిని వీరు పూర్తిగా విస్మరించినారు.

అయితే, మన్మిత్రులు భూమయ్య ప్రణయకవి కాదు. భక్తిమార్గంలో సుదీర్ఘ దూరాలకు పయనించి అమృతోపమైన కావ్య పంచకమును తెలుగు లోకానికి సమర్పించి తరించిన కవివరేణ్యులు. సార్థక జన్ములు. నా ఈ అభినందనపరమైన కతిపయ వాక్యాలకు సందర్భం వీరి ఇటీవలి 'సౌందర్యలహరి గీతాలు'. ఆదిశంకరాచార్య విరచిత "సౌందర్యలహరి"లో నిక్షప్తమైన తాత్విక అంశాలను పరిపూర్ణంగా ఆకలనం చేసికొన్న ధన్యజీవులు వీరు. వీరివి వారు మహత్ప్రేరణ నుండి ఉబికి వచ్చిన పీయూష స్యందము. 'ధనుఃపౌష్పం' అనే శ్లోకాన్ని సుకుమార మనస్కులకు బోధపడే విధంగా గేయంగా మలచిన తీరు అత్యంత స్తవనీయమనుటలో ఏమాత్రం అత్యుక్తి లేదు. శ్రీ లక్ష్మణ యతీంద్రుల అంతేవాసులైన వీరు భక్తిరస ప్రధానమైన కృతులనందించి బ్రతుకును తులసి తోటగా చేసికొనినారు. దేవి పూర్ణాను గ్రహం పొందిన వీరికై, మాదృశులు ఆ జగజ్జనని నుండి యాచించదగినది ఏమున్నది ?

65వ యేట అడుగిడుతున్న డా॥ భూమయ్య గారికి సత్కారరూపంగా అభినందన సంచికను వెలువరిస్తున్న 'ఆలాపన' సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీమతి శారదారెడ్డి గారికి నా అభినందనలు.

-గజానన్ తామన్

యశోధర కావ్యం - ఒక పరిశీలన

బౌద్ధం యజ్ఞసంస్కృతి వల్ల అధఃపతితమైన భారతీయ సమాజాన్ని హేతువాదంవైపు మరల్చింది. ఈ బౌద్ధం నేపథ్యంగా తెలుగులో ఎన్నో కావ్యాలు వచ్చాయి. పింగళి, వేటూరి వారి 'సౌందరనందనము' జంధ్యాల వారి 'ఉదయశ్రీ' డా. వి.వి.యల్. నరసింహారావు గారి 'ఆనందభిక్షువు' బోడేపూడి వెంకటరావుగారి 'కళాక్షేత్రము' తరువాత వచ్చిన మరో ఉత్తమ తెలుగు కావ్యం డా॥ ఉపాధ్యాయుల అప్పల నరసింహమూర్తి 'యశోధర'. బౌద్ధం వైపు జగజ్జనాళి దృష్టి మరలుతున్న వేళ, ఈ కావ్యాగమనం ప్రాసంగిక మనుటలో ఏలాటి అత్యుక్తి లేదు. యావత్ప్రపంచంలోని ఏ ప్రాంతం వైపు చూపు నిల్పినా దృగ్గోచరమయ్యే కఠోరనృత్యం సర్వజన విదితమే. హింసారిరింసలతో నేటి మానవుని అస్తిత్వం కకావికలయ్యింది. అంధ విశ్వాసాలూ, తర్కవిసంగతమైన ఆచరణలూ మన బ్రతుకుల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మానవతావాదం మానవ జీవనానికి ప్రాతిపదిక కావాలని మానవాళి శ్రేయాన్ని కోరే వేలగళాలు నినదించిన బధిర శంఖారావాలవుతున్నవి. అయినా తిమిరం తొలగే వరకు సమరం కొనసాగించాలి. సమాజంలోని ప్రతిస్తరానికి స్వాస్థ్యం చేకూరే వరకు, కృత్రిమ అంతరాలు తొలగి సమస్త జనాళికి స్వస్తి ప్రదమైన సమాజం అస్తిత్వంలోకి వచ్చే వరకు ఉద్యమించాయి.

సాహితీప్రియుల దీర్ఘప్రతీక్షానంతరం వచ్చిన ఉత్తమ పద్యకావ్యం 'యశోధర'. వ్యాసారంభంలో పేర్కొన్న కావ్యాలవంటిది ఈ కావ్యం కాదు. ఇందులో కథాకథనం లేదు. పాత్రల ఆత్మసంవాదం (Monologue) నుండి పఠితలు కథా సూత్రాన్ని ఊహించుకోవాలి. కథ అన్నాక మనకు అభిప్రేతమయ్యేది ఘటనా సమాహారం కాలహేతునిబద్ధ క్రమంలో ఘటనలు ఉంటాయి. ఘటనలు అంటే పాత్రల యొక్క కదలికలు. ఈ కదలికల వల్ల కథ సుఖాంతంగా లేక దుఃఖాంతకంగా ముగుస్తుంది.

ఆంగ్లకవి రాబర్ట్ బ్రౌనింగ్ ప్రక్రియ ను తెలుగులో ప్రవేశపెట్టిన తొలికవి.

డా॥ నరసింహమూర్తిగారేమో !

ఈ కావ్యంలోని ప్రధానపాత్ర యశోధరయే. కారణం మిగతా నాలుగు పాత్రల భావపరంపర యశోధర చుట్టే పరిభ్రమిస్తుంది. యశోధరతోపాటు అభిసంబోధిని పొందిన బుద్ధుడు, అతని జన్మదాతయైన శాక్యరాజ్యాధిపతి శుద్ధోధనుడు, శైశవంలోనే మాతృహీనుడైన సిద్ధార్థుని పెంచి పోషించిన గౌతమి, అతని ఏకైక పుత్రుడైన రాహులుడు ఈ కావ్యంలో మనకు సాక్షాత్కరించే ఐదు పాత్రలు.

ఈ ఐదు పాత్రలకు స్థలకాలపరమైన గమనం లేదు. పరస్పర సంఘర్షణ లేదు. జరుగవలసినదేదో (ప్రజల దృష్టిలో) జరుగకూడనిదేదో (కుటుంబజనుల దృష్టిలో) జరిగిపోయింది. సిద్ధార్థుడు రాజ్యాన్ని పరివారాన్ని త్యజించాడు. మానవ దుఃఖనివృత్తి మార్గాన్ని అన్వేషించే నిమిత్తం పారివ్రాజక జీవితాన్ని స్వీకరించాడు. ఆరేండ్ల పాటు కఠోర తపశ్చర్యలో ఉండి దాన్ని స్వీయ సత్యాన్వేషణలో వ్యర్థ ప్రయాసగా గుర్తించి, ఒకరోజు రాత్రి నేరెంజురా నదీ తీరాన అభిసంబోధిని పొందాడు. తను మానవ ఉత్థార్థం కనుగొన్న అష్టాంగ మార్గాన్ని ప్రజలకు బోధించే నిమిత్తం చారికలు సల్పి, విశ్వవంద్యుడైనాడు.

'యశోధర' కావ్యం ఏకోణం నుంచి చూసినా బౌద్ధం పై పరిపూర్ణ వ్యాఖ్యకాదు. మానవీయ అనుబంధాలు స్పందనలు ఈ కావ్యంలో హృద్యంగా మనల్ని అంతర్ముఖుల్ని చేసే విధంగా చిత్రింపబడ్డాయి.

సామాన్యులకు మల్లేనే మహాపురుషులకు సైతం పరివారముంటుంది. అతడు సాధించిన దాని మూల్యాంకనయతితో పారివారిక జనులదృష్టి లోక దృష్టికి భిన్నంగా ఉంటుంది.

సిద్ధార్థ గౌతముడు బుద్ధుడై ఏడేండ్లయినది. రోహిణీ నదీజలాల విషయమై (నేటిలాగానే ఆనాడు) వివాదం కొలియలకు శాక్యులకు మధ్య తలయెత్తింది. ఏ తద్వివాద పరిష్కారార్థం ఉభయ పక్షాలు కోరగా శిష్యసమేతుడై వచ్చి న్యగ్రోధవనంలో బస చేశాడు. తండ్రియైన శుద్ధోధనుని ఇంత అతిథ్యం ఓ పూట స్వీకరించడానికి తన అంగీకారం తెలిపాడు.

బుద్ధుడు భిక్షార్థం రాజప్రసాదానికి రానున్నాడన్న సమాచారం కుటుంబ సభ్యుల్ని అంతర్ముఖుల్ని చేసి ఆలోచనామగ్నుల్ని చేసింది. వారి ఆలోచనలే, అంతర్మథ్యలే భావతీవ్రతలే ఈ కావ్యానికి వస్తువు.

వయోవృద్ధుడైన కారణంగా శుద్ధోధునునకు రాజ్యధురంధరత్వం మోయలేని భారమైంది. 'అండగ నుండి రాజ్యపరిపాలన చేస్తాడని' ఆశించిన తండ్రిని గేహత్యాగం వల్ల 'భూమిపై రెండవ రౌరవమ్మునకు తేని'గా చెడినాడు సిద్ధార్థుడు – 'నీపోక క్రీనీడల్ మాయిలువాకిలిం బరచెనే ! నీరాక లెట్లుండునో' అని తలపోస్తూ శుద్ధోధనుడు ఆశానిరాశల మధ్య ఊగిసలాడుతాడు. గౌతముని నామకరణోత్సవానికి వచ్చిన 'కొండణ్ణ' సిద్ధార్థుడు బుద్ధుడవుతాడని ఏనాడో చెప్పాడు.

గౌతముడు బుద్ధుడయ్యే సంభావ్యతను నిరోధించడానికి రాజు చేయవలసినవన్నీ చేశాడు.

నీసుకుమార చిత్తమును
నీడగనంటి నిమేషమాత్ర సం
త్రాగమునైన నీయెఱుక
దారుల నిల్వగ నీక సౌఖ్యమే
యీ సకలాననీతలము
నేలెదు సత్యమటంచునమ్మగాఁ
జేసితి ముప్పదేండ్లు యువ
జీవన సంపదకొల్లబోసితిన్

కుమారుని నిమిత్తం నిర్మించిన హర్మ్య పరిసరాల్లో మూడు రకాల పద్మాలు గల సరస్సులు వెలిసేట్టు చేశాడు. 'లోక వికారమ్ములనంటబోని యతి లోకానందముంగూర్పగా' యువతీజననృత్తగానముల వివశుణ్ణి చేసి సిద్ధార్థుని కళ్ళలో కామనీయతను కాపురముంచినాడు. 'మేలిమి వారణాసిపుర మేదుర వస్త్ర విభూషణమ్ములే కాలము దప్పకుండగను కట్టగ' జూచినాడు. అంతటితో ఆగినాడా ? భవితవ్యంబును మార్చనెంచి యశోధర వధువును యుద్వాహము' చేసినాడు. తన ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన

పన్నీరైనవి. కొండణ్ణ జోస్యం నిజమైంది. కడలికెరటము చెలియలికట్ట దాటినట్లు గృహాంగణసీమను దాటి గౌతముడు విశాల విశ్వంలో అడుగెట్టాడు. తనకు కాకుండా పోయాడు. భార్యాపుత్రులను శోకసాగరంలో మునకలు వేసేట్టు చేశాడు. వీళ్ళ బాధ తన బాధను ఇబ్బడి ముబ్బడి చేసింది.

జలజల మంచుపూలజడి
జల్లులు జల్లులు రాలినట్టులా
వలిమల తెల్లతామరల
వాకలు రెక్కలు రాల్చినట్లువే
యలకల నాణిముత్తెముల
హారములెన్నియొ జారినట్లు దా
వెలవెల బారి యేడ్చు నిను
నీడి యశోధర యెల్లవేళలన్

శుద్ధోధనుడు ఈ ఆలోచనలతో విలవిలలాడుతుంటే మాతృవిహీనుడైన గౌతముని పెంచి పెద్ద జేసిన ధాత్రి గౌతమి ఆలోచనలు ఇలా ఉన్నాయి.

జలకములార్చి చల్వలను
చక్కధరింపగ జేసి ముద్దుగా
నలకలు దువ్వి పూల్ముడిచి
యంగవిలేపన మద్దిమేలురా
పలకలపైడిగిన్నె మురి
పమ్ముల పాలను బోసి కంటిలో
వెలుగును కాచినట్లు నిలు
వెల్లను కన్నులు చేసి పెంచితిన్....

గౌతముడు ఇలువీడి నందుకు గౌతమి దుఃఖించుట లేదు. 'భవసాగరోర్మికల నావయు తెడ్డున లేక నిలిపినందుకు వ్యష్టి శ్రేయం కన్న సమిష్టి శ్రేయమే మిన్నయని గుర్తించిన గౌతమికి 'ఇమ్ముగ దివ్య సౌఖ్యముల నింటను వాకిట నిల్పి 'ధ్యేయచ్యుతుణ్ని చేయడానికి

ప్రయత్నించిన శుద్ధోధనుడు ఎమ్మెలు చూపి లోకమ్మును చూడకుండ కట్టడి చేసిన యశోధర ఆమె దృష్టిలో రాహుకేతువుల వంటివారే ! అయినా 'సూర్యచంద్ర ఘనకాంతులు ఎల్లకాలం' దాగుతాయా ! కోడలితో ఆమె సంబంధం వెంగలులూహించినట్లు బెడసి పోలేదు. రాహులుని రాజుగా చేసి, ధార్మిక రాజ్యము యశోధరకు చెందేట్టుగా కొలియలు కదుపుతున్న రాజకీయ పాచికలు ఆమెను ఆందోళనకు గురిచేసినవి. యశోధర విషయమై అప్రమత్తను జేసినవి. ఆమెకు మహిళాభ్యుదయనేత్రికాగల అన్ని అర్హతలున్నాయి. తనను ఉపేక్షించి యశోధరను ధార్మకరాజ్యనేత్రిని చేస్తారేమోనన్న భయం గౌతమిని పట్టుకుంది. యశోధరలో ఏదో మార్పు ఆమెకు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. 'వినయమ్ము, విధేయత యశోధర ఎప్పటివలె చూపుతుంది. కాని రవంత యేనియు మనస్సులో మమ్ము చొరనీయదు. ఇది గౌతమి వ్యథ. ఈ కావ్యానికి యశోధర కేంద్రస్థానీయ. గౌతముని మహాభినిష్క్రమణ ఆమె సుందర భావనావిశ్వాన్ని నిలువునా కూల్చివేసింది. పలి పత్నీరాగ సంబంధముల్ శశ్వత్స్వాదు శరత్కృతంబులగు' నని యతానుయాత ప్రజలు బాల్యమాదిగా ఆమెను ఆశ్వాసించినారు. 'ఆవిశ్వాసంబును మంటగల్పితిగదే ! అని భర్తను తలచుకొని లోలోన కుమిలిపోయినది. దుఃఖమనేది నారీ జగత్తుకు అనాయాచిత వరం.

"దమయంతీ పరిదగ్ధ జీవన దురంత నర్ధముల్ ద్రౌపదీ
సమయాంతర్గత వేదనా విధుర ఘోషా భీషణోద్వేగముల్

ఆమె తలంపులో మెదలినవి. తనది 'వైధవ్యము సౌభాగ్యము గానిస్థితి. గౌతముడు పరివ్రాజకుడవటం ఆమె జీవనాన పూరింపలేని శూన్యతను సృష్టించినది. ఈ పరిస్థితిలో రాహులునికి దీక్షనీయనున్నాడన్న పిడుగువంటి వార్త ఆమె చెవిని పడింది. ఆమె దుఃఖం అతివేలమైంది. జీవితానికి వెలుగూ, చీకట్లూ రెండూ పార్శ్వాలు. చీకట్లనే చూచి సంసారాన్ని త్యజించదగునా?

వెలుగులు చీకటుల్ గలవు
వింతలుగా వినసృష్టి బీజముల్
కలుగులు లేని నేలలును

కలలుగానవి కల్మిలేములున్
మలుపులు లేని మార్గములు
మీరు తలంపని మేధలున్నవా ?

విశ్వజనీన సుఖైక సాదనంబైన గేహధర్మమును మానిపరివ్రాజిక వృత్తి నవలంబించాలా ? విశ్వవ్యాప్త సంసారములను వికసింపజేయుటే విజ్ఞుడైన వానికి పరమ కర్తవ్యం కావాలి. సన్యాసం నిష్క్రియారమణమే ! కాలాన్ని కమరపు డిప్పలో పడవేయుటే ! పురుష స్త్రీద్వయమేకమైన యపుడే పూర్ణావతారమౌతుంది. 'మధురోదాత్త వచోవిలాసాల హేమంతము నౌకౌగిలై' అనే రోజులు కేవలం స్మృతిగానే మిగిలిపోయినది.

ఈ సంసారం దుఃఖమయమని గౌతమునికి కలిగిన ఊహ తనకు కల్గి పరిత్యజిస్తే లోకం 'ఈయమలోకబాంధవి, కారుణ్యావారాశి' అని పొగడుతుందా ? గౌతముడు స్థాపించిన సంఘంలో తనను సైతం భిక్షునిగా చేర్చుకొన్న పక్షంలో 'చీకాకుంబడు జీవసంతతికి ప్రాచీజ్యోతు'లందించటం సాధ్యమౌతుంది. ఏర్పడన పరిస్థితితో రాజీపడేబౌద్ధిక, నైతిక పరిణతను యశోధర చివరకు సాధించుకొంది.

తండ్రి నీడను కోల్పోయిన బాలుని మానసిక స్థితి రాహులునిది.

వయసు పెద్దలు నాముందు వంగిచనుట
జనులు పరిజనులందరు జాలిపడుట
అమ్మకన్నులు ననుజూచి చెమ్మగిలుట
వెనకు జూచిన నా కథ వింతగొల్పు.

కన్నతల్లి ఊరువాడలోన ఉత్సవముండగా చిన్నబోవుట రాహులుని విషాదంలో పడవేసింది. ఒడిని నాస్తిక ధూమములడుగుబెట్టినని' సహపాఠులు అన్యాపదేశముగ ఆడిన మాటలు' అతని హృదయాన్ని గాయపరిచాయి. ఇవన్నీ ఇన్నాళ్ళు తట్టుకోగలిగాడంటే తల్లి చలువే ! ఆమె ఎలాంటిది.

మంచెనిలబడి వడిసెల గొంచుపంట
కాచుదీక్షతో మాయమ్మ బ్రోచునన్ను
నూగుగల పాలకంకులు సాగుచేయు
సేద్యగానికి మాయమ్మ సేగి తెలియు.

తండ్రి వస్తున్నాడన్నవార్త ఎనలేని సంతోషాన్ని రాహులునకు కలిగించింది. ఆయన పరివ్రాజకుడవడం మాత్రం రుచించలేదు. 'భిక్షువులు' శుష్కబోధలు సలిపెడిసోమరులని' అతని భావన. రాహులుని వేదనను వ్యక్తం చేయడానికి వృత్తాలకు బదులుగా కవి తేటగీతి – ఆట మొదులను ఎన్నుకొనటంలో ఔచిత్యముంది. చిరుచేపలు తిమింగలాలవలె శబ్దం చేయగల్గుతాయా ?

'యశోధర మానసిక స్థితిని గ్రహించిన బుద్ధుడు తన మనసులో ఆమెను సమాధానపరచాడని రచయిత అంటారు. 'బుద్ధుడు' అధ్యాయంలో కవి మార్గచంధస్సుకు బదులు దేశీ ఛందోరీతియైన మధ్యాక్కరను వాడారు. ధమ్మ ప్రచారం బుద్ధుడు సంస్కృతాన్ని కాదని పాలీభాషలో చేశాడు కదా!

గౌతముడు యశోధరలో లోకోత్తర గుణ సంపుటులు మేలుకొల్పు 'లోచూపు' కలదు కనుకనే ఆమెను లోకకళ్యాణార్థం వీడినాడు. నిర్వాణ పథాన్ని ఆమెకంటి వెలుగుల నిలుపగోరియే అట్లు చేసినాడు. 'బిండి (యశోధర) సిద్ధార్థుని స్వార్థకేంద్రము. సంఘ సముద్ధరణకై పాటు పడాలనుకొనే బుద్ధికి స్వార్థము పరమ శత్రువు. దానిపై యుద్ధం చేయటానికే ఆమెను వీడినాడు. 'విశ్వజనతా పరివార హృదంతరాదర్శ బింబతానన' యశోధర యని చాటేందుకు గృహత్యాగము చేసినాడు. భిక్షవులు, లోకమూమించినట్లుగా సోమరులు కాదు. ప్రజా సేవకులు.

తరువులు గోవులు నదులు
నుపకార ధర్మమునందు
గురువులు బౌద్ధ భిక్షులకు
పితరుల కొమరుల కూర్మి
తరుణులను వదలి

సంఘసేవకు తరలిపోయెదరు
వారు మానవతా శిఖరముల
దరికి పరుగుతీయుదురు

బౌద్ధంలో కనికట్టు కథల కిటమనికి లేదని చెప్పుతూ ధర్మ పథావలంబులు కావాలని ప్రజలకు ఉద్బోధ చేశాడు. జీవితము లిప్తమాత్రము.

నీటిపైని బుడుగవంటివి. అందుకని త్రిరత్నాలను విజ్ఞుడైనవాడు ఆశ్రయించాలి.

బుద్ధసంఘ ధర్మముల శరణము కోరెడు వార
లిద్ధర శాంతి సౌఖ్యముల పొందుదు రిమ్మగ నాత్మ
శుద్ధియగు, కరుణగలుగు, లోకముచుట్టమౌ కడువి
రుద్ధ జగత్తు మిత్రమగు....

-గజానన్ తామన్
మంథని

పొద్దుపొడుపు

కొన్నేళ్ళ క్రితం సాహితీ గౌతమి కరీంనగర్ అధ్యక్షులు శ్రీ మాడిశెట్టి గోపాల్ నిర్వహించిన ఏదో ఒక సాహితీ కార్యక్రమంలో అన్నవరం దేవేందర్‌తో పరిచయం ఏర్పడింది. ఆయన తన కవితా సంపుటి 'మంకమ్మతోట లేబర్ అడ్డా' నాకు ఉపాయనంగా ఇచ్చారు. తెలంగాణ బాధామయ గాథలను తెలంగాణ మాండలికంలోనే అభివ్యక్తీకరింపబడిన ఈ మనోజ్ఞకృతి నన్ను మంత్రముగ్ధుణ్ణి చేసి ఏకబిగిన చదివింపచేసింది. దీన్ని మరాఠీ రచయిత అనిల్ అవచట్ 'మాణసే' (మనుష్యులు)తో పోలుస్తూ ఓ సమీక్ష వ్రాసి 'విశాలాంధ్ర'కు పంపారు. సమీక్ష అనేది బరువైన పదం. అది సైద్ధాంతిక ఆధారం కలదిగా వుండాలి. ఈ పదం కంటే 'స్పందన' అనే పదం శీర్షికతో జోడించి వుంటే బాగుండేదని ఇప్పుడు అనిపిస్తుంది. పంపించిన వేళావిశేషం వల్ల అది అచ్చయినది.

అలా అవటానికి వైదుష్యం హేతువు కాదని మనవి. ఆనాటి నుండి మా ఇరువురి మధ్య స్నేహబంధం ఏర్పడింది. తాను సంపాదకత్వం వహించిన 'వల్లుబండ'లో నా కవిత 'శ్రీకృష్ణా !'కు చోటు కల్పించారు. ఆయన నాకు ప్రనీతిపాత్రుడు కావటానికి ఇది ప్రధాన కారణం కాదు. జ్వాలాముఖి చెప్పి 'కల్చర్ ఆఫ్ కన్‌సెర్న్' ఆయన కవితల్లో సాక్షాత్కరిస్తుంది. సహజజీవి, స్వీయ ప్రాంతం యెడ ఆయనకు గల ఆర్తి వీటిలో స్పష్టంగా ధ్వనిస్తుంది. అణగారిన రైతు బ్రతుకు ప్రపంచీకరణ వల్ల మరుభూమి ప్రాయమైన పల్లెలు, వలసవాదుల వల్ల తెలంగాణకు కల్గిన అపారక్షతి ఆయన కవితా వస్తువు. తెలంగాణ అస్తిత్వానికి ఏర్పడిన ముప్పు వలన కల్గిన ఆవేదన నుండే ఆయన కవిత పురుడు పోసుకున్నది. "కట్టమైసమ్మ" కవితలో హుస్సేన్‌సాగర్‌కు సలాం చెబుతూ ఇలా అంటాడు.

'ఇది మా షోయెబుల్లా నడిచిన ఆనకట్ట
ఇది మా తుర్రేబాజ్‌ఖాన్ తానమాడిన చెరువు'
జోడేఘాట్‌ను స్మరిస్తూ :
'ఇది మా కొమురం భీమ్ కొట్లాడిన నేల,

ఏడబోయినను మా ఆనవాలు?'

అన్నవరం దేవేందర్ కవితలు తెలంగాణ హృదయస్పందనలకు అక్షర రూపాలు. ఇది వరకు ఆయన వ్రాసిన ఐదు కావ్యాలు : తొవ్వ (2001), నడక (2003), మంకమ్మతోట లేబర్ అడ్డా (2005), బుడ్డ పరకలు (2006), బొడ్డుమల్లెచెట్టు (2008). ఈ కృతులలో ఆయన తెలంగాణీయుల హృదయాలపై చెరగని ముద్ర వేశారు. ఈయన శబ్ధ ప్రపంచం కృతమైంది కాదు. ఆయనను చిన్ననాటి నుండి ఆవరించినదే ! మట్టి వాసనలు కలదే!

అయితే మరాఠీ కవి సుధీర్ మేఘే చెప్పినట్లు శబ్దాలు జడ జగత్తుకు చెందినవి. అయినా సమర్థమైన వాహికలని గుర్తుంచుకోవాలి.

శబ్దాలెరుగవు మోదం
శబ్దాలెరుగవు ఖేదం
నిత్యం అవిమో+సేవే
నీనా కావడి కుండేదు

ఇప్పుడు అనుశీలనార్థం మనుముందున్నది 2011 చివరలో ప్రచురించబడిన కవితా సంపుటి 'పొద్దుపొడుపు' నాకు చేజిక్కిన వెంటనే అరువయిఎనిమిది పుటలను వ్యాపించిన దీన్ని స్నాతం చదివి నాకు కలిగిన అనుభూతిని పంచుకోవాలనే ఈ నాలుగు మాటలు.

తెలంగాణీయుల నొసటి వ్రాత విధి విచిత్రంగా వ్రాసినాడో ఏమో ! ఈ షోదయం అయినట్లే అయ్యి భయావహనిశీధిగా మారింది. జీవితాలను కాగడాలుగా మలచి,వెలిగించి పోరు సల్పాల్సి అవసరం మనముందు మళ్ళీ నిలిచింది.

ట్యానిషియాలో చదువు సంస్కారములున్నా కొలువు దొరుకక పళ్ళమ్ముకునే ఒక యువకుని ఆత్మాహుతి 'మల్లెల విప్లవానికి ప్రేరక మయ్యింది. ఇక్కడ ఈ తెలంగాణలో ఒకటా రెండా ? గతంలో మూడువందల పై మాటే. ఇప్పుడు ఏకంగా ఏడువందలు ! మానవ సారస్యం లేని కేంద్రం, స్థాణుతుల్యమైన రాష్ట్ర ప్రభుత్వం ! విరామాలకి మధ్య ఈ

'పోటీ' ఆ 'పోటీ' ప్రేలాపనలు ! వీటి అన్నింటికి చలించిన దేవేందర్ 'అగ్గిపుల్ల' అనే కవితలో జీవన దినమధ్యలలో అస్తమిస్తున్న సూర్యులు కారాదని యువతకు మిత్రసమ్మితమైన వాక్కులతో హితవు గరుపుతున్నాడు.

అంటుకున్న దీపం వత్తివి
ఎందుకైతివి నాయనా !
బాధపడి సచ్చుడు కాదు
బోధపడేట్టు బొబ్బ చెయ్యాలె.

అన్యాయానికి విరుద్ధంగా పిడికిలి బిగించని జీవస్మృతమైనది కాదు. తెలంగాణ జాతి కొమురంభీమ్, దొడ్డి కొమురయ్య, బందగీ, షోయబ్ ఉల్లాఖాన్, తుర్రెబాజ్‌ఖాన్, మరెందరో ఇందుకు తిరుగులేని దృష్టాంతాలు.

'పొద్దుపొడుపు' అనేది ఈ సంకలనానికి పేరు. ఇది అన్ని విధాల సార్థకమైనది. ఈ పదాన్ని వాచ్యార్థంలో కాక వ్యంజకార్థంలో తీసికోవాలి. ఈ 'పొద్దుపొడుపు' మూడుసార్లు పొడిచినదై మరుక్షణమే వంగిపోయింది. తెలంగాణీయుల తీవ్ర మనోవేదనను 'దీపంవత్తి' అనే కవితలో దేవేందర్ అభివ్యక్తిం చేశాడు. చిందించిన రక్తం వృథాగా ధూళితో కలిసింది. తెలంగాణ శాపగ్రస్తమా ? ప్రశ్నిస్తాడు 'దోఖా' అనే కవితలో తెలంగాణ శ్రమజీతవుల తిరుగుబాటు లక్ష్యం సాధించకుండానే కదా వికలమయ్యింది. పేరు పెద్దరికమైన తెలంగాణ సాయుధ పోరు నైజం రాజరికం, దొరతనం తోలుతీసిన కాలం నాల్గువేల ప్రాణాలు తృణప్రాయం.

పారిపోయిన భూస్వామ్యం
గాంధీటోపీలతో మల్లా బుస కొట్టింది.

గతాన్ని విస్మరించి వర్తమానంలోకి వస్తే మరో చీకటి అధ్యాయం మన ముందు నిలుస్తుంది. మన ఓట్లు దండుకొని అధికార పీఠాన్ని అధిరోహించిన జననాయకులకు తెలంగాణ వ్యథ పట్టదు. మన నల్ల బంగారం మన కొలువులో ఆవలిగడ్డకు తరలుతున్నా మూగనోమును వీడరు. 'మంత్రి' అనే ఘాటయిన కవితలో ఇలా ఇంటాడు దేవేందర్. ఈ కవిత ఏడు ద్విపదల సమాహారం.

నాలుగు పానాదుల కాడ భూమి జాగలు పలారం
మారు మాట్లాడకుండ బెల్లం గడ్డ అడ్డం
అంబాడిన నేల ఇచ్చుకపోతుంటే
అందలం ఎక్కి అందిన కాడికి మ్యాత
విధిక్షేపాత్మక కవితారచనలో అన్నవరంది అందె వేసిన చేయి.

'ఎండ' అనే కవితలో వర్షాభావం వల్ల కాకివికలైన తెలంగాణ పల్లీయ జనజీవనాన్ని, హృదయాన్ని స్పర్శించే శబ్ధచిత్రంగా మలిచాడు.

పునాస నీళ్ళు లేక వలిస్లీపోయిన వైనం

పచ్చని మక్కపెరడు ఎకాఎకిన ఎండన తీరు

గొడ్డు గొర్రె మ్యాత లేక ఆవుగోలిచ్చుడు

ఇప్పుడు రైతు ముకం మీద దృశ్యం....

ఈ దేశం చేసుకున్న సుకృతమేమటో ఉత్తర భారతాన 'చిప్కో' ఉద్యమాన్ని నడిపిన బహుగుణ, పోలవరం వల్ల మునుకకు గురికానున్న గ్రామాల ఆదివాసుల గోడు పట్టించుకొన్న మేధాపట్కర్ కోవకు చెందినవాడు స్వర్గీయ బాలగోపాల్ ఈయనకు పావురం అనేక కవిత ద్వారా శబ్ధాంజలి ఘటించాడు.

నాల్గు కోట్ల తెలంగాణ ప్రజానీకం కన్నీటి పాటమారుగా పన్నీటి పాట పాడుకునే శుభతరుణం ఎప్పుడు ఆగమిస్తుంది ?

పొద్దుపొడుపును మళ్ళీ మళ్ళీ అడ్డుకుంటున్న బలనాయకు లెవ్వరు? 'పరాశ్కం' అనే కవితలో గ్రంథి విప్పుతాడు కవి.

ఎప్పుడైనా ద్రోహి అవతలిగడ్డ వాడే కావచ్చు
దోహదకారుడు మాత్రం ఈ గడ్డ బిడ్డడయితండు
పట్టపగలు పొక్కలు చేయవాడొస్తే
సుత్తె సానం ఇంటోడే అందిస్తుండు.

తెలంగాణలో అంతా సద్దుమణిగిందని ఊహిస్తున్నవారు 'దేవానాం

ప్రియుడు' ఉద్యమాలకు విరామాలు ఉంటాయి. ముగింపు ఉండదు. తెలంగాణ బిడ్డడైన దేవేందర్ గ్రీకు పురాగాధల్లోని ఫీనిక్స్‌గా చెప్పుకోవచ్చు.

నన్ను నేను నిత్యం నిప్పులకొలిమిలో
రగుల్చుకొని రగుల్చుకొని స్వచ్ఛమౌతుంటాను
నన్ను ఎప్పటికప్పుడు గంధకికామ్లంలో శుద్ధిపొందుతాను
నాకు నేను సోపతిగాళ్ళతో
అగ్ని గుండంలో దునికి దూలా ఆడుతాను (దాన్యం. పుట 51)

దేవేందర్ వ్రాసిన అన్ని కవితా సంకలనాలలో మనకు స్పష్టంగా వినిపించేది 'నిరసనగళం'

'పాలన భాషనాది కాదు
పాలకులలోనూ నా సంభాషణ లేదు
ఆహారం, ఆహార్యం ఏవి నావి కావు.
సంస్కృతి అంతా వికృతం'.

ఇది ఆయన వ్యధ. 'శిల్పం, 'శయ్య' మాట ఎలా వున్నా జన జీవన సౌందర్యంతో, శైథిల్యంతో మమేకమైన కవి అన్నవరం.

ఆయన మనకందిస్తున్నది అసలైన సిసలైన కవిత్వం. ఏలికలిచ్చే భుజకీర్తులు ధరించి 'తవుటా బల్ల' పై చిందులేసే కవుల కోవకు దేవేందర్ చెందేడు.

ఈ సంకలనంలో అన్ని కవితలు నిరసనను, ఆవేశాన్ని, ఆగ్రహాన్ని వెలిబుచ్చేవి కావు. భవభూతి శ్లోకాలు కూడా ఉన్నాయి. 'బడి' సాగు బాట', 'ఎగిలివారంగ' అనే రెండు కవితలు భవభూతి ఇచ్చే అనుభూతిని ఇస్తాయి.

'పొద్దుపొడుపు' సంకలనంలో అధికభాగం ఉద్యమకవితలే. వీటి మూల్యాంకనానికి ప్రాచీన, ఆర్వాచీన సాహిత్య శాస్త్ర మానదండాలు అరపసంగికాలు. ఉద్యమకవిత ప్రయోజనం జనజాగృతి. ఇది జనప్రియం కావడానికి శబ్ద భావ చమత్కృతి కల్గినదై యుండాలి. గతంలోని 'మా కొద్దీ తెల్లదొరతనము' తెల్లవారను గడుసరి గొల్లవాడు వంటివి సాహిత్యపరంగా గొప్ప కృతులు కావు. అయినా అవి జనమానసాల

దోచుకొనడానికి గల హేతువును అన్నవరం పట్టుకోగలగాలి. భీభత్సాన్ని, అశ్లీలతను ఆశ్రయించడం సంస్కారం గల కవి చేయాల్సిన పనికాదు. 'సావుదప్పు' సంకలనం సౌందర్యానికి క్షతి కలిగించేదిగా వున్నదని చెప్పక తప్పడం లేదు.

అన్నవరం దేవేందర్ అలుపు సొలుపు ఎరుగని తెలంగాణవాది. అలాగే రాజీపడని అభ్యుదయవాది. తెలంగాణావాదిగా జయశంకర్ సారుకు భక్తితో ఫలమో, పుష్పమో, చివరకు పత్రమో సమర్పించడం ఆద్య కర్తవ్యం కనుక 'తుక్కం' అనే కవితను ఈ సంకలనంలో చేర్చాడు. అలాగే అభ్యుదయవాదిగా (మార్క్సువాదం పునాదిలేని అభ్యుదయవాదం) శ్రీశ్రీకి 'నేను సైతం' అంటూ మరో కవితను చేర్చాడు. ఈ రెండు కవితలు ఈ మహావిభూతల వ్యక్తిత్వాన్ని ప్రతిఫలించేవిగా లేవు. శబ్ద భావపుష్టికి యోజన దూరంలో ఉండి ఏవో మొక్కుబడిగా వున్నాయి. శ్రీశ్రీ కవితలో కవ అన్నట్లుగా పద్యం గాలికి పోయేది కాదు. ఎంతో వైభవ చరిత్ర కలది నన్నయ్యతో మొదలైనిది ఈ నాటికి సజీవంగా ఉంది. 'పద్యాన్ని' బాగా ఒంటపట్టించుకున్న వాడు శ్రీశ్రీ. అందుకే మహాకావ్యమైన మహాప్రస్థానాన్ని సాహితీ జగత్తుకు ఉపాయానంగా ఈయగలిగాడు. అగ్ని దగ్ధమై మళ్ళీ మళ్లీ 'ఫీనిక్స్'గా పుడుతానని ప్రతిన బూనిన ఈయన శ్రీశ్రీ మార్గంలో పయనించి మరింత పదునైన కవితల్ని అందిస్తాడన ఆశిద్దాం.

-గజానన్ తామన్
మంథని

'అమ్మ' కావ్యానుశీలనము

పద్యకవిత్వం మొత్తం మీద పరిశీలించనప్పుడు స్త్రీని ఎక్కువగా రసికురాలుగా చిత్రించారని విమర్శకులు ద్వారా శాస్త్రిగారు తన వ్యాసం 'స్త్రీవాదం ఒక సంచలనం' (ఆంధ్రభూమి 25-9-2006లో వెలిబుచ్చారు. సాధరణీకరించటంలో సాహితీ విమర్శకులు తమ ఉత్తర విస్మరించడం క్షంతవ్యం కాదు. ఇలాంటి వైఖరుల వల్ల స్త్రీ వాదం ప్రబలుతున్న ఈరోజుల్లో స్త్రీలకు పద్యకావ్యం త్యాజ్యంగా పరిణమిస్తుంది. పద్యకావ్యాలలో ముఖ్యంగా ప్రాచీన కావ్యాలలో స్త్రీ శారీరక సౌందర్యం వర్ణితమైన మాట నిజమే. పురుషుని శారీరక సౌందర్యం అభివర్ణితము కాలేదా ? మెరుగు చెంగటనున్న మేగలోను కైనడి ఉవిద చెంగట నుండ నొప్పువాడని' పోతన రాముని వర్ణించ లేదా ? స్త్రీని ప్రాచీన కవులు పద్యకావ్యాలలో రసికురాలుగా వర్ణించారని చెప్పడంలో ద్వానాగారు మనుచరిత్రలోని వరూధినిని దృష్టిలో పెట్టుకొన్నారేమో !

'పాండురంగమహాత్మ్యము'లో నిత్య నైమిత్తిక కర్మల స్వాధ్యాయాన్ని విస్మరించి 'ఉహ్వాన హోమాగ్ని యూదనొల్లడు గాని విరహ జ్వరార్తుడై వెచ్చనూర్చు నిగమ శర్మను మందలించిన అక్కమాటేమిటి ? 'వీర శృంగార భయ రౌద్ర విస్మయులు గలిసి భామిని' యైన పోతన సృష్టి సత్యభామ రసికురాలేనా ? మూర్తీభవించిన చైతన్యమైన నన్నయ విరచిత ఆదిపర్వంలోని శకుంతలను ద్వానా గారు 'రసికురాలు'గా సంభావించగలుగుతారా?

వచన కవితను ప్రజాస్వామ్య ప్రక్రియగా నిర్ధారించిన వారితో ద్వానా గారు సైతం జతకట్టారు. పద్యకవితను భూస్థాపితం చేయాలన్న వారి వీరావేశం నానాటికి అతివేలమై పోతున్నది. పద్యం తెలుగు వాడికి ప్రాణం. అవధానాలు ఎందుకు లోక ప్రియమైనట్లు?

సాహిత్యపరమైన వివాదాలు సృష్టించడంలో ద్వానా వారిది అందవేసిన చేయి. వారి దృష్టిలో వచన కవితలోనే స్త్రీకి న్యాయం జరిగింది ? మానవాభ్యుదయంలో ప్రధాన భాగాస్వామినిగా గుర్తింపబడింది. 'అమ్మ'

పై ఎన్నో కవితలు వెలువడ్డాయి. ఇది చర్చనీయాంశం.

వచన కవిత, పద్యకవిత ఛందోరీతులే పద్యం భూస్వామ్య వ్యవస్థకు ప్రతీక అన్న అపప్రచారాన్ని డా॥ కోవెల సంపత్కుమారాచార్య తప్పుపట్టారు. పద్యం గ్రాంథిక భాషానుగుణమంటూ దానిని నిరసించడం న్యాయం కాదన్నారు. వ్యావహారిక భాషలో సైతం పద్యరచన సాధ్యమనడానిక జీనంత ఉదాహరణ జోస్యం విద్యాసాగర్ గారి అమ్మ సాహితీ ప్రియులకు మళ్ళీ మళ్ళీ చదివించే కావ్యం.

'అమ్మ' ఏబదియారు పుటల పద్యకావ్యం ఆశ్చర్యం కలిగించే విషయమేమిటంటే పద్యానికి అనుగుణం కానిదంటున్న శిష్ట సమ్మత వ్యావహారికాన్ని కావ్యమంతటా కవి అక్కడక్కడ వాడారు. నాపై పంచ ప్రాణములు నా కొరకై యది పంచటానికే ప్రేమ జుర్రుకొను చిట్టి పెదాలెవియైన నొక్కటే (కూతురైనా సరే) ఇంత పొడుగ్గ జుట్టు గల దేమిటిరా వెధవన్న' ఉదాహర్యాలైన ఈలాటివి కావ్యం నిండా పరుచుకొని ఉండి పఠితకు అనిదంపూర్వమైన ఆనందానుభూతిని కలిగిస్తాయి. 'కడపటి శ్వాస' తినవాలనెగానె మొహమ్ము మొత్తు' లాంటివి నిస్సందేహంగా రాయలసీమ మాండలికానికి చెందినవే. కవి పుట్టిన వూరు అనంతపురం జిల్లా 'తాడిపత్రి' అని చెప్పడం ఇక్కడ అప్రస్తుతం కాదనుకుంటాను. ఈ కావ్యంలోకి మరికొన్ని ప్రయోగాలు 'చూచేందకైనన్' మాపట్టిని కొట్టుతార ? 'కొకొచ్చెన' వంటివి పరవస్తు చిన్నయసూరి వ్యాకరణ మహారణ్యాశోభను సంపూర్ణ తిలకించిన వారిని ఇబ్బంది పెట్టేవిగా ఉన్నాయి.

గ్రాంథిక భాషపై జ్యోస్య వారికి సంపూర్ణ ప్రభుత ఉంది. ఆ భాషలో రచించిన వారి కావ్యాలు 'తాడిపత్రి' 'వెంకట శతకము' ఎన్నో పురస్కారాల్ని అందుకొన్నాయి.

'అమ్మ' కావ్యంలో సాంప్రదాయిక వ్యాకరణ విరుద్ధ ప్రయోగాల్ని సమర్థించడానిక ఎవరి వకాలత్తు అవసరం లేదు. ముందు మాటలో వారు చెప్పింది తర్కబద్ధంగా వుంది.

అమ్మకు బాసరాదు : వ్యవహారికమైన తప్పరావమ్మకు కావ్యపున్నుడులు అమెనుచిన్న తనమ్ములో పంతమ్ముగనైన పంపలేదు ఒడిదాపుకు.... మరో పద్యంలో... అందుకె బాసపై నియమ మందుకై

వ్యాకరణంపు నీయముల్ విందునకైన కాన పడవిందున...

అమ్మను నైరూప్యాకృతిగా కాక కవికి జన్మనిచ్చి అంతకు మించి సంస్కార మిచ్చిన చైతన్యమూర్తిగా రూపుకట్టించేందుకు ఆమె ఏ చందము మాటలాడినదొ సొంతము నట్టులె సాగదీశాడు.

అమ్మకు బాసరాదు. అయితే నేమి ? 'వాల్లభ్యపు మంచు మించు ఎద' ఆమెది. ఆమెయే కవికి దైవతం : ఆమెయే కవికి త్రికాల స్మరణీయ సాంప్రదాయక కవులు ప్రాయికంగా ఇష్టదేవతా స్తుతి కావ్యారంభంలో కావిస్తారు. ఈ కవి 'హృదోయిలి'లో 'ఆశీర్వాదమునిచ్చి నాదు కవితా వ్యాసంగమును మెచ్చి వేవేగ ఎట్లైన రా' అని స్వర్గీయ మాతృదేవతను ఆహ్వానిస్తాడు.

యశః కామియై కవి అమ్మ కావ్యాన్ని రచించలేదు. తల్లిపై గల అపారమైన భక్తి ప్రతిపత్తులు కావ్య రచనకు కవిని ప్రేరేపించినవి.

మెచ్చును నా కవత్వ కలిమింగని లోక మటంచు మెచ్చి బ
ల్పచ్చని లే ఒసిండి విలువైన కిరీటము నుంచునంచుగా
నిచ్ఛితినేమి ఈ రచన ? నెమ్మది నమ్మ గతించె నన్నకా
ర్చిచ్చు దహించగా... ... ...
పెచ్చిన శోక భాష్పచయ పెన్నిధికిచ్చిన రూపమంతియే !

అమ్మను ఆహ్వానించటంతో పాటు 'నాటి నేటి భార్గవులను ప్రస్తుతించి కవి పోతన మార్గగతుడైనాడు.

విద్యాసాగర్‌గారి 'అమ్మ' ఒక జీవంత శబ్ద చిత్రం. ఆమె హృదంతరాళలో తీయని కోకిలావపు తేనెల జల్లులు తప్ప మరేమీ ఉండవు. ఆమె ఆలోచనల్లో ప్రతీరోదచ్ఛాయలు లేవు.

పున్నామ్నో నరకాద్యస్మాత్త్రాయతే పితరం సుతః తస్మాత్ పుత్ర ఇతి ప్రోక్త స్వయమేవ స్వయం భువునా అని మనువు చెప్పినది కాలబాహ్యమైనదిగా చెప్తుంది. కొడుకు 'స్వర్గమందు ఊనగ' చేస్తాడన్నది 'ఊరకతీపి ఊహ', ఆమె దృష్టిలో

ఊపిరి ఉన్న చాలు కొడుకో గిడుకో
యెవరైన నొక్కటే
చేసిన ప్రేమ జుర్రుకొను చిట్టి పెదా
లెవియైన నొక్కటే.....

సామాజిక స్పృహను అభివ్యక్తీకరించేందుకు వచన కవితతో పాటు పద్యకవితకూ క్షమత ఉంటుందనడానికి ఇది చక్కని ఉదాహరణ. ప్రగతివాద భావజాలాన్ని హృద్యంగా అనన్యంగా పద్య రూపంలోనూ ప్రకటించవచ్చు. కాఫీ తాగడె అమ్మను కుర్రాడు ఎగదిగ 'కనుల నా అరచేతి వెడల్పు చేసి చూసి' నాడట. ఆ చూపు ఆమె బ్రతుక్కి పరిపూర్ణత నొసంగింది.

తల్లి ప్రేమస్వరూపిణి. అయితే, చిలిపి పనులు చేస్తే ఏతల్లి ఊరుకోదు. యశోద కృష్ణుడ్ని దధిభాండ వికలనాదులు చేసిన కారణంగా 'రోలను కట్టినది' కవి గారి 'అమ్మ' ఇందుకు అపవాదమా!

"నోటను వేలు తీ వెధవ.... నోటికి
వాతను పెట్టుతాను ఏం
చేటిది నీకు... .... మరో సందర్భంలో
పక్కిలు పిల్లవాని మెడపట్టుకుకొట్టితి
వంట... ....ఏమి నీ
కెక్కువ యైనది పొగరు... అని మందలిస్తుంది.

నేటి మమ్మీల వంటిది కాదు విద్యాసాగర్ గారి మాతృమూర్తి. మంచి విద్యావేత్త.

"తొందర యెందుకింత పడదోయుదు
రిప్పుడినుండి యెందుకా

ఒందిల దొడ్డిలోకి పసిబాలుని"

బుక్కుల మోతతప్ప మన బుజ్జికి
వచ్చెడు గొప్పవిద్యనా
కెక్కడ కనుపించదు.

"ఇంగిలిపీసు మోజుపడితే తెలుగన్నది
రాదు ఓనమాలే...

పున్నమి వెన్నలవోని తల్లి చల్లని చూపులో పిల్లాడు పెద్దాడై ఓ ఇంటి వాడవుతాడు. ఇంటిలో దృక్ప్రియంగా కదలాడే కోడలు ఆమెకు బహిః ప్రాణం. భార్యతో ఎలా మసులుకోవాలో కొడుక్కి హితబోధ చేస్తుంది.

కన్నెగ నున్న నాడుతనకన్నియలుకూర్చితి
అమ్మ నాన్న... ... ఏ
చిన్నని కోర్కెనైన చెవ చేర్చిన
చాలది తీర్చుచుండ్రి సు
మెన్నగ తల్లి నీవె మురిపించెడి
తండ్రివి నీవె ఇప్పుడే
మున్నదొకోర్కె ఏమో మరి
ముద్దులగుమ్మ మనస్సునేర్చి సం
పన్నముచేయు మన్నిటిని
పన్నుగతెల్పెడి అమ్మ అమ్మయే !

'పసిండికొండయైన' మనుమడి ముఖం కొన్నాళ్ళకు చూసుకొన్న అమ్మకు తకీమని ప్రాణము పోయినా విచారానికి తావులేదు. కనజాలితి నన్నిటి జీవితమ్ము'లో అన్నతృప్తి ఆమెకుంది.

విద్యాసాగర్ గారి 'అమ్మ' కావ్యంలోని ప్రతిపద్యం ఒక అమృతగుళిక. భారతీయ కౌటింబక వ్యవస్థ ఛిన్నాభిన్నమవుతున్న ఈ పాడుకాలాన్ని అమ్మ మహత్తు ఏమిటో ఈ కావ్యంలో హృదయ స్పర్శిగా అభివర్ణితమైంది.

తల్లి అదెవ్వరిదైన సరె... తప్పక ఒక్కతె ఆమె మంచిదె
చల్లనిదే సుధామధురసమ్మును గుండెలపిండిచేసి రం
జిల్లగ పంచిపెట్టునదె చిత్రముగా తనపొట్ట చీల్చు జా
బిల్లినె యెత్తి ముద్దుగొను పిచ్చిదై... వెర్రిదై... ఈ జగమ్ములో

-గజానన్ తామన్

మంథని

నిగమశర్మకు అక్క వ్రాసిన లేఖావళి

-గజానన్ తామన్

'అమ్మ'కు మించిన దైవం, 'అమ్మనుడి'ని మించిన నుడి లేదని ఘనంగా, హృదయస్పర్శిగా, తర్క సంగతంగా ఉద్ఘోషించే శ్రీ మణీలాల్ పటేల్ గుజరాతీ రచన నా యీ లేఖావళికి మహత్ప్రేరణ. ఏ అర్థంలోనూ ఇది అనువాదం కాదు. అలాగని, ఆ రచనను చదవకుండా ఈమాత్రం వ్రాయగలిగానని చెప్పడం సత్యదూర మవుతుంది. వర్ధమాన తెలుగు భాషోద్యమానికి 'చంద్రుని కొసగే నూలు పోగు' చందాన నా ఈ లేఖావళిని సమర్పిస్తున్నాను. ఈ లేఖలను అందుకొనబోయే నిగమశర్మ తెనాలివారి నిగమశర్మ కాదు. ఉన్నత సంస్కారం గల కుటుంబంలో జన్మించి, ఉత్తమ సంస్కారాలను అలవరచుకొన్న వ్యక్తి తెలుగు భాషాభిమాని.

ప్రియమైన తమ్ముడు చి॥ నిగమశర్మకు

ఆశీర్వదిస్తూ అక్క నిర్మల వ్రాస్తున్న జాబు,

ఉభయకుశలోపరి.

ఎన్నో రోజుల నుండి నీకు వ్రాయాలని మనసులో వున్నా వీలుపడనందుకు గల కారణాలు కొల్లలు. అవన్నీ ఏకరువుపెట్టి నిన్ను విసిగించకుండా ఒకటి రెండు మాత్రమే ఇక్కడ వివరిస్తాను. మొదటి చిక్కు - పిల్లల పరీక్షలు. ఇక రెండవది - మీ బావగారు నీటి పారుదల శాఖ డిప్యూటీ ఇంజనీరుగా ఉద్యోగ బాధ్యతల నిర్వహణ దృష్ట్యా నెలరోజులకు పైగా మంత్రపురి సమీపంలోని సుందిళ్ళ గ్రామంలో మకాం వేసియున్నారు. అక్కడ గోదావరి నదిపై బ్యారేజీ నిర్మిస్తున్నారన్న విషయాన్ని టి.వి. లేక వార్తాపత్రికల ద్వారా తెలిసికొనియే ఉంటావు. అస్తు !

ఇపుడిప్పుడే ఆమని చేలాంచలం ప్రకృతిపై, జన నివాసాలైన పల్లీపత్తనాలపై హుందాగా రెపరెపలాడుతున్నది. ఊరి పొలిమేరల్లో గల నల్లరేగడులలో రైతు బాంధవులు శనిగెలూ, గోధుమలు విత్తడంలో క్షణంపాటు తీరిక లేకుండా ఉన్నారు. వివాహాలకు వలసిన సుముహూర్తాలు

కొన్ని ఉన్నందున, ఈడొచ్చిన అమ్మాయిల్ని ఓ ఇంటివాళ్ళను చేయగోరే తల్లిదండ్రులు 'పట్టు' 'పసిడి' కొనుగోలులో మునిగితేలుతున్నారు.

కవులకు ప్రీతిపాత్రమైన అందాలను ఏమని వర్ణించను ? నన్ను అన్ని విధాలా ఆకట్టుకొనే ఋతువు ఆమని. ఈ ఋతువును సంస్కృత కవులు మధుమాసం అంటారు. అయితే వర్ష శరత్తులు ఉపేక్షితవ్యాలు కావు. ఆంగ్ల మహాకవి కీట్స్ అన్నట్లు 'శిశిరశోభలు' వసంత శోభలకు తీసిపోవు. మహాకవి ఆవంత్స సోమసుందరంలా 'ఆమ్రపర్ణి' వంటి ఉత్తమ కావ్యాన్ని తెలుగు సాహిత్య జగత్తుకు అందించలేను. ఆమ్రపర్ణి అంటే మామిడి. పుష్పించిన మామిడే వసంత ఋతువు ఆగమనాన్ని లోకానికి చాటుతుంది.

నీవు రకరకాల పక్షి, వృక్ష జాతులను గురించి చెబుతూ పారవశ్యంలో మునిగిన క్షణాలను ఈవేళ గుర్తుకు తెచ్చు కుంటున్నాను. నా మట్టుకు నాకు కుహుకుహు రాగాల కోకిలమ్మలే కాదు అన్యజాతికి చెందినవీ నా మనస్సుని దోచేవే ! చిలుకలూ, గోరింకలు, పారావతాలు చివరకు గబ్బిలాలు కూడా ! దేవులపల్లివారి 'ఎందుకే నీకింత తొందర' అనే గీతాన్ని స్నానగదిలో తరుఉగా పాడుకొంటాను. పంజరపు బ్రతుకు ముగిసి నీలాల నింగికి ఎగిరిపోతానన్న నలనీషను అభివ్యక్తం చేసే గీతం ఇది. 'నా కవితలు దయా పారావతాలు' అన్న బాలగంగాధరతిలక్‌ని ఎలా మరువగలం ? కాళిదాసుడు తన సందేశాన్ని ప్రియురాలికి చేరవేసేందుకు మేఘాన్ని ఎంచుకుంటే మన జాషువాకవి దీనుల వ్యధను శివునకు విన్నవించేందుకు దూతగా 'గబ్బిలాన్ని' నియమించుకొన్నారు.

విహంగ తతుల గురించి ఋతువుల గురించి కవులు గానం చేసిన రచనలు తెలుగులో లెక్కకు మించి ఉన్నవి. ఎన్నో మనకు తెలుగు పాఠ్యపుస్తకాలలో సాక్షాత్కరిస్తాయి. పక్షుల మాట చెప్పుకొన్నాక ఋతువుల మాట ఎత్తుకోవాలి. 'ఈ జంట నగరాలు, హేమంత శిశిరాలు' చెప్పుకోదగ్గ సాహితీ కృతి. దీని రచయిత ఉత్పలవారు. పనిగట్టుకొని కొన్నింటినైనా చదువు. తెలుగు సాహిత్య వైభవాన్ని ఆకలనం చేసుకొనటానికి తోడుపడతాయి.

ఇక హంసలు – నీవూ నేనూ ఏనాడూ చూడనివి. మానస సరోవర ప్రాంతంలో విహరించే విహంగాలని పెద్దలు చెబుతారు. నానా అగచాట్లుపడి అక్కడికి వెళ్ళేకన్న శ్రీనాథ విరచిత శృంగార నైషధాన్ని విప్పి చూడు. నలదమయంతుల మధ్య దౌత్యం నెరపిన హంస నీ ఎదుట నిలుస్తుంది. అది మనం నిత్యం చూసే పక్షి కాదు. చదలేటి బంగారు జలరుహంబుల తూండ్లు దాని మేత. శారద ఆ హంసకు సహాధ్యాయిని. బ్రహ్మదేవుని రథానికి పూన్చబడిన వారువము. ఎంత గొప్ప సీసపద్యం ! ఇలాటి పద్యాలు ఎన్నో ఉన్నాయి 'నైషధం'లో. ఆ పద్యాలలోని తూగును గమనించావా ? లాక్షణికులు చెప్పే పదలాలిత్యాన్ని, అర్థ గౌరవాన్ని పసిగట్టావా ? సీస పద్యాలంటే శ్రీనాధునివే ! నాన్నగారు ఇచ్చే పాకెట్‌మనీలోని కొంత భాగాన్ని 'ఎమెస్కో ! వారు ప్రచురించే తెలుగు ప్రబంధాల్ని కొనడానికి వెచ్చించు. తీరుబడిగా చదువుకొందువుగాని.

ఇంతగా ఎందుకు చెబుతున్నానంటే మన తెలుగువాళ్ళకు పుస్తకాలను కొని చదివే అలవాటు అంతంత మాత్రమే ! వార్తాపత్రికలకే పక్కింటి వారి తలుపు తట్టుతారు. ఇలాంటి విషమ పరిస్థితిలో విశ్వకోశాలు, నిఘంటువులు ఎలా పుట్టుకొస్తాయి ? ఏ పద్యాన్నయినా, గేయాన్నయినా పారడీగా మలచగల జలరుక్ శాస్త్రి గారి నేర్పు నాలో కొరవడినా, ఈవేళ రాయప్రోలువారి 'దేశభక్తి' గేయాన్ని వదలిపెట్టను.

ఏదేశ మేగినా ఎందుకాలిడినా
ఎలుగెత్తిల చాటు నీ తెలుగు వైభవము

మన తెలుగునకు రెండువేల సంవత్సరాల చరిత్ర ఉంది. అరవలు పలుమారులు అడ్డుపడినా ప్రాచీన భాషగా (Classical) ఇటీవల గుర్తింపు పొందింది. వ్యాసభారతాన్ని తెలంగించవలెనని రాజరాజనరేంద్రుడు కోరగానే మన నన్నయ అందుకు పూనుకొన్నాడు. ఆయన రచన అనుసృజన తప్ప మాతృకావిధేయం కాదు. వ్యాసభారతాన్ని అన్యభాషాకవులు అనువదించారు. నన్నయ అక్షర రమ్యత వారి రచనల్లో ఈషణ్మాత్రమైనా అనుభూతికి రాదు. మహాకావ్య నిర్మితికి రాచబాట ఏర్పర్చిన నన్నయ

తెలుగు భాషను వ్యాకరణబద్ధం చేసి స్థిరరూపాన్ని ప్రసాదించాడు. ఆయన కావ్యాన్ని చదివి అర్థం చేసుకొనటానికి ఏ మల్లీనాథుడు అవసరం లేదు. ఆంగ్లంలోని చాసర్ పదవ శతాబ్దపు భాష ఇప్పటివారి ఆకలన పరిధిలో లేదు. మరాఠీ జ్ఞానేశ్వరీ అంతే ! నన్నయకు పూర్వం పెద్దగా తెలుగులో సాహిత్య నిర్మితి కాకపోయినా, ప్రభువులు శిలా శాసనాల్లో తరువోజలు, మధ్యాక్కరలు, కందపద్యాలు మనల్ని పలుకరిస్తవి.

ఇంతటి ఘనమైన చరిత్రగల మన మాతృభాష సమీప భవిష్యత్తులో అంతర్ధానమయ్యే భాషల జాబితాకెక్కినదని యునెస్కో హెచ్చరించినప్పుడు ఏ తెలుగు భాషి మౌనధారణ వహిస్తాడు ? ఈ విషాదాంతికకు కారణాలను కారకులకు శోధించటం కష్టమైన పనికాదు.

ఈ జాబు వ్రాయటంలో ముఖ్యహేతువు నీకు నా హార్ధిక అభినందనలను తెలపటానికే ! ఎందుకని నీవు అంటావేమో ? నీవు ఇంటర్ ఎం.పి.సి. చదవటానికి నీ మాతృభాషయైన తెలుగును మాధ్యమంగా ఎన్నుకొన్నందుకు ! ఈ నీ నిర్ణయం నిజానికి సాహసో పేతమైనదే ! మన వాళ్ళకు ఆంగ్లభాషలో విద్యాబోధన అంటే ఎనలేని మోజు. లక్షలు కుమ్మరించి పిల్లల్ని కార్పొరేటు విద్యాలయాల్లో చేర్పిస్తారు. నిన్ను, నీబోటి వారిని ప్రతిపవాదులుగా గణించినా ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. ఈనాటి నవ్యోక్తి 'ఉత్తమం ఆంగ్లం - మధ్యమం తెలుగు'. 'నర్సరీ రైమ్స్' పిల్లలచే వల్లె వేయిస్తూ మన గురజాడ, శ్రీశ్రీలకు దూరం చేస్తున్నారు. 'మమ్మీ డాడీ'లు 'అమ్మ', 'నాన్న' స్థానాన్ని ఆక్రమించాయి.

మాతృభాష విద్యాభ్యాసం చేయటం వల్ల విద్యార్థి కల్పన తర్కశక్తులు వికసిస్తాయి. మాతృస్తన్యం గ్రోలు దశలోనే వ్యక్తి భాషాభ్యాసం మొదలవుతుంది. మొదట పదాలు, ఆ తరువాత చిన్న చిన్న వాక్యాలు నిర్మించే క్షమత అలవడుతుంది. తల్లిదండ్రుల నుంచి, ఇరుగుపొరుగుల నుంచి, బంధుమిత్రుల నుంచి చివరకు బృహత్ సమాజం నుంచి ఎనలేని ప్రావీణ్యాన్ని సంపాదించి జనాధరణ కల్గిన ఒక వక్తగా వ్యక్తి ఎదుగుతాడు. న్యాయవాదికి, ఆచార్యులకు, రాజకీయులకు వక్తృత్వ సామర్థ్యం ఎంతైనా

అవసరం. ఎన్నేళ్లు చదివినా ఏ కొందరికో తప్ప ఆంగ్లంపై పట్టు ఏర్పడదు. ఎల్లప్పుడూ హుందాగా ఉండే భారతీయులు ఆంగ్లం మాట్లాడే సందర్భాలలో విదూషకులుగా మారిపోతారు ! ఇది ఆంగ్లకవి విలియమ్ బట్లర్ ఏట్స్ అన్నమాట.

విశ్వకవి రవీంద్రులు, జాతిపిత బాపూజీ మాతృభాషలోనే వద్యాబోధన జరగాలని మరీమరీ చెప్పారు – గాంధీజీకి ఆంగ్లంపై ప్రభుత లేక కాదు. అయినా ఆయన స్వీయ ఆత్మకథను మాతృభాషయైన గుజరాతీలోనే వ్రాసి పలువురి ప్రశంసలందు కొన్నారు. రవీంద్రులు తన గీతాంజలిని ఆంగ్లంలోనికి అనువదించారు. బెంగాలీ మాతృకలోని గేయానికి గల శబ్ద సౌందర్యం లయాత్మకత అనువాదంలో లోపించి ఈ అనువాదాన్ని చదివి ఆంగ్లకవి ఏట్స్ పెదవి విరిచారు.

తస్మాత్ ! విద్యార్థి ఆంగ్లాన్ని మాధ్యమంగా ఎన్నుకొన్న పక్షంలో విజ్ఞానార్జన అటుంచి సాంస్కృతిక మూలాన్ని కోలుపోతాడు. రెంటికి చెడ్డరేవడ అవుతాడు. భూదివుల మధ్య వేలాడే త్రిశంకువు అవుతాడు. అప్పయ్య దీక్షితులవారు తెలుగువాడిగా పుట్టడం గతజన్మలోని పుణ్యఫలంగా భావించారు. 'దేశభాషలందు తెలుగులెస్స'. ఈ మాట ఎవరో కాదు. తెలుగు కవుల పాలిట కల్పతరువైన కృష్ణరాయల వారే సెలవిచ్చారు.

ఈ లేక ఇంత పొడువైనది అవుతుందని మొదలెట్టేటప్పుడు అనుకోలేదు. నీవు బహు సహనశీలివి. నీ సహనాన్ని పరీక్షకు పెట్టటం సభ్యసమాజంలో క్షంతవ్యం అనిపించుకోదు.

మన భాషను గురించిన మరికొన్ని విశేషాలను ఇంకో జాబులో వ్రాస్తాను.

సెలవా మరి !

ప్రేమతో,

నీ అక్క... నిర్మల

నిగమశర్మకు అక్క వ్రాసిన లేఖావళి - 2

-గజానన్ తామన్

ప్రియమైన తమ్ముడు చి॥ నిగమశర్మకు

నీ అక్క చిరాయువు కమ్మని దీవిస్తూ వ్రాయు రెండవ జాబు. నేను క్షేమం. నీవు క్షస్త్రమమని తలుస్తాను.

ఇటీవల ప్రపంచవ్యాప్తంగా భూతాపం పెరిగిపోయి, మానవ జీవనం దుర్భరమైపోయింది. ఈ పరిస్థిఇకి మనవూరు ఎలా అతీతం కాగల్గుతుంది ? ఇంటి పన్నులన్నీ వదిలేసి పొద్దస్తమానం కూలర్ల ముందు కూచోలేముకదా !

ఇక అసలు విషయం తెలుగు-దాని భవితను గూర్చి రేయింబవళ్ళు మన ఆలోచన - తపన. తాపత్రయాలను పక్కకు నెట్టి దానికి వద్దాము. మన పొరుగువారైన తమిళులకు తమ అమ్మనుడి యెడమాటల్లో చెప్పలేని మమకారం. సాధ్యమైనంత మేరకు తమిళులు తమ భాషలో అన్యభాషాపదాలకు చోటివ్వరు. పరిచితులు ఎదురైనచో 'వణక్కమ్' అంటారేతప్ప మనలా 'నమస్కారం' అనడానికి వారి మానసం ఒప్పుకోదు. అయినను మాతృభాషను ప్రాణప్రదంగా ప్రేమించే తమిళ విద్వాంసులు పాడటానికి మన త్యాగరాజులవారి కీర్తనలచే ఎన్నుకుంటారు. ఎందుకో తెలుసా ? గాంధర్వానికి అనువైన భాష మన తెలుగుభాష. రాయప్రోలువారి 'రమ్యాలోకము'లోని తేటగీతిని ఓమారు గుర్తుకు తెచ్చుకో !

"ఏ ప్రఫుల్ల పుష్పంబుల నీశ్వరునకు
పూజ సల్పితినో ఇందు పుట్టినాడ !
కలదయేని పునర్జన్మ కల్గుగాక
మధుర మధురంబయిన తెల్గు మాతృభాష"

ఇది ఇలా ఉండగా అప్పయదీక్షితులు నుడివినది విస్మరించతగినది కాదు.

'ఆంధ్రత్వ మాంధ్రభాషాచ
బహుజన్మ తపఃఫలమ్'

మహానుభావులైన వీరు ఇలా సెలవిస్తూంటే ఇంగ్లీషు వానిగా పరకాయ ప్రవేశంచేసి తెలుగును వీడి ఇంగ్లీషులో చదువులు వెలగబెడతామని అఘోరించడం దేనికి ?

తెలుగు తేజమైన మన త్యాగరాజస్వామి జన్మించింది తంజావూరులో ! ఆయన కృతులు కేవలం గానయోగ్యమే కాదు. అందులో అజరామరమైన సాహిత్యం ఉంది. ఎనలేని భక్తిభావ కుశలత! అదీ అలతి అలతి పదాలలో ! కేరళీయుడైన యేసుదాసో లేక మనవాడైన బాలమురళీకృష్ణనో పాడగా ఆకీర్తనలు విన్నప్పుడు నాకు కలిగే ఆనందానికి మేరలుండవు. 'నగుమోము గనలేని నీజాలి తెలిసి' 'పక్కాలా నిలబడి కొలిచే ముచ్చట' ఎందరో మహానుభావులు' వంటి వారి కీర్తనలు ఎన్నిమార్లు విన్నా ఓ కవి అన్నట్లు 'క్రొత్తలవుచుండు'. ఈ కీర్తనల్లో ఎక్కడోతప్ప అచ్చతెలుగు పదాలే ఎక్కువగా సాక్షాత్కరిస్తాయి. సాంప్రదాయక వాద్యాలకు మారుగా పాశ్చాత్య వాద్యబృందం సహకారంగా ఇటీవల వచ్చిన గానాన్ని విన్నాను. మధుర గాయని శ్రీరంజని కోడంపల్లినే గాక ఓ పాశ్చాత్య గాయకుణ్ణి విన్నాను. ఇట్టి త్యాగయ్యకు దూరమైన తెలుగు జీవనం నిస్సారమైంది.

రామభక్తిలో త్యాగయ్య తర్వాత పేర్కొనదగిన వాగ్గేయకారుడు కంచర్ల గోపన్న. ఆయన రామదాసుగా విసుతికెక్కాడు. "నను బ్రోవమని చెప్పవే' "సీతమ్మకు చేయిస్తి" మున్నగునవి ఆయన కీర్తనలు. సర్కారు పైకంతో భద్రాద్రిలో రామాలయ నిర్మాణం కావించి కటకటాల పాలైనాడు. ఆయన కీర్తనలను మన మంగళంపల్లివారు పాడి తెలుగువారి బ్రతుక్కి ధన్యతను ఆపాదించాడు.

ప్రాతఃస్మరణీయుడు అన్నమయ్య. ఆయన రచనల్లో భక్తి శృంగార రసాల మేళవింపు ఉంది. మధుర భక్తి సంప్రదాయానికి చెందినవాడు కదా ! "అదిగో అల్లదిగో హరివాసము" అనేకృతి తిరుమలేశునియెడ ఆయన

భక్తిభావాన్ని చాటుతుంది. –"ఇంత తెలిసియుండి ఈ గుణమేలర" అనే ఆయన జావళి అమలిన శృంగార రసానుభూతిని కలిగిస్తుంది.

ఈ ముగ్గురు కవుల రచనల్లో ఏలాటి కృతకమత లేదు. భావ దరిద్రతను శబ్దాడంబరం మాటున దాచిన తీరు లేదు. తత్సమపద బాహుళ్యంతో సామాన్యునికి అందుకోజాలని ఆనందదాయినులు కావు. కాళిదాసు మహాకవివలె తన్నుతాను వామనునిగా ఎంచి 'ఉస్సుర'న వలసిన పనిలేదు.

అన్యభాషాపదాలను అరువు తెచ్చుకొనకున్నా 'స్వయంపూర్ణ'గా నిలువగలిగిన భాష మన తెలుగుభాష. సంస్కృతంలో వలె గాక ఆంగ్లంలోని ఆంగ్లోసాక్షన్ పదాలవంటి అలతి అలతి పదాలు కల్గినది. 'నిక్కమైన నీలమొక్కటి చాలు' వేమన ఆటవెలది మొదటిపాదం ఇందుకు ఉదాహరణ.

భాషావిషయంలో జర్మనులు శుద్ధీకరణవాదులు. యూరప్ మొత్తానిది ఒకదారైతే వారిది మరోదారి. గ్రీక్, లాటిన్ పదాలను తమభాష నుండి తొలగించారు. వారి శుద్ధీకరణోద్యమం జాత్యహంకార జన్యం. తమిళులను, జర్మనులను అనుకరించాల్సిన అవసరం మనకు లేదు. తెలుగులో సంస్కృతాది భాషలకు చెందిన పదాలున్నవి. అన్యభాషాపదాలుగా గుర్తుపట్టలేనంత ఒదిగి పోయినవి. తెలుగుపదాల్ని వాటికి పర్యాయాలుగా కల్పించవలసిన అనివార్యత ఏమాత్రంలేదు.

సిద్ధాంతవ్యాసం వ్రాయగల్గిన వైదుష్యం నాయొద్ద లేదు. అయినా తెలుగుసాహిత్యం నాకు ఆరవప్రాణం. గైడ్ల సహాయంతో గాక ఎంతోకొంత చదివి బి.ఎ.డిగ్రీని అందుకొన్నాను. తెలుగు ఆరాధన అభిమానాలు మనకు అమ్మానాన్నల నుండి అబ్బిన సంస్కారాలు.

తమ్ముడూ ! భక్తిరసప్రధానమైన మన ఉదాత్త సాహితీసంపద ఇదివరకు పేరుకొన్న ముగ్గురితో ముగియలేదు. ఆధునికుల్లో చెప్పుకోదగినవారు దేవులపల్లికృష్ణశాస్త్రి. వారి శ్రవణపేయమైన 'మ్రోయింపకోయి మురళి' 'పదములె చాలు' గీతాలు చాలాసార్లు వినే ఉంటావు. 'నీ దయ గౌతమి

గంగా రామయ్య, నీ దాసులు మునుగంగా' అనే పాదంలో యమకం ఎంత చక్కగా ఒదిగి పోయింది ! నాదమాధురి గల పదాల ప్రోహళింపులో దేవులపల్లి వారిని మించిన కవిలేడు. షెల్లీగా కాక జయదేవునిగా ఆయనను చెప్పుకోవాలి. "తీయతేనియ బరువు బతుకు మోయలేని' విధంగానే తెలుగు గేయం బరువైన సంస్కృతపదాలను మోయలేదు.

'మహాప్రస్థానం' కర్త శ్రీశ్రీ విప్లవ కవిగా తెలుగు సాహితీ జగత్తుకు పరిచితుడు. ఓ ధార్మిక తత్త్వాన్ని హృదయాన్ని స్పర్శించే పాటగా మలిచాడు.

'బొమ్మనుచేసి ప్రాణము పోసి
ఆడేవు నీకిది వేడుక'

ఇలా వ్రాసినందుకు 'అరసం' కవులు ఆయనపై కినుక వహించారు. శ్రీశ్రీ గొప్పగా వ్రాశాడనడానికి ఈ ఉదంతం చాలు.

తెలుగును మింగివేసి సంస్కృత పదాలతో రూపొందిన కావ్య రచన జనామోదం పొందజాలదు. అలా అని సంస్కృత పదాల్ని పూర్తిగా పరిహరించి అచ్చతెలుగు పదాలే 'శయ్య'గా గల్గిన పొన్నగంటి తెలగనార్యుని యయాతి – మణిప్రవాళశైలిలోని మనుచరిత్రను మించిన ఖ్యాతిని గడించలేదు. 'గమికర్మ కృతనైకనీవృతుడనై' వంటి సమాసాలను నైషాధానువాదంలో ప్రయోగించిన శ్రీనాధునినాటి విమర్శకులు తెగనాడకుండా వదలిపెట్టలేదు. తత్సమశబ్ద బాహుళ్యం కల్గిన పద్యాలు వ్రాసినందులకు నేటి జలరుక్' శాస్త్రిగారు విశ్వనాథ వారికి 'పాషాణప్రభు'వనే కితాబు ఇచ్చారు. శ్రీనాథుడు గాని విశ్వనాథ వారుగాని అన్ని పద్యాలు అలాగే వ్రాశారా? 'రిక్కించుకొని యున్నరెక్క మొత్తము తోడి' 'తల్లి మదేక పుత్రిక' వంటి శ్రీనాధుని పద్యాలు 'లేద'నే సమాధానమిస్తాయి. విశ్వనాథవారివి వెదికి పట్టుకోవడం నీకు వదులుతాను.

కావ్యరచనలో అచ్చతెలుగు పదాలకే పెద్దపీట వేస్తానని ప్రతిన బూనిన పాలకుర్కి సోమన పండితారాధ్య చరిత్రలోని ఈ పద్యాన్ని ఉటంకించకుండా ఉండలేను. శ్రీనాధుని ఊహాజలధి తరగల్లో ఈదులాడే హంసనువీడి మనదైన ఈ జగత్తులో మనకు సుపరిచితమైన కుక్కుటరాజు జనాల్ని

నిదుర నుండి మేలుకొల్పే ఈ పద్యాన్ని నీవు ఓపిగ్గా చదవాలని కోరుతాను.

'తొలి కోడి కనువిచ్చి నిలిచి మైపెంచి
జలజల రెక్కలు సడలించి నీల్గి
గ్రక్కున కాలార్చి కంఠంబు విచ్చి
ముక్కున ఈకలు సక్కొల్పి కడుపు
నిక్కించి మెడసాచి నిక్కి మిన్సూచి
కొక్కొరో కుర్రని కూయక మున్ను'

మహా వైభవోపేతమైన భాషా సంస్కృతులు మనవి. ఆంగ్ల భాషా సంస్కృతుల వ్యామోహంలో పడి వాటిని ఉపేక్షించడం క్షంతవ్యం కాని అవివేకమౌతుంది.

కిన్నెరసాని నడకలోని సొబగులను విశ్వనాథ హృదయంగ మంగా వర్ణించాడు. భాషలో, ఆహార్యంలో, ఆలోచనల్లో ఆదాన ప్రధానాల్లో తెలుగు జీవనానికి ఎనలేని సొబగులున్నాయి. అవి అంతరించకూడదు. అవి వృద్ధిగతం కావాలి.

సోమన కుక్కటారావం తెలుగుజాతికి మేలుకొల్పు కావాలి. మరికొన్ని విషయాలు వచ్చే జాబులో...

నీ ప్రగతిని, క్షేమాన్ని కోరే
నీ అక్క

నిగమశర్మకు అక్క వ్రాసిన లేఖావళి - 3

-గజానన్ తామస్

ప్రియమైన తమ్ముడు నిగమశర్మకు.... దీవెనలు -

నీవు నా జాబుకోసం వేయి కన్నులతో వేచియుంటావని తెలుసు. పన్నులన్నింటిని పక్కనబెట్టి, సుదీర్ఘమైన మరో లేఖను నీకు వ్రాస్తున్నాను. నీ చదువు సంధ్యలు చక్కగా సాగిపోతున్నవనే నా నమ్మకం. ఆరోగ్యం విషయంలోనూ తగు నియమాలు పాటిస్తున్నావనే తలుస్తాను. నీ యోగక్షేమాల గురించి మీ బావగారు తరచూ ఫోను చేస్తూనే వుంటారు. నీవు ఆయనకి ఆరవ ప్రాణం కదా !

ఇక ముఖ్య విషయాలకు వద్దాము. నీవు సైన్స్ మాథ్సలకు సంబంధించిన పాఠ్యపుస్తకాలే కాదు; తెలుగు సాహిత్యాధ్యయనం ఎప్పటి వలె కొనసాగిస్తున్నావు కదూ !

నేను బి.ఎ. చదివే రోజుల్లో, నాకు సర్ రిచ్ద్ లివింగ్స్టన్ అనే విద్యావేత్త వ్రాసిన పుస్తకం "Some Task for Edcuation" ఉపవాచకంగా ఉండేది. ఈనాటికీ దానిని దాచి పెట్టుకొన్నాను. ఆ పుస్తకం ద్వారా ఆయన చెప్పదలచేదేమిటంటే - 'విజ్ఞానం అధ్యయన క్షేత్రంగా ఎంచుకొన్న విద్యార్థులు కేవలం దానికే పరిమితం కారాదు. మానవ శాస్త్ర (Humanities) పరిజ్ఞానంతో ముఖ్యంగా సాహిత్యంతో పర్యాప్త పరిచయం కలిగిన వారై ఉండాలి. వ్యక్తి వికాసానికి ఆ పరిచయం ఎంతో దోహదపడుతుంది. ఇది విస్మృతమై పక్షంలో, మానవులు యంత్ర మానవులుగా అంటే రోబోట్స్ (Robots)గా పరిణమిస్తారే తప్ప మానవతావాద లేక జీవనవాద దృక్పథం కలవారుగా ఎదుగరు. ఏండ్లలోఎదుగుదలతో పాటు విలువల్లో ఎదుగుదల విద్యార్థుల సాధించే దిశలో మన విద్యా విధానం ఉండాలని మరీమరీ ప్రతిపాదిస్తారు. 'మానవులమైన మనం పక్షిలా నింగిలో ఎగురనేర్చాము;

చేపలా నీలి జలాల్లో ఈత చేర్చాము; ఈ మన నేలపై మనుష్యులుగా మనుగడ సాగించడం నేర్వలేదు'. ఇది సర్వేపల్లివారి ఉద్ధరణగా ఎక్కడో చదివినట్లు గుర్తు.

సర్ రిచర్డ్‌గాక మరో మహనీయుణ్ణి ఈవేళ స్మరించుకొందాము. ఆయన పదహారు అణాల ఆంధ్రులు – మనం గర్వించ దగ్గ గొప్ప విజ్ఞాన వేత్త – ఎల్లాప్రగడ సుబ్బారావు గారు (1895–1948). ఎవరూ సాహసించని రోజుల్లో అమెరికాలో అడుగెట్టి, వివిధ విజ్ఞాన శాలలలో ఎనలేని విజయాల్ని సాధించారు. నూటన్‌కు సాటిరాగల ఆయనకు నోబెల్ బహుమతి దక్కలేదు.

వేద ఋషుల సూక్తుల్ని తలపించే ఓ సూక్తి ఆయన సమాధిపై చెక్కి యుండి మనకు దర్శనమిస్తుంది.

"Science prolongs life; religion deepens it." – దీనినే తెలుగులో చెప్పాలంటే; 'విజ్ఞానం జీవనానికి దీర్ఘత్వాన్ని ప్రసాదించేది అయితే ధర్మం గహనత్వాన్ని అనుగ్రహిస్తుంది.' ఎల్లాప్రగడవారు చెప్పింది 'ధర్మానికి గల ప్రయోజనాన్ని – సాహిత్యానికి గల సంబంధాన్ని గురించి కాదు గదా!' ఇలా నిత్యశంకితులు ప్రశ్నించే ఆస్కారం లేకపోలేదు. అయితే వారి శంకను పటాపంచలు చేస్తూ ధార్మిక సంక్షోభ గ్రస్త విక్టోరియా మహారాణి యుగానికి చెందిన మాథ్యు ఆర్నల్డ్‌ని ఉత్తర పక్షిగా చూపవచ్చు. 'సమీప భవిష్యత్తులో సాహిత్యమే ధర్మానికి పర్యాయమౌతుందని' ఆయన గారు ఉద్ఘోషించారు.

సాహిత్యం మాట ఎత్తగానే, ఉన్నపళంగా ఉలికిపడి, ఏ యుగానికి చెందిన సాహిత్యమని నిలదీసే సర్వజ్ఞులు ఈనాడు తెలుగు నాట లెక్కకు మించియున్నారు. గతంలోని సాహిత్యం ప్రతీపవాద సాహిత్యమనో, మనువాద సాహిత్యమనో గుఎక్కతిప్పకుండా సుదీర్ఘోప న్యాసాలు ఇస్తారు – లేదా ఆ సాహిత్యం ప్రభువుల మానసాలను రంజింప జేసి మడి మాన్యాలు రాబట్టే కోవకు చెందినదని నిర్ధారిస్తారు. అకించనులను ఉపేక్షించి,

అగ్రవర్ణీయ నాయకా కేంద్రితమని సన్నాయి నొక్కులు నొక్కుతారు. వారొసగే దాఖలాలు ఏమిటంటే మను చరిత్ర కావ్యనాయకుడు భూసుర కులోద్భవుడైన ప్రవరాఖ్యుడు. వసుచరిత్ర కావ్య నాయకుడు క్షాత్రకులా వతంసుడు – వారు చూసే దృష్టాంతాలు ఇంతటితో ముగియవు.

ఈ తీరున సిద్ధాంతీకరించే బుద్ధిజీవులు ఓ క్షణం పాటు అంతర్ముఖులై నా ఈ విన్నపానికి చెవి యొగ్గవలె.

'ఏ దేశ సాహిత్యమైనా ఒక అవిచ్ఛిన్న క్రమం క్రాంతదర్శులైన అంటే ముందు చూపు గల వ్యక్తుల వల్ల అది నిర్మితమవుతుంది. అవి ప్రతిపాదించే జీవన మూల్యాలు త్రికాలాబాధితాలు. మరో విషయమేమిటంటే శాస్త్రానికి విభిన్నమైన జ్ఞాపమిక మాధ్యమం కలది. శాస్త్రంవలె ఏ విషయమైనను ఇదమిత్థమని ప్రతిపాదించదు. మానవ జీవనానుభూతులను ఉపమా నాదులు లేక ప్రతిమల ద్వారా పఠితకు చేరవేస్తుంది. సాహిత్యంలో సాక్షాత్కరించే వ్యక్తులు కేవలం పాత్రలే ! మనుష్యులు కారు.

సాహిత్యం ఏ కాలానికి చెందినదైనా కాలబాహ్యమైనది కాదు. డా॥ సి.నారాయణరెడ్డి గారు నుడివినట్టు 'కవిత్వము భానుని వలె ఎంత సనాతనమో, అంత నూతనము'. వర్తమాన సాహిత్యం ప్రాచీన సాహిత్యాన్ని తెరమరుగు కావింపదు. అలాగే ఈనాటి వచన కవిత ఛందోబద్ధమైన కవితను మటుమాయం చేయదు. – పద్యకవిత పండిత వర్గ పరిమితమని, వచన కవిత ప్రజాస్వామ్య యుగావిర్భావమని చేసే సూత్రీకరణ ఏ పరీక్షకు నిలువదు. తిరుపతి వేంకట కవుల పాండవోద్యోగంలోని పద్యాలు రాయలసీమలోని పసుల కాపర్లు పాడుకున్న రోజులు ఎప్పటివో కావు !

'నా ఈ వచన పద్యాలనే దుడ్డుకర్రల్తో పద్యాల నడుము విరుగదంతాను' ఇది ఫిడేలు రాగాల డజన్ కవి పఠాభిప్రగల్భోక్తి. నేను ఆశువుగా చెప్పదలచే కందానికి చివరి పాదం ఇలా ఉంటుంది. 'పద్యాలెటువిరిగె తిక్క ! బడితయ విరిగెణ్' పద్య రచన నాటి నుండి

నేటిదాకా హుందాగా నడక సాగిస్తున్నది. అటు ఆంధ్రలో తుమ్మపూడి కోటేశ్వరరావు, కట్టా నర్సింహులు, వైద్యం వేంకటేశ్వరరావు గారలు, ఇటు తెలంగాణలో లక్ష్మణమూర్తి, సంపత్కుమార, సుప్రసన్న మరియు అనుమాండ్ల భూమయ్య గారలు పద్యకవులుగా ప్రథిత యశస్కులు.

చిన్నయ్యసూరి వ్యాకరణాన్ని పఠాభి సూచన మేరకు దండించే బదులు సరళీకరించి శాస్త్ర విజ్ఞాన భాషగా చేసియుంటే ఈనాటి రెండు తెలుగు రాష్ట్రాలు భాషాపరంగానైనా ఐక్యంగా ఉండగలిగేవి. రెండున్నర జిల్లాల వ్యావహారికాన్ని తెలంగాణపై రుద్దవలదని నాడు జువ్వాడి గౌతమరావు గారు ఒనరించిన విన్నపం అరణ్యరోదనమైనది.

'కొత్తపాతల మేలు కలయికే' సంప్రదాయం. దానికి తిలోదకాలనొసంగే జాతి భవితను కోల్పోతుంది. తెలుగు వారికి గర్వకారణమైన ఆ సంప్రదాయం నేడు కులం పేర, మతం పేర తునాతునకలయింది. కావ్య శ్రేష్టత్వాన్ని నిర్ధారించే నేటి నికషోపలం కులం ! వైదిక సాహిత్యంలోని ప్రతిమలను అభివ్యక్తి మాధ్యమంగా తీసికొన్న శ్రీశ్రీ నేటి కుహనా మేధావుల దృష్టిలో ప్రతీపవాది. యావత్ సాహితీ క్షేత్రాన్ని 'నానీ' కవుల వ్యాపించి 'సునామీ'లు సృష్టిస్తున్న ఈ అసుర సంధ్యా సమయాన శ్రీశ్రీ గేయం మౌనగీతమై జాలిగా వినిపిస్తున్నది.

'ఏవితల్లీ ఏవితల్లీ ?
నిరుడు కురిసిన హిమ సమూహములు?"

ఇంటి పనులూ, పిల్లల ఆలనాపాలన నుండి వీలు చిక్కినప్పుడల్లా సొంత గ్రంథాలయం నుండి 'మహాప్రస్థానం'ను ఎంచుకొని,కొన్ని కవితల్ని ఒకటి తరువాత ఒకటి చదువుతాను. ఆయన, విశ్వనాధ మన తెలుగుజాతికి చెందిన మహాకవులు. శ్రీశ్రీ తెలుగు కవితకు కొత్త మలుపును, తెలుగు కవులకు కొత్త చూపును ఒసంగిన చిరకాల స్మరణీయులు. కాల బాహ్యమైన అన్యాయ రాజకీయ వ్యవస్థను కూకటివేళ్ళతో పెరికి వైచి సరికొత్త సమ,

సమాజ వ్యవస్థా నిర్మితికై కదలి రండని ఆహ్వానం పలికిన మహనీయుడు. ఆయన స్వప్నించిన మరో ప్రపంచం మన ముందు నేడు ఉందా ? రష్యన్ విప్లవం విఫలమవడం నా దృష్టిలో ఒక శోకాంతిక. అయినా 'మరోమారు' అనక తప్పదు.

భావ కవిత్వాన్ని తరువాతి అభ్యుదయ విప్లవ కవులు ఆత్మాశ్రయ కవిత్వమని, ఊహా ప్రేయసి చుట్ట పల్లటీలు కొట్టిందని, నిర్హేతుకంగా బావురుమన్నదని ముద్రవేసి మళ్ళీమళ్ళీ ఈసడించినా, ఆడిపోసుకొన్నా అట్టి చరిత్రను విస్మరించి ఈ వేళ నేను త్రిసంధ్యలుఆరాధించే భావకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి, ఊర్వశి, కృష్ణపక్షం ఆయన కావ్యాలు. 'పల్లకీ !" అనే ఆయన తేటగీతి ఏనాటికీ మరుపురానిది. శైలీ సౌకుమార్యం, ప్రసాదమాధుర్యం ఆయన రచనల్లో అంతటా పరచుకొని చదవటానికి పఠితను వివశుణ్ణి చేస్తుంది. "నేను భావకవినిగాను; అహంభావ కవిని' అని నిష్ఠురోక్తులాడిన పఠాభికి భావ కవిత్వానికి గల తాత్త్విక భూమిక అంతుపట్టనిదయ్యింది.

'జగమునిండా స్వేచ్ఛాగాన ఝురులనించు' భావకవికి స్వేచ్ఛా గానమే ప్రాణము. స్వేచ్ఛ అనేక త్యాగాల ఫలితం; దేవతల ఉపాయనం కాదు. త్యాగాల బాట విజయమైనది కారాదు. మళ్ళీమళ్ళీ ఆ బాటగుండానే అమర వీరుల 'కాఫిలా' సాగిపోవాలి' అన్నాడు ఉర్దూకవి కైఫీ ఆజ్మీ, జగత్కారకుడైన ఈశ్వరుడే పరాధీనుడు. సృష్ట్యాదీనుండి సైతానుపై ఆయన చేస్తున్న పోరాటం ముగియలేదు. స్వేచ్ఛలేని నాడు మానవ జాతికి ప్రగతిపథాలు మూసుకొని పోతాయి.

పురుష స్వామిత్వ సంస్కృతిలో స్త్రీ 'చరణదాసి'. అట్టి స్త్రీని ఆరాధ్య కావించింది భావ కవిత్వం, – ఋగ్వేదంలోని ఆంభృణిని చేసింది.

తెలుగు తల్లిని కర్పూరనిభకీర్తి విభూషితను చేసిన తెలంగాణ కవిత్రయం దాశరథి కృష్ణమాచార్య, కాళోజి మరియు డా॥ సి. నారాయణ

రెడ్డిగారలు. వీరి తర్వాత పేర్కొనదగినవారు వానమామలై వరదాచార్యులు. అభినవ పోతన బిరుదాంకితులు. ఆంగ్లంలో జూన్ మాసిఫీల్డ్‌లా తెలంగాణ గ్రామీణ సౌందర్యాన్నిశబ్ద చిత్రాలుగా మలచిన దిట్ట.

గదిలోని ఓ మూల కూర్చొని దాశరధి దేశభక్తి గీతాలను అదలపించలేదు. హైదరాబాద్ సంస్థాన విమోచనకై ప్రాణాన్ని పణంగా పెట్టిన యోధ. నిజామాబాద్ జైలు గోడలపై ఆయన బొగ్గుతో రాసిన తేటగీతి చిరస్థాయిగా నిలిచిపోయింది.

"తీగెలను త్రెంపి అగ్నిలో దింపినావు
నా తెలంగాణ కోటిరత్నాల వీణ".

ఉర్దూకవుల సాహిత్యం వలె, దాశరధి సాహిత్యం అంగార శృంగారాల హృదయంగమ సంగమం. నాకు శృంగారం అంతగా నచ్చక పోయినా, అందులోని అంగారానికి ఆకర్షితునయ్యాను.

'గపానిటవులన్ పడగొట్టి మంచి మాగాణములను సృజించిన తెలంగాణము రైతుదే'

ఈయన 'రుద్రవీణ', – 'అగ్ని ధారలు' చదువాల్సిన కావ్యాలు. గాలిబ్ గీతాలతో తెలుగు సాహిత్యంలోకి 'గజల్' అనే ప్రక్రియను ప్రవేశపెట్టాడు.

ఇక ద్వితీయుడు అద్వితీయునిగా చెప్పుకోదగిన 'నా గొడవ' కవి కాళోజీ. పేరును బట్టి ఆత్మాశ్రయ కావ్యమనిపించినా సమస్త మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలు ఆయన కావ్య వస్తువు 'నీ పేర టోపీలు పెట్టామని' 'గాంధీజీ' కవితలో అన్ని సైజుల నాయకులకు చురకలంటించాడు.

విశ్వనాధ తరువాత జ్ఞానపీఠ పురస్కార గ్రహీత సి. నారాయణ రెడ్డి. 'కర్పూర వసంతరాయల' కవిగా తెలుగు సాహితీ జగత్తుకు సుపరిచితులు. నలునికి 'అక్షహృదయం'వలె నారాయణరెడ్డికి మాత్రా ఛందస్సు హృదయం సంపూర్ణంగా అవగతం. ఈయన గేయం 'ఈ నల్లని రాలలో' లోయేట్స్

కవిత 'సేలింగ్ టు బై జాంటియమ్' ఛాయలున్నాయి. ఈయన సిద్ధాంత గ్రంథం తెలుగు ఆధునిక సాహిత్యానికి ప్రవేశద్వారం.

ఈ కవిత్రయం తరువాత పేర్కొనదగిన కవ 'అభినవ పోతన' బిరుదాంకితులు వానమామలై వరదాచార్య. ఖండకావ్య యుగంలో మహాకావ్యాన్ని అందించన ఘనులు. దీనికి ముందు తెలుగు భారతిని ఆయన కైసేసిన కావ్యం 'మణిమాల'. ఆంగ్లకవి వర్డ్సవర్త్‌లా. సామాన్యులను, సామాన్య వస్తువులను అసామాన్యం చేశారు. కాడికి కచ్చరానికి కట్టిన ఎదులను బరువులాగలేని సమయంలోరక్తం కారేలా తెగ పొడిచే రైతు 'ముల్లుకర్ర'కు కన్నులు లేవని వాపోయారు. భవభూతిలా కావ్యాన్ని కరుణరస ప్లావితం చేశారు. అర్ధాలంకారమైన 'ఉత్ప్రేక్ష', శబ్దాలంకారమైన 'యమకం' ఈయన కృతులకు ప్రాణాధారం. పెద్దనలా గండపెండియరం కాలికి తొడిగించుకున్న కవిశ్రేష్టులు.

ఇంటింట గ్రంథాలయం మాటేమోగాని మా మటుకు మా ఇంట వేయి పుస్తకాల చిన్న గ్రంథాలయం ఉంది. అవివాహితగా ఉన్న రోజుల్లో ఖరీదైన చీరలు ఒల్లని నాకు నాన్న ఉపాయనంగా ఇచ్చినవి కొన్ని. నా అభిరుచి మేరకు శ్రీవారు ఇచ్చినవి మరికొన్ని. బలీయమైన కాంక్షవల్ల నేను కొన్నవి మిగతావి. 'తులసి కోట'కు చోటు కల్పించే తెలుగు ఆడపడుచులు పుస్తకాలకుతమ ఇంట చోటు కల్పిస్తారని నా ఆకాంక్ష.

తమ్ముడూ ! నీవు ఛాత్రుడవు. నేను గేహినిని. క్షణభంగురమైన జీవితంలోయావత్ సాహిత్యాన్ని ఔపోసన ఏరికేని అసాధ్యం ! ఈ విషయంలో లార్డ్ బేకన్ చెప్పినట్లు నడుచుకోవాలి. "Arts longa; Vita brevis" ఇది లాడిన్‌లోని ఉక్తి, కళ దీర్ఘమైనదైతే మానవ జీవనం క్షణభంగురమనట్టిది.

ఆంగ్లమాధ్యమం ధృతరాష్ట్రుని బిగి కౌగిలి. ఈ అంధునికి జనకత్వం వహించింది కార్పొరేటు విద్యారంగం. ఇందులో చిక్కుకొని మన తెలుగునకు గల గొప్ప సాహిత్యాన్ని 'ఈనగాచి నక్కల పాలు' చేయటమా ! వీరి విద్యా

సంస్థల్లో చదివేవారు ఒత్తిడిని తట్టుకొని కుబేరులుగా ఎదిగి సర్వం ధారపోసిన తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు చేర్చే సుపుత్రులౌతారు. తట్టుకొననివారు అపార్ట్‌మెంటు గవాక్షాల నుండి కిందకిదూకి అసువులను గాలిలో విలీనం చేస్తారు. ఇందుకు భిన్నంగా, గురుకులాల్లో చదువుకొనే పేదపిల్లలు ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహిస్తారు !

ఎల్లాప్రెగడవంటి మేధావులు తెలుగు నేలల్లో జన్మించాలంటే మాతృభాషనే బోధనా మాధ్యమం అన్ని స్తరాల్లో చేయాలి. సాహిత్యాన్ని అభ్యసించేలా పరిస్థితులు కల్పించాలి.

సాహిత్యం వినా భాష జీవించలేదు.

"ఊరక వైభవ మూడిపడునొక్కో
మహేశ్వరినట్లు మాతృభా
షారమణినిన్ భజించుటకు సంబరమందని
చచ్చు జాతికిన్"

భౌగోళికంగా రెండుగా చీలినా ఈనాడు వెలుగు కల జాతియే తెలుగుజాతి.

మరో జాబులో మన బాతాఖానీ.

ఇట్లు
నీ అక్క, నిర్మల

నిగమశర్మకు అక్క వ్రాసిన లేఖావళి - 4

-గజానన్ తామన్

నా అనుంగు సోదరుడైన చి॥ నిగమశర్మకు దీవెనలు
దీవెనలతో పాటు వ్రాస్తున్న జాబు

కొన్ని రోజుల క్రితం నిన్ను విసిగించేంత సుదీర్ఘలేఖ వ్రాసి ఇంటిని. 'ఇంత చిరుగీతి ఎదవేగిరింపచెనేని పాడుకొనును తాండవమాడుకొనును' అన్నారు కదా దేవులపల్లివారు ! తెలుగు భాషకు, సాహిత్యానికి మంచి రోజులు రావాలన్న నా ఉత్సాహపూరిత భావనలకు శబ్ద రూపంతో మరో లేఖ.

విద్య, వైద్యం మరియు రక్షణ పౌర సమాజానికి అందించవలసిన కనీస బాధ్యతలు ప్రభుత్వాలని. 'ముందుచూపులేని గతంలోని దొరతనాలు విద్యావైద్యాలను కార్పొరేటు రంగానికి సమర్పించుకొన్నవి. ఉపాధికి ప్రతిభా వ్యక్తిత్వాలు అర్హతలు కాక మార్కులే యువతీ యువకులకు రాచమార్గాలని భ్రమలు కల్పించి. తల్లిదండ్రుల నుండి ఫీజు రూపంలో నిలువునా దోచుకుంటున్నవి. ఈ ప్రైవేటు విద్యా సంస్థలు ఆంగ్లాన్ని బోధనా మాధ్యమంగా చేసి తమ శ్రేష్ఠత్వాన్ని నిరంతరం చాటుకొంటూ, చాత్రులను పెద్ద సంఖ్యలో చేర్చుకొంటున్నవి. ప్రభుత్వ పాఠశాలలు ఒకటి తరువాత ఒకటి మూతవడుతున్నందునందున బోధనా మాధ్యమైన తెలుగుకు సర్కారులు స్వస్తి చెప్పి ఆంగ్లానికి ఆహ్వానం పలుకుతున్నాయి. ప్రభుత్వాలు సంస్థలను శాసించడంపోయి సంస్థలే ప్రభుత్వాన్ని శాసిస్తున్నాయి. ఆంగ్లంలో ఓ సామెత ఉంది. "కుక్కతోకని ఆడించడానికి మారుగా తోకే కుక్కను ఆడిస్తున్నది."

ఈనాడు తెలుగులో పంతులుగారు పాఠాలు చెప్పరు. న్యాయాధీశులు తెలుగులో తీర్పులివ్వరు. ఆంగ్లంలో శాసకీయ వ్యవహారాలు సాగిస్తూ దొరతనం వారు ప్రజల చేరువలో ఉండరు. ప్రజాస్వామ్యం ఈవేళ నేతి

బీరకాయలోని నేయిలా వుంది ! మన శ్వసనావసనాలైన తెలుగు భాష క్రమంగా అంతర్హితమయ్యే ప్రమాద ఘంటికలు వినిపిస్తున్నాయి. ఆధునిక పరిభాషలో చెప్పాలంటే ఈనాడు తెలుగు భాషాయోగ ఐ.సి.యు.లో ఉంది.

మన తీయ తెలుగును పునరుజ్జీవింప చేసే ఉద్యమాలు ప్రజల నుండి పెద్ద ఎత్తున రావాలి. కుంభకర్ణునిలా నిద్రపోతున్న సర్కార్లను మేలుకొల్పాలి. బోధనా మాధ్యమంగా కాక, తెలుగును ఒకటవ తరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకు పాఠ్యాంశంగా చేసినందుకు ఉబ్బి తబ్బిబ్బు కావడం అల్ప సంతోషత్వానికి నిదర్శనం. ఇటీవలి చర్య మొక్కుబడి అవుతుందే తప్ప విద్యార్థులను పఠనాసక్తులను చేయదు.

సాహిత్యం వినా భాష జీవించి యుండదు. తెలుగునాట ప్రాచీన సాహిత్యం దాదాపు విస్తృతమౌతున్నది. వైభవ ప్రతీకలైన మహాకావ్యాలు పునర్ముద్రణకు నోచుకొనవు.

నోచుకొనినా, ప్రజాదరణలేని కారణంగా పుస్తక విక్రయశాలలు అమ్మకానికి పెట్టవు. పలు విషయాలకు చెందిన గైడ్లు విక్రయిస్తూ అస్తిత్వాన్ని నిల్పుకొంటున్నవి. ఆ గైడ్లు సాహిత్య గ్రంథాలకు నేటి అనివార్యపర్యాయాలు. అవి చదివే డిగ్రీలు, కొలువులు సంపాదించడం నేడు సాధ్యమౌతున్నది. సాహిత్యకృతులే అందుబాటులో లేనప్పుడు సిద్ధాంత గ్రంథాలు పి.హెచ్.డి. నిమిత్తం ఎలా సమర్పిస్తారు ? నాటి బ్రౌను మహాశయుని అపార ఉపకృతి వల్ల తెలుగు ప్రాచీన సాహిత్యం కనుమరుగు కాకుండా ఉంది. నేడు తిరుమతి తిరుపతి వారు కొంతవరకు ప్రాచీన సాహిత్య గ్రంథాలను ప్రజలకు అందజేస్తున్నారు. హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం వారు, కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయం వారు తెలుగు ప్రబంధాలను ఇటీవల ముద్రించియున్నారు. విశాలాంధ్ర పుణ్యమా అని గురజాడ, జాషువా, శ్రీశ్రీ మరియు దేవులపల్లి కృతులు లభ్యమౌతున్నవి. తెలుగు సాహిత్య అకాడమివారి ప్రయాసను విస్మరించలేము. 'ఎమెస్కో' వారు తెలుగు ప్రబంధాల్ని ప్రజలకు కారు చౌకగా చేరవేస్తున్నారు. అయినా వారు టీకా

తాత్పర్యాలతో ప్రచురించనందువల్ల పెద్దగా ప్రయోజనం చేకూరదు.

ఇటీవల వేదం వేంకట రామశాస్త్రి వారి టీకా తాత్పర్యాలతో ఓ ప్రైవేటు సంస్థవారు ప్రచురించిన శ్రీనాధుని 'శృంగార నైషధ' కావ్యాన్ని కొన్నాను. వెల ఎనిమిది వందల రూపాయలు మాత్రమే అయినా, ఆ పుస్తకం తీవ్ర మనోవ్యధకు గురిచేసే అచ్చు తప్పుల తడక – ఈ పరిస్థితుల్లో, ప్రభుత్వంవారు నాటి బ్రౌను మహాశయుని ఎనలేని ప్రాచీన, ఆధునిక కావ్యాల పునర్ముద్రణకు కటి బద్ధులు కావాలి. సరసమైన ధరకు ఆబాల గోపాలానికి అందించాలి. డిగ్రీ కాలేజీలు విశ్వవిద్యాలయ గ్రంథాలయాలను అధ్యాపక విద్యార్థులకు ప్రాప్తిస్థానాలుగా చేయాలి. తెలుగు సాహిత్యం ఆద్యంతం ఔపోసనపట్టి విద్వత్పరిషత్తుల 'శలాక' పరీక్షకు నిలిచి తమను నిరూపించుకొన్నవారినే ఉపాధ్యాయులుగా, అధ్యాపకులుగా, ఆచార్యులుగా నియమించి గౌరవించాలి. ఉద్యోగం దొరకని పక్షంలో సంపూర్ణ సాహిత్య అధ్యేతలైన విద్యార్థులకు గౌరవ వేతనాన్ని ఒసగే వ్యవస్థను ఏర్పర్చాలి. సాహితీ మూర్తులు వార్షిక పురస్కారాలకు 'పైరవీ' కాక 'ప్రతిభ' గీటురాయి కావాలి.

ఇంతటితో సరిపెట్టుకొనక, విశ్వకోశాలనూ, శబ్దకోశాలను సామెతల కోశాలను మాండలిక వ్యాకరణాలను రూపొందించే బాధ్యత ప్రభుత్వం వారు వారి రాష్ట్రానికి సంబంధించిన 'అకాడమీ'లకు అప్పగించాలి. అందుకు తగిన నిధులను సమకూర్చాలి. నేటికీ ఉభయ తెలుగు రాష్ట్రాలలో భాషా సాహిత్య నిష్ణాతులకు కొరత లేదు. వారి సేవలను 'అకాడమీ'లు వినియోగించుకోవాలి. ఇది చేసిన పక్షంలో తెలుగు సాహితీ వైభవ పునరాగమన ప్రవేశాలకు తోరణద్వారాలు తెరచుకొంటాయి.

ఈనాడు తెలుగు సాహితీ ప్రాంగణంలో ఉత్పలవారు నుడివినట్లు ఒక ప్రకారమైన 'స్తబ్దత' నెలకొని యుంది. ఉత్తమ సాహిత్య నిర్మితి దాదాపు మృగ్యమై పోయింది. అక్కడక్కడ ఊట చెలమలే తప్ప తెలుగు సారస్వత నదీ ప్రవాహం ఇరుతటాలను ఒరుసుకొంటూ, 'ఉప్పొంగి పోతూ'

'ఆకాశగంగతో హస్తాలు కలుపుతూ' సాగర మార్గం పట్టడం లేదు. పూర్వం కవి సమ్మేళనాలకు జనం తండోపతండాలుగా వచ్చేవారు. ఒక విశ్వనాథనో, ఒక దేవులపల్లినో, ఒక రాశరథినో, ఒక సినారెనో విని జన్మసార్థకమైన అనుభూతిని పొందేవారు. నేటి సమ్మేళనాలలో శ్రోతలకన్న నానీల కవులే గుంపులుగా దర్శనమిస్తారు. నేటి కవులు తమ కవితా సంకలనాలను తామే వ్యయ ప్రయాసలకోర్చి ముద్రించుకొని సాహితీ గంధస్పర్శ ఎరుగని మిత్రులకు కట్టబెడతారు. కొన్ని పత్రికలు సూదిమొన మోపినంత చోటు కవితలకు ఈయవు.

ఏమా రోజులు ! తెలుగువారు గర్వంగా చెప్పుకొన్న సాహితీ మాసపత్రిక. భారతి. రచనలు స్వీకరించటంలో సంపాదకులు గొప్ప ప్రమాణాలను పాటించేవారు. మహాకవి శ్రీశ్రీ 'మహాప్రస్థానం'ను ప్రచురించక మొదట తిప్పి పంపారంటే నీకు ఆశ్చర్యం వేస్తుంది కదూ !

కొమ్ములు తిరిగిన విమర్శకుల వ్యాసాలు అందులో చోటు చేసుకొనేవి – అట్టి గొప్ప పత్రికను అడిగేవారు లేనందున మూతపడింది. తెలుగు సాహిత్య చరిత్రలో అది ఒక చీకటి అధ్యాయం.

ఉత్తమ సాహితీ నిర్మితికి పరిపోషకమైన బౌద్ధిక వాతావరణం మాథ్యూ ఆర్నల్డ్ సెలవిచ్చినట్లు ఎంతైనా అవసరం. అట్టిదానికి నానా భాషలలో చరిత్ర సృష్టించిన గ్రంథాలు తెలుగులోకి అనూదితం కావాలి. ఫ్రెంచి రచయితలైన 'సార్త్రె', 'కేమూ'లు, జర్మన్ రచయిత 'కాఫ్కా', రష్యన్ రచయిత 'సోల్జినిట్షిన్'తో నేటి రచయితల పరిచయం పెరగాలి. అలాగే 'సాల్‌బెలో' లాంటి అమెరికన్ రచయితలతో. మరాఠీ బెంగాలీ భాషలలో గొప్ప సాహిత్యముంది. "పేరడైజ్‌లాస్ట్ వంటి మహాకావ్యం రచనకు ఆంగ్లకవి మిల్టన్ ఎంచుకొన్న మార్గాన్నే నేటి తెలుగు కవులు అనుసరించాలి.

మనకు గల విశ్వవిద్యాలయాలకు, అకాడమీలకు ఇంతకు మించిన 'ఎజండా' ఉండబోదు. ఈ సంస్థలు అంకితభావంతో అనువాద కార్యానికి పూనుకొవాలి.

ఒకనాడు తెలుగునాట గొప్ప గ్రంథాలయాలు ఉండేవి. ఇటు హైదరాబాద్ ఓరుగల్లులో అటు రాజమహేంద్రవరంలో, హైదరాబాద్‌లోని శ్రీకృష్ణదేవరాయ భాషానిలయం 1903లో స్థాపించబడింది. అట్టి సందర్భానికి ధర్మవరం కృష్ణమాచార్యులు ఆహూతులు. మంత్రపురికి చెందిన గంగా లక్ష్మణకవి ఆచార్యుల వారి ప్రశస్తిగా పంచరత్నాలను సభలో సమర్పించారు. లక్ష్మణకవి అప్పుడు కేవలం పదమూడు ఏండ్లు నిండిన పసివాడు.

నేడు గ్రంథాలయోద్యమాలు తెలుగునాట మళ్ళీ రావాలి. గ్రంథాలయాలకు పట్టిన నేటి దయనీయ స్థితి తొలగిపోవాలి. పల్లీ పత్తనాల్లో గ్రంథాలయాలకు తగిన భవనాలు లేవు. గ్రంథాలను భద్రపరిచే, పఠితలు కూర్చునే సామాగ్రి లేదు. చెదలు పట్టకుండా వలసిన రసాయనిక చర్యలు లేవు. పుస్తకాల ప్రియులైన గ్రంథపాలకులు లేరు. అంతర్ముఖులై ప్రజలూ ప్రభుత్వాలు ఆలోచించాలి. ఈ విషాదస్థితికి చరమగీతం పాడాలి. అంధ విశ్వాసాల్ని సమూలం పెరికివైచి, హేతువాదాన్ని పరిపుష్టం చేసే సాధనాలు గ్రంథాలయాలు ! పౌరుల్ని సుసంస్కృతుల్ని చేసి దేశోన్నతి వైపు నడిపించే ప్రేరణా స్రోతస్సులు గ్రంథాలయాలు !

పురాణాల్లో సుందోపసుందుల గాథ ఉంది. వారు లోకబీకరులైన రాక్షసులు. దైవీ ప్రేరణ వల్ల వారు పరస్పరం కలహించుకుని ఒకరినొకరు హతమార్చుకొన్నారు. తెలుగు సాహిత్యంలో ఇదే జరిగింది. సమయ ప్రేరితాలుగా వచ్చిన ధోరణులు సహజీవనం నెరపకుండా పరస్పర హత్యాకాండకు పూనుకొన్నవి.

భావ కవిత్వాన్ని – అభ్యుదయ కవిత్వం, అభ్యుదయ కవిత్వాన్ని విప్లవ కవిత్వం అంతమొందించే వరకు అభినివేశాన్ని వీడలేదు. దిగంబర కవులు రంగ ప్రవేశం చేసి సాహిత్యాన్ని చీల్చి చెండాడి శాశ్వత సమాధి కట్టారు. జనవంద్యమైన పద్యాన్ని వచన కవులు అపరవామనులై పాతాళానికి నెట్టివేశారు.

కవిత్వం సార్వకాలికం. కవులది భౌగోళిక, రాజకీయ సాంస్కృతిక ఎల్లలెరుగని సువిశాల జగత్తు. టాల్‌స్టాయ్ మనకు పరకీయుడు కాడు. జర్మనీకి చెందిన 'గెటే' త్యాజ్యుడు కాదు. కాళిదాసుని అభిజ్ఞాన శాకుంతలాన్ని జర్మన్‌భాషలోనికి అనువదించిన మహనీయుడు. ఏ మూలలో సృష్టింపం బడినా సాహిత్యం సమస్త మానవాళిది.

పోతన్నవారి 'ఆపన్న గజేంద్రము పాహి ! పాహి ! అనగానే శ్రీ మహావిష్ణువు సంరంభియైనట్లు' నేటి ప్రజా నాయకులు తెలుగునకు పూర్వ వైభవం కల్పించటానికి నడుం బిగించాలి. ఉంటాను.

ఇట్లు
నీ అక్క, నిర్మల

Jnanpith Awardee
Dr. C. Narayana Reddy Ex. M.P.
M.A., Ph.D., D.Litt.
PRESIDENT
Andhra Saraswatha Parishath
Tilak Road, Hyderabad - 500 001.
Phone : (Off.) 24753724

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
డాక్టర్ సి. నారాయణరెడ్డి ఎక్స్ ఎం.పి.
ఎం.ఏ., పిహెచ్.డి., డి.లిట్.
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్, హైదరాబాదు-500 001.
ఫోన్ : (ఆ) 24753724

No.

తేది: 24.06.2006

శ్రీ గజానన్ తామన్ గారికి,

నమస్కారం.

మీరు ఆప్యాయంగా పంపిన "మానస సరోవరం" అందింది.

మాత్రాచ్ఛందో భరితంగా గేయం రచించినా, వచన కవిత రాసినా మీ సృజనాత్మకత ప్రతి కవితలో అగుపిస్తున్నది.

మీ గేయ రచనా పటిమకు "నేటి నా గీతం" అనే కవిత ప్రబల సాక్ష్యం. మీ కవితల్లో వస్తు వైవిధ్యం ఉంది. అభివ్యక్తి గాఢత్వం ఉంది. చాలా సంతోషం.

మీ

N.B: నా విశ్వంభర మీరింకా చదువలేదా? చదువకపోతే పంపించే ఏర్పాటు చేస్తాను.

Res: Plot No.48, Film Nagar Colony, Jubilee Hills, Hyderabad - 500 034. Ph. 23548451

Jnanpith Awardee
Dr. C. Narayana Reddy Ex. M.P.
M.A., Ph.D., D.Litt.
PRESIDENT
Andhra Saraswatha Parishath
Tilak Road, Hyderabad - 500 001.
Phone : (Off.) 24753724

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
డాక్టర్ సి. నారాయణరెడ్డి ఎక్స్ ఎం.పి.
ఎం.ఏ., పిహెచ్.డి., డి.లిట్.
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్, హైదరాబాదు-500 001.
ఫోన్ : (ఆ) 24753724

No. ఆసాప/2004-05/2854

తేది: 7.12.2004

శ్రీ గజానన్ గారికి

నమస్కారం

మీరు పంపిన డా. సోమసుందర్ గారి "ఆమ్రపల్లి" పైని వ్యాసం చదివాను.

ఆ కావ్యానికి పూర్వ రంగాన్ని మీరు చక్కగా విశ్లేషించి చూపారు. దానికి సంబంధించిన మరికొన్ని అంశాలను ప్రస్తావించారు. ఆమ్రపల్లి కావ్యానికి మీ వ్యాసం కరదీపిక లాంటిది. సంతోషం.

ఉంటాను.

మీ

Res: Plot No.48, Film Nagar Colony, Jubilee Hills, Hyderabad - 500 034. Ph. 23548451

Jnanpith Awardee
Dr. C. Narayana Reddy Ex. M.P.
M.A., Ph.D., D.Litt.
CHAIRMAN
Andhra Pradesh State Cultural Council
Government of Andhra Pradesh
Kalabhavan, Hyderabad - 500 004.
Phone : (O) 23214603 (R) 23548451
Fax : (O) 23214603

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
డాక్టర్ సి. నారాయణరెడ్డి ఎక్స్ ఎం.పి.
ఎం.ఏ., పిహెచ్.డి., డి.లిట్.
అధ్యక్షులు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక మండలి
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
కళాభవన్, హైదరాబాదు-500 004.
ఫోన్ : (ఆ) 23214603 (ఇ) 23548451
ఫాక్స్ : (ఆ) 23214603

తేది:22.1.2004

శ్రీ గజానన్ గారికి,

నమస్కారాలు -

మీరు ఆప్యాయంగా పంపిన మీ కవితా సంపుటి **'మానస సరోవరం'** అందింది. సంతోషం.

అక్కడక్కడ కొన్ని వచనకవితలున్నా, మీ రచన వివిధ గేయగతుల్లో సాగింది. వైదికాంశాలను, పౌరాణికాంశాలను భూమికలుగా తీసుకొని మీరు చక్కని కవితలు రచించారు. కొన్ని కొన్ని కవితల్లో భావుకతతోపాటు, సామాజిక చేతన కూడా వుండడం ప్రశంసనీయం.

మీరు నా **'నవ్వని పువ్వు'**ను ప్రస్తావిస్తూ **'విశ్వంభర'** చదవలేదన్నారు. **'విశ్వంభర'** ప్రతిని పంపుతున్నాను. చదివి మీ స్పందన తెలియజేయండి. ఉంటాను.

మీ,

(డా. సి. నారాయణరెడ్డి)

శ్రీ గజానన్ తామన్,
తమ్మిచెరువు కట్ట,
మంథని - 505 184
కరీంనగర్ జిల్లా.

Jnanpith Awardee
Dr. C. Narayana Reddy Ex. M.P.
M.A., Ph.D., D.Litt.
PRESIDENT
Andhra Saraswatha Parishath
Tilak Road, Hyderabad - 500 001
Phone : (Off.) 24753724

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
డాక్టర్ సి. నారాయణరెడ్డి ఎక్స్ ఎం.పి.
ఎం.ఏ., పిహెచ్.డి., డి.లిట్.
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్, హైదరాబాదు-500 001.
ఫోన్ : (ఆ) 24753724

No.

తేది: 17-04-2009

శ్రీ గజానన్ థామన్ గారికి

నమస్కారం.

మీరు ఆప్యాయంగా పంపిన మీ గేయ కావ్యం
"సాకేత రామాయణం" అందింది. సంతోషం.
మరాఠీ మహాకవి మాడ్గూళ్కర్ 'గీత రామాయణ్'కు
మీరు చేసిన తెలుగు అనుసృజనం పరమ మనోజ్ఞంగా ఉంది.
గేయ చ్ఛందస్సుల్లో వివిధ గతుల్లో ఈ కావ్యాన్ని రూపొందించారు
మీరు. భావాలు మూలగ్రంథంలోనివే అయినా వాటిని తెలుగు
పదాల్లో మీరు పొదిగిన తీరు శ్లాఘనీయంగా ఉంది.
చక్కని పరిణత కృతిని తెలుగులో అందించిన
మీకు నా హార్దికాభినందన.

Res: Plot No.48, Film Nagar Colony, Jubilee Hills, Hyderabad - 500 034. Ph. 23548451

Jnanpith Awardee
Dr. C. Narayana Reddy Ex. M.P.
M.A., Ph.D., D.Litt.
PRESIDENT
Andhra Saraswatha Parishath
Tilak Road, Hyderabad - 500 001.
Phone : (Off.) 24753724

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
డాక్టర్ సి. నారాయణరెడ్డి ఎక్స్ ఎం.పి.
ఎం.ఏ., పిహెచ్.డి., డి.లిట్.
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్, హైదరాబాదు-500 001.
ఫోన్ : (ఆ) 24753724

No. ఆసాప/2004-05/[illegible]

తేది: 30-11-2004

శ్రీ గజానన్ గారికి,

మీ లేఖ అందింది. డా. సోమసుందర్ మీకు "నారాయణ చక్రం" గ్రంథం అందించినందుకు సంతోషం.

మీరు పంపిన రెండు కవితల్లో 'షట్పదులు' రచనా సంవిధానం బాగుంది. ధారాళంగా సాగిపోయింది.

చాలా సంతోషం.

మీ

Res: Plot No.48, Film Nagar Colony, Jubilee Hills, Hyderabad - 500 034. Ph. 23548451

శ్రీ గజానన్ థామన్ గారికి

కవివరా ! నమస్కారం

మీ సాకేత రామాయణం పఠించి పరికించి సంతోషించాను. మీ కర్త గజానన్ అనువక్త గజానన్ సమీక్షకులు లక్ష్మణులు. ఎంత శుభయోగం!

పాత్రల పలుకులతో కథను పాఠకుల కళ్ళకు కట్టించిన ప్రణాళిక ప్రశంసనీయం, అపూర్వం.

సంతాన భాగ్యం లేని కౌసల్య పరితప్త హృదయం అద్భుతంగా ఆవికృతమయింది. ఎంత సనాతన మా ఆకాశం ఎన్నితారకల నీ నను నిత్యం – ఈ మాటలలో ఎంత అర్థం గర్భితమై ఉన్నదో ! లక్ష్మణుడు అన్యాయం పట్ల ప్రదర్శించిన అసహనంలో ఆగ్రహంలో ప్రత్యేకత ఉంది. "మత్తమతంగజమై విధి నున్ను చిమ్మనీ రాఘవ ! సంకెల దగిలించి దాని బింకమణచనా" ఈ క్రోధావేశం ఎవరి మీదనో కాక విధి మీద గావడం విశేషం.

సీత తాను భుజాతనని చెప్పిన తీరు మనోజ్ఞంగా "నిజ సహవాసిగ పొందనెంచియే నేల పొరలలో వేచితి యుగములు" శూర్పణఖ రావణుణ్ణి రెచ్చగొట్టిన చిన్నమాటలోని నైశితీ చిత్రం గమనార్హం. జనుల దృష్టి ఆ తాపసి పూజ్యుడు జనుల దృష్టిలో నీవొక పూజ్యము. మొదటిపాదంలో జనుల దృష్టి ఆ తాపసి ఇక్కడ దృష్టి నా తపసి. అంటే సప్తమి స్పష్టంగా ఉండేదే నిలిచినది నా మ్రోల... నిబిడనీరిజగా అనంతము – అనుకొన్న శబరిపలుకులో రాముడి అనంతత్వం స్ఫురితమయింది. హనుమంతుడికి సీత గ్రహణసమయాన దిగులొంగు దిక్సతివలె 'అస్తమయవేళ సందిగ్ధక్షితిజము వలె తోచిందా ? ఎంత రుచిరమైన ఊహ !

వానరులు తమ అసాధారణ పరాక్రమ ప్రాగల్భ్యాలను అలవోకగా అసామాన్యప్రజ్ఞా విశేషంతో ప్రకటించారు.

ఆ దరి వెలసినలంకానగరిని
ఈ దరి కీడ్చుట మనకగు సాధ్యుడు

ఇట్లా కావ్యమంతటా భావశబలత ఉంది. ఉక్తివై చిత్రి ఉంది. ఏమైనా అనుసృజనలో మూలకర్త భావాలేవో అనువక్తభావాలేవో తెలుసుకొనే అవకాశం పాఠకుడికుండదు.

సంయుక్తాక్షర పూర్వాక్షరాలు లఘువులుగా చాలచోట్ల ప్రయుక్తమైనవి. రేఫాంత సంయుక్తాక్షరపూర్వాక్షరానికే గదా ఈ అవకాశం?

వశిష్ఠ కాశ్యపజాబారీలు - బాబాలులు అనవలదా ?
స్నాత నేడు సాకేతము - భిన్నలింగం కాదా ?
తేరువు ఉన్నదా ? ఎమరక - ఏమరక కాదా ?

శ్వేతఛత్రము, భక్తితో, నేరమగునె నరుని - నరుని ముందుండ నక్క ఆ లేదా ? నీవోలెనె, అరయు దెపుడు (ఉత్తమ పురుషలో అరయుదును), ఆశ్రయించని (నీ) సాగని (నీ) హ్రస్రం తుగనా ?

ఇవీ ఇటువంటివి మరికొన్ని అక్కడక్కడ కనిపిసున్నవి. వేటికేమిగాని మీ అనువాదం సరళసుందరం రసజ్ఞుల నలరిస్తున్నది.

ఆ మహారాష్ట్ర కవి గజానన్ దిగంబర్ మాడ్గూల్కర్ ఎప్పటివారు ? మీరు మహారాష్ట్ర భాషలోనూ పండితులేమో ! పారశీకం నేర్చుకొనడం వలన దువ్వూరి రామిరెడ్డి గారి పానశాల ఉమార్ఖయ్యాం రుబాయత్ల అనువాదాలలో ప్రసిద్ధమయింది.

మీరు పద్యాలూ చక్కగా వ్రాయగలరనుకొంటాను. అందరూ చదివి ఆనందించదగిన మంచి కావ్యం సాకేత రామాయణం.

దాచేపల్లి
07-08-2009

భవదీయుడు
కవి రాజశేఖర
చిట్టిప్రోలు కృష్ణమూర్తి
గుంటూర్. సెల్ : 98665 79402

श्रीः

"यं कामये तंतमुग्रं कृणोमि तं ब्रह्माणं तमृषिं तं सुमेधाम्"* (ऋ.वे.10.125.5)

Satadhika Grantha Nirmata, Vedanta Visarada, Vedanta Sagara, Sastrakalanidhi

"Mahamahopadhyaya" **Dr. P. Sri Ramachandrudu**

Vedanta Siromani (Sanskrit), Vidvan (Telugu), M.A., Ph.D. (Skt.). M.A. (English), M.A. (Hindi)
Professor of Sanskrit, O.U. (Retd.)

'Nandanam' 7-1-32/4,
P-2 (892) Leela Nagar,
Begumpet, Hyderabad - 500 016.
Phone : 23731200

Date : 18. 4. 2009

Member, Executive Board,
Central Sahitya
Akademi, New Delhi

Recipient of :

National Award of All India Oriental Conference 1985
Award from A.P. Sahitya Akademi 1985
PRESIDENT'S CERTIFICATE OF HONOUR 1987
Award from Telugu University, 1991
Viswabharati Award, 1994
Central Sahitya Akademi, Translation Award, Telugu 1996
Gupta Sahitya Award, 1999
Siddhartha Kalapitham Award 1999
Sivanandaguru Eminet Citizen's Award 2000
Telugu Atmagourava Puraskar, Govt. of A.P. 2001
Central Sahitya Akademi Award for Original Work in Skt. 2002
Vachaspati Puraskar, Birla Foundation, New Delhi 2004
Kalidasa Jnanaratna Award, 2006
Mahakavi Kalidasa Sanskrta Jivana Vrati Rastriya Puraskar, K.K. Sanskrit University, Ramtek
Raghunatha Desikendra Samskrita Visishta Puraskar, 2007
Pratibhamurti Jeevitakala Sadhana Puraskar A.V.K. Foundation, U.S.A. 2008
Prajna Puraskar 2008
B.N. Reddy Sahiti Puraskar 2008

★ *"Whomever I want to protect I make him very powerful, a creator, a seer of supernatural vision and intellect"*

Declares the ***Vedic Seer,*** **वाक्** in her ***Brahmic Ecstasy.***

శ్రీ గజానన్ ధామన్ గారికి నమస్కారములు.

మీరు [illegible] పంపిన సీతారామాయణం
చదివి ఆనందించినాను. [illegible]
[illegible] అవసరం లేదు. [illegible]
[illegible] ప్రొ. లక్ష్మణమూర్తి గారు, డా. [illegible]
లక్ష్మణ రావుగారు చక్కగా విశదీకరించారు.
శ్రీ [illegible] లక్ష్మణ్ రావుగారు శ్రీసీతారామ
సదనం ద్వారా ప్రచురించి సాధకులకు ఉత్తమ
మైన భక్తిరసపూరితమైన కావ్యం అందించారు.

సీతారామునకు ఒక్క లక్ష్మణుని సేవ
ఉంటే సీతారామాయణానికి ముగ్గురు
లక్ష్మణుల సేవ ఉన్నది.

అభినందనములతో

భవదీయుడు
పుల్లెల శ్రీరామచంద్రుడు

డా॥ జి. లక్ష్మణరావు, M.A., P.hd.
విశ్రాంతోపన్యాసకులు
కరీంనగర్.

ఇ.నెం. 10-3-363, వివేకానందపురి,
కరీంనగర్-505 002.
సెల్ : 984938036, 2229880

తేది : 01.05.2009

ఆత్మీయులు, పండితులూ, కవీ

శ్రీ గజానన్ తామన్ గారికి అనేక నమస్కారములు. మీ సాకేత రామాయణమునకు ఒక అభిప్రాయం రాసే అవకాశం కల్పించడం వల్ల పూలుముడిచిన వస్త్రమునకు వలె నాకు కూడా కొన్ని యశఃపరిమళాలు లభించడం అదృష్టం. శ్రీరాముని అనుగ్రహం. మీ అభిమానం - నా ప్రాప్తం.

"ధవళము" గురించి తెలుగు ఛందోవికాసము (సంపత్కుమార)లో ఉన్న విషయము ఉన్నంతవరకు కొంత వివరణ కలిపి మీకు రాస్తున్నాను.

"ధవళము" - దేశీయమైన ఛందస్సు. దేశీయ చ్ఛందములన్నీ మాత్రా గణ ప్రమాణములే. సంప్రదాయ గణములలో ఒదుగవు. మాత్రాగణములు కాలసూచికలు. సంగీత పరిభాషలో త-క-కి-ట-లు. ఒక్కొక్క అక్షరము దాని ధ్వని ఒక మాత్ర. రెండు మాత్రలయితే "తక' లేదా కిట. మూడు మాత్రలయితే తకిట - నాలుగయితే కిటతక - దేశీయములైన పాటలు ఈ కొలమానములలో రెండు నుండి ఐదు మాత్రల వరకు పునఃపునరావృతి చెందుతూ ఉంటాయి. వాటి మాత్రలు, ఆవృతులను బట్టి 19 రకాలయిన పదములు, పాటలు తెలుగులో పాడబడుచున్నవి ఉన్నాయి. అందులో ఒకటి ధవళము.

<u>**ధవళము :-**</u>

గ్రక్కున - ప్రయాన - పట్నం 4+4+4 - (3)
కాంచిరి - హర్షము - తోనూ 4+4+4 - (3)

ఇందులో నాలుగు మాత్రల గణములు ఆరు ఉన్నాయి. రెండు పాదాలుగా విభజించి వ్రాసినాము.

మధురగతి రగడకూడ ఇంతే కాని ప్రతిపాదంలో నాలుగేసి గణాలు ఉంటాయి.

దాదాపు దేశీయమైన పాటలన్నీ జానపదాలే. అన్నీ మాత్రాగణలయబద్ధములే. అన్నీ ద్విపద, రగడ, షట్పదుల భేదాలే. ధవళమువలె కొంచెము భిన్నంగా మధురగతి రగడ రూపంలో ఉన్న ఒకపాట – తలుపు దగ్గర పాట. (పైన తెలిపిన 19లో ఇదొకటి).

కలికిక – వాటము – బంధము – చేసిన.... 4+4+4+4 – (4)

"ధవళము" గురించి ఇంతకంటె ఎక్కువగా తెలియదు. దేశిచ్ఛందస్సు పై పరిశోధన చేసిన డా॥ సంగనభట్ల ఇంకా ఏమయినా వివరంగా వ్రాసినాడేమో ఆ పుస్తకం ప్రస్తుతం నావద్ద లేదు. చూసినప్పుడు విశేషముంటే వ్రాస్తాను.

నమస్సులతో...

"ధవళము"
ప్రయోగాలు కనిపించినపుడు
రాసిపెడతాను.

మీ
[signature]
1/5/09
ఉదయం 6 గం॥లు

Dr. M. PRABHAKARA RAO
Sr. Asst. Professor of Telugu
Principal Investigator
UGC Major Research Project (2006-09)
Oriental Research Institute
Sri Venkateshwara University
THIRUPATI - 517 502. Chithur Dist. (A.P.)

(O) : 0877-2249666 Ex. 291
(R) : 0877-2262114
Mobile : 9441872536
Email: mprao_24@yahoo.com

గౌరవనీయులు సహృదయ కవిమిత్రులు ఆచార్య శ్రీ గజానన్ థామన్ గారికి నమస్సులు.

నేను చాలా కాలంగా చదవాలని అన్వేషిస్తున్న గజానన్ డిసెంబర్ మాడ్గుళ్కర్, "గోల్ రామాయణాన్ని" మీరు అత్యంత ప్రతిభ .... తెనిగించి ప్రచురించి వెంటనే నాకు ఒక ప్రతి పంపించడం నాకెంతో ఆనంద దయకమైంది. వచ్చిన వెంటనే నిన్నటి రాత్రి మీ పుస్తకాన్ని అక్షరక్షరమూ చదివి ఆనందిచాను అద్భుత రచన. అనువాదమన్నట్లులేదు. చెబితేగాని తెలియదు మీ లేఖని బహులార్థసాధక సంధాయని ! ఒక రామాయణాన్నే కాదు, భాగవతాన్ని మీరు ఈ విదంగా వ్రాస్తే చదవాలని ఉంది. అనువాదం కాక రామాయణాన్నే మరికొంత విస్తృతంగా స్వతంత్ర గ్రంథంగా రగడలాంటి బంధు వైవిద్య ఫలితాలతో మీరు వ్రాస్తే చదవాని ఉంది. ప్రయత్నించండి. మీరు తప్పక వ్రాయగలరు.

మా సంస్థ జూన్ నెల 2009 20×, 21, 22 తారీఖుల్లో అంతర్జాతీయ భాగవత మహా సదస్సు మిమ్మల్ని ప్రత్యేక ఆహ్వానితులుగా పిలుస్తున్నాను. దయచేసి అంగీకరించి ఒక సభకు అధ్యక్ష స్థానంలో ఉండి, మాసత్కరాలు అందుకొన్న మీ సొంత వ్యాసంగభావాన్ని ధన్యుల్ని చేయవలసిందిగా కోరుతున్నాను.

తప్పక అంగీకరించి రాయవలసిందిగా
మీ అభిమాన పాత్రుడు
మాచివేడు ప్రభాకరరావు

ఇ.నెం. 16-2-45, పాత పోస్టాఫీసు వీధి, శ్రీకాకుళం
గుజురాతిపేట, శ్రీకాకుళం- 532 005. 26.09.2009

గౌరవనీయులు పెద్దలు శ్రీ గజానన్ థామన్ గారికి

సాహిత్యాభివందనాలు

అభిమానంతో పంపిన "సాకేత రామాయణం" అందుకొని మీ చిరునామాకు ఒక కార్డు వ్రాశాను. ఈ సరికి మీకు అందే వుంటుంది. ఫోనులో మీతో భాషించినందుకు ఎంతో ఆనందించాను.

మీ గేయ కావ్యాన్ని పూర్తిగా చదివాను. అబ్బురపడ్డాను. "మానిపాదగీతం" మళ్ళీ మళ్లీ ప్రకంపిస్తోంది హృదయంలో గేయకావ్యం చదివినప్పుడు రసగోళాలు నా పైన ప్రయోగిస్తున్న మిమ్మల్ని చూస్తూ శతకోటి స్నేహహస్తాలనీ అందిస్తున్నాను హృదయపూర్వకంగా, మానసికంగా !

రామయణ కాలం నాటి ఆదర్శాలు ఈనాటి సమాజానికి పొసగక పోయినప్పటికీ ఆ అపురూపాలు సౌందర్యాత్మకమైనవి.

రసాత్మకం, కళాత్మకం మీ అభివ్యక్తి. తెలుగులోని తీయదనాన్ని పాఠకులకు పంచిపెట్టే తీరు గొప్పది. మీ సృజనే ఈ కావ్యం. అనుసృజన అనిపించలేదు నాకు. పదపదమూ ప్రకంపిస్తోంది. ఉదహరించడం కష్టం.

ప్రొ॥ శ్రీ లక్ష్మణమూర్తి, డా॥ గంధ్ర లక్ష్మణరావులు అత్యంత శక్తి వంతంగా చేసిపెట్టారు. వారికి నా అభినందనలు.

ఈనాటి సామాజిక విచ్ఛితిని కావ్య వస్తువుగా జేసి మరో మహాకావ్యాన్ని అందించడానికి ప్రయత్నించాలని కోరుతున్నాను. "మానస సరోవరం" గురించి విన్నాను గాని చదివే భాగ్యం కలుగలేదు.

ఇంతటి మంచి కావ్యాన్ని వినామూల్యం అందించిన శ్రీ సీతారామ సేవా సదన్ వారికి అభినందనలు.

మీ స్నేహశీలి

ఛాయారాజ్

విరియాల లక్ష్మీపతి
VIRIYALA LAKSHMIPATI
అభ్యుదయ సాహితీ కరదీపిక
సంపాదకులు

అభ్యుదయ రచయితల సంఘం
(అరసం)
విశాఖ శాఖ.

కవితా దృశయంలో మానససరోవరం

జంబూద్వీపే భరతవర్షే, భరతఖండే, జననీజన్మభూమి, ఇది వేదం పుట్టిన దేశం, వేదాంతం పుట్టిన దేశం లాంటి రసాత్మక వాక్యాలు భారతదేశాన్ని దేశ ప్రతిష్ట హిమవత పర్వత పంక్తుల మీద ప్రతిష్టించడానికి రచించి గానం చేయబడినాయి. భారతదేశాన్ని తలుచుకోగానే ముందుగా గుర్తోచ్చేవి వేదాలు, ఉపనిషత్తులు. ఆర్య సంస్కృతి భారతదేశంలో విడదీయరానంతగా ముడిపడి వుండడానికి ముఖ్యకారణం చతుర్వేదాలే... భారతదేశము వేద విజ్ఞానమూ అవిభాజ్యులు.

అయితే వేదమూ వేద విజ్ఞానమూ సామాజికులకు చేరకుండా మడిగట్టించి ఆలయాల్లోకి మళ్లించారు. మధ్యయుగాల నాటి పాలకులూ, అగ్రకులలవారు, వారు వారి పబ్బం గడుపుకునేందుకు, సంఘ జీవన స్థితిగతుల పై పెత్తనం చెలాయించేందుకు సకల భోగభాగ్యాలు అనుభవించేందుకు వేదాన్ని అడ్డం పెట్టుకుని, ఆధిపత్యం చెలాయించారు. ఈ కారణంగా వేదకాలం నాటి సహజీవన సంస్కృతి మధ్యయుగాలలో ప్రజాజీవనానికి అక్కరకు రాకుండా నిరోధించబడింది. కుల వ్యవస్థ బలంగా వేళ్లూని వేదమూ వేదార్థమూ తప్పుదారుల్లో నడచిపోయి సామాన్యులకు అందని సస్యాలయ్యాయి. విగ్రహారాధన పెచ్చు పెరిగింది. దేశానికి కావలసినంత మతమౌఢ్యం సంక్రమించింది. మతము వైరాగ్యము ప్రజలకు తలనొప్పి తెచ్చిపెట్టాయి. మతయుద్ధాలు ప్రబలి నరబలి తాండవించింది. మానవ రక్తానికి తప్ప ఏకాయ కల్పచికిత్సకి లొంగని దీర్ఘరోగం దేశానికి సంప్రాప్తించడం జాతి చేసుకొన్న దురదృష్టం.

సహనావవతు, తమసోమాజ్యోతిర్మయి, అగ్నిమీళేపురోహితం సర్వేజనా

సుఖినోభవంతు లాంటి విజ్ఞాన సూక్తులు కొన్ని మాత్రమే ప్రజాబాహుళ్యంలో ప్రాచుర్యం పొందాయి. మానవజాతికి విజ్ఞాన జ్యోతులుగా భాసించాయి. అసత్యం నుండి సత్యానికి, అజ్ఞానం నుండి విజ్ఞానానికి, చీకటి నుండి వెలుతురు లోకాలకి నడిపించడానికి సుఖశాంతులతో వుండాలని ఆకాంక్షించాయి.

అయితే మానవజాతి సంపూర్ణ మానవులుగా మనుగడ సాగించడానికి తెలుగు సాహజత్యంలో వేద సూక్తుల్ని ఉపనిషదార్థాన్ని యథాతథంగా అనువాదం చేసిగాని, అనుసృజన చేసిగాని తెలుగుతో కవిత్వీకరించడం అరుదుగానే కనిపిస్తుంది. అలా వేదస్ఫూర్తిని కవిత్వీకరించిన వారిలో శ్రీ గజానన్ థామన్ ఒకరు. వీరు తేలికమాటల్లో కొన్ని వేదసూక్తుల్ని కవితలుగా సృష్టించి మానససరోవరంగా సంపుటీకరించి తెలుగు పాఠకులకు అందించారు. ఈ ప్రయత్నాన్ని తెలుగు పాఠకులందరూ మెచ్చుకోవలసినదే. విమర్శకులు తప్పక పరిశీలించవలసినదే.

శ్రీ గజానన్ థామన్ వెలువరించిన ఈ సంపుటంలో ఇరవైరెండు అందమైన కవితలు సమాహారం చేయబడ్డాయి. ఇందులో ముత్యాలై రసాలుచిందే లయ ప్రధానంగా సాగి కవితలతోపాలిట కొన్ని వచన కవితలు కూడా సంకలనం చేసి పాఠకులకు అందించారు కవి.

ఈ మానససరోవరం గ్రంథంలో గల కవితల్ని పైపైన పరిశీలించే సమయంలోనే గ్రంథకర్త సంస్కృతాంధ్ర భాషల్లోనేకాక ఇంగ్లీషు, హిందీ, మరాఠీ భాషలలో పరిచయస్తుండన్న సత్యం పాఠకలోకానికి బోధపడుతుంది. అలాగే గ్రంథంలోతులు పరిశీలించి ఆమూలాగ్రం కావ్యం పఠించిన తర్వాత గ్రంథకర్త మహారాష్ట్రా దేశం తెలుగు దేశానికి బహూకరించిన బహుభాషా పండితుడన్న సత్యం తేటతెల్లమౌతుంది. ఈట్స్ నుండి సో॥సు వరకూ విశ్వనాథ నుండి ఎలియట్ వరకూ మహాకవులం దరినీ ఆపోసన పట్టిన సందర్భాలు అనేకం వీరి కవితలు స్పష్టం చేస్తాయి.

మాక్సు ముల్లర్‌ని ఇంకా ఇతర ఫ్రెంచి జర్మన్ పండితుల్ని ప్రభావితం చేసిన కఠోపనిషత్తుని గజానన్ థామన్ కవిత్వంలోకి తర్జుమా చేసి తెలుగు కవి పండితుల మన్ననలందుకున్నారు. ఇది వీరిలోని కవితాశక్తికి మచ్చుతునక అయితే శుష్కవేదాంతంలో నిమగ్నమై అగోచరమైన ఆత్మజ్ఞానంతో జారిపోకుండా గ్రంథకర్త మానుష సమాజ విజ్ఞానంలోకి తన్ను తాను మళ్లించుకుని మానవుడ్ని తన కార్యానికి నాయకుడిగా, మానవతని తన కార్యానికి అంగరసంగా ప్రతిష్టించుకున్నారు. ఈ సత్యం వీరి కవితలన్నిటిలోనూ ప్రస్ఫుటమౌతుంది. వేదనాదాన్ని జీవనవేదంగా ప్రదర్శించే కిటుకు తెలుసుకుని ఆలోచనాత్మకమైన కవితలు రచించి తెలుగు పాఠకులకు అందించారు థామన్.

"నీ కనులు కరుణనే వర్షించునవి గాన
హరిణవాలు ఇంతగా నా ఊహమెదిలినవి
నీ హృదయమే వీణవోలె మొరయునగాన
ఈ వసుధ అందుల కోవెలగ తోచినది" అంటూ తన కవితలకు జ్ఞానకాంతులందించిన సరస్వతికి అంజలి ఘటించి కవితకు **"అంజలి"** అని నామకరణం చేశారు కవి. కావ్యారంభంలో కావ్యానికి మంగళాశాసనం చేసే సమయంలో ఇష్టదేవతా ప్రార్థన చేయడంలోని భాగంగా భాసరలోని చదువుల తల్లికి నమస్కరించే సత్ సాంప్రదాయాన్ని పాటించారు గజానన్.

వీరి కార్యహంస

"భూ దినాల మధ్య అహర్నిశం
లీలగా కదిలే వినోద వేషాన్ని" అంటూ మరో నగరాల్లోంచి ఎగిరి,

"నేను మానవుడను అయోనిగళ నియంత్రుడను ఉభయ సంధ్యలుపేక్షించు అనామకుడను" అంటూ మానవ మనోంతరాళంలో విహరించి, దేవదారుల నీడ తీర్చి నిత్యము కొలువు గంధర్వ గీతికల గళమెత్తి పాడుదము" అని మానస సరోవరంలో పల్లటీలు కొడుతుంది. కవితను చదివే పాఠకుడ్ని తనతో పాటే ఎగరేసుకుపోతుంది. మానవ

మేథల్ని విహంగాలుగా చేసి మానసరోవరంలో త్రుళ్లింతలాడిస్తుంది. ఊహాలకందని తీరాలకి పరుగులు తీస్తుంది. ఎన్నో రసగుళికలు నోటకరుచుకుని పాఠక హృదయకుడ్యాలలోకి ప్రవేశిస్తుంది. “ద్వాసుపర్ణా సయుజాసఖాయ” అని కొమ్మమీద వాలిన వేదవిహంగాల్ని పాఠక లోకంలో గల ప్రియసఖులకు పరిచయం చేస్తుంది. తనదైన శైలిలో ఎన్నో సత్యాల్ని వాక్యాలుగా తర్జుమా చేసి అందించారు గజానన్.

ఇటు తెలుగునేలకీ అటు మహారాష్ట్రకి మధ్య స్నేహవారధిగా నిలుపుతూ ఆదిలాబాద్, సాకేత మృగశిర కవితలు వెలయిస్తూ “నా తెలంగాణా ముక్కోటి దేవతల ప్రాంగణం” అంటూ విజ్ఞప్తి చేస్తారు కవి.

అందాల మా ఊరి కోవెలలో
నిత్య నవోన్వేషణం అనుగ్రహించే

స్వామి కృతికి అనురూప స్పందనగా అంటూ కవి on to be in England Now that utprills there. అన్న రాజిర్టే(బ్రౌనింగ్ వాక్యాలలో కవితను ప్రారంభించి, ఆ కవితను స్వామి కృతికి అనురూప స్పందనగా... అన్న వాక్యంలో ముగిస్తారు. నైఋతి ఋతుపవనాలు వచ్చి తెలంగాణాలోని, తన పంటపొలాల్ని తడిపి సస్యశ్యామలం చేసివుంటాయనే ఆశాభావాన్ని ఒక సైనికుడి కంఠవాహినిలో విన్పిస్తారు కవి. తెలంగాణా అందాల్ని ఇంగ్లాండ్‌లోని చైత్ర మాస శోభలతో ఉపక్రమిస్తారు. సత్యాన్వేషణ, సౌందర్యారాధన, మానవతాజిగీష ఈ మూడు వీరి ఈ మూడు గుణములు వీరి కవితల్లో ఉపాంగరసాలుగా గోచరిస్తాయి. ఎవరో అజ్ఞాత సుందరిని ప్రేయసిగా ఊహా సుందరిగా హృదయంలో ప్రతిష్ఠించుకుని కాల్పనిక ధోరణిలో తన హృదయాంతర్గత బాధని విన్నవించుకుంటారు. వీటిని చదివి ఆస్వాదించిన తర్వాత పాఠకులు ఎవరికి వారు తమ తమ ఊహాసుందరీమణులను జ్ఞప్తికి తెచ్చుకుని తీయనైన బాధని అనుభవించకమానరు. ఇదే వీరి కవితల్లో, అంతస్సూత్రంగా పొందుపర్చిన కావ్య రహస్యం.

మానవతనీ, సౌందర్యాన్వేషణ సిద్ధప్ప సిద్ధాంతాన్ని ప్రబోధించిన ఈ కవితా సంపుటిలో గజానన్ థామన్ కొన్ని సామాజిక స్పృహ గల కృతలకి ప్రాణప్రతిష్ఠ చేశారు. నామాలు వేరైనా, పంచశీల, ఈనాదేశం, ఇల్లు కంటె లాంటి కవితలు ఆధునిక కవిత్వానికి అద్దంపడతాయి. శ్రీ గజానన్ తామన్ కంచెల గురించి "స్నేహమయీ

సాధ్యం కాదు చెప్పడం సంక్షిప్త రూపంలో
కథనం చేయాల్సి వుంటుంది. అంచెలంచెలుగా
కరుణరపస్ఫోరక మహాకావ్యంగా మంచి" అంటూ సాగిన కంచె కవిత పాఠకున్నే కాదు, అభ్యుదయ కవుల్ని ప్రత్యేకంగా ఆకర్షించకమానదు.

"మనం మనం భాయీ భాయీ"
మన మధ్య కంచె అనేది ఎక్కడుంది.
ఇదంతా పూర్వీకుల నిర్వాకం" అంటారు. కంచె వేయడం అన్నది భాష ఏదైనా ప్రాంతం ఏదైనా హద్దులు నిర్ణయించడానికి ఉద్దేశించబడింది. భూమి తగాదా వచ్చి రెండుగా విడిపోయి మళ్లీ ఎప్పుడూ హద్దు దాటకుండా వుండడానికి తగువు పొడిగించకుండా వుండడానికి మానవులు ఏర్పరుచుకున్న సాధనం కంచె పరిష్కార మార్గం కంచె.

భారతదేశానికి భరతభూమికి కురుపాండవుల నాటి నుండి భూ సమస్య శాపంగా పరిణమించింది. రక్తం కాల్వలై పారింది. అసంఖ్యాక- నాటి నుండి ఆ శాప ఫలితంగా పగలు రేగుతునే వున్నాయి. స్వాతంత్ర్యం సిద్ధించిన తరుణంలో భరతఖండంలో చీలిక ఏర్పడింది. భాయీభాయిలుగా మసలుకోవలసినవారు జుత్తులు పట్టుకున్నారు కత్తులతో పోరాడుకున్నారు. కంచె ఏర్పరుచుకున్నారు. అయితే కవి కవిత్వంలో చెప్పినట్టు కంచె ఏర్పరుచుకున్న తర్వాత కథ కంచికి చేరలేదు. కథ దుఃఖానికి రక్తపాతానికి దారి తీసింది. దేశాల మధ్య చిచ్చు రగిల్చిందని చెప్పడంతోనే కంచె కవిత ఉత్తమ కవితగా రూపుదాల్చింది.

"నేనే నీవు నేనే నీవయినా
కంచె అనేది అవసరం నీనామధ్య
పున్నమి కోమారైనా నీవు అయి వేపు నుంచి
నన్ను పలుకరించి ఊరించాం కదా !

ఋగ్వేదంలోని ఊర్వశిలా" అంతా కంచె కవితను ముగిస్తారు థామన్. కవిత చదవడం ముగిసిన తక్షణం పాఠకుని మదిలో ఒక స్నేహభావం చిగురిస్తుంది. కంచెకి ఇరువైపుల అంతా వుండి ఇరువర్గాల వారు శతృత్వం కాస్తంత సేపు ఆపి ప్రేమగా పలకరించుకోవాలనిపించడానికి కవిత దోహదపడుతుంది. ఆ ప్రేమ భావం ఉద్భూతం కావడానికి కవి ఋగ్వేదంతో గల ఊర్వశి పురూరవుల గాథని గుర్తుకు తెచ్చుకుంటారు. కవితకు చక్కని ముగింపు సమకూర్చి పెట్టారు థామన్.

ఈ కవితల్లో గల కొన్ని రసాత్మక వాక్యాలు పరిశీలిస్తే కవి భావ కవి యుగంలో జన్మించిన ఆధునికుడుగా దర్శనమిస్తాడు. ఎంత ఆధునికుడో అంత ప్రాచీనుడుగానూ సాక్షాత్కరిస్తాడు.

1. ఎల్లవేళలు తిరిగి సజన విజన పథాలు
   నీవు అర్పించుటకు నేను తరియించుటకు

2. అవి విదాతకు ఇవి సాటి మానవునికి
   అనాకలనీయమైన ప్రశ్నన చిహ్నాన్ని

3. ఇన్ని నాళ్ల నెయ్యాన్ని సమభావ ప్రేరిత సహజీవనాన్ని

4. "దాని నింపను దీని నిత్తును
   గగన కుసుమములు చిటవి యిత్తును"
   ఎన్నికలలో గెల్పుకోసము
   ఇవి ఉత్తి మాటల గారడీలు

5. గ్రామాభ్యుదయం ధ్యేయమైన యువకిశోరాలు
   కావిస్తారు నాకొలువున వాదోపవాదాలు

7. ఎడారియె దవ్వేంత నడచిన ఎక్కడోచిరుశాద్వలం" లాంటి వాక్యాల్లో గ్రాంధిక వాసనలు దాగున్నా మానవతను వీడని కారణంగా కవితలు రసజ్ఞుల్ని ఆకర్షించక మానవు. అభ్యుదయ స్ఫోరక వాక్యాలు ఆహ్వానాలందుకొనక మానవు.

అయితే నేటి ఆధునిక కవిత్వంలో ఎలా మాట్లాడితే అలాగే వచన కవితలు రచించే సంవిధానం నెలకొని వుంది. గేయం గట్టిగా చదివి గంభీరంగా ఆలోచించడం అలవాటయిన నేటి తరం కవితా పాఠకులకు ఈ సంపుటిలోని కొన్ని కవితలు విసుగు కలిగిస్తాయనడంకు విమర్శ కాదు.

"ఈ వేళ ఓపికగా నాగదిలో కూర్చొని
అడ్డం నిలువు ఎటు పడితే అటు అయి
నా ఈ కుంచెను పరుగులు తీయించి
భిన్నత్వంలో ఏకత్వం చూపించే
ఓ మహాకృతిని తెస్తాను అస్తిత్వంలోకి
మళ్లీ వీలుండునో ఉండదో" అంటారు మళ్ళీ వీలుండునో... అనేక కవితలో. పైన ఐదు పాదాలు వాడుక భాషలోను ఆరవపాదం గ్రాంధికంలోనూ వుండడం పఠితకు కొంత ఇబ్బంది కలిగిస్తుంది. వచన కవితల్ని వాడుకభాషలో చదవడం అలవాటయిన పాఠకులకు ఇలాంటి వాక్యశకలాలు సూదుల్లా గుచ్చుకుంటాయనడం అతిశయోక్తి కాదు.

కవికి సంస్కృత భాష మీద ఎనలేని అభిమానం అన్న సత్యం వీరి ప్రతి కవితలోనూ ప్రస్ఫుటంగా దర్శనమిస్తుంది. అక్కడక్కడ కవితల్లో గల పదాడంబరం క్లిష్ట సమాస విన్యాసమూ పాఠకుల్ని మొగ్గలు వేయిస్తుంది. తెలుగు నాట కృష్ణశాస్త్రి విశ్వనాథ శ్రీశ్రీ వంటి మహాకవుల కంఠాలు వీరంగం చేసిన తర్వాత ఓ అంటే ఓహో అంటూ అనేక యువ కంఠాలు అనుకరించి ప్రతిధ్వనించడం ప్రారంభించాయి. శ్రీ గజానన్ థామన్ కూడా అలా ప్రతిధ్వనించి తన స్వంత గొంతుని వినిపించిన వారిలో ఒకరైన దాఖలాలు వీరి కవితల్లో కన్పిస్తాయి. ధ్వనిని, లయని తన కవితలో నిక్షిప్తం

చేసి స్మృతుల్ని శ్రుతుల్ని ఋక్కుల్ని కవితకు నేపథ్యంగా స్వీకరించారు.

వృత్తిపరంగా గజానన్ థామన్ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయులు. పండితులకు పండితులు. ఈ పాండిత్య ప్రకర్ష వీరి కవితలలో అక్కడక్కడ తొంగి చూస్తూ పాఠకులకు గ్రాంధిక బరువులు తలకు మించిన భారాన్ని కలిగిస్తాయి.

కొన్ని కవితల్లో శిశిర శైత్య దష్టతరులు, శీర్ణకోటి పర్ణావళి, వర్తమాన మంథన నిర్గళితగరళం, విరార్జనాళిక, నభంగమనిర్ఘోషం, నికృత్తన్యగ్రోధం, సహచర పరివ్యక్తుడు, నిరీహవు లాంటి పదాలు తెలుగు కవితల్లో వాడకంలో లేని పదాలు, వచన కవితలకి కొత్త కాంతులూ, నూతన అందాలూ, సమకూర్చలేకపోయాయి. అందగించని ఆభరణాల బరువులుగానే దర్శనమిచ్చాయి. ఆ పేజీ తిప్పి పఠితను అమోమయంలో పడవేస్తా యనడంలో నిజం లేకపోలేదు.

అలాగే వస్తువు ఆధునిక మూసం విధానం ప్రాచీనమై సమాస పదాడంబరంతో కొన్ని వచన కవితలు నారికేళపాకంలో పడిన సందర్భాలు అక్కడక్కడ కన్పిస్తాయి. అయితే మహారాష్ట్ర కవి సంస్కృత తెలుగు భాషల మీద మంచి వైదగ్ధ్య వైవిద్యాలు ప్రదర్శించాడన్న సంతృప్తి పాఠకుల్లో కొంత ఊరట కలిగిస్తుంది.

భారతీయ ఆత్మ యొక్క లాక్షణికతను స్వీకరించడం ప్రముఖ మరాఠీ సాహిత్యకారుడు పురుషోత్తమ రేగే సావిత్రి నవలను తెలుగు చేయడం, సాయనాచార్యుల వారి భాష్యం సహాయంతో ఋగ్వేదం పారాయణ చేయడం, జీవనవాదాన్ని మార్క్స్ దృక్పథాన్ని అనుసరిస్త ఆధునిక కవితా లోకానికి వచన కవితలందివ్వడం నేడు గజానన్ థామన్ రూపు రేఖలు తెలుగు వారందరూ సాదరంగా ఆహ్వానించదగిన ఉత్తమ కవి గజానన్ థామన్ ఉత్తమ కవితా సంపుటాల జాబితాలో చేర్చదగిన సంపుటం వీరి మానససరోవరం.

మానస సరోవరంపై నాలుగు మాటలు

ప్రతి మనిషిలో ప్రకంపనలుంటాయి. ఆ ప్రకంపనలు ఆనందానికి కావచ్చు. ఆవేదనకైనా కావచ్చు. అయితే కొన్ని ప్రకంపనలు శారీరకమైనవి. కాగా మరికొన్ని మానసికమైనవి. శారీరకమైన స్పందనలకు కొన్ని ప్రక్రియలుంటాయి. ఏ తావుల ఏ విధమైన స్పందన ఎలా కలిగిందో పరీక్ష చేసి... పసికట్టి ఆయా ప్రకంపనలను లేదా స్పందనలను విశ్లేషించి అనువైన మందునీ తగిన ఔషధాన్ని సేవనం చేయించుతారు వైద్య శిరోమణులు. కానీ మానసిక ప్రకంపనల విషయం అలా కాదు. దీని విశ్లేషణ ఎవరో ఎదుటి వ్యక్తికాదు చేయవలసినది. ఎవరికి వారే చేసుకోవలసినది. కొంత మంది ప్రకంపనలను లేదా స్పందనలను వెలగ్రక్కి ఉపశమించుతారు. అయితే ఆ వెలగ్రక్కటంలోనూ వ్యత్యాసాలున్నాయి. ఒకరు గొంతెత్తి పాడి తన అంతరాంతరాలలో చెలరేగే స్పందనలను బయటపెడతారు. ఇంకొకరు తన హృదయపుట గాధములలో ఉద్భుతమైన ఉద్రేకాలను చిత్రవర్ణ శోభితం చేసి దృశ్యావిష్కారం కావించుతారు. మరొకరు ఆవేశంతో ఊగిపోతూ అంగాంగాలతో అభినయాతివేలం చేసి ఆవిర్భవించిన లాస్య విన్యాసంతో తన మానసపు స్పందనలను నయనానందకరముగా వెలికిచూపించుతాడు. ఇక మరొక 'తరహా' మనుషులున్నారు. వీళ్ళని కవులంటారు. వీళ్ళ గుండెకోనల్లో ఉండిపాడే కోకిల స్వరాలకు అక్షర రూపం ఇస్తారు. అయితే, కవులని పేరున్న ఈ అక్షరరూపం యిచ్చే వాళ్లు ఎంచుకునే పద్ధతులు వేరువేరుగా ఉంటాయి. వీటి జన్మస్థలం ఒక్కటే అయినా వేటికవి ఉన్నతంగా విశిష్టంగా వుంటాయి. అవి.... ఒకటి పద్యము – మరొకటి వచనము. పద్యమైనా వచనమైనా ఆ ఇరు ప్రక్రియల లక్ష్యం ఒకటే. గమ్యం ఒక్కటే. ఈ పద్యమన్న ప్రక్రియ పాండిత్య శోభితులైన వారి పంచన ప్రాణం పోసుకుని పెరిగి పెద్దదయిందయితే, వచనం మాత్రం సామాన్యునితో సఖ్యంచేసి వారి సరసన శ్వాస తీసుకున్నట్టిది. మరి పద్యానికి ఆ పాండితీ ప్రసూనాల పరిమళాలు అలముకొనటం... దాని ప్రభావంతో పరిఢవిల్లడం ఎంత తప్పనిసరియో.. వచనం సామాన్యుని సాంగత్యంతో

సహజమైన సౌరభ సంపదను నెత్తికెత్తుకొని... తత్ప్రభావంతో ఆ దారిని సాగగలిగినదంటే అది అంతే తప్పనిసరి. పద్యం పండితునిది, వచనం సామాన్యునిది. పద్యం చదివి అర్థం చేసుకోవడానికి కొంత సాహిత్య పరిచయం అవసరం. శ్రమా అవసరమే. కానీ వచనమును అందరూ అర్థం చేసుకోగలరు. మొదటిదాన్ని రచించడానికి భాషపై పట్టు అవసరం. ఛందోజ్ఞానం అవసరం. వచనానికి అనుభవం చాలు, ఆవేశం చాలు, ఆసక్తి చాలు, అవగాహన చాలు, కానీ కొన్ని కొన్ని వచన కవితలకు ఇది వర్తిస్తుందేమో కానీ మానస సరోవరంలోని కొన్ని కవితలకు అది వర్తించదేమో.

తామన్ గజానన్ కావ్యం 'మానససరోవరం'లోని కవితా స్రవంతిలో యీ నుడివిన రెండింటి యొక్క సాంగత్య శోభావిభవములున్నాయి. ఇందులో కొన్ని సామాన్యునికి సులభంగా అర్థమయేలాగున్నాయి. వచన కవిత్వం మాదిరి. మరికొన్ని పద్య కవిత్వం జటిలంగా... రవంత మేధోశ్రమ అవసరమనిపించేట్లుగా ఉన్నాయి. కొన్నింటిలో మాత్రాఛందస్సుంది. పద్యంలా కాదు కాని అంతే 'పకడ్బందీ'గా ఉన్న పదాల లయతో వీరి కవితలు లాస్యం చేస్తున్నట్లుంటాయి. కానీ కవితల్లో అంతర్లీనంగా ఉన్న భావ సముదాయం మాత్రం విశిష్ట కవి ప్రోక్తములైన కవితా సుమ సౌరభాలను తలపించుతుంటాయి. ఇది గణ యతిప్రాస నియతులు లేని మాత్రాఛందము. నడక నవ్యంగా వుంటుంది. నల్లేరుపై నడకని తలపించుతూ ఉంటుంది.

గురజాడ జాడన ఎంత వడి పయనించగలను
ముప్పొద్దులా మాత్రల్ని మింగుతూ బతకలేను

'మాత్రలని మింగుతూ బతకలేను...' ఓహ్ ? ఆ మాత్రకున్న మరో అర్థాన్ని ఎంత అందంగా ఉపయోగించుకున్నారో ? పరోక్షంగా అట్లా అంటూ తమకు గురజాడ 'ముత్యాల సరాల'పై మురిపెం ఉన్నట్లు తెలుపుతూనే 'ఎన్నాళ్లీ మాత్రలని మింగుతూ... కాదు మాత్రా ఛందస్సుని పట్టుకుని వేళ్లాడను... పరుగు తీయనూ ?' అంటూ ఆ మాత్రలతో (మాత్ర)

అంటే ఔషధ పరిభాషలో మందు గుళికలు. సాహిత్య పరిభాషలో అతి తక్కువ సమయంలో పలుకగలిగే అక్షరం అనీ ఉంది. ఇక బతకలేను అంటారు అయినా మాత్రలు మింగీ మింగీ విసువు వచ్చిన ఆయన వృత్తాల్లోకి పోదామనుకున్నారు. నేన సైతం వృత్త పద్యం కొత్తకొత్తగా అల్లుతాను అంటూ ఉత్పలాన్ని కోయబోయారట గోరుకందిందట. చంపకం చెంప పేల్చేసింది. మత్తేభాన్ని చూచి పరుగు తీశారు. సీసం శ్రీను సొత్తు (శ్రీను శ్రీనాథుడికి ముద్దుపేరు) కందానికి దండం పెట్టారు. అన్ని వృత్తాలు ఆయన్ని ఏదో విధంగా బాధించినవే. భయభ్రాంతునిగా చేసినవే. కాకపోతే "ఒక్క తేటగీతికి ఏలనో నాపై జాలి. చేరదీసి రవంతకాలం చెలిమి చేసింది' అన్నారు. గజానన్ తామన్ గారు తేటగీతులను వ్రాశారు. అవి వెలుగు చూడాలి. వెలుగులోకి వచ్చేదాకా మనం వేచి చూడాలి.

ఈ మాసములో (మానసం అంటే మానస సరోవరంలో ఉండేవి అన్న అర్థం ఉంది) మొత్తం రెండు తక్కువ ఎనుబది ఉన్నాయి కవితలు. ఈ డెబ్బయ్యెనిమిదింటిలో ఆయన స్పృశించని అంశం లేదు. కవితాత్మ లేని శీర్షిక లేదు. లయాత్మకం కాని కవిత లేదు. ఇంచుమించు అన్నీ సమాజం... సమసమాజంలోని సమస్యలే. సామాజిక స్పృహ ఉన్న కావ్యమిది. అందుకే ఇందాక ఆయన వ్రాసిన గణబద్ధమైన పద్యాలు వెలుగులోకి రావాలన్నాను గదా. దానికి కృతికర్తే అంటారు.

ఎంతోకాలం ఎదురుచూడటం దేనికీ ?
రేపో మాపో... మరీ అయితే మాపో
ఓ అపూర్వ సుముహూర్తాన పుడమి చీల్చుకుని
అందాక నీవు తీర్పు వహించు నేస్తం" అని.

అవును మరి. మాత్రలు మింగి మింగి అలసి సొలసిన కవి నుంచీ జాలువారిన ఆ 'తేట'గీతం త్వరలో పఠితృహృక్షేత్రమును చీల్చుకుని వస్తాయి.

'కడగొట్టు బిడ్డను నేను తల్లీ...
కేలు సాచాను...' అంటారు. సామాన్యంగా కడగొట్టు సంతుపై తల్లికి

మమకారం ఎక్కువ అంటారు. అవును. తామన్‌గారు ఆదిలాబాద్ జిల్లావారు. కనుక కడగొట్టు బిడ్డే. పలుకుల తల్లికి శ్రీ గజానన్ కడగొట్టు బిడ్డ. అందుకే ఆ మమకారాన్నీ.. ఆ వాత్సల్యాన్నీ... అణుమాత్రంగా అందించమనీ అభ్యర్థిస్తారు. తల్లి సరస్వతి ఆయనని తప్పక ఆదుకుంటుంది. హస్తం అందిస్తుంది.

ఈ మానసాన్ని మొత్తం చదివితే కవి మానసమును విశ్లేషించ వీలు దొరుకుతుంది. కవి హృదయాంతరాళంలో ఎక్కడో ఏదో నిరాశ దొరుకుతుంది. ఏదో నిరాశ ఎగసిపోతున్నట్లనిపిస్తుంది. ఏదో నిర్వేదన...! కవితలన్నింటిలోనూ నాకు అలా అనిపించింది.

ఇది కేవలం నాకు తట్టే భావశకలమే సుమా ! కవిగారి కవితను.. కవిగారి ప్రతిభనూ, ప్రకర్షనీ, ఎప్పుడో, ఎక్కడో, చులకన చేసి చూసినట్లున్నారు. ఎవరో కించపరిచారేమోననిపిస్తుంది.

నీలాల నింగిలో తారలా నీ ఉనికి
నేల వీడని నేను చాతు నెటుల కరాలు ?

అంటారింకొకసారి. గుండె కోనల్లో నింగికెగసిపోవాలన్న ఆశ అతివేలంగా ఉంది. కానీ 'నేల వీడని' నేను చాతునెటుల కరాలు అంటూ నిస్పృహనీ... నిస్సహాయతనీ.. నిరాశనీ వెలిగ్రక్కుతారు.

తామన్ గజానన్ కవితలన్నింటిని ఇలా విశ్లేషించి చూస్తుంటే నాకు మరోమారు ఆయన ఎప్పుడో బాగా బాధచెందారనే అనిపిస్తుంది.

సామాన్యంగా రచయిత ఎవరైనా తన మనసులో కుతకుత ఉడికిపోయే బాధనీ... కోపాన్నీ... ఆవేశాన్ని పరోక్షంగానో... అన్యాపదేశంగానో కవితల్లో చొప్పించి మనసును శాంతింపచేసుకుంటారన్నది విమర్శకుల వివరణ. విమర్శకులే కాదు మనోవిశ్లేషణగావించే మానసిక తత్వశాస్త్రవేత్తలు కూడా ఇదే అంటారు. కథలయితే తాము సృష్టించిన పాత్రతోనో కవితలయితే ఇలాగే వెలిబుచ్చుకుంటారు. 'ఏ గతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరు కదా ?' అన్న చేమకూర కవి పద్యపాదాన్ని ఆయన స్వానుభవంగా పేర్కొంటారు. నాలో విశ్లేషణకు యీ భావశకలమే ఆధారము. కేవలం

యిది నా దృష్టిగోచరమయినదే. ఇందులో వాస్తవముండవచ్చును. లేకపోతే లేకపోవచ్చును కూడా. నేను విఖ్యాతుడనయిన విమర్శకుడను గాను అలా అని మానసిక తత్త్వవేత్తనూ కాను.

ప్రజ్ఞాదురంధరులయి అపర సరస్వతులైన గజానన్ గారి వంటి వారి కవితలు యీ సాహితీ ప్రపంచంలో సరియైన చోటు దక్కాలని మనసారా కోరుతున్నాను.

-జె. విద్యాసాగర్

వైవిధ్యభరిత కవితా తరంగిణి 'మానస సరోవరం'

మానస సరోవరం కవితా సంపుటికర్త 'గజానన్ తామన్' ఇందులో 78 కవితా తరంగాలున్నాయి. రచయిత వాటిలో 52 కవితలనీ, 26 గేయాలనీ వర్గీకరించాడు. వాస్తవానికి కవితలన్నీ గేయ ఫణితుల్లోనే వున్నాయి. ఎక్కువభాగం ముత్యాల సరాల్లో ముచ్చటగా కూర్పు చేశాడు. అక్కడక్కడ కొన్ని 'గజల్స్' సాక్షాత్కరిస్తాయి. గేయరీతుల్లో త్ర్యస్రగతి, చతురస్రగతి వంటి పద్ధతులను పాటించాడు. ఇందులో కవితలన్నింటినీ రచయిత చేయి తిరిగిన గేయ రచయితగా రూపొందించాడు.

ఇందులో గేయాల ప్రకరణంగా ప్రకటించిన 26 ఖండికల్లో భక్తితత్త్వంతో కూడిన మార్మికత గుభాళిస్తుంది. ప్రకృతి వర్ణనలు పరిమళిస్తున్నాయి. టైటిల్ కవిత 'మానస సరోవరం'లో "మనల పిలిచిన దోయి/మానస సరోవరము/సహజీవననానంద/సౌఖ్యాల తేలుదము" అని తానొక కవి రాజహంసలా మానససరోవరంలో గంధర్వగీతికలు గళమెత్తి పాడేందుకు, ఆకాశగంగలో ఆహ్లాదంగా విహరించేందుకు పాఠకులను ఆహ్వానించాడు.

'నేటి నా గీతం' ఖండికలో తన గీతం భావి ప్రగతి గీతంగా గానం చేయబడుతుందన్న విశ్వాసాన్ని ప్రకటించాడు. 'నేను జీవించడం నేర్చుకున్నా 'ఖండి'కలో "బ్రతుకు వెలుగైన / పెనుచీకటైనా / బ్రతుకు విషమైన / పీయూషమైనా / భావిబంగారు రూపునూహిస్తూ / ఠీవిగా బాట పయనిస్తున్నానన్న' ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తీకరించాడు. రూపగంధము ఖండికలో జీవితానుభవంలోని వాంఛా వైఫల్యాలు, ప్రేయసీ వియోగం వంటి వ్యధాభరిత సంఘటనలు వర్ణించాడు. ఈ ఖండికపై భావ కవితా ప్రభావం పుష్కలంగా వుంది. అంజలితో ఆరంభమైన సంపుటి అందమైన వేళతో ముగిసింది. 'అంజలి'లో తన జీవన గమనానికి, కవితా రచనకు స్ఫూర్తినిచ్చిన 'బాసర సరస్వతి'కి అంజలి ఘటించాడు. జన్మభూమి మమకారాన్ని 'ఆదిలాబాదు' వంటి ఖండికల్లో ఆవిష్కరించాడు. తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన 'కొమరం భీముని' స్మరించాడు.

ఇటు తెలుగు నేలకు, అటు మహారాష్ట్రకు మధ్య శాశ్వత స్నేహ వారధిగా వ్యాసమహర్షి తపోవనంగా ఆదిలాబాద్‌ను అభివర్ణించాడు. 'మట్టి గుర్రాలు' ఖండికలో తెలంగాణ నీటి కరువుకు స్పందిస్తూ ఆవేదన వ్యక్తపరిచాడు. ప్రభుత్వాలు మారిన వెంటనే పథకాల పేర్లు మారుతున్నాయని "జన్మభూమి ఆటకట్టించి పల్లెబాట పట్టింది నేతృత్వం" అని అధిక్షేపించాడు.

'అయం ముహూర్తం' ఖండికలో అభ్యుదయ ధోరణితో "పాత కథల ఉత్ఖననం సహచరుడా ! ఇపుడెందుకు భావివైపు చూడక నిలిపి కదలాలోయ్ ముందుకు/అన్న ప్రగతిభావ సందేశం కవి అభ్యుదయ దృక్పథానికి తార్కాణం. 'అర్ధాంగి', 'కన్యక' ఖండికలు రచయిత స్త్రీవాద దృక్పథానికి తార్కాణాలు పురుషాధిక్యతతో అలమటిస్తున్న అర్ధాంగి ఆవేదనతో "అహర్నిశలు సేవలో, లాలనలో/ఏనాడో అస్తమించింది. నానవోఢ రూపలావణ్యం ! నిన్ను అనుక్షణం అనుసరించే ప్రౌఢగా, క్రీనీడగా నేను మిగిలాను అని నిరాశా నిస్పృహలతో ప్రశ్నించడం స్త్రీని ఆటబొమ్మగా భావించే పురుష పుంగవులకు కనువిప్పు కలిగిస్తుంది.

'కన్యక' ఖండికలో సమితులిందున/కొలువులందున ఆడవారికి మూడువంతులు/పుట్టుకముందే ముగియు ప్రశ్నకు/పెదవి విప్పరు జననాయకుల్" అనే పంక్తుల్లో రాజకీయంగా రిజర్వేషన్ కల్పించిన నాయకులు గర్భస్థ స్త్రీ శిశు భ్రూణహత్యలకు నోరు విప్పరన్న అధిక్షేపణ స్త్రీ వాద భావమే. 'నేను చదివితి, నడకనేర్చితి' 'నీర క్షీరము లెరుగజాలితి/నీవు మారవు/నేను మార్తును/నేటి జీవన విషమ సరణిన్' అని స్త్రీ తిరుగుబాటు ప్రకటించుట స్త్రీవాద లక్షణమే.

'ఈ నాదేశం' ఖండికలో స్వాతంత్ర్యం సాధించి 56 సంవత్సరాలైనా సాధించిన ప్రగతి మిధ్య అనే భావనతో "ఏనుగు మింగి నేల జార్చిన వెలగపండులా" వుందన్న భావంపై ఆరుద్ర "మన స్వాతంత్ర్యం మేడిపండు/కరిమింగిన వెలగపండు' పంక్తుల ప్రభావం వుంది.

నేరగాళ్ల, బేరగాళ్ల ఆశీస్సులతో అధికారాన్ని క్రూరంగా చెలాయించే

నేతలు రావణభ్రాతల్లా నిద్రిస్తున్నారని అధిక్షేపించాడు. సమాజంలో సంఘర్షణలు, కల్లోలాలు, మానభంగాలు రోజురోజుకీ పెచ్చుపెరుగుతున్న స్థితిని నిరసిస్తూ "బాహాబాహీలతో/గృహదహనాలతో/కీచక నైచ్యాలతో/ధర్మధ్వజ గర్జనలతో/అనావిలకవోష్ణ రుధిరషావితాలతో/కర్ణుని కర్మభూమిగా మారిందని ఆవేదన ప్రకటించాడు.

'మహీరుహం–మానవుడు' ఖండికలో మహీరుహం మానవుడితో "మానవుడా/నన్నాశ్రయించు/ పర్ణపర్ణానికి ప్రసరించిన హర్షంతో, నిన్ను ఆశీర్వదిస్తాను" అనిపిస్తాడు. మానవుడికి ఎన్నో ప్రయోజనాలు కలిగించే వృక్షాన్ని ఛేదించడం అవివేకమని "వృక్షవేధం ఖండిక"లో హెచ్చరించాడు.

సామాజిక స్పృహతో జనవాహినిలో కలిసి ఉద్యమిస్తానంటాడు. 'అరువది వసంతాల' ఖండికలో జీవితపు అనుభూతులను వివరించాడు. 'యుగాంతం' ఖండికలో తాత్త్విక ధోరణితో ప్రకృతి వైపరీత్యాలను వర్ణించుటలో పోతులూరి వీరబ్రహ్మంగారి ప్రభావం కనిపిస్తుంది. శాస్త్ర సాంకేతిక రంగాల ప్రగతిని సాధించిన ఆధునికయుగంలో అశాస్త్రీయ భావాలను పాఠకులు ఆదరించరు.

తన కవితాతత్త్వం అయోమయం, అస్పష్టమన్న భావాలు 'పదబంధాలు' ఖండికలో వివరించాడు. తన కవితలో విప్లవాత్మక సామ్యవాద సంకేతాలు కాదని, పండితాళి మెచ్చే ప్రౌఢ కవితలు కాదని, "ఏమీ పాలుపోక అల్లిన అనాదృత పదబంధాలు'గా ఉబుసుపోక కవితలుగా చెప్పుకున్నాడు. కాని, కవితా తత్త్వాన్ని అంచనా వేయవలసిన వారు విమర్శకులే.

మానససరోవరం కవితా తరంగాల్లో కవితా ప్రియులు ఆహ్లాదంగా విహరించి రసాస్వాదన చేయదగిన విధంగా వున్నాయి. ప్రతిభ–వ్యుత్పన్నత – అభ్యాసం సమపాళ్లలో సంతరించుకొని కవితా సంపుటిని వెలువరించిన 'గజానన్ తామన్'ను అభినందిస్తున్నాను. సమకాలీన ఇతివృత్తంతో మంచి గేయ కావ్యాలు రాయాలని ఆకాంక్షిస్తున్నాను.

–డా॥ పి.వి. సుబ్బారావు

గజానన్ తామన్ కవిత "మానస సరోవరం"

గజానన్ తామన్ ఓ అపురూపమైన కవి. ఆయన పట్టిందల్లా కవిత్వమైపోతుంది. 'చెవికి ఇంపుగా వినబడే పదాలతో తనకు కావలసినట్టు నడపడం రాయప్రోలు నుండి, అనుభవాన్ని వాడిగా వేడిగా ఇవ్వడం, కృష్ణశాస్త్రి నుండి ఈ కవి అలవరచుకున్న గుణాలేమో అనిపిస్తుంది. ఆయన 'మానస సరోవరం' కవితాగేయసంపుటిని చదివాక అందమైన భావాన్ని అందంగా చెప్పడం తామన్ ప్రత్యేకత. కవిని చూడకుండా కావ్యాన్నే చదివి ఆ కావ్యానందంలో తడిసి అనుభవించి పలవరించడం ఒక పద్ధతి. కవితో బాగా పరిచయం ఉండి ఆ గాఢ పరిచయాన్ని దృష్టిలో ఉంచుకొని కావ్యాన్ని అనుశీలించడం ఇంకో పద్ధతి. మొదటి పద్ధతి ఆమోద యోగ్యమూ, అభినందనీయము అని వేరే చెప్పవలసిన పనిలేదు. గజానన్ తామన్‌తో నాకెలాంటి పూర్వపరిచయం లేదు. కృతిని చదివి, 'అనుభవించి పలవరిచినదే' ఈ వ్యాసం

'నీ కనులు కరుణనే వర్షించునవిగాన
హరిణాలు ఇంతగా నా ఊహమెదలినవి
నీ పలుకు కపురంపు పలుకువంటిది గాన
నా కవితకీ కొలది నెత్తావి అబ్బినది
బాసరను వీడను తలపై చదువుల తల్లి
నను చేతనా స్థితిని ఇన్నాళ్ళు నిలిపినది

అని బాసరలో కొలువైన జ్ఞాన సరస్వతికి 'అంజలి' ఘటించారు.

ఎల్లవేళలు తిరిగి సజన విజన పథాలు
ఏరికూర్చితి విరుల సొబగుమించు పదాలు
నీకు అర్పించుటకు, నేను తరియించుటకు
నెపమైన తపమైన ఈ జన్మకిదిచాలు

అంటూ నీలాల నింగిలో తారలా ఉనికియై తేజస్వినిలా భాసించే ఆ కళామూర్తికి విమల గాంధర్వాలు విన్పిస్తావంటారు.

'ఇటు తెలుగు నేలకు అటు మహారాష్ట్రకు మధ్య
శాశ్వత వారధివి
వ్యాసమహర్షి తపోవనానివి, అంటూ ఆదిలాబాద్‌ను
ప్రకృతి పెదాలపైని మృదుహాసరేఖలా
మైళ్లుగా వ్యాపించిన నీమహారణ్యం
ఏపుగా పెరగడంలో పంతగిస్తున్న తేకు మద్ది వృక్షాలు
అడుగడుగునా ఎదురయ్యే వెదురుపోదలు
దొరల నిమిత్తం పెంచబడుతున్న నీలగిరులు... అంటూ సుందర ప్రకృతి సీమగా వర్ణించారు ఆదిలాబాద్ కవితలో

ఏ కల్పార్యంతంలో, ఏ యుగంలో
ఏ మహర్షి పంచాగ్ని మధ్యలో నిలిచి
ఎన్ని వసంతాలు ఆచరించిన తపఃఫలానివో అంటూ అభివర్ణించారు.

గజానన కవి సిసలైన కవిత్వం చేవ్రాలు వంటిది ఆరాధన మనిషి ఎత్తును పెంచుతుంది. హృదయస్పర్శి కావటంతో పాటు కవిత మేధా స్పర్శించటం ముఖ్యం అంటారు. అందుకు ఈ సంపుటిలోని ప్రతి కవిత సాక్ష్యంగా నిలుస్తుంది. అర్ధాంగినీ ఎంత హృదయ ద్రావకంగా వర్ణించారో!

'నీవు మైమరచి హాయిగా నిదురించువేలలో
నిశ్శబ్దతను విధిగా పాటించాను
ఆకలేసి నీవు అల్లాడినక్షణం
అన్నపూర్ణలా వండీ వడ్డించాను
ఆడాలన్న నీ మనసుకు అనురాగం
ఆడాను నీతో ఎన్నో ఆటలు
పాడుకుని నన్ను కోరడమే తరువాయి
పాడాను, పాడే ధోరణి అంతగా లేకున్నా
అని ఆమె భర్తకు చెప్పుకున్నతీరు 'కార్యేషు దాసీ' అన్న నీతి శాస్త్ర శ్లోకాన్ని గుర్తుకు తెస్తుంది.

ఎన్నాళ్లుగానో ఇలా సాగిపోతున్న

ఈ అపురూప దాంపత్య ప్రస్థానంలో
ఆడిగావ ఎప్పుడైనా 'ఎలా ఉన్నావని
అలసి సొలసి నేనున్న సందర్భంలో' అని ప్రశ్నిస్తుంది. సహృదయులు మరీ ద్రవింపజేసే ఈ పంక్తులు చూడండి.

'అహర్నిశలు నీ సేవలో, లాలనలో, ఏనాడో
అస్తమించింది నానవోఢరూపలావణ్యం
నిన్ను అనుక్షణం మౌనంగా అనుసరించే
ప్రౌఢగా, క్రీనీడగా,
నేను మిగిలాను ఈనాడు నీ కోసం,

'పౌడగా, క్రీనీడగా, అనే రెండు పదాలలో ఎంతో లోతైన భావం 'దృష్ట పూర్వఅపిహ్యార్తా / కావ్యేరసపరిగ్రహత్ / సర్వేనవా ఇవా భాంతి / మధుమాస ఇవద్రుమః అని అలంకారికులన్నట్లుగా సామాన్యమైన దృశ్యం కవి వర్ణనా జగత్తులో నవ్యాతి నవ్యంగా, పరమరమణీయంగా సాక్షాత్కరిస్తుంది.

'మహిరుహం, మానవునితో తనకథ చెప్పినతీరు హృద్యం,
ఓ అపూర్వ సుముహూర్తాన
పుడుతాను పుడమి గర్భాన్ని చీల్చుకొని
తృణాంకుర సందోహం
మూర్తిమంతమైన నా అస్తిత్వాన్ని
గమనించి విస్తుపోతావు, అంటున్న మొక్క
ఇది వర్షర్తువు, ఇంచుక శ్రమిస్తే నా కోసం
ప్రాణిరూపాన ఏ హాని నాదరి దాపులకు రాకుండా
ఓ దట్టమైన కంచెను నా చుట్టు నిర్మించు

కనీసం ఓ రెండు వసంతాలైనా నా పోషణ భారం వహించు అని మానవునికి నివేదిస్తుంది.

అతని ఈక్షణంలో ప్రతీక్షలో తాను నింగినందుకుందని ఎవరైనా భ్రమిచేంత ఎదుగుతానంటుంది మహావృక్షంగా...

నాలో గూళ్ళు నిర్మించుకొని

నానాద్విజ సంతానాలు
గడుపుతాయి ముచ్చటగా గార్హస్థ్య జీవనాలు
మార్గశ్రాంతులైన పాంథులనేకులు
చేరుతారు నా సుఖద శీతలచ్ఛాయలో, అని మానవాళికి భరోసా ఇస్తుంది మహీరుహం. వస్తు శిల్పాలదృష్ట్యా ఇది ఉత్తమ కవిత. 86లో భారతి, సాహిత్యమాస పత్రికలో ప్రచురింపబడి సాహితీవేత్తల ప్రశంసలను అందుకుంది.

వర్తమాన భారతాన్ని చూచి...
'బాహుబాహీలతో' గృహదాహంతో
కీచకనైచ్యాలతో, ధర్మరాజు గర్జనలతో
అనావిల కవోష్ట రుధిరప్లావితాలతో
అనుదినం ఓ శాపానికి గురవుతున్న కర్ణుని భూమి, అని ఖేదపడ్డారు.

'కంచె, ఆలోచింపజేసే కవిత
'మనువు సంతానాలైన మానవ సమూహాలు
కంచెనట్టి పెట్టుకొనేవున్నాయి వేలయుగాలు,
'కంచె చేనుమేస్తుంది
ఏం చేసేది ? ఏమిటి దారి ?
మనం మనం భాయీ భాయీ
మన మధ్యకంచే అనేది ఎక్కడుంది ?' వంటి పంక్తులు ప్రతి సహృదయుడిని కదిలింపజేస్తాయి.

మానవాళిలో 'మానవత' నశించిపోతున్న వైనాన్ని చూచి
నాగమల్లెల చెలిమి కరువై
నాగజెముడుల నెయ్యమైనం
మానవులలో మానవునిగా
మనుట కలలో మాటయైనది
జగము హృదిపై గాయమైనది
జగముతలపున మాయమైనది, అంటూ బాధపడ్డారు, గజానన్ తామన్

కవిత మానవుణ్ణి అంతర్ముఖుణ్ణి చేసేది కావాలి, ఈ సువిశాల జగత్తును చిన్న గ్రామంగా చూడగలిగే హృదయ వైశాల్యం కలది కావాలి, అంటారు.

అరమరికలు, అంతరాలు
కరిగిపోని కలపోలిక
మనిషి మానసాన మరల
మధుమాసము కదలాడని

అందమైన వేళరాని
అమృతవృష్టి కురిసిపోని
అదే నీవు అదే నేను

ఇదే బాట, బాటగాని, అనే అందమైన వేళ కోసం ఆయన నిరీక్ష.

'సరళోక్తిని నేటి సభ్యసమాజం జీర్ణించుకోలేదు కనుక వక్రోక్తిని అభివ్యక్తి మాధ్యముగా ఎన్నుకోవాలి' అని సూచించిన ఈ కవి తన కవితా రచనకు దాన్నే ఎన్నుకున్నారు.

'వక్రోక్తి మార్గమంటే గజానన కవికి పరమప్రాణం 'ధ్వని' జీవంగా నడుస్తుంది ఈయన కవిత. దీనికి కృతిలోని కవితలన్నీ ఉదాహర్యాలే. 'ధ్వని' అంటే వట్టి ధ్వనికాదు. హంసధ్వని, 'సోహం సోహమ్' అంటూ బ్రహ్మతో అభేదం భావించగల హంసధ్వని, అని 'సాహిత్య బ్రహ్మ, Dr. V.V.L. నరసింహారావు ఈ కృతి విశిష్టతను ముందుమాటలో వివరించారు.

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా॥ సినారె వైదికాంశాలను, పౌరాణిక అంశాలను భూమికలుగా తీసుకొని మీరు చక్కని కవితలు రచించారు. భావుకతతో పాటు సామాజిక చేతన వుండడం ప్రశంసనీయం అని కవిని అభినందించారు.

ఇరవయ్యో శతాబ్దం మలిభాగంలో వచ్చిన సహస్రాధిక కవితా సంపుటాలలో నిలిచే, మంచి కవితా సంపుటి మానస సరోవరం అందమైన,

ఆలోచనాత్మకమైన కవితల సంపుటి మానస సరోవరం సాహిత్యరంగంలోని ఎందరో మహానుభావుల ప్రశంసలనందుకున్న కృతి. 'కఠోపనిషత్'కు పద్యానువాదం చేసి పండితుల ప్రశంసలనందుకున్న గజానన్ తామన్ లేఖిని నుండి ఈ 'పరిణత' దిశలో మరిన్ని మంచి కావ్యాలు రావాలని ఆశిస్తూ ఆయన వాణికి చేతులు జోడిస్తున్నాను.

"కవిత్వము యొక్క జీవితంలో సంప్రదాయాలు, తిరుగుబాట్లు దివారాత్రులు తిరుగుబాటు తరువాత సంప్రదాయాలు ఆ వెనువెంటనే తిరుగుబాట్లు వస్తుంటేనే కవిత్వం చైతన్యవంతంగా సాగిపోతుంది"

డా॥ శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

మానస సరోవరం (కవితా గేయసంపుటి)
కవి : గజానన్ తామన్
తమ్మిచెఋవుకట్ట, మంథని, కరీంనగర్ జిల్లా

కవితిలక
-డా॥ తిరునగరి



గజానన్ తామన్ సొంతూరు ఆదిలాబాద్ జిల్లాలోని చాకేపల్లి. మక్తేదారుల కుటుంబం. భూస్వాముల కుటుంబంలో పుట్టినా ఫ్యూడల్ సంస్కృతిలేని ఇంట పెరిగారు. గజానన్ తాతగారు రాజారామ్ తామన్ సంస్కృత, ఆంగ్ల, మరాఠీ భాషల్లో మంచి పండితుడు. నానమ్మ ఆయుర్వేద వైద్యం చేసేది. మనవడిది తాతగారి పోలికే. గజానన్ తండ్రి అంతగా చదువుకోలేదు. కాని కొడుకును మాత్రం బాగా చదివించాలని ఆరాటపడేవాడు. చాకేపల్లిలో స్కూల్ లేకపోవడంతో గజానన్ అమ్మమ్మ ఊరైన మంథనికి పంపించాడు కొడుకును.

గజానన్ తామన్ : 'వచన కవిత్వం అసలైన కవిత్వాన్ని చంపేసింది. మ్యాజిక్ రియలిజమ్‌లో ఆకర్షణ లేదు. కవిత్వంలో భావం మోరల్లీ, స్పిరీచ్యువల్లీ ఎలివేట్ అయ్యేలా ఉండాలి. అవార్డు రాజకీయాలకు నేను దూరం.

తెలుగులో స్నేహం

మంథనిలో ఉర్దూ మీడియం చదువు గజానన్‌ను తెలుగు అక్షరాలకు అపరిచితుడిగా మిగిల్చింది. అక్కడ భమిడిపాటి వీరవెంకట సూర్య నారాయణ పరిచయం గజానన్‌ను పూర్తిగా మార్చేసింది. ఎప్పుడూ చురుకుగా, హుషారుగా ఉండే గజానన్ అంటే ఆయన బాగా ఇష్టపడేవాడు. వాళ్లింటికి తీసుకెళ్లి వాళ్లమ్మాయితో... 'వీడికి తెలుగు ఒక్క అక్షరం కూడా రాదు, కొంచెం నేర్పు' అనేవాడట. గజానన్‌కు తెలుగు ఆధునిక సాహిత్యాన్ని పరిచయం చేసింది ఆయనే. పుస్తకాలు చదవడంలో ఉన్న రుచి తెలిసి ఆ స్నేహానికి బానిసయ్యాడు గజానన్. ఆ ప్రేరణతో తన స్కూల్ మ్యాగజైన్‌కు కవిత్వం రాయడం మొదలుపెట్టాడు. దానికి ఎడిటర్ అతనే. అట్లా మెట్రిక్ పూర్తిచేశాడు. కొడుకును ఇంజనీర్‌ను చెయ్యాలని గజానన్ తండ్రి గుణవంతురావు కల. కాని లెక్కల్లో మార్కులు తక్కువ రావడంతో ఇంజనీరింగ్ కల కల్ల అయింది. గుమస్తా గిరి చేయమని ఆర్డరేశాడు తండ్రి కొంచెం అసహనంగానే. గజానన్‌కేమో పై చదువులకెళ్లాలని. చేసేదిలేక టీచర్ ఉద్యోగంలో చేరాడు.

మహారాష్ట్ర ప్రయాణం

సుల్తానాబాద్‌లో టీచర్‌గా ఉన్నప్పుడు రవీంద్రనాథ్ ఠాగూర్ పోస్టాఫీస్‌ను తెలుగులోకి అనువదించి స్కూల్ పిల్లలతో నాటకం కూడా వేయించాడు. దాంతో గజానన్ సాహిత్య పిపాసిగా అందరి దృష్టికి వచ్చాడు. ఉద్యోగం, పుస్తకాలతో కాలం గడుస్తున్నా పై చదువులు చదవాలన్న కోరిక మాత్రం రొదపెడ్తూనే ఉంది గజానన్‌లో. సన్నిహితుడైన రాఘవాచార్యులుకు గజానన్ మనసు తెలిసింది. తృష్ణ ఉన్నప్పుడు జాగెందుకు పై చదువులకని ప్రోత్సహించాడు. ఈలోపే తెలంగాణ కోసం జరుగుతున్న ఉద్యమాల్లో కూడా పాల్గొన్నాడు చురుకుగా. ఫజల్ అలీ కమీషన్ రిపోర్టులో తేల్చినట్టు తెలంగాణ ఏర్పాటుకు పాటుపడిన కేశవరెడ్డి ప్రభృతుల్లో గజానన్ కూడా ఉన్నాడు. తెలంగాణ రాలేదన్న నిస్పృహతో మహారాష్ట్రలోని నాందేడ్‌కు వెళ్లిపోయాడు. అక్కడే పీపుల్స్ కాలేజ్ నుంచి బి.ఎ. పట్టా పొంది తర్వాత

మరత్వాడా యూనివర్సిటీ ఔరంగాబాద్ నుంచి ఇంగ్లీష్‌లో ఎమ్మే చేశారు. తాను చదివిన కాలేజ్‌లోనే రీడర్‌గా కొంత కాలం పనిచేసి ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా నియమితులయ్యారు.

భారతిలో కవిత

మహారాష్ట్ర గజానన్‌లోని సాహితీ దాహాన్ని తీర్చే చెలిమెగా మారింది. హిందీ, మరాఠీ, ఇంగ్లీష్ సాహిత్యంతో విడిపోని బంధం ఏర్పడింది. ఈ ముగ్గురు స్నేహితులతోనే ఆయన జీవితం పెనవేసుకుపోయింది. మరాఠీలో చదువుతూ తెలుగులో ఆలోచించేవాడు. ఎమర్జెన్సీ సమయంలో ఆ పరిస్థితుల మీద రాసిన కవిత 'భారతి' మ్యాగజైన్‌లో అచ్చయింది. మహాకవి శ్రీశ్రీ కవితలనే మూడు సార్లు తిప్పి పంపింది ఆ మ్యాగజైన్. కానీ గజానన్ నాలుగు కవితలను అచ్చేసింది 'భారతి' మరాఠీలోని గ్రేస్ అనే కవినుంచి స్ఫూర్తి పొందిన గజానన్ తామన్ ఉద్యోగ విరమణ పొందాక మంథనికి వచ్చి స్థిరపడ్డారు.

నరసింహారావు మాట

1978 నుంచి 2009 వరకు రాసిన తన కవితలన్నిటిని పోగుచేసి 'మానస సరోవరంగా' మలిచారు. దానికి సాహిత్య బ్రహ్మ డా॥ వి.వి.యల్. నరసింహారావు 'హంసధ్వని' పేరిట ముందుమాట రాశారు. అందులో 'ఈ హంసకు బహుభాషలు వచ్చు. మానస సరోవరంలో ఈదుకుంటూనే అలవోకగా వేదోప నిషత్తుల్నీ, వాల్మీకి వ్యాసుల రామాయణ భారతాల్ని, ఇంగ్లీషులో టెన్నిసన్, షెల్లీ, బ్రౌనింగ్ ప్యాస్టర్‌నాక్, తెలుగులో శ్రీశ్రీ, దేవులపల్లి, కరుణశ్రీ, తిలక్, దాశరథి, సినారె మొదలైన మహాకవుల రచనలనూ మధురంగా గానం చేస్తుంది' అని గజానన్‌ను కొనియాడాడు నరసింహారావు. మరాఠీ కవి గజానన్ దిగంబర్ మాడ్గూళ్కర్ రాసిన 'గీత్ రామాయణ్'ను తెలుగులో 'సాకేత రామాయణం'గా అనుసృజించాడు గజానన్. అంతేకాదు అంపశయ్య నవీన్ కాలరేఖలకు పరిచయవాక్యాలు రాశారు. గట్టు నారాయణ 'నోబుల్ లీడర్'ను 'ఉదాత్తనేత'గా 'ఆఫరింగ్స్ వన్ అండ్ టూ'ను 'కథాంజలి వన్ అండ్ టూ'గా తెలుగులో అనువదించాడు

గజానన్. ఋగ్వేదాన్ని అభ్యసించిన ఆయన 'సాహిత్య వరివస్యలో మంథని' అనే కృతికీ పురుడు పోశాడు. పురుషోత్తమ్ గేరే మరాఠీ నవల సావిత్రికి ఈయన తెలుగులో చేసిన అనువాదం మాత్రం ఇంకా అముద్రితంగానే ఉంది.

ఈట్స్‌కు దగ్గర

జీవితంలోని చేదు, తీపిలను సమపాళ్లలో చవిచూసిన ఏడుపదుల ఈ అక్షరపిపాసి జీవనవాదాన్ని, మార్క్సువాద దృక్పథాన్ని ఏమాత్రం వదులుకొనలేదు. ఇంగ్లీష్ కవి ఈట్స్‌కు, గజానన్‌కు చాలా సామ్యం ఉంది. ఐర్లండులో ఉంటున్నా స్వస్థలమైన మడగాన్ కోసం పరితపి స్తుంటాడు ఈట్స్. గజానన్ కూడా అంతే. మహారాష్ట్రలోఉంటున్నా తెలంగాణ ఊపిరిగానే బతికాడు. ఆయన కవితల్లో ఇది ప్రస్ఫుటం అవుతుంది. స్త్రీవాదం, పర్యావరణం కూడా ఈయన కవితకు మూలాంశాలు.

సరస్వతి రమ

-గజానన్ తామన్

1. పేరు : గజానన్ తామన్
2. తల్లిదండ్రులు : స్వ॥ రాధాబాయి, స్వ॥ గుణవంతరావు గార్లు
3. జన్మగ్రామం : చాకేపల్లి, మం॥ బెల్లంపల్లి, జి॥ ఆదిలాబాద్
4. జన్మతేది : 05-12-1936
5. కుటుంబం : బహుభాషలకు నిలయం
6. విద్యార్హతలు : B.A. మరాఠ్వాడా యూనివర్సిటీ 1963
   M.A. మరాఠ్వాడా యూనివర్సిటీ 1965
7. సేవ : పీపుల్స్ కాలేజ్ నాందేడ్ (మహారాష్ట్ర) స్నాతకోత్తర విభాగంలో 30 సం॥ ఆంగ్లసాహిత్యం బోధించారు.
8. తెలుగు, హిందీ, ఆంగ్ల, మరాఠీ, ఉర్దూ, సంస్కృత భాషలతో సాధారణ పరిచయం.
9. బ్రహ్మశ్రీ కొల్లారం సీతారామశర్మ గారి అంతేవాసి. సాయనాచార్య వ్యాఖ్య ఆధారంతో ఋగ్వేవాధ్యయనం.
10. స్వీయరచన : 1. మానససరోవరం (కవితాగేయ సంపుటి) 2004
    2. సాకేత రామాయణం (గేయకావ్యం) 2009
11. అనువాదాలు :
    శ్రీ గట్టు నారాయణ గురూజీ Offering I,II,III మరియు Leader కు
    1. కథాంజలి-1 - 2003
    2. కథాంజలి-2 - 2003
    3. కథాంజలి-3 - 2006
    4. ఉదాత్తనేత
    5. కఠోపనిషత్ పద్యానువాదం